సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 20+20 వెల: ₹ 5.00




'రాష్ట్రాన్ని దేశానికే అన్నం పెట్టే అన్నపూర్ణగా తీర్చిదిద్దాలనేది నా స్వప్నం'

## ● అర్జున.. ఫల్గుణ.. కిరీటి..



**ఉరుములు** ఉరిమినప్పుడు.. మెరుపులు మెరిసినప్పుడు.. చిన్నప్పుడు చాలాసార్లు ఇది పఠించాం.. ఈ దృశ్యం క్రొయేషియాలోని స్ప్లిట్ నగరంలోనిది. మరి అక్కడెన్నిసార్లు చదివారో.. అర్జున.. ఫల్గుణ.. కిరీటి..

# అయ్యో.. ఆర్టీసీ!

## ప్రైవేటుకు బాటలు.. సంస్థకు బీటలు

- సొంత నియామకాలకు చెల్లుచీటీ..
- ఇక అంతా ఔట్‌సోర్సింగే
- చివరకు సెక్యూరిటీ బాధ్యతా 'ప్రైవేటు'కే..
- 18 శాతం నుంచి 28 శాతానికి పెరిగిన 'అద్దె' బస్సులు
- తార్నాక ఆస్పత్రి ఫార్మసీ ప్రైవేటుకు
- టైర్ రీ ట్రేడింగ్ యూనిట్‌కు తాళం..
- రేపోమాపో సొంత ప్రింటింగ్ ప్రెస్ మూత

**ఆర్టీసీ..** సగటు ప్రయాణికుడిపైనే తప్ప మరెవరిపై ఆధారపడకుండా ఇన్నాళ్లూ తన మనుగడను సుస్థిరం చేసుకుంటూ సాగిన ఈ సంస్థ ఇప్పుడు క్రమంగా 'పరాన్న జీవి'గా మారుతోంది! సంస్థ నిండా సొంత కార్మికులు.. అవసరాలను తీర్చుకునేందుకు సొంత అనుబంధ సంస్థలు.. ఈ రాజఠీవిని చరిత్ర పుటల్లోకి తోసి.. 'ప్రైవేటు'పై ఆధారపడి కుంటి నడకకు సిద్ధమైంది. సొంతంగా సిబ్బందిని సమకూర్చుకోకుండా ప్రైవేటు సంస్థల ద్వారా ఔట్ సోర్సింగ్ పద్ధతిలో ఏర్పాటు చేసుకోవటం, సొంత అనుబంధ సంస్థలను మూసేసి సేవలన్నింటినీ ప్రైవేటు సంస్థలకు అప్పగించటం... వెరసి ప్రపంచంలోనే గొప్ప రవాణా సంస్థగా గిన్నిస్ రికార్డు సాక్షిగా వెలుగొందిన ఆర్టీసీ ఇప్పుడు ప్రైవేటు చాటున మిణుకుమిణుకుమంటోంది.

**- సాక్షి, హైదరాబాద్**

### ● ఐదేళ్లుగా నియామకాల్లేవ్



దేశంలో ప్రభుత్వపరంగా ప్రజా రవాణా వ్యవస్థలున్న రాష్ట్రాల్లో మన ఆర్టీసీ(ఉమ్మడి రాష్ట్రం)దే అగ్రస్థానం. లక్షన్నర మంది సిబ్బందితో కళకళలాడేది. రాష్ట్ర విభజన తర్వాత కూడా 57 వేల మందితో ఉనికి చాటుకుంది. కానీ నష్టాల బూచీతో బుగులుపడి నియామకాల విషయంలో వెనుకడుగు వేసింది. దాదాపు ఐదేళ్లుగా నియామకాల్లేవు. దీంతో సిబ్బంది సంఖ్య తగ్గుతూ వస్తోంది. ఇద్దరి పనిని ఒకరితో చేయించే విధానం రావటంతో మరిన్ని పోస్టులు కాలగర్భంలో కలిసిపోయాయి. కండక్టర్ల నియామకం ఇక చేపట్టొద్దన్న ఆలోచనతో ఉంది. దూరప్రాంతాల సర్వీసుల్లో డ్రైవర్లకే టిమ్ యంత్రాలు ఇచ్చి కండక్టర్ లేని సర్వీసులు నడుపుతోంది. హైదరాబాద్‌లో కూడా స్మార్ట్ కార్డులు, వాటిని గుర్తించే సెన్సార్ల ఏర్పాటుతో కండక్టర్ పోస్టులకు మంగళం పాడబోతోంది.

| | | | | |
|---|---|---|---|---|
| సిబ్బంది సంఖ్య.. | 2015 మే: | 56,000 | ప్రస్తుతం: | 53,700 |


### ● 'హైర్' హవా..




కొత్త బస్సు వేయడమంటేనే భారంగా భావిస్తోంది ఆర్టీసీ. అందుకే హైర్(అద్దె) బస్సుల వైపు మొగ్గుచూపుతోంది. ఒకప్పుడు నామమాత్రంగా ఉన్న అద్దె బస్సులు ఇప్పుడు విరివిగా కనిపిస్తున్నాయి. కొత్త రూట్లు గుర్తించి టెండర్లు పిలిచి అద్దె బస్సులను రోడ్లపైకి ఎక్కిస్తోంది. గతంలో మొత్తం బస్సుల సంఖ్యలో 18 శాతానికి మించకుండా అద్దె బస్సులు తీసుకునేవారు. ఇప్పుడు గేట్లు బార్లా తెరిచి దాన్ని 28 శాతానికి పెంచేశారు.

| | | | | |
|---|---|---|---|---|
| అద్దె బస్సుల సంఖ్య.. | 2015 మే: | 1,643 | ప్రస్తుతం: | 2,184 |

### ● తగ్గుతున్న షెడ్యూళ్లు...



జనాభా పెరిగేకొద్దీ వాహనాల సంఖ్య పెరగటం సాధారణం. పదేళ్ల క్రితం రాష్ట్రంలో 28 లక్షల వాహనాలుంటే ఇప్పుడు 77 లక్షలను మించాయి. ఈ సూత్రం ఆర్టీసీ బస్సులకు కూడా వర్తించాలి. కానీ కొంతకాలంగా ఆర్టీసీ బస్సు షెడ్యూళ్ల సంఖ్య తగ్గిపోతోంది. ఏటేటా వాటిని తగ్గించుకుంటూ వస్తోంది. దీంతో ప్రయాణికులు ఇతర రవాణా సాధనాల వైపు మళ్లుతున్నారు.

| | | | | |
|---|---|---|---|---|
| ఆర్టీసీ బస్ షెడ్యూళ్ల సంఖ్య.. | 2015 మే: | 8,842 | ప్రస్తుతం: | 7,822 |

### ● అంతా ఔట్‌సోర్సింగ్




ఆర్టీసీలో ఔట్‌సోర్సింగ్ హవా పెరుగుతోంది. కార్మికులు డిమాండ్ చేసిన దానికంటే ప్రభుత్వం ఎక్కువ ఫిట్‌మెంట్(44 శాతం) ప్రకటించడంతో సంస్థలో కొత్త పోకడ మొదలైంది. భారీగా పెరిగిన జీతాలను భరించటం సంస్థకు ఇబ్బందిగా మారింది. ఉన్న సిబ్బందికి జీతాలిచ్చేందుకే నెలనెలా దిక్కులు చూస్తోంది. ఈ పరిస్థితిలో కొత్త నియామకాల ఊసే ఎత్తడం లేదు. విభాగాల వారీగా పత్రికా ప్రకటన జారీ చేస్తూ ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో ఖాళీలు భర్తీ చేస్తోంది. ఇటీవల సెక్యూరిటీ సిబ్బంది నియామకానికి ఇదే పద్ధతి అనుసరించింది. తాజాగా ఉప్పల్ వర్క్‌షాపులోని టైర్ రీ ట్రేడింగ్, క్యాంటీన్, డిపో మెయింటెనెన్స్ సిబ్బందిని ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన నియమించుకునేందుకు ప్రకటన విడుదల చేసింది.

### ● అనుబంధ సంస్థలకు తాళం



ఆర్టీసీ అనుబంధ సంస్థలు ఒక్కొక్కటిగా ప్రైవేటుపరమవుతున్నాయి. ఇటీవల తార్నాకలోని ఆర్టీసీ ప్రధాన ఆస్పత్రిలో మందుల సరఫరా విభాగాన్ని ఓ ప్రైవేటు సంస్థకు అప్పగించారు. వరంగల్‌లోని టైర్ రీ ట్రేడింగ్ యూనిట్‌ను మూసేసింది. కరీంనగర్, ఉప్పల్‌లోని యూనిట్ల ఉత్పత్తి తగ్గించుకుంది. కొద్ది రోజుల్లో అవి కూడా మూతపడతాయన్న వాదన వినిపిస్తోంది. మియాపూర్‌లో ఉన్న సొంత ప్రింటింగ్ ప్రెస్‌కు కొద్దిరోజుల్లో తాళం పడబోతోంది. ప్రింటింగ్ అవసరాలను ప్రైవేటుకు అప్పగించి సిబ్బంది సంఖ్యను భారీగా కుదించింది. ఇప్పటికే బస్ బాడీ తయారీ పనులను ఎక్కువగా ప్రైవేటుకు అప్పగిస్తోంది. వెరసి సొంత యూనిట్‌ను కూడా మూసే అవకాశం ఉందనే సంకేతాలిస్తోంది.


'మహిళల ముఖాలు కళకళలాడుతూ ఉంటేనే కుటుంబమూ, సమాజమూ బాగుంటాయి'

సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 20+20 వెల: ₹ 5.00

సంపుటి: 10 సంచిక: 141

శుక్రవారం 11-8-2017

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL





ఫ్లిప్‌కార్ట్‌లో సాఫ్ట్‌బ్యాంక్ భారీ పెట్టుబడి..

-14లో



స్టాక్ మార్కెట్లకు నాలుగో రోజూ నష్టాలే..

-15లో





గురువారం నిజామాబాద్ జిల్లాలోని పోచంపాడ్ వద్ద శ్రీరాంసాగర్ ప్రాజెక్టు పునరుజ్జీవ పథకానికి శంకుస్థాపన చేసిన అనంతరం జరిగిన భారీ బహిరంగ సభలో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్. పెద్ద ఎత్తున హాజరైన ప్రజలు

# రాష్ట్రానికి జీవధార

## శ్రీరాంసాగర్ ప్రాజెక్టు పునరుజ్జీవ పథకంతో రాష్ట్రం సస్యశ్యామలం: కేసీఆర్

"1996లో నిర్మల్‌కు వచ్చినప్పుడు ఎస్సారెస్పీని సందర్శించిన. ప్రాజెక్టు గేట్లకు గ్రీజ్, ఆయిల్ లేదు.. తాళ్లు సిలుమెక్కినయి. అదే ఆంధ్రాకు నీటిని తీసుకెళ్లే నాగార్జున సాగర్ ప్రాజెక్టు కళకళలాడేది. అన్యాయం ఎక్కువైతే తిరుగుబాటు వస్తుందని, మళ్లీ తెలంగాణ ఉద్యమం వచ్చి తీరుతుందని చెప్పిన. అనుకున్నట్లుగనే రాష్ట్రాన్ని సాధించుకున్నం."

- ముఖ్యమంత్రి కేసీఆర్

- పథకానికి శంకుస్థాపన చేసిన ముఖ్యమంత్రి
- అనంతరం బహిరంగ సభలో ప్రసంగం
- ఏడాదిలోగా ఎస్సారెస్పీకి కాళేశ్వరం నీళ్లు
- ఆగమేఘాలపై పనులు పూర్తి చేస్తాం
- వచ్చే ఖరీఫ్ నాటికి నీళ్లు అందిస్తాం
- ఇక ముందు ఏటా శ్రీరాంసాగర్ పూర్తిగా నిండుతుంది
- తెలంగాణ సాధిస్తానని శ్రీరాంసాగర్ ప్రాజెక్టు కట్టమీదే ఆన చేసిన
- అనుకున్నట్లుగానే తెలంగాణ సాధించుకున్నం
- ఆంధ్రా పాలకుల ప్రాజెక్టులు మోసపూరితం.. అవేవీ నీళ్లిచ్చేవి కాదు
- టీఆర్ఎస్ సర్కారుకు పేరు రావొద్దనే కాంగ్రెస్ నేతల కుట్రలు
- కేసులతో ప్రాజెక్టులకు అడ్డం పడుతున్నరు
- వారిని ప్రజలు ఎక్కడికక్కడ నిలదీయాలని పిలుపు

సాక్షి, నిజామాబాద్

శ్రీరాంసాగర్ ప్రాజెక్టు పునరుజ్జీవ పథకం రాష్ట్రానికి జీవధార అని.. దీనితో ఉత్తర తెలంగాణ సస్యశ్యామలం అవుతుందని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు పేర్కొన్నారు. ఆగమేఘాలపై ఈ పథకం పనులు పూర్తిచేస్తామని... వచ్చే ఏడాది ఆగస్టు నాటికి కాళేశ్వరం నీటితో శ్రీరాంసాగర్‌ను నింపుతామని చెప్పారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణం పూర్తయితే ఏటా ఫిబ్రవరి, మార్చిలోగా 90 టీఎంసీల నీళ్లు ఈ ప్రాజెక్టులోకి వస్తాయని పేర్కొన్నారు. నిజామాబాద్ జిల్లాలోని పోచంపాడ్ వద్ద శ్రీరాంసాగర్ ప్రాజెక్టు పునరుజ్జీవ పథకం పనులకు కేసీఆర్ గురువారం శంకుస్థాపన చేశారు. ప్రాజెక్టు వరద కాలువ మిగతా 2వ పేజీలో ▶

## సీఎం ఢిల్లీ పర్యటన రద్దు

- వివరాలు 2లో



## 'అన్‌ట్రైన్డ్'కు అర్హత తప్పనిసరి



**2019 మార్చి 31కల్లా ఉపాధ్యాయ శిక్షణ పొందాలి**

- లేదంటే బోధించడానికి వీల్లేదని స్పష్టం చేసిన ఎంహెచ్ఆర్‌డీ
- వారిని పాఠశాలల నుంచి తొలగించాలని ఆదేశం
- రాష్ట్రంలో 3,930 మంది అన్‌ట్రైన్డ్ టీచర్లు
- వచ్చే నెల 15లోగా వారంతా డీఎడ్‌లో చేరాలని ఆదేశం

- వివరాలు 6లో

## పళని-పన్నీరు వర్గాల విలీనం!

**అన్నాడీఎంకేలో వేగంగా మారుతున్న సమీకరణాలు**



- దినకరన్ నియామకం చెల్లదని సీఎం నేతృత్వంలో పార్టీ తీర్మానం.. శశికళకు వ్యతిరేకంగా గళం
- వెంకయ్య ప్రమాణ స్వీకారానికి ఢిల్లీ బయలుదేరిన పన్నీర్, పళని
- 15 లోపు విలీన ప్రకటన వచ్చే అవకాశం!

11లో

## తమిళ రాజకీయాల్లో కొత్త శకం

- ద్రవిడానికి వచ్చిన ముప్పేమీ లేదు
- డీఎంకే వేదికపై కమల్‌హాసన్ వ్యాఖ్య
- కార్యక్రమానికి హాజరైన రజనీకాంత్



11లో





## అన్సారీకి వీడ్కోలు

- రాజ్యసభ చైర్మన్‌గా తన వంతు న్యాయం చేశారు: ప్రధాని
- సభా నియమాల్ని పాటించడంలో ఆయనకు ఆయనే సాటి: సభ్యులు
- అన్సారీ నుంచి ఎన్నో సలహాలు, సూచనలు తీసుకున్నా: మన్మోహన్
- ప్రభుత్వ విధానాలపై విమర్శల్ని అనుమతించకపోతే నిరంకుశత్వమే: అన్సారీ

- వివరాలు 11లో

## మళ్లీ కొత్త జిల్లాల లొల్లి!

- వరంగల్ రూరల్ జిల్లా కేంద్రంపై తకరారు
- కలెక్టరేట్ స్థలం ఎంపికపై వివాదం.. పరకాల, నర్సంపేట, మామునూరుల్లో ఆందోళనలు
- అధికార పార్టీ ఎమ్మెల్యేల తలోబాట
- తెరపైకి నర్సంపేట జిల్లా డిమాండ్

10లో

## ✦ హైదరాబాద్‌కు మోదీ, ఇవాంకా ట్రంప్

### నవంబర్‌లో 3 రోజులపాటు ప్రపంచ పెట్టుబడిదారుల సదస్సు




**సాక్షి, హైదరాబాద్:** భారత్, అమెరికా దేశాల సంయుక్త ఆధ్వర్యంలో జరిగే ప్రపంచ పెట్టుబడిదారుల (పారిశ్రామిక వ్యవస్థాపకులు) సదస్సుకు భారత ప్రధాని నరేంద్ర మోదీతో పాటు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కూతురు ఇవాంకా ట్రంప్ హాజరయ్యేందుకు అంగీకరించడం పట్ల ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు సంతోషం వ్యక్తం చేశారు. ఈ ఏడాది నవంబర్ 28 నుంచి మూడు రోజులపాటు జరిగే ఈ సదస్సుకు హైదరాబాద్ ఆతిథ్యం ఇవ్వడం తెలంగాణ రాష్ట్రానికి గర్వకారణమని ముఖ్యమంత్రి అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న పారిశ్రామిక వ్యవస్థాపకులు ఈ సదస్సులో పాల్గొనడం ఔత్సాహికులకు ఎంతో ప్రోత్సాహకరంగా ఉంటుందని సీఎం కేసీఆర్ అభిప్రాయపడ్డారు. చారిత్రక నగరమైన హైదరాబాద్ ఈ చారిత్రక సదస్సుకు వేదిక అవుతుండటం సంతోషంగా ఉందన్నారు. ఈ సదస్సుకు వచ్చే అమెరికా బృందానికి ఇవాంకా నాయకత్వం వహిస్తుండగా, భారతదేశం తరఫున ప్రధాని నరేంద్ర మోదీ అమితాసక్తి చూపడం గొప్ప విషయమని సీఎం కేసీఆర్ అభిప్రాయపడ్డారు. హైదరాబాద్ సదస్సుకు సంబంధించిన సమాచారాన్ని ట్వీటర్ ద్వారా సోషల్ మీడియాలో షేర్ చేసినందుకు ప్రధాని మోదీకి సీఎం కేసీఆర్ ధన్యవాదాలు తెలిపారు.

## ✦ సీఎం ఢిల్లీ పర్యటన రద్దు

**సాక్షి, హైదరాబాద్:** ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ఢిల్లీ పర్యటన రద్దయింది. ఉప రాష్ట్రపతిగా ఎన్నికైన ఎం.వెంకయ్యనాయుడు శుక్రవారం చేపట్టనున్న ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొనాలని కేసీఆర్ ముందుగా భావించారు. దీని ప్రకారం గురువారం రాత్రి ఎనిమిదిన్నర గంటలకు ఆయన హైదరాబాద్ నుంచి ఢిల్లీకి వెళ్లాల్సి ఉంది. అయితే చివరి నిమిషంలో సీఎం ఢిల్లీ పర్యటన రద్దయింది.

## ✦ 4 రోజులు బ్యాంకులు బంద్

**సాక్షి, హైదరాబాద్:** బ్యాంకులకు వరుస సెలవులు వస్తున్నాయి. శనివారం నుంచి వరుసగా 4 రోజుల పాటు బ్యాంకులు మూతపడనున్నాయి. ఈనెల 12న రెండో శనివారం, 13న ఆదివారం, 14న శ్రీకృష్ణ జన్మాష్టమి, 15న స్వాతంత్య్ర దినోత్సవం కావడంతో ఈ 4 రోజులు బ్యాంకుల్లో కార్యకలాపాలు నిలిచిపోనున్నాయి. ఆన్‌లైన్, డిజిటల్ లావాదేవీలు యథావిధిగా సాగుతాయి. ఇప్పటికే అరకొర నగదు, పని చేయని ఏటీఎంలతో సమస్యలు ఎదుర్కొంటున్న ఖాతాదారులకు వరుస సెలవుల రూపంలో ఇబ్బందులు పెరగనున్నాయి. మరోవైపు ఈనెల 25 నుంచి కూడా వరుసగా మూడు రోజులు బ్యాంకులకు సెలవులు రానున్నాయి. 25న వినాయక చవితి, 26న 4వ శనివారం, 27న ఆదివారం కావడంతో మూడు రోజులు కార్యకలాపాలు నిలిచిపోనున్నాయి.



## కాంపౌండర్ ఇక ఫార్మసిస్ట్

**సాక్షి, హైదరాబాద్:** వైద్య ఆరోగ్య శాఖకు సంబంధించి ఆయుర్వేద, యునానీ, హోమియోపతి విభాగాల్లోని కాంపౌండర్ పోస్టును ఫార్మసిస్టుగా మారుస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. పోస్టు మార్పుతో వేతన పరంగా ఎలాంటి మార్పులు ఉండబోవని స్పష్టం చేసింది. కొత్తగా ఫార్మసిస్టుగా నియమితులయ్యే వారు ఈ విభాగాల్లో రెండేళ్ల ఫార్మసీ కోర్సు పూర్తి చేయాల్సి ఉంటుందని పేర్కొంది. దేశంలోని ఎక్కువ రాష్ట్రాల్లో ఇదే విధానం ఉందని, భారత కేంద్ర ఔషధ మండలి నియమాలకు అనుగుణంగా ఈ మార్పులు చేశామని ఉత్తర్వుల్లో పేర్కొంది.

## మల్లారెడ్డి వైద్య విద్యా సంస్థలకు 8 కోర్సులు

**సాక్షి, హైదరాబాద్:** మల్లారెడ్డి వైద్య విద్యాసంస్థలో కొత్తగా 8 పారామెడికల్ కోర్సులకు అనుమతిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. వైద్యారోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ తివారీ ఈ మేరకు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. డీఎంఎల్‌టీలో 10, డీవోఎం 15, డీఏఎం 10, డీపీఈఆర్‌ఎఫ్‌యూ 5, డీడీఐపీఎల్‌వై 15, డీఎంఐటీ 15, డీఆర్‌ఈఎస్‌టీ 10, డీఏఎన్ ఎస్‌లో 15 సీట్లు కలిపి 8 కోర్సుల్లో 95 సీట్ల నిర్వహణకు అనుమతిచ్చారు.







# రాష్ట్రానికి జీవధార

▶ మొదటి పేజీ తరువాయి

జీరో పాయింట్ వద్ద నిర్మించిన పైలాన్‌ను ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన బహిరంగసభలో ప్రసంగించారు. ఒక్కసారి ఎస్సారెస్పీ ప్రాజెక్టును నింపుకొంటే నిజామాబాద్, నిర్మల్, మంచిర్యాల, జగిత్యాల జిల్లాల్లో రెండు పంటలు పండించుకునే అవకాశం ఉంటుందని చెప్పారు. బాల్కొండ, మెట్‌పల్లి, వేములవాడ, మానకొండూర్ నియోజకవర్గాల నుంచి వెళ్లే వరద కాలువలో ఏడాదంతా నీటి నిల్వ ఉంటుందన్నారు. తద్వారా చేపలు, చెట్లు, నేలలో తేమశాతం పెరుగుతుందని.. ఒక అపురూపమైన దృశ్యం ఆవిష్కృతమవుతుందని వ్యాఖ్యానించారు.

### ఆంధ్రా పాలకులు కట్టిన ప్రాజెక్టులు మోసపూరితం

ఎస్సారెస్పీకి పునాదిపడి 54 ఏళ్లు గడిచినా ఎస్సారెస్పీ స్టేజ్–1, స్టేజ్–2, వరద కాలువ పనులు ఇప్పటివరకు పూర్తి కాలేదని కేసీఆర్ పేర్కొన్నారు. ఈ పనులన్నింటిని తాము పూర్తిచేసే ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. ఆంధ్రా పాలకులు కట్టిన ప్రాజెక్టులన్నీ మోసపూరితమైనవని, అవి నీళ్లిచ్చే ప్రాజెక్టులు కాదని ఆరోపించారు. 2001లో గులాబీ జెండా ఎగురవేసిన తర్వాత జలసాగర్ ఉద్యమం చేశామని గుర్తు చేశారు. ''ఆంధ్రా పాలనలో ఇచ్చంపల్లి ఇచ్చకాయల పాలైంది.. నిజాంసాగర్ వట్టిపోయింది.. మెదక్ జిల్లా ఘనపురం నాశనమైంది.. దిండిలో బండలు తేలినయి.. కోయిల్‌సాగర్‌ను కొంగలు ఎత్తుకెళ్లినయి.. అప్పర్ మానేరు అడుగంటింది.. చెరువులన్నీ తాంబాలాల్లెక్క మారినయి..''అని కేసీఆర్ పేర్కొన్నారు. 15 ఏళ్ల సుదీర్ఘ పోరాటం తర్వాత తెలంగాణ సాధించుకున్నామని.. ఈ తరుణంలో సాగునీటి కోసం మొదటిదశలో మిషన్ కాకతీయ చేపట్టి చెరువులను బాగు చేసుకునే పనులు ప్రారంభించామని చెప్పారు. రాత్రింబవళ్లు కష్టపడి గోదావరి, కృష్ణా జలాలను ఆయకట్టుకు తరలించేందుకు కృషి చేస్తున్నామన్నారు.

### ఆనకట్టపైనే ఆన చేసిన..

ఉద్యమం చేసి ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం సాధిస్తామని 1996లో శ్రీరాంసాగర్ ఆనకట్ట మీద ఆన చేశానని.. అనుకున్నట్లుగానే తెలంగాణ సాధించానని కేసీఆర్ చెప్పారు. ''1996లో ఉప ఎన్నిక కోసం నిర్మల్‌కు వచ్చిన సందర్భంగా ఎస్సారెస్పీని సందర్శించిన. అప్పుడు ప్రాజెక్టు గేట్లకు గ్రీజ్, ఆయిల్ లేదు.. తాళ్లు సిలుమెక్కినయి. కట్టపై రోడ్లు మోకాళ్ల లోతు గుంతలు పడ్డయి. అదే ఆంధ్రాకు నీటిని తీసుకెళ్లే నాగార్జునసాగర్ ప్రాజెక్టు మాత్రం వైష్ణవాలయంలా ధగధగలాడుతుంటే... తెలంగాణ ప్రాజెక్టు అయిన ఎస్సారెస్పీ శివాలయంలా తయారైందని ఆ రోజే నా స్నేహితుడైన సత్యనారాయణగౌడ్‌కు చెప్పిన. అన్యాయం ఎక్కువైతే తిరుగుబాటు వస్తుందని, మళ్లీ తెలంగాణ ఉద్యమం వచ్చి తీరుతుందని చెప్పిన. అసలు నేనే ఉద్యమం ప్రారంభిస్తానని ఆనకట్ట మీద ఆన చేసిన.. అనుకున్నట్లుగనే తెలంగాణను సాధించుకున్నం..''అని పేర్కొన్నారు. ఇప్పుడు తానే ముఖ్యమంత్రి హోదాలో ఎస్సారెస్పీ పునరుజ్జీవ పథకాన్ని చేపట్టడం అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు.

### కాంగ్రెస్సోళ్లను నిలదీయండి

ప్రాజెక్టులను అడ్డుకునేందుకు కాంగ్రెస్ పార్టీ నేతలు కోర్టుల్లో కేసులు వేస్తున్నారని కేసీఆర్ మండిపడ్డారు. టీఆర్‌ఎస్ ప్రభుత్వానికి మంచి పేరు రాకుండా ఉండేందుకు కాళేశ్వరం ప్రాజెక్టుపై 96 కేసులు వేశారని... సుందిళ్ల, అన్నారం, మల్లన్నసాగర్, పాములపర్తి రిజర్వాయర్ల విషయంలో పంచాయితీలు పెడుతున్నారని ఆరోపించారు. కొండపోచమ్మ రిజర్వాయర్‌కు 4,600 ఎకరాలు అవసరమైతే 4,510 ఎకరాల భూసేకరణ పూర్తయిందని... కేవలం 90 ఎకరాలకు మాత్రమే కాంగ్రెస్ నేతలు అడ్డుతగులుతున్నారని మండిపడ్డారు. 25 రోజుల్లో 6 కేసులు వేశారని చెప్పారు. ప్రాజెక్టుల నిర్మాణాన్ని అడ్డుకుంటున్న కాంగ్రెస్ నాయకులను ఎక్కడికక్కడ నిలదీయాలని.. మౌనం పాటిస్తే మనం నష్టపోతామని పేర్కొన్నారు.

### యాసంగి నుంచి 24 గంటల విద్యుత్

తెలంగాణ వచ్చాక రాత్రింబవళ్లు కష్టపడి రాష్ట్రంలో కరెంట్ బాధలు లేకుండా చేసుకున్నామని కేసీఆర్ చెప్పారు. వచ్చే యాసంగి నుంచే వ్యవసాయానికి 24 గంటల విద్యుత్ సరఫరా చేస్తామన్నారు. కాంగ్రెస్, టీడీపీ నాయకులు తెలంగాణ ప్రజలను ఏడిపించారని... వారి పాలనలో ట్రాన్స్‌ఫార్మర్లు, బోర్లు కాలిపోతుండేవని, కానీ ఇప్పుడా పరిస్థితి లేదని స్పష్టం చేశారు. మహిళలు వడ్డీలేని రుణాలు కోరుతున్నారని, వెంటనే రుణాలు ఇప్పించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.



ప్రాజెక్టు వరద కాల్వ జీరో పాయింట్ వద్ద నిర్మించిన పైలాన్‌ను ఆవిష్కరిస్తున్న సీఎం కేసీఆర్. చిత్రంలో మంత్రులు, ఎమ్మెల్యేలు



శ్రీరాంసాగర్ పునరుజ్జీవ ప్రాజెక్టు పథకానికి శంకుస్థాపన సందర్భంగా గడ్డపార పట్టిన సీఎం కేసీఆర్. చిత్రంలో మంత్రి హరీశ్‌రావు తదితరులు

### సీఎం కార్యక్రమం ఇలా..

- ఉదయం 11.30 గంటలకు అతిథి గృహం నుంచి బయలుదేరిన కేసీఆర్
- 11.43 గంటలకు పునరుజ్జీవ పథకానికి భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు.
- కేసీఆర్ గడ్డపారతో మట్టిని తవ్వగా మంత్రి హరీశ్‌రావు పారతో మట్టి ఎత్తారు.
- అనంతరం పథకం పైలాన్‌ను కేసీఆర్ ఆవిష్కరించారు.
- బహిరంగ సభ వద్దకు ఉదయం 10 గంటల నుంచే జనాలు చేరుకోగా.. మధ్యాహ్నం 2 గంటలకు సీఎం వచ్చారు.
- 3.15 గంటలకు సభ ముగియగా.. కేసీఆర్ తిరిగి హైదరాబాద్‌కు బయలుదేరారు.
- సీఎం బహిరంగ సభకు ఒకే సమయంలో పెద్ద సంఖ్యలో వాహనాలు రావడంతో జాతీయ రహదారి 44పై ట్రాఫిక్ స్తంభించిపోయింది. – బాల్కొండ

### వాస్తు కోసం రావి మొక్క!

**బాల్కొండ:** పునరుజ్జీవ పథకం పైలాన్ వద్ద వాస్తు కోసం గురువారం ఉదయం అటవీ శాఖ అధికారులు రావి మొక్కను నాటారు. బుధవారం వరకు పైలాన్ చుట్టూ పచ్చని గడ్డి వేసి, అందంగా మొక్కలు నాటారు. అయితే సీఎం సన్నిహిత వర్గాల సూచన మేరకు గురువారం ఉదయం హడావుడిగా రావి మొక్కను నాటినట్లు తెలుస్తోంది.

### ట్రాఫిక్‌లో కేటీఆర్

#### సభకు వెళ్లకుండానే వెనక్కి..

**భీమ్‌గల్ (బాల్కొండ):** పోచంపాడు వద్ద బహిరంగసభలో పాల్గొనేందుకు వెళ్లిన మంత్రి కేటీఆర్ ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయారు. సీఎం సభకు వచ్చిన వాహనాలతో జాతీయ రహదారిపై దాదాపు 20 కిలోమీటర్ల మేర ట్రాఫిక్ స్తంభించిపోయింది. దాంతో మంత్రి కేటీఆర్ కాన్వాయ్ కూడా ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయింది. కొద్దిసేపు ప్రయత్నించి.. సభా స్థలం సమీపం వరకు వెళ్లగలిగారు. అయితే అప్పటికే సభ పూర్తయి కేసీఆర్ వెళ్లిపోవడంతో.. కేటీఆర్ వెనుదిరిగారు. అయితే ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయిన సమయంలో సభకు వస్తున్న యువకులతో కేటీఆర్ సరదాగా సెల్ఫీలు దిగారు. దీంతో పెద్ద సంఖ్యలో యువకులు ఫొటోలు దిగేందుకు పోటీపడ్డారు.

### నాలుగు జీవధారలతో సస్యశ్యామలం

నాలుగు జీవధారలతో రాష్ట్రం సస్యశ్యామలం అవుతుందని సీఎం కేసీఆర్ చెప్పారు. పెన్‌గంగ వంటి మొదటి జీవధార ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాను సస్యశ్యామలం చేస్తోందన్నారు. రెండో జీవధార రాష్ట్రంలో 200 కిలోమీటర్లపైన ప్రవహించే గోదావరి నది అని.. అది ఎప్పటికీ 70, 80 టీఎంసీలతో నిండి ఉంటుందని తెలిపారు. ఇక మూడో జీవధార ఎస్సారెస్పీ వరద కాలువ అని, ఇది శ్రీరాంసాగర్ ప్రాజెక్టును నింపడంతో పాటు, నిర్మల్, నిజామాబాద్, లోయర్‌మానేరు, మిడ్ మానేరు మీదుగా వరంగల్ దాటి పోతుందని చెప్పారు. నాలుగో జీవధార మిడ్‌మానేరు నుంచి అనంతగిరి, రంగనాయకి సాగర్, బస్వాపూర్ రిజర్వాయర్ల ద్వారా హైదరాబాద్ వరకు కొనసాగుతుందన్నారు. తాను ఈ అంశాన్ని మంత్రులందరికీ చెప్పానని, ప్రజలకు వివరించాలని సూచించామని తెలిపారు. రాబోయే కాలంలో తెలంగాణలో 40 లక్షల నుంచి 45 లక్షల ఎకరాలకు కాలువల ద్వారా సాగునీరు అందుతుందని చెప్పారు.

### రాష్ట్ర నాయకత్వమంతా హాజరు

దాదాపుగా టీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకత్వం మొత్తం పోచంపాడు బహిరంగ సభకు హాజరైంది. ఉప ముఖ్యమంత్రులు కడియం శ్రీహరి, మహమూద్ అలీ, మంత్రులు నాయిని నర్సింహారెడ్డి, ఈటల, తలసాని, మహేందర్‌రెడ్డి, జోగు రామన్న, పద్మారావు, ప్రభుత్వ చీఫ్ విప్ కొప్పుల ఈశ్వర్, రాజ్యసభ సభ్యులు డీఎస్, కెప్టెన్ లక్ష్మీకాంతరావు, ఎంపీలు కల్వకుంట్ల కవిత, బీబీ పాటిల్, వినోద్‌కుమార్, బాల్క సుమన్, మిషన్ భగీరథ వైస్ చైర్మన్ ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్దన్, జీవన్‌రెడ్డి, బిగాల గణేశ్‌గుప్తా, షకీల్, హన్మంత్ షిండే, కొండా సురేఖ, ఎమ్మెల్సీలు సుధాకర్‌రెడ్డి, రాజేశ్వర్‌రావు, భూపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ట్రాఫిక్ సమస్య కారణంగా మంత్రి కేటీఆర్ సభా స్థలానికి చేరుకోలేక వెనుదిరిగారు.

### రాష్ట్రానికి ఊపిరినిచ్చే ప్రాజెక్టు ఇది: హరీశ్

శ్రీరాంసాగర్ ప్రాజెక్టు పునరుజ్జీవన పథకం ఉత్తర తెలంగాణ జిల్లాలకు ఊపిరినిస్తుందని భారీ నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు చెప్పారు. అతి తక్కువ ఖర్చు, అతి తక్కువ ముంపు, అతి తక్కువ సమయంలో ఎక్కువ ఆయకట్టుకు ఇది నీరందించగలదని తెలిపారు. కర్త, కర్మ, క్రియ అన్నీ తానై కేసీఆర్ ఈ ప్రత్యేక పథకానికి రూపకల్పన చేశారని కొనియాడారు. కాళేశ్వరం నీటిని తరలించేందుకు అవసరమైతే మూడు షిఫ్టుల్లో ఉద్యోగులతో పని చేయించాలని సీఎం సూచించారని తెలిపారు. కృష్ణా, గోదావరి నదుల ద్వారా వచ్చే నీటి శాతం తగ్గిపోతోందని.. దాంతో ఉన్న నీటిని సద్వినియోగం చేసుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. సీఎం ఆదేశాలను ఓ భగవద్గీత, ఓ ఖురాన్‌లా పవిత్రంగా భావించి ఎస్సారెస్పీ పునరుజ్జీవన పథకాన్ని వేగంగా పూర్తి చేస్తామని పేర్కొన్నారు. సాగునీటి పథకాలతో టీఆర్‌ఎస్‌కు మంచి పేరు రావడాన్ని తట్టుకోలేకే కాంగ్రెస్ నేతలు విమర్శిస్తున్నారన్నారు.

## 12 నుంచి రెండో దశ వెబ్ ఆప్షన్లు

### ఎంబీబీఎస్, బీడీఎస్ ఏ కేటగిరీ సీట్లకు..

**సాక్షి, హైదరాబాద్:** తెలంగాణలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు, మైనారిటీ కాలేజీల్లోని ఏ కేటగిరీ ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల భర్తీ కోసం ఆగస్టు 12 నుంచి రెండో దశ వెబ్ ఆప్షన్ల ప్రక్రియ మొదలుకానుంది. ఆగస్టు 12, 13, 14 తేదీల్లో ఏ కేటగిరీ వెబ్ ఆప్షన్ల ప్రక్రియ నిర్వహించేందుకు కాళోజీ నారాయణరావు ఆరోగ్య, విజ్ఞాన విశ్వవిద్యాలయం ఏర్పాట్లు చేస్తోంది. జాతీయ వైద్య నిబంధనల ప్రకారం ఏ కేటగిరి వైద్య సీట్లకు ఆగస్టు 18లోపు కౌన్సెలింగ్ పూర్తి చేయాల్సి ఉంది. ఈ నేపథ్యంలో కాళోజీ విశ్వవిద్యాలయం ఆగస్టు 14తో వెబ్ కౌన్సెలింగ్ ప్రక్రియను ముగిస్తోంది.

# సీఎం సభలో కలకలం

### భారీ కటౌట్ ఎక్కిన సర్పంచ్ భర్త



**భీమ్‌గల్/మోర్తాడ్/కడెం:** సీఎం కేసీఆర్ పోచంపాడ్‌లో గురువారం పాల్గొన్న బహిరంగ సభలో కలకలం రేగింది. సీఎం ప్రసంగం ముగుస్తుండగానే సభా వేదిక పక్కన ఏర్పాటు చేసిన ఆయన వంద అడుగుల భారీ కటౌట్‌పైకి ఓ సర్పంచ్ భర్తతో పాటు మరో మహిళ వేర్వేరు కారణాలతో ఎక్కి ఆత్మహత్య చేసుకుంటామని బెదిరించారు. సీఎం కేసీఆర్ ప్రసంగం చివరి దశకు చేరుకుని ముగింపు పలుకుతున్న సమయంలో ఆదిలాబాద్ జిల్లా కడెం మండలం గంగాపూర్ సర్పంచ్ ఆరెంపల్లి శాంత భర్త చంద్రహాస్ కటౌట్ ఎక్కి, గ్రామ సమస్యలపై వినతిపత్రాన్ని సీఎం కేసీఆర్ వైపు చూపించాడు. ఈ దశలో సీఎం ఇదేమీ పట్టించుకోకుండా సభను ముగించి తిరుగుముఖం పట్టారు. దీంతో బాధితుడు పై నుండే గొడవ చేయడం ప్రారంభించాడు. ఈ సమయంలోనే ఊహించని రీతిలో పోచంపాడ్‌కు చెందిన విజయలక్ష్మి సైతం కటౌట్ ఎక్కి, తనకు డబుల్ బెడ్రూం ఇల్లు ఇవ్వాలని డిమాండ్ చేసింది. లేని పక్షంలో దూకుతానని బెదిరించింది. ఈ నేపథ్యంలో ముగ్గురు కానిస్టేబుళ్లు వారిని కిందకు దించేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. విజయలక్ష్మి చివరకు కిందకు దిగింది. కానీ, చంద్రహాస్ మాత్రం తనకు స్పష్టమైన హామీ ఇచ్చే వరకు కిందికి దిగేది లేదని మొండికేసాడు. గ్రామ సమస్యలపై ఎన్నిసార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని, గత్యంతరం లేక సర్పంచ్ భర్త ఇలా చేయాల్సి వచ్చిందని ఓ గ్రామస్తుడు వివరించాడు. గ్రామాన్ని రాష్ట్ర పోలీసు అధికారి దత్తత తీసుకున్నా పనులు చేయడం లేదని ఆరోపించాడు. దీంతో సీపీ కార్తికేయ ఆ అధికారితో తాను మాట్లాడుతానని చెప్పడంతో కిందికి దిగాడు.

## ఓయూలో దూరవిద్య బీఈడీ కోర్సు రద్దు

**హైదరాబాద్:** ఓయూ పరిధిలోని రెగ్యులర్ కళాశాలల్లో ఇన్ సర్వీస్ టీచర్ల కోసం కొనసాగుతున్న రెండు సంవత్సరాల బీఈడీ కోర్సుతో పాటు బీఈడీ థర్డ్ మెథడాలజీ కోర్సులు రద్దయ్యాయి. డిస్టెన్స్ ఎడ్యుకేషన్ బ్యూరో (డెబ్) నిబంధనల ప్రకారం దూరవిద్య కోర్సు కేవలం సార్వత్రిక వర్సిటీలు, దూరవిద్య కేంద్రాలలో మాత్రమే నిర్వహించాలని సూచించడంతో ఓయూ పరిధిలోని కళాశాలల్లో బీఈడీ కోర్సును రద్దు చేశారు. ఈ కోర్సును తిరిగి ప్రారంభించేందుకు ఓయూ దూరవిద్య కేంద్రం నుంచి ప్రయత్నాలు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

## సచివాలయంలో సాంస్కృతిక కార్యక్రమాలు

### నేడు విజేతలకు బహుమతుల అందజేత

**సాక్షి, హైదరాబాద్:** స్వాతంత్య్ర దినోత్సవం, ప్రొఫెసర్ జయశంకర్, ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతి కార్యక్రమాలను పురస్కరించుకొని తెలంగాణ సచివాలయ టీఎన్జీవోల యూనియన్ ఆధ్వర్యంలో గురువారం సచివాలయంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో బంగారు తెలంగాణలో ఉద్యోగుల పాత్రపై ప్రసంగం, పరిపాలన సంస్కరణలపై వ్యాస రచన పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన వారికి ఈ నెల 11న (శుక్రవారం) బహుమతులు అందజేస్తామని టీఎన్జీవో అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కారం రవీందర్, మామిళ్ల రాజేందర్ తెలిపారు. బహుమతుల ప్రదాన కార్యక్రమంలో మంత్రులు నాయిని, ఈటల రాజేందర్ ముఖ్య అతిథులుగా పాల్గొంటారని పర్యాటక శాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం హాజరవుతారని తెలిపారు.

# వచ్చేనెల 9న జీఎస్టీ కౌన్సిల్ భేటీ

### సమావేశానికి హైదరాబాద్ ఆతిథ్యం

- కేంద్ర మంత్రి అరుణ్‌జైట్లీ సహా అన్ని రాష్ట్రాల ప్రతినిధుల రాక

**సాక్షి, హైదరాబాద్:** వస్తుసేవల పన్ను (జీఎస్టీ)కు మార్గదర్శకత్వం వహించే జీఎస్టీ కౌన్సిల్ 21వ సమావేశానికి మన రాష్ట్రం ఆతిథ్యం ఇవ్వనుంది. కేంద్ర ఆర్థిక మంత్రి చైర్మన్‌గా వ్యవహరించే ఈ కౌన్సిల్ తదుపరి సమావేశం వచ్చేనెల 9న హైదరాబాద్‌లోని నోవాటెల్ హోటల్‌లో నిర్వహించనున్నారు. ఈ సమావేశానికి కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీతో పాటు అన్ని రాష్ట్రాల ఆర్థిక మంత్రులు, వాణిజ్య పన్నుల శాఖల ముఖ్య కార్యదర్శులు, కమిషనర్లు హాజరై జీఎస్టీ అమల్లో ఎదురవుతున్న సమస్యలను గుర్తించి వాటికి పరిష్కార మార్గాలపై దృష్టి సారించనున్నారు.

### రాష్ట్రంలో వివాదాస్పదం..

తెలంగాణలో జీఎస్టీ అమలు వివాదాస్పదమవుతోంది. మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, డబుల్ బెడ్‌రూం ఇళ్లు, ఇరిగేషన్ ప్రాజెక్టులపై జీఎస్టీ అమలు వల్ల రూ.19,200 కోట్ల భారం పడుతుందని ప్రభుత్వం లెక్కలు కడుతోంది. అభివృద్ధి పనుల విషయంలో జీఎస్టీని 18 శాతం నుంచి 5 శాతానికి తగ్గించాలని రాష్ట్రం పట్టుబడుతోంది. దీనివల్ల రూ.6 వేల కోట్లకు పైగా ప్రభుత్వానికి ఉపశమనం కలగనుందని పన్నులశాఖ అధికారులు చెపుతున్నారు. ప్రస్తుతం ప్రారంభమైన అభివృద్ధి పనులకు 18 నుంచి 12 శాతానికి తగ్గిస్తామని, ప్రారంభం కావాల్సిన పనులకు మాత్రం అన్ని రాష్ట్రాలతో పాటు 18 శాతమే జీఎస్టీ వసూలు చేయాల్సి ఉంటుందని కేంద్రం మెలికపెడుతోంది. అయితే, ఏకంగా జీఎస్టీ కౌన్సిల్ సమావేశమే హైదరాబాద్‌లో జరగనుండడంతో అభివృద్ధి పనులకు ఉపయోగించే వస్తువులపై జీఎస్టీని 5శాతమే వసూలు చేయాలని కేంద్రం వద్ద ప్రతిపాదించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ఈ మేరకు అవసరమైన అన్ని నివేదికలను సిద్ధం చేస్తోంది. దీనిపై వాణిజ్య పన్నుల శాఖ అధికారులు కసరత్తును తీవ్రతరం చేశారు. ఈ సమావేశానికి రాష్ట్ర ముఖ్యమంత్రి హోదాలో కేసీఆర్ కూడా హాజరయ్యే అవకాశాలున్నట్టు తెలుస్తోంది.

## ఓయూ బీఈడీ కళాశాల పేరు మార్పు

**హైదరాబాద్:** ఓయూ క్యాంపస్‌లోని బీఈడీ కళాశాల పేరును మార్పు చేసినట్లు ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బలరామ్‌నాయక్ గురువారం తెలిపారు. గతంలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ స్టడీ ఇన్ ఎడ్యుకేషన్‌గా ఉన్న పేరును యూనివర్సిటీ కాలేజీ ఆఫ్ ఎడ్యు కేషన్‌గా మార్పు చేసినట్లు తెలిపారు. ఎంహెచ్‌ఆర్‌డీ పథకం కింద 1996– 97లో ఐఏఎస్‌ఈగా నామకరణం చేసినట్లు చెప్పారు. బీఈడీ కళాశాల కొత్త భవనం నిర్మాణం కోసం వీసీ రూ.5 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. రూ.5 లక్షల వ్యయంతో లైబ్రరీని ఆధునీకరించి ఈ–లైబ్రరీని ప్రారంభించామన్నారు.


ఇదం జగత్



● ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ పట్ల బీజేపీ, టీఆర్ఎస్ వైఖరికి నిరసనగా శుక్రవారం(11న) రాష్ట్రవ్యాప్తంగా విద్యాసంస్థల బంద్‌కు పిలుపునిచ్చామని మాదిగ విద్యార్థి సమాఖ్య (ఎంఎస్ఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు గోవింద్ నరేశ్ మాదిగ, ఓయూ ఇన్‌చార్జి పల్లెర్ల సుధాకర్ మాదిగ తెలిపారు.

# ఏపీ, తెలంగాణ హజ్ యాత్రికులకు హైదరాబాద్‌లోనే ఏర్పాట్లు

● తెలంగాణ, ఆంధ్రా హజ్ కమిటీల మధ్య కుదిరిన ఒప్పందం
● హజ్ ప్రత్యేక అధికారి షుకూర్



**సాక్షి, హైదరాబాద్:** ఆంధ్రప్రదేశ్ హజ్ కమిటీ ద్వారా 2017 హజ్ యాత్రకు ఎంపికైన యాత్రికులను కేంద్ర హజ్ కమిటీ గన్నవరం ఎయిర్‌పోర్టు నుంచి తీసుకెళ్లేందుకు నిరాకరించడంతో వారు కూడా హైదరాబాద్ నుంచి వెళ్లేందుకు వీలుగా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలంగాణ రాష్ట్ర హజ్ కమిటీ ప్రత్యేక అధికారి ఎస్ఏ.షుకూర్ తెలిపారు. గురువారం నాంపల్లి హజ్‌హౌస్‌లోని కమిటీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ యాత్రికులకు ఆగస్టు 11– 22 తేదీల్లో నాంపల్లి హజ్ హౌస్‌లో హజ్ క్యాంప్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ క్యాంప్‌లో అన్ని సౌకర్యాలు ఉంటాయన్నారు. కేంద్ర హజ్ కమిటీ సూచనల ప్రకారం మొదటి 6 రోజులు తెలంగాణ యాత్రికులు యాత్రకు వెళ్తారని, మిగిలిన 4 రోజులు ఆంధ్రా యాత్రికులు వెళ్తారన్నారు. తెలంగాణ యాత్రికులకు వసతి, భోజనం యాత్రకు కావాల్సిన అన్ని సౌకర్యాలు హజ్ హౌస్‌లోనే ఏర్పాటు చేస్తారన్నారు. ఈ మాదిరిగానే ఆంధ్రా హజ్ కమిటీ అధికారులు, ఆంధ్రా మైనార్టీ సంక్షేమ శాఖ ప్రత్యేక కార్యదర్శి కూడా తమ యాత్రికులకు హజ్‌హౌస్‌లోనే వసతులు కల్పించాలని నిర్ణయించారన్నారు. ఈ మేరకు ఇరు రాష్ట్రాల హజ్ కమిటీల మధ్య ఒప్పందం కుదిరిందని షుకూర్ తెలిపారు. హజ్ క్యాంప్ నిర్వహణకు అయ్యే ఖర్చులను యాత్రికుల సంఖ్య, నిష్పత్తి ప్రకారం చెల్లింపులు ఉంటాయన్నారు. ఈ నేపథ్యంలోనే ఆంధ్రా హజ్ కమిటీ హజ్ క్యాంప్ నిర్వహణకు గాను ముందస్తుగా రూ.30 లక్షలు తెలంగాణ కమిటీకి చెల్లించిందన్నారు. దీంతో ఆంధ్రా యాత్రికులకు ఎలాంటి లోటు రాకుండా చూసుకొనే బాధ్యత తెలంగాణ హజ్ కమిటీపై ఉంటుందన్నారు. ఆంధ్రా యాత్రికుల ప్రయాణం తేదీల్లో ఆంధ్రా హజ్ కమిటీ ఉద్యోగులు పూర్తి సహకారం అందిస్తారని షుకూర్ తెలిపారు. ఆంధ్రా యాత్రికుల కోసం ఏర్పాట్లపై చివరి వరకూ స్పష్టత లేకపోవడంతో వారు కొంత గందరగోళానికి గురయ్యారు. అయితే ఇరు రాష్ట్రాల హజ్ కమిటీలు ఓ పరిష్కార మార్గం కనుగొనడంతో వారికి ఇక్కట్లు తప్పాయి.

## 19లోగా కాలేజీల్లో చేరండి: దోస్త్

**సాక్షి, హైదరాబాద్:** డిగ్రీ ఆన్‌లైన్ ప్రవేశాల్లో భాగంగా మూడో దశ సీట్ల కేటాయింపును ప్రకటించినట్లు డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ(దోస్త్) ప్రవేశాల కమిటీ తెలిపింది. సీట్లు పొందిన వారి మొబైల్‌కు సమాచారం పంపించామంది. అలాట్‌మెంట్ లెటర్లను డౌన్‌లోడ్ చేసుకొని ఈ నెల 19న సాయంత్రం 5లోగా కాలేజీల్లో రిపోర్టు చేయాలంది.

## 'ఏఈఈ పరీక్షను వాయిదా వేయండి'

**సాక్షి, హైదరాబాద్:** స్టాఫ్ సెలక్షన్ కమిషన్ రాత పరీక్షలు ఈ నెల 5న ప్రారంభమయ్యాయని, అవి 21 వరకు ఉన్నాయని, అందుకే ఏఈఈ పరీక్షలను ఆగస్టు 21 వరకు వాయిదా వేయాలని కోరుతూ టీఎస్‌పీఎస్సీ చైర్మన్‌కు అభ్యర్థులు వినతిపత్రం ఇచ్చారు.

# సాక్షి

శుక్రవారం, ఆగస్టు, 11

## ట్రంప్-కిమ్ కయ్యం

అమెరికా, ఉత్తర కొరియాల మధ్య వాగ్యుద్ధం ముదిరింది. చివరికి అది పూర్తి స్థాయి యుద్ధంగా మారుతుందేమోనన్న భయాందోళనలు ఒక్క అమెరికాలో మాత్రమే కాదు... ప్రపంచమంతటా వ్యాపించాయి. తమ దేశానికి ముప్పు కలిగించాలని చూస్తే కనీవినీ ఎరుగని విధ్వంసాన్ని చవిచూడాల్సి వస్తుందని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ హెచ్చరించిన కొన్ని గంటలకే ఉత్తర కొరియా అందుకు దీటైన జవాబిచ్చింది. పసిఫిక్ మహా సముద్రంలో అమెరికా సైనిక స్థావరంగా ఉన్న గ్వామ్ ద్వీపంపై మధ్య శ్రేణి ఖండాంతర క్షిపణి హ్వాసంగ్-12తో దాడి చేయదల్చుకున్నట్టు ఆ దేశం ప్రకటించింది. అందుకు సంబంధించిన పథక రచన పూర్తయిందని కూడా వివరించింది. అంతటితో వదలకుండా అమెరికా భూభాగాన్ని సైతం ధ్వంసం చేస్తామని బెదిరించింది. గ్వామ్ ద్వీపంలో అమెరికా జలాంతర్గాముల దళం, వైమానిక దళ స్థావరం, తీర రక్షక దళం వగైరాలున్నాయి. అక్కడ అమెరికా సైనిక స్థావరం మాత్రమే కాదు... దాదాపు లక్షన్నర జనాభా ఉంది. బడాయి కబుర్లు ఉత్తర కొరియాకు కొత్తగాదు. తాము హైడ్రోజన్ బాంబును పరీక్షించి చూశామంటూ నిరుడు ఆ దేశం చేసిన ప్రకటన అగ్రరాజ్యాల వెన్నులో మాత్రమే కాదు... ప్రపంచమంతా వణుకు పుట్టించింది. వెంటనే కాకపోయినా ఒకటి రెండేళ్లలో ఉత్తర కొరియా పూర్తి స్థాయి అణ్వాయుధ దేశంగా మారొచ్చునన్న అంచనాలు కూడా వెలువడుతున్నాయి. ఇప్పటికైతే దాని దగ్గర పెను విధ్వంసం సృష్టించగల ఖండాంతర క్షిపణులు రెడీగా ఉన్నాయన్నది వాస్తవం. కొరియా ద్వీప కల్పం ఉన్న ఈశాన్య ఆసియా ప్రపంచంలో పశ్చిమ యూరప్, అమెరికాల తర్వాత ముమ్మరంగా ఆర్థిక, వాణిజ్య కార్యకలాపాలు సాగే అతి పెద్ద ప్రాంతం. పపువా న్యూగినియా, ఫిలిప్పీన్స్, జపాన్ వగైరాలు కొరియా ద్వీపకల్పానికి 1,500 మైళ్ల లోపు దూరంలో ఉన్నాయి. కనుక యుద్ధమంటూ మొదలైతే అది సామాన్యంగా ఉండదు. భారీ జన నష్టాన్ని మాత్రమే కాదు... ప్రపంచ మార్కెట్లనే ఆ యుద్ధం తలకిందులు చేస్తుంది. దేశదేశాల ఆర్థిక వ్యవస్థలనూ కోలుకోలేని దెబ్బ తీస్తుంది.

కేవలం ఇరువైపులా వెలువడుతున్న ప్రకటనల ఆధారంగా యుద్ధం నిజంగా ముంచుకొస్తుందని ఎవరూ నిర్ధారించలేరు. ఎందుకంటే ఇలాంటి ప్రకటనలు ఆ రెండు దేశాలకూ కొత్తగాదు. ట్రంప్‌కు ముందున్న అధ్యక్షులు సైతం ఉత్తర కొరియాను గతంలో బెదిరించారు. అయితే ఉత్తర కొరియా భాషను పుణికి పుచ్చుకోవడం ట్రంప్‌తోనే మొదలైంది. మూర్ఖత్వం ఒకరికే సొంతమైతే ఎంతో కొంత భరించవచ్చు. అదుపు చేయొచ్చు. రెండోవైపు కూడా అది బయల్దేరితే...ఆ ఇద్దరూ పరస్పరం కాలుదువ్వడం ప్రారంభిస్తే అది ఎటు దారి తీస్తుందో చెప్పలేం. అటు ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జాంగ్ ఉన్... ఇటు ట్రంప్ ఇద్దరికిద్దరూ మూర్ఖత్వంలో ఒకరిని మించి ఒకరున్నారు. ఉత్తర కొరియా మాటేమోగానీ... ట్రంప్ మాత్రం ఇంతవరకూ రెచ్చగొట్టే ప్రకటనలకు మించి ఏమీ చేయడం లేదు. కనీసం దళాల సంసిద్ధతకు సంబంధించి ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేదు. కొరియా ద్వీపకల్పానికి విమాన వాహక నౌక తరలింపు లేదా అక్కడ ఒకటి రెండు నౌకలను అటూ ఇటూ హడావుడిగా కదల్చడం వంటి ఛాయలు కూడా లేవు. అయితే అణ్వాయుధాలను ఆధునికీకరించే ఫైలుపై అధ్యక్షుడైన వెంటనే సంతకం చేశానని, ఆ విభాగంలో అమెరికా ఎన్నడూ లేనంత శక్తిమంతంగా, బలంగా ఉన్నదని ట్రంప్ చేసిన ప్రకటనను యుద్ధ వ్యతిరేక ఉద్యమకారులు తేలిగ్గా తీసుకోవడం లేదు. దేశాన్ని యుద్ధంలోకి నెట్టే ఇలాంటి ప్రమాదకరమైన మూర్ఖపు ప్రకటనలు చాలించమంటూ దేశవ్యాప్తంగా జరిపిన సభల్లో ఆయనను హెచ్చరించారు.ఉత్తర కొరియా ఖండాంతర బాలిస్టిక్ క్షిపణి పరీక్ష జరిపినప్పటి నుంచీ ట్రంప్ స్వరం పెరిగింది. దాంతోపాటే ఉత్తర కొరియా కూడా మాటలు మీరుతోంది. వాటికి తోడు అడపా దడపా క్షిపణి పరీక్షలు సాగిస్తూనే ఉంది.

ఏదో రకంగా అమెరికాను, ప్రపంచాన్ని బెదరగొట్టి తనకు కావలసినవాటిని సాధించుకోవడమే ఉత్తర కొరియా ఆంతర్యం. తనను అణ్వాయుధ దేశంగా అమెరికా గుర్తించడం అందులో ఒకటి. అలా గుర్తిస్తే దేశంలో తన పరపతి పెరుగుతుందని... అమెరికా లాంటి అతి పెద్ద దుష్ట దేశం మెడలు వంచానన్న కీర్తి లభిస్తుందని కిమ్ కలలు కంటున్నారు. అమెరికా లొంగి వచ్చి దౌత్య సంబంధాలకు సిద్ధపడుతుందని ఆయన భావిస్తున్నారు. నిజంగా అలా దౌత్య సంబంధాలు ఏర్పడితే అమెరికా తీర్చాల్సిన కోర్కెలు ఇంకా చాలా ఉన్నాయి. ముఖ్యంగా తమపై ఒత్తిళ్లు తీసుకొచ్చి 1953లో సంతకం చేయించిన యుద్ధ విరమణ సంధిని రద్దు చేసి శాంతి ఒప్పందం కుదిరేందుకు కృషి చేయాలన్నది అందులో కీలకమైనది. ఈమధ్యే బాధ్యతలు స్వీకరించిన దక్షిణ కొరియా అధ్యక్షుడు మూన్ జే యిన్ తరచు ఉభయ కొరియాల పౌరుల సాన్నిహిత్యం గురించి, ఇరు దేశాల మధ్య చర్చల గురించి మాట్లాడుతున్న తీరు కిమ్‌కు నచ్చడం లేదు. కొరియా విభజనతో వేలాది కుటుంబాలు విచ్ఛిన్నమయ్యాయి. రక్తం పంచుకు పుట్టినవారు విడిపోవాల్సివచ్చింది. ఎడతెగని వైషమ్యాలు, యుద్ధాలు... అమెరికా ప్రోద్బలంతో వచ్చిపడిన ఆంక్షలు ఉత్తర కొరియా ప్రజలను కుంగదీశాయి. పేదరికం, నిరుద్యోగం, ద్రవ్యోల్బణం సంక్షోభంలోకి నెట్టాయి. అమెరికాను బెదిరిస్తేనే ఈ స్థితి కాస్తయినా మారుతుందని కిమ్ దృఢమైన విశ్వాసం. సమస్య ఏమంటే... ఇలాంటి నమ్మకమే ట్రంప్‌కు కూడా ఉంది. గట్టిగా బెదిరిస్తే, కఠినంగా మాట్లాడితే అంతా సర్దుకుంటుందని ఆయన అనుకుంటున్నారు. ఉత్తర కొరియాను మాటలతో దారికి తెచ్చిన ఘనత దక్కుతుందని, దేశంలో తన ఆదరణ పెరుగుతుందని భావిస్తున్నారు. కానీ ఈ మతిమాలిన చేష్టలు చివరకు ఎటు దారి తీస్తాయోనని విశ్లేషకులు ఆందోళన పడుతున్నారు. కనుక ట్రంప్ బాధ్యతగా మెలగాలి. రెచ్చగొట్టే ప్రకటనలు సమస్యను మరింత సంక్లిష్టం చేస్తాయని గుర్తించాలి.



యుద్ధం తర్వాత మనలో మిగిలేది, అది దేన్నీ పరిష్కరించలేదనే భావన మాత్రమే. యుద్ధంలో గెలుపు కూడా ఓటమంత వినాశకరమైనదే.

– ఆగాథా క్రిస్టీ
ఇంగ్లిష్ రచయిత్రి

### గ్రహం అనుగ్రహం

శ్రీ హేవిళంబి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు శ్రావణ మాసం, తిథి బ.చవితి రా.10.44 వరకు, తదుపరి పంచమి నక్షత్రం పూర్వాభాద్ర ఉ.6.21 వరకు, తదుపరి ఉత్తరాభాద్ర, వర్జ్యం ప.3.52 నుంచి 5.27 వరకు, దుర్ముహూర్తం ఉ.8.16 నుంచి 9.06 వరకు, తదుపరి ప.12.30 నుంచి 1.21 వరకు, అమృతఘడియలు రా.1.23 నుంచి 3.00 వరకు.

సూర్యోదయం : 5.45
సూర్యాస్తమయం : 6.26
రాహుకాలం : ఉ.10.30 నుంచి 12.00 వరకు
యమగండం : ప.3.00 నుంచి 4.30 వరకు

### నమాజ్ వేళలు

| | | | |
|---|---|---|---|
| ఫజర్ | 4.42 | మగ్రీబ్ | 6.44 |
| జొహర్ | 12.21 | ఇషా | 8.01 |
| అసర్ | 4.49 | | |

# మౌన ఛేదనే మార్పుకు నాంది



దిలీప్ రెడ్డి

'బయటకు వెళ్లిన పిల్లలు ఆలస్యంగా ఇంటికి వస్తున్నారంటే తల్లిదండ్రులు ఆందోళన చెందాల్సింది ఆడపిల్లల గురించి కాదు, మగపిల్లల గురించి' అన్న కిరణ్‌ఖేర్ మాట అక్షర సత్యం! చట్టాల్లో, పోలీసు వ్యవస్థలో, న్యాయపాలనలో, సామాజిక దృక్పథంలో, మగవాళ్ల ఆలోచనల్లో... అంతటా మార్పు రావాల్సిందే! వర్ణిక, అదితిల ధైర్యం, పట్టుదల వికసిస్తున్న మహిళా చైతన్యానికి సంకేతం, ఇతరులకు ఆదర్శం. మహిళల పట్ల జరుగుతున్న అన్ని రకాల దాష్టీకాలకూ కాలం చెల్లే రోజులు వస్తున్నాయనడానికి వారి తెగువ బలమైన సంకేతం.

### సమకాలీనం

కొత్తతరం మహిళ వర్ణిక కుందు పెట్టిన పెద్ద పొలికేక భారతదేశమంతా ఇప్పుడు ప్రతిధ్వనిస్తోంది. అదింకా ఎన్నెన్నో రెట్లు పెరిగి, దిక్కులు పిక్కటిల్లే శబ్దమై ఘోషించాలి. దాన్ని అందిపుచ్చుకొని మహిళలు భవిష్యత్ బాటలు సుస్థిరం చేసుకోవాల్సిన తరుణమిది. న్యాయబద్ధంగా తమదైన ప్రతిష్ఠాత్మక స్థానాన్ని భారత మహిళ పదిలపరచుకోవాల్సిన సమయం వచ్చేసింది. పటిష్టంగా వేళ్లూనుకున్న మన పురుషాధిక్య సమాజంలో మొగ్గతొడుగుతున్న మార్పులకిది చిరు సంకేతం! ఓ రకంగా చూస్తే ఘర్షణల పురిటి నొప్పులు పడుతున్న సంధి కాలమనిపిస్తుంది. 48 గంటల వ్యవధిలో చండీగఢ్‌లో వర్ణిక, ముంబైలో అదితి అనే ఇద్దరు వనితలు కనబరచిన అసాధారణ తెగువ అభినందనీయం! 'మేం ఏం చేసినా చెల్లుబాటవుతుంద'నుకున్న ముగ్గురి పురుషాహంకారాన్ని చెంప చెళ్లు మనేలా తిప్పికొట్టారు. ఈ వీర వనితలు, ఈ దేశపు 65 కోట్ల మహిళలకు ప్రతినిధులే కాదు, మరో 65 కోట్ల మందితో కూడిన పురుష సమాజానికి ప్రత్యక్ష గుణపాఠం చెబుతున్న సవాళ్లు! సమాజ గతి మార్పునకు తెరతీస్తున్న 'చేంజ్ అంబాసిడర్లు'! రాత్రిపూట వీధుల్లో తమను వెంటాడిన వైట్‌కాలర్డ్ మానవ మృగాల్ని ధైర్యంగా ఎదుర్కొన్నవారు. స్వీయ ప్రతిభతో విపత్తు నుంచి గట్టెక్కినా, 'బయటపడ్డాం, బతుకుజీవుడా!' అని సరిపెట్టుకోకుండా, సాహసించి ఆ ముష్కరుల్ని కటకటాల వెనక్కి పంపారు. పాలకపక్షం బీజేపీ హరియాణా శాఖ అధ్యక్షుడు సుభాష్ బరాలా కుమారుడు, వికాస్ బరాలాను రెండోసారి అరెస్టు చేయించి, అదనపు సెక్షన్లు పెట్టించిందా తెగింపే! ముంబైలో తనను వెంటాడి, కడకు ఇంటి తలుపు తట్టిన 'టెక్కీ'కీ దాదాపు అదే గతి పట్టించింది ఓ ఇల్లాలి తెగువ! ప్రతికూల పరిస్థితిని వారు సమర్థంగా ప్రతిఘటించారు. సకాలంలో పోలీసులకు ఫిర్యాదు చేశారు. దుశ్చర్యను సామాజిక మాధ్యమాల్లో (ఫేస్‌బుక్) ఎండగట్టారు. తగు చర్యలు తీసుకోవాలని సర్కార్‌ను డిమాండ్ చేశారు. చర్యలు తీసుకోక తప్పని అనివార్య పరిస్థితుల్ని కల్పించారు. పిరికితనంతో, పాడుపడిన సంప్రదాయ కట్టుబాట్ల గుహల్లో కుమిలి, మగ్గి పోవడానికి వారు సిద్ధంగా లేరు. ''నా పేరును గోప్యంగా ఉంచి ముఖాన్ని దాచుకోవాల్సిన అవసరం లేదు, ఎందుకంటే, నేను నేరస్తురాల్ని కాదు, బాధితురాలినీ కాదు. ఒక విపత్కర పరిస్థితి నుంచి బయటపడ్డ విజేతను' అంటోంది వర్ణిక! 'వేటాడి, కిడ్నాప్‌నకు యత్నించి, నన్నింత క్షోభకు గురిచేసిన నేరతత్వపు ముష్కరులకు తగిన శిక్ష పడాల్సిందే!' అంటోందామె. ఆమె తండ్రి, సీనియర్ ఐఏఎస్ అధికారి వరిందర్‌సింగ్ కుందు ఆమెకు కొండంత అండ. ఇంకా పడికట్టు పదాలతో, మేకపోతు గాంభీర్యం కనబరుస్తున్న సంప్రదాయక సమాజంపై ప్రశ్నల పరంపరనే కురిపించింది వర్ణిక. ఆమె సంధించిన వాటిలో ఇంకా సమాధానం రాని, రావాల్సిన ప్రశ్నలు మనందరి చెవుల్లో గింగిరుమంటూనే ఉన్నాయి. సభ్య సమాజంలో మహిళల పట్ల జరుగుతున్న అన్ని రకాల దాష్టీకాలకూ క్రమక్రమంగా, కాలం చెల్లే రోజులు అనివార్యంగా సమీపిస్తున్నాయనేందుకు, వారిరువురి తెగువ ఓ బలమైన సంకేతం! ఆధిపత్య దురాలోచనలకు అడ్డుకట్ట, భావజాల సంస్కరణ, ప్రతిఘటన, నివారణ చర్యలు, దోషులకు కఠిన శిక్షల అమలు ద్వారా మాత్రమే ఆడవాళ్లపై జరిగే లైంగిక వేధింపులు, అఘాయిత్యాలు, అత్యాచారాలను నియంత్రించగలుగుతాం. తాము చూపిన తెగువ, పట్టుదల, ప్రతిఘటన దేశవ్యాప్తం కావాలన్న గట్టి సందేశమే వారిద్దరూ చూపిన సాహసం అంతరార్థం.

**కళ్లను కనురెప్పలు కాటేస్తున్నాయ్!**

స్విచ్ వేస్తే బల్బు వెలిగినంత వేగంగా వ్యవస్థలు మారవు. కానీ, మార్పు సంకేతాలున్నపుడు వాటిని గుర్తించడం, స్వాగతించడం, ప్రోత్సహించడం సమాజహితం కోరే వారి బాధ్యత. ఇప్పుడదే జరగాలి. తమపై పురుషులు జరిపే దాష్టీకాలను సాహసంతో ఎదురొడ్డి, మహిళలు ప్రతిఘటించే సంఘటనలు వేళ్లమీద లెక్కించగలిగినన్నే కావచ్చు! భవిష్యత్తులో చెట్టై విశాలంగా విస్తరించే విత్తుపై ఇప్పుడా క్రాంతి ఓ సన్నని పొట్టులాంటిదే! చీకటి వ్యవహారాల్లా జరిగిపోయే ఈ దారుణాల్లో అసలు వెలుగు చూసేవే కొన్నయితే, అందులో పోరాట బాటన సాగేవి చాలా తక్కువ. డబ్బు, పలుకుబడి, రాజకీయ నేపథ్యమున్న కుటుంబాల వారు చేసే అకృత్యాలు అసలు పోలీసు కేసుల దాకానే రావు. వచ్చినా, కడదాకా నిలువవు. ప్రతిఘటనల నడుమ ప్రాణాలు పణంగా పెట్టి పట్టుదలగా ఎవరైనా పోరు సాగించినా, భ్రష్టుపట్టిన వ్యవస్థల్ని వివిధ స్థాయిల్లో ప్రభావితం చేసే 'పెద్ద మనుషులు' కేసు దర్యాప్తుల్ని, నేర విచారణల్ని నిలువునా నీరుగారుస్తారు. పరిస్థితుల్ని తమకనుకూలంగా మలచుకుంటారు. నిర్దోషులుగా చలామణి అవుతారు. తుది ఫలితంపై భరోసా లేక, బాగా చదువుకున్న మహిళలు కూడా ఈ అఘాయిత్యాలను ప్రతిఘటించడానికి, పోరాడటానికి సాహసించలేక పోతున్నారు. మానసికంగా నలగటం, నలుగురి నోళ్లలో నానటం తప్ప ఒరిగేదేమీ ఉండదని కొన్నిసార్లు ఫిర్యాదు కూడా చేయట్లేదు. కానీ, మారుతున్న పరిస్థితుల్లో, శాస్త్ర-సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకొస్తున్న యుగంలో, నిజాల్ని నిప్పులా చూపే సీసీ కెమెరాల శకంలో, సామాజిక మాధ్యమాలు వేయి కళ్లతో చూస్తూ పౌర సమాజాన్ని అప్రమత్తం చేస్తున్న ఈ రోజుల్లో మహిళలు చూపే చొరవ, తెగింపే వారికి రక్ష. ముంబై, చండీగఢ్ వంటి పెద్ద నగరాల్లో జరిగిన ఈ రెండు ఘటనల్లోనూ వారు చేసిందదే! పట్టు సడలనీయకుండా ప్రతిఘటించారు. అందుబాటులోని అన్ని వనరుల్ని సమీకరించి 'మృగాళ్ల' ఆట కట్టించారు. మహిళలపై అఘాయిత్యమైనా, అందుకు ప్రయత్నమైనా.... లోలోపల కుమిలే మౌనం, నిశ్శబ్దం వారికి రక్ష కాదు సరికదా, చెలరేగే అల్లరి మూకలకు కొత్త ఇంధనం.

2013 అక్టోబర్ 18న హైదరాబాద్ ఇనార్బిట్ మాల్ ప్రాంతంలో క్యాబ్ ఎక్కిన యువతిని దారి మార్చి, ఓఆర్ఆర్‌లో తీసుకు వెళ్లి క్యాబ్ డ్రైవర్ అత్యాచారానికి తలపడ్డాడు. 'అభయ' పేరిట నమోదైన ఈ కేసును విచారించిన ఫాస్ట్‌ట్రాక్ కోర్టు, ఈ దుష్కృత్యానికి పాల్పడ్డ డ్రైవర్, అతని మిత్రుడికి 2014 మేలో, ఇరవై ఏళ్ల కారాగార శిక్ష విధించింది. 'ఇది వరకెప్పుడూ నేనిటువంటి చర్యలకు పాల్పడలేదు, అత్యాచారం చేస్తే ఏమీ కాదు, ఇతరులెవరికీ వారు చెప్పుకోలేరు అని మా మిత్రుడు నన్ను పురిగొల్పాడు, ఇంతకు ముందు తానొకరిపై ఇలాగే అత్యాచారం చేసినా తనకేమీ కాలేద'ని చెప్పాడని విచారణలో వెల్లడించాడు. అదీ వారి భరోసా! గొంతెత్తి ప్రతిఘటించడం, అకృత్యాల్ని ఎలుగెత్తి చాటడం, పట్టుబట్టి నేరానికి తగ్గ శిక్ష ఇప్పించడమే ఉన్నంతలో సరైన మార్గం. వర్ణిక, అదితి ఇప్పుడీ మార్గాన్ని ఎలుగెత్తి చూపారు. ఇప్పటికీ కోట్లాది కుటుంబాల్లో పెదాలు విచ్చుకోవట్లేదు. గొంతులు పెగలట్లేదు. ఉబికివచ్చే కన్నీరు తప్ప, గుండె పొరలు దాటని దుఃఖం లోలోనే సుడులు తిరుగుతోంది. సహోద్యోగుల నుంచి పై అధికారుల దాకా, సాటి పనివారి నుంచి యజమానుల దాకా, వరుసకు సోదరుల నుంచి ఇతర బంధువుల దాకా, పెంపుడు తండ్రుల నుంచి కన్నతండ్రుల దాకా.... కళ్లను కాటేస్తున్న కనురెప్పలెన్నో! గ్రామీణ భారతంలో, పేదరికంలో, పని ప్రదేశాల్లో, పాలన-అధికార వ్యవస్థల హోదా దొంతరల్లో... అంతటా ఆడవారిపై అఘాయిత్యాలకు అంతే లేకుండా పోతోంది.

**భావజాలమే మూల సమస్య**

'వాడు మగాడు, ఎలా అయినా తిరగొచ్చు, ఆడాళ్లకెందుకు...?' ఇదీ, ఉగ్గుపాలతో మన వారు నూరిపోసే భావజాలం. మెజారిటీ తలిదండ్రులు పిల్లల పెంపకంలోనూ ఈ వివక్ష చూపుతున్నారు. చింత చచ్చినా పులుపు చావ లేదన్నట్టు, ఎన్ని చదువులు చదివినా అంతర్లీనంగా ఉన్న భావజాలం వదలడం లేదు. పైకెన్ని గంభీరమైన మాటలు చెప్పినా, లోలోపల ఇటువంటి ఆలోచనా సరళి ఉండటం వల్లే ఆడవాళ్ల పట్ల లింగ వివక్ష, లైంగిక వేధింపులు, మానసిక, భౌతిక దాడులూ, పెంపకం లోపం వల్ల మగాళ్ల వైఖరిలోనే ఆడాళ్ల పట్ల ఓ చిన్నచూపు అంతర్లీనంగా బలపడుతోంది. ఈ దుష్ప్రభావం వల్లనేమో, ఎదుగుదల క్రమంలోనే మగపిల్లల్లో ఓ విచ్చలవిడితనం, ఆడపిల్లల్లో ఓ రకమైన బెరుకు, భయం అలవడి పోతున్నాయి. దీనికి పూర్తి భిన్నమైన పంథాను వర్ణిక, అదితి కనబర్చారు. మహిళలపై అకృత్యాలకు పాల్పడే వాళ్లకన్నా, పరోక్షంగా వాటిని సమర్థిస్తూ మాట్లాడే పెద్ద మనుషులే ప్రతికూల భావజాలాన్ని వ్యాప్తి చేస్తున్నారు.

తాజా ఘటనలో కూడా, 'అంత రాత్రి పూట ఆమెకు అక్కడేం పని, త్వరగా ఇంటికి వచ్చి ఉండాల్సింది. ఆమె తల్లి దండ్రులు ఈ విషయంలో ఎందుకు శ్రద్ధ తీసుకోలేదు' అని హరియాణా బీజేపీ ఉపాధ్యక్షుడు రామ్‌వీర్ భట్టి చేసిన వ్యాఖ్య ఈ కోవదే! మరి అదే విషయం వర్ణికను వెంటాడిన వికాస్ బరాలాకూ వర్తిస్తుంది కదా! ఇదేదో అతి సాధారణ విషయమైనట్టు, 'అబ్బాయిలు అమ్మాయిల వెంటపడటం కాలేజీ విద్యార్థుల్లో మామూలే!' అని మరో బీజేపీ నాయకుడి నిస్సిగ్గు వ్యాఖ్య, 'కుర్రాళ్లు, కుర్రాళ్ల పనులే చేస్తారు' అని వారి పోకిరీ పనుల్ని సమర్థిస్తూ లోగడ ములాయంసింగ్ యాదవ్ అన్న మాటల్ని గుర్తుకు తెస్తోంది. సంతానం ఆడో, మగో కనడం ఎవరి చేతుల్లోనయినా ఉంటుందా? కాలం చెల్లిన సామెతే కావచ్చు! 'కోడలు మగబిడ్డను కనిపెడతానంటే ఏ అత్త వద్దంటుంది?' అని ఏపీ ముఖ్య మంత్రి చంద్రబాబునాయుడు పబ్లిగ్గా చేసిన వ్యాఖ్యలు ఏ భావజాలాన్ని వ్యాప్తి చేస్తున్నాయి? అంటే, ఆడబిడ్డని కంటే అత్తలు వద్దంటారని, అలా అనడం సముచితమేనని అర్థమే కదా! 'కారు గ్యారేజీలో ఉంటే క్షేమంగా ఉన్నట్టు, ఆడవాళ్లు ఇంట్లోనే ఉంటే ఏ అఘాయిత్యాలూ జరుగవు కదా!' అని సాక్షాత్తూ ఏపీ అసెంబ్లీ స్పీకర్ కోడెల శివప్రసాదరావు చేసిన వ్యాఖ్యల్ని ఎలా అర్థం చేసుకోవాలి? ఇలాంటివి ఇంకా చాలానే ఉన్నాయి. కొన్ని విషయాల్లో ఇదొక దుర్మార్గమైన సమాజం, మరీ ముఖ్యంగా మహిళల పట్ల! బూజు పట్టిన భావజాలంలో బతికే సనాతన వాదులు మహిళల్ని... అవసరమైన పనులు చేసిపెట్టే, లైంగిక వాంఛలు తీర్చే, పిల్లల్ని కనిచ్చే జీవులుగా తప్ప, సాటి మనుషులుగా కూడా చూడలేక పోతున్నారు.

**తామె కదిలితే తప్ప....**

తాను కాకుండా మరో సాధారణ యువతి అయితే పోలీసులు స్పందించి ఉండేవారా? వారు కల్పించుకునే లోపలే పోకిరీలకు తాను చిక్కి ఉంటే? తెగించి తాను సాహసించకుంటే ఏమై ఉండు? ఇలాంటి ఆలోచనలూ వర్ణిక మదిలో మెదిలాయంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు! 'ఏది ఏమైనా సరే, దోషులకు శిక్షపడే హేతుబద్ధమైన ముగింపు వరకూ పోరాడుతా, ఈ సమయంలో ఆమెకు నేను అండగా నిలవకపోతే దేశంలో ఏ తండ్రీ తన బిడ్డల కోసం నిలబడలేడ'న్న వరిందర్ కుందు మాటలెంత సత్యం! 'బయటకు వెళ్లిన పిల్లలు ఆలస్యంగా ఇంటికి వస్తున్నారంటే తల్లిదండ్రులు ఆందోళన చెందాల్సింది ఆడపిల్లల గురించి కాదు, మగపిల్లల గురించి' అన్న బీజేపీ ఎంపీ కిరణ్ ఖేర్ అభివ్యక్తిలో ఎంత నిజముంది! చట్టాల్లో, వాటి అమలులో, పోలీసు వ్యవస్థలో, న్యాయపాలనలో, సామాజిక దృక్పథంలో, మగవాళ్ల ఆలోచనల్లో... అంతటా మార్పు రావాల్సిందే! ముఖ్యంగా మహిళల్లో మరింత చైతన్యం రావాలి. వర్ణిక, అదితిల ధైర్యం, పట్టుదల మహిళా సమాజానికి ఓ స్ఫూర్తి కావాలి.

ఈ-మెయిల్ : dileepreddy@sakshi.com

# వేతన సవరణలో గోప్యతా?

వేతన సంబంధ సమాచారాన్ని కేంద్రప్రభుత్వ సంస్థలు తమంత తామే వెల్లడించాలి. అడిగినా ఇవ్వకపోవడం అన్యాయం. వేతన సవరణ గురించి అడిగితే అది భద్రత, నిఘాలకు సంబంధించినదని ఎలా వాదిస్తారు?

విశ్లేషణ



మాడభూషి శ్రీధర్

వేతన స్కేల్ సవరించాలని రెండేళ్ల కిందట జారీ చేసిన ఉత్తర్వుల అమలు ఎంతవరకు వచ్చిందని ఒక ఉద్యోగి నేషనల్ టెక్నికల్ రీసెర్చ్ ఆర్గనైజేషన్ (NTRO)ను అడిగాడు. కొన్ని సంస్థలు ఆర్టీఐ కిందకు రావని నోటిఫై చేసే అధికారాన్ని ఆర్టీఐ చట్టం సెక్షన్ 24 ప్రభుత్వాలకు ఇచ్చింది. ఎన్‌టీఆర్‌ఓ ఆ విధంగా మినహాయింపు పొందిన సంస్థ కనుక సమాచారం ఇవ్వాల్సిన పని లేదన్నారు. తనకు 2009 ఉత్తర్వు ప్రకారం వేతన బకాయిలు సవరించినప్పటికీ 41 వేల రూపాయలు బాకీ ఉన్నారని ఉద్యోగి ప్రశ్నించాడు.



సెక్షన్ 24 కింద పూర్తిగా నోటిఫైడ్ సంస్థ కనుక ఏ సమాచారమూ ఇవ్వనవసరం లేదనే వాదం చట్ట విరుద్ధమని కమిషన్ తిరస్కరించింది. సెక్షన్ 24 పరిధిలోని సంస్థలు కూడా ప్రజాసమాచార అధికారిని నియమించి, సెక్షన్ 4(1)(బి) కింద ఇవ్వవలసిన సమాచారమంతా స్వయంగా వెబ్‌సైట్‌లో వెల్లడి చేయాలని కేంద్ర సమాచార కమిషన్ ఆదేశించింది. సెక్షన్ 4(1)(బి) పదో క్లాజ్ ప్రకారం నెలకు అధికారులకు ఉద్యోగులకు ఇచ్చే జీతాల వివరాలను, రెగ్యులేషన్‌లో భాగంగా నష్ట పరిహారం చెల్లింపు వ్యవస్థను కూడా సాధికారికంగా వివరించాల్సి ఉంటుంది. వేతన సంబంధ సమాచారాన్ని తమంత తామే ఈ సంస్థలు వెల్లడించాలి. వేతన సవరణ గురించి అడిగితే అది భద్రత, నిఘాలకు సంబంధించినదని ఎలా వాదిస్తారు? ఈ సమాచారం ఇవ్వకుండా ఆపడానికి సెక్షన్ 24 ఉపయోగపడదు.

భద్రత, గూఢచర్యానికి సంబంధించిన సమాచారం చెప్పనవసరం లేదని చట్టం నిర్దేశిస్తే వాటితో సంబంధం లేని మామూలు వ్యవహార సమాచారాన్ని కూడా ఆ క్లాజ్ కిందనే చెప్పబోమని అనడం చట్టవిరుద్ధమని అనేక హైకోర్టులు వివరించాయి. వేతన అసమానతల అన్యాయాన్ని ఎదిరించాలంటే అందుకు కావలసిన సమాచారం ఇవ్వాల్సిందే. అవినీతి, మానవ హక్కుల ఉల్లంఘన ఆరోపణలకు సంబంధించిన ఏ సమాచారమైనా సెక్షన్ 24(1) కింద నిరోధించడానికి వీల్లేదని 24(2) స్పష్టంగా వివరిస్తున్నది.

**సెక్షన్ 24 పై కీలక తీర్పులు**

ఫస్ట్ అప్పిలేట్ అథారిటీ, అడిషనల్ డీజీపీ, సీఐడీ, హరియాణా వర్సెస్ సీపీసీ కేసులో పంజాబ్ హరియాణా హైకోర్టు 2011లో నిఘా, భద్రతలతో సంబంధం లేని సమాచారాన్ని ఆర్టీఐ కింద ఇచ్చి తీరాలని తీర్పు చెప్పింది. భద్రతకు అవసరమైన మేరకు సమాచారాన్ని కాపాడాలన్న ఉద్దేశంతో మాత్రమే కొన్ని సంస్థలను ఆర్టీఐనుంచి మినహాయించడానికి పార్లమెంటు సెక్షన్ 24ను చేర్చింది. కానీ దాని అర్థం రహస్యంగా పాలన జరపాలని కాదని ఆబిద్ హుస్సేన్ వర్సెస్ మణిపూర్ రాష్ట్రం కేసులో మణిపూర్ హైకోర్టు 2015లో తీర్పు చెప్పింది. మినహాయింపు పొందే సంస్థల జాబితాలో సీబీఐని చేర్చినప్పటికీ దానికి సంబంధించిన ప్రతిసమాచారమూ రహస్యంగా కాపాడాలని అర్థం చేసుకోరాదని వివరించింది. కీలకమైన నిఘా భద్రతల వ్యవహారాల సమాచారాన్ని తప్పిస్తే, మామూలు పాలనా సమాచారం ఆర్టీఐ కింద ఇవ్వవలసిందేనని కోర్టు నిర్ధారించింది.

ఫైరెంబాన్ సుధేశ్ సింగ్ వర్సెస్ మణిపూర్ కేసులో సెక్షన్ 24 పరిధిని మణిపూర్ హైకోర్టు మరోసారి వివరించింది. ఆ కేసులో అభ్యర్థి తన సర్వీసు ఫైలుకు సంబంధించిన వివరాలు కోరుతూ, నియామక పత్రాలు, సస్పెన్షన్ ఫైలు, డిపార్ట్ మెంటల్ చర్యలు తీసుకున్న ఫైలు, తొలగింపు ఉత్తర్వు పత్రం మొదలైనవి ఇవ్వాలని ఆర్టీఐ కింద అడిగాడు. ఆర్టీఐ చట్టంలో ఒక్క సెక్షన్ 24 మాత్రమే చదివి ఒక తీర్మానానికి రాకూడదు. మొత్తం చట్టాన్ని పీఠికను ఉద్దేశ పత్రాన్ని కూడా సమగ్రంగా పరిశీలించి సమన్వయించి, అడిగిన సమాచారం ఎటువంటిదో పరీక్షించి భద్రతా, నిఘా వ్యవహారాలకు సంబంధించనిదైతే తప్పనిసరిగా ఇవ్వవలసి ఉంటుందని హైకోర్టు వివరించింది.

ఆర్టీఐ చట్టం సెక్షన్ 24లో మినహాయింపు రూపంలో చాలా స్పష్టంగా ఆర్టీఐ వర్తించని సంస్థలు కూడా అవినీతి మానవ హక్కుల ఉల్లంఘనకు సంబంధించిన సమాచారం ఇవ్వాలని చట్టం నిర్దేశించింది. రాష్ట్ర ప్రభుత్వానికి కొన్ని నిఘా భద్రతా వ్యవహారాలను నెరపే సంస్థలను ఆర్టీఐ పరిధినుంచి పూర్తిగా మినహాయిస్తూ నోటిఫికేషన్ జారీ చేసే అధికారం ఉన్నప్పటికీ, ఆ రెండు అంశాలు కాకుండా ఇతర సమాచారం ఇవ్వకుండా నిషేధం విధించలేదనీ, అవినీతి, మానవహక్కుల ఉల్లంఘనకు సంబంధించిన సమాచారాన్ని ఇవ్వకుండా దాచే అధికారాన్ని ఈ చట్టం రాష్ట్రాలకు గానీ కేంద్ర ప్రభుత్వానికి గానీ ఇవ్వలేదని విజిలెన్స్ అండ్ యాంటీ కరప్షన్ డైరెక్టరేట్, సెంట్రల్ రేంజ్, ఎస్పి వర్సెస్ ఆర్ కార్తికేయన్ కేసు (ఏఐ ఆర్ 2012 మద్రాస్ 84)లో మద్రాసు హైకోర్టు తీర్పు చెప్పింది.

సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ వర్సెస్ ఎం కన్నప్పన్ కేసులో మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తి శ్రీ డి హరిపరంధామన్ (2013 (292) ఇఎల్‌టి 24 (మద్రాస్) కేసులో పై తీర్పును ఉటంకిస్తూ నేరవిచారణకు అనుమతించిన ఫైల్ నోట్స్ తదితర వివరాలను కోరితే ఇవ్వాల్సిందేనని, సెక్షన్ 24 సంస్థలు కూడా సెక్షన్ 4(1)(బి)5 కింద సమాచారం ఇవ్వవలసి ఉంటుందని నిర్ధారించింది. కనుక ఎన్‌టిఆర్‌ఓ అడిగిన సమాచారం ఇవ్వవలసిందేనని కమిషన్ ఆదేశించింది. (గెహ్లోట్ వర్సెస్ ఎన్‌టీఆర్‌ఓ CIC/ LS/ A-/2012/001368 కేసులో 25 జూలై 2017 ఇచ్చిన తీర్పు ఆధారంగా).

వ్యాసకర్త కేంద్ర సమాచార కమిషనర్
professorsridhar@gmail.com

## శుక్రాచార్యుల శాపం



శుక్రాచార్యులు రాక్షసుల గురువు. ఆ కాలంలో దేవ దానవుల మధ్య నిరంతరం సాగే యుద్ధాలలో, దానవులదే ఎల్లప్పుడూ పైచేయిగా ఉండేది. ఎందుకంటే శుక్రాచార్యులకు అపురూపమైన 'మృత సంజీవని' విద్య తెలుసు. ఈ మంత్రశక్తితో యుద్ధభూమిలో మరణించిన దానవ వీరులకు పునర్జన్మ ప్రసాదించేవారు. ఈ అద్భుత విద్యను ఏదో విధంగా నేర్చుకోవాలని, దేవతలు కచుడిని శుక్రాచార్యుని వద్దకు పంపించారు.

కచుడు ఒకనాటి ఉదయమే గురువులవారి ఆశ్రమానికి వెళ్లి, పాదాభివందనం చేసి, "స్వామీ, నన్ను అనుగ్రహించి, శిష్యుడిగా స్వీకరించండి" అని వేడుకున్నాడు. యువకుడి నమ్రతకు మెచ్చిన శుక్రాచార్యులు అందుకు అంగీకరించారు. కచుడు సత్ప్రవర్తనతో గురువుతోపాటు ఆయన ఏకైక పుత్రిక దేవయాని అభిమానాన్నీ సంపాదించాడు.

జ్యోతిర్మయం

దీంతో గురువు శిష్య బృందంలో అసూయ రేగింది. కచుడిని ఏదో విధంగా తొలగించాలని కూడబలుక్కున్నారు. వంట చెరకు, కందమూల ఫలాలు తేవటానికి అడవికి వెళ్లిన సమయంలో కచుడిని హతమార్చి తిరిగి వచ్చారు. 'కచుడు ఎక్కడ' అని గురువు అడిగితే పాముకాటువల్ల మరణించాడని సమాధానం చెప్పారు. ఇది విని దేవయాని విలపిస్తూ, "నాన్నా, కచుడు లేక నేను జీవించలేను. అతణ్ణి కాపాడు" అని ప్రార్థించింది. తండ్రి దివ్య దృష్టితో అంతా గ్రహించి, మృత సంజీవనీ మంత్రాన్ని పఠించి అడవిలో ఉన్న కచుడి శవాన్ని బ్రతికించాడు.

శిష్యులు ఈసారి కచుడిని అడవిలో హతమార్చి, దహనం చేసి, చితాభస్మాన్ని, గురువుగారికి ప్రీతికరమైన సోమరసంలో కలిపి, ఆయనచేత తాగించారు. గురువు సోమపానం చేస్తుండగా, 'కచుడెక్కడ' అని దేవయాని ప్రశ్నించింది. లేడు అని తెలిసి కుప్పగూలిన కుమార్తె 'నాన్నా, నేను బ్రతకను' అన్నది. శుక్రాచార్యుడు కచుడి భస్మం తన కడుపులోనే ఉన్నదని గ్రహించి, 'అమ్మా ఇక లాభం లేదు' అన్నాడు. తర్వాత దేవయాని సలహా మేరకు, మృత సంజీవనీ మంత్రాన్ని పఠించగా, కడుపులో ఉన్న చితాభస్మం జీవం ధరించి, కడుపు చీల్చుకుని బయటకు వచ్చింది. ఒకసారి విన్న మంత్రాన్ని కచుడు తిరిగి పఠించి, గురువుగారిని బ్రతికించాడు. మృత సంజీవనీ విద్య దేవతలకు లభ్యమైంది, శుక్రాచార్యులంతటి మహాజ్ఞాని, రాక్షస రాజుల ఆగ్రహానికీ, ప్రజలలో అవమానానికీ గురై, తన గౌరవ స్థానాన్ని కోల్పోయాడు. సురాపాన వ్యసనం వల్ల అధోగతిపాలైన శుక్రాచార్యులు మద్యపాన ప్రియులను శపించాడు. "మద్యం సేవించువారు క్షణంలో సర్వం మరచి, మహాపాతకులగుదురుగాక" అని శాపం ఇచ్చారు. మహా భారతం అప్పటికీ ఇప్పటికీ ఎంత సార్థక నామధేయం!

– మాడపాటి సత్యవతి

## ఈపీఎస్-95 ఉద్యోగుల పాట్లు

ఈపీఎస్-95 (ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ స్కీమ్)లో వాలంటరీ సపరేషన్ స్కీమ్ (వీఎస్ఎస్) ద్వారా బలవంతంగా తొలగింపునకు గురైన.. ఖాయిలా పడిన భారత ప్రభుత్వ రంగ సంస్థ ఉద్యోగులు గత పదిహేనేళ్లుగా ఆర్థికంగా, శారీరకంగా, మానసికంగా నరకం అనుభవిస్తున్నారు. ఇలా బలవంతపు తొలగింపునకు గురైన ఉద్యోగుల న్యాయపరమైన కోరికలు:

1. పెన్షన్ వెయ్యిలోపే వస్తోంది. దీన్ని కనీసం రూ. 5 వేలకు పెంచి సాలీనా కొంత కలపాలని లేదా కేంద్రప్రభుత్వ ఉద్యోగులకు ఇస్తున్న డీఏను అమలు చేయమని అడగడమైంది. దీనిపై 28-7-2017న లోక్‌సభలో అరగంటకుపైగా చర్చలు జరిగాయి. మళ్లీ ఓ కమిటీని వేస్తామని నిర్ణయం తీసుకున్నారు. 2. కమ్యూటెడ్ పెన్షన్ మొత్తాన్ని పదిహేనేళ్లలో తిరిగి పెన్షన్‌లో కలపరట. అంటే పదేళ్లలో వడ్డీతో తీరిపోయే ఈ బాకీ జీవితాంతం తీరుతూనే ఉంటుంది. దీని వల్ల ఉద్యోగికి లక్షల్లో నష్టం వస్తుంది. 3. వీరికి ఏ ఆసుపత్రిలోనూ ఉచిత వైద్యం లేదు. ఈఎస్ఐ హెల్త్‌కార్డు ఇస్తామన్నారు. దీనికి కూడా అతీగతీ లేదు. 4. రిటైరల్ బెనిఫిట్‌లో అడహాక్‌గా చెల్లించిన మొత్తాన్ని కూడా లెక్క గట్టి ఇవ్వమని కోర్టు ఆదేశించినా ప్రభుత్వం ధిక్కార స్వరం వినిపించింది.

కార్మికమంత్రి దత్తాత్రేయతో సహా అనేక మంది కేంద్రనాయకులను కలిసినా ఇంతవరకు ఉద్యోగుల న్యాయపరమైన కోరిక ఒక్కటీ తీరలేదు. ప్రధాని నరేంద్ర మోదీనే ఈ విషయంలో కల్పించుకుని తగు న్యాయం చేయాలని కోరుతున్నాం.

ఎస్.ఎస్.ఆర్ మూర్తి, రిటైర్డ్ ఉద్యోగి
రామగుండం ఎరువుల కర్మాగారం, తెలంగాణ
మొబైల్ : 94900 56843

ఇన్ బాక్స్

## ఇంకుడుగుంతలే మార్గం

రాష్ట్రంలో నీటి కొరతను నివారించడానికి చెరువులను పునరుద్ధరించడం, వివిధ ప్రాజెక్టులను చేపడుతుండటం హర్షణీయం. ప్రతి ఏటా వర్షాలు సమృద్ధిగా పడి చెరువులు, ప్రాజెక్టులు నిండతాయనే గ్యారంటీ ఏమీ లేదు. ఇంకుడు గుంతల ద్వారా భూగర్భ జలాలను పెంపొందించుకోవడం ఒక్కటే మార్గం. హైదరాబాద్‌తో పాటు కార్పొరేషన్లు, మునిసిపాలిటీలలో ప్రతి ఏటా భూగర్భ జలాలు పడిపోతున్నాయి. వంద గజాల స్లాబ్ ఉన్న ప్రతి ఇంటిలోనూ ఇంకుడు గుంతను తప్పనిసరి చేయాలి. నిర్మించుకోని వారిపై ప్రత్యేక పన్ను వేయాలి. భవిష్యత్తులో సమృద్ధిగా వర్షాలు పడకున్నా తాగు, సాగునీటికి కరువురాని విధంగా సన్నద్ధం కావాలి. నీటిసమస్యకు ఇంకుడు గుంతలే పరిష్కారం అని అందరూ గుర్తించాలి.

కంది కృష్ణారెడ్డి, కరీంనగర్

# నేనో నిరుద్యోగి..
# చదివింది B.Tech



**ఉద్యోగం ఇవ్వని ఇంజనీరింగ్ విద్య.. నైపుణ్యాల కొరతే ప్రధాన సమస్య**

**అడ్డగోలుగా కాలేజీలు.. ప్రమాణాలు మాత్రం శూన్యం.. దేశవ్యాప్తంగా 32.88% మందికే ఉద్యోగాలు**

**ఏటా ఇంజనీరింగ్ చదువుతున్న వారు 15 లక్షల పైనే.. ఉద్యోగాలు లభిస్తున్నది 4.95 లక్షల మందికే**

**తెలంగాణలో 28.3% శాతం మందికే ఉద్యోగాలు.. రెండేళ్లుగా మెరుగుపడుతున్న పరిస్థితి..**

అరవింద్.. వయసు 26 ఏళ్లు.. ఊరు నల్లగొండ జిల్లా తేరట్‌పల్లి. ఇంజనీర్ కావాలన్నది అతడి చిన్నప్పటి ఆశయం.. దానికి తగ్గట్టే బీటెక్ చదివాడు. 2012లో ఓ కాలేజీలో ఇంజనీరింగ్ పూర్తి చేశాడు.. బీటెక్ పూర్తిచేశాడు గానీ ఇంజనీర్ కావాలన్న అతడి ఆశయం మాత్రం అలాగే ఉండిపోయింది. ఎన్నో ఇంటర్వ్యూలకు హాజరయ్యాడు. ఓరల్‌లో అంతా ఇంగ్లిష్‌లోనే సమాధానమివ్వాలి.. అరవింద్ అక్కడ తడబడ్డాడు.. నేటికీ నిరుద్యోగిగానే మిగిలిపోయాడు.

సాక్షి, హైదరాబాద్

ఇంజనీరింగ్ విద్య ఉద్యోగ అవకాశాలు కల్పించలేకపోతోంది. కొరవడిన నాణ్యతా ప్రమాణాలు, సబ్జెక్టుపై పట్టులేకపోవడం, కమ్యూనికేషన్ స్కిల్స్ లోపం వంటి కారణాలతో దాదాపు 67% మందికిపైగా ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్లు నిరుద్యోగులు గానే మిగిలిపోతున్నారు. దేశవ్యాప్తంగా ఏటా 15 లక్షల మందికి పైగా ఇంజనీరింగ్ విద్య పూర్తిచేసుకుంటున్నా.. వారిలో 32.88% మందికే ఉద్యోగాలు లభిస్తున్నాయి. ఇవీ కూడా కాలేజీల యాజమాన్యాలు చెప్పిన లెక్కలే. వాస్తవంగా ఈ శాతం మరింత తక్కువగా ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. తెలుగు రాష్ట్రాల్లో అయితే పరిస్థితి మరీ దారుణంగా ఉంది. తెలంగాణలో కేవలం 28.31 శాతం మందికి, ఏపీలో 27.92% మందికే ఉద్యోగావకాశాలు లభిస్తుండడం గమనార్హం.

## ఏఐసీటీఈ సర్వేలోనే..

తెలంగాణలోని ఇంజనీరింగ్ కాలేజీల నుంచి 2016–17 విద్యా సంవత్సరంలో 1,18,419 మంది ఇంజనీరింగ్ విద్యను పూర్తిచేసుకున్నారు. ఇందులో 33,529 మందికి (28.31%) మాత్రమే ఉద్యోగావకాశాలు లభించాయి. ఏపీలో గతేడాది 1,47,699 మంది ఇంజనీరింగ్ పూర్తి చేయగా.. 41,312 మందికే (27.97%) ఉద్యోగాలు వచ్చాయి. ఇవి లెక్కలు కూడా సాక్షాత్తు అఖిల భారత సాంకేతిక విద్యా మండలి (ఏఐసీటీఈ) స్వయంగా తేల్చినవి కావడం గమనార్హం.

## ఎన్నో కారణాలతో..

ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్లకు ఉద్యోగావకాశాలు లభించకపోవడానికి అనేక కారణాలు ఉన్నాయి. అందులో నైపుణ్యాల కొరత, మార్కెట్ అవసరాలు, కమ్యూనికేషన్ స్కిల్స్ లేకపోవడం, ఇంగ్లిషు భాషా సమస్య వంటివి ప్రధానమైనవి. విచ్చలవిడిగా పెరిగిపోయిన ఇంజనీరింగ్ కాలేజీలు, వాటిల్లో ప్రమాణాల లేమి, మౌలిక సౌకర్యాల కొరత, మార్కెట్ అవసరాలకు అనుగుణంగా బోధన జరపకపోవడం వంటి వాటి కారణంగా ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్లలో నైపుణ్యాల లేమి కనిపిస్తోంది. పీపుల్ స్ట్రాంగ్, కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ, అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీస్, లింక్డ్ఇన్ సంస్థలు సంయుక్తంగా నిర్వహించిన సర్వేలోనే ఈ అంశాలు వెల్లడయ్యాయి. వీబాక్స్ ఎంప్లాయబిలిటీ స్కిల్ టెస్టు (వెస్ట్) పేరుతో నిర్వహించిన ఈ అధ్యయనంలో దేశంలోని 29 రాష్ట్రాలు, 7 కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 5.2 లక్షల మంది అభ్యర్థుల అభిప్రాయాలను సేకరించారు. ఇక అస్పైరింగ్ మైండ్స్ అనే సంస్థ చేసిన అధ్యయనంలోనూ ఇవే అంశాలు వెల్లడయ్యాయి. వీటితోపాటు పారిశ్రామిక రంగంలో, మార్కెట్‌లో అవసరాల కంటే ఏటా రెట్టింపు సంఖ్యలో ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్లు బయటకు రావడమూ కారణమని తేలింది. మరోవైపు మంచి నైపుణ్యం ఉన్న అభ్యర్థుల కోసం డిమాండ్ కూడా పెరుగుతుండడం గమనార్హం.

## మెరుగవుతున్న పరిస్థితి

గత ఒకటీ రెండేళ్లుగా ఉద్యోగాలు పొందుతున్న ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్ల శాతం స్వల్పంగా పెరిగింది. రాష్ట్రంతో పాటు దేశవ్యాప్తంగా కూడా గతేడాది ఉద్యోగాలు పొందిన వారి శాతం పెరిగింది. తెలంగాణలో 2015–16లో 26.79% మంది ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్లకు ఉద్యోగాలు లభించగా... 2016– 17లో 28.31% మందికి ఉద్యోగాలు వచ్చాయి. పొరుగు రాష్ట్రం ఏపీలో 2015–16లో 25.30% మందికి ఉద్యోగాలురాగా.. 2016–17లో 27.97% మందికి లభించాయి.

**ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్ల పరిస్థితి ఇదీ**

| సంవత్సరం | గ్రాడ్యుయేట్లు | ఉద్యోగం వచ్చింది | శాతం |
|---|---|---|---|
| తెలంగాణలో.. | | | |
| 2016-17 | 1,18,419 | 33,529 | 28.31 |
| 2015-16 | 1,26,706 | 33,955 | 26.79 |
| 2014-15 | 1,42,991 | 33,314 | 23.29 |
| దేశవ్యాప్తంగా.. | | | |
| 2016-17 | 15,06,977 | 4,95,563 | 32.88 |
| 2015-16 | 16,67,417 | 5,42,400 | 32.52 |
| 2014-15 | 17,34,738 | 5,09,707 | 29.38 |

## మాకేమో నీళ్లు లేవు.. వాళ్లేమో ప్రాజెక్టులు కడుతున్నారు



**లోక్‌సభలో జితేందర్‌రెడ్డి ఆందోళన**

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో నీటి ఎద్దడి ఉంటే ఏపీ ప్రభుత్వం కృష్ణా బేసిన్‌లో కేంద్రం అనుమతుల్లేకుండా ప్రాజెక్టులు కడుతోందని టీఆర్‌ఎస్ ఎంపీ జితేందర్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం ప్రశ్నోత్తరాల సమయంలో మాట్లాడుతూ.. రైతులు ఇప్పటికే విత్తనాలు నాటారని, ఇప్పటివరకు వర్షాలు పడకపోవడంతో పంటలు ఎలా ఎదుగుతాయని ఆందోళనలో ఉన్నారని అన్నారు. ఆల్మట్టి నిండకపోవడంతో కిందికి నీళ్లు రాలేదన్నారు. ఏపీ.. కృష్ణా, గోదావరి బేసిన్లలో కొత్త ప్రాజెక్టులు నిర్మిస్తోందని కేంద్రానికి ఇప్పటికే చెప్పామని, పట్టిసీమ, పురుషోత్తపట్నం, ముచ్చెర్ల, గుండ్రేవుల రిజర్వాయర్, గాజులదిన్నె, గురురాఘవేంద్ర, పులికనుమ, సిద్ధాపురం తదితర ప్రాజెక్టులు నిర్మిస్తోందని చెప్పారు. పెద్ద ప్రాజెక్టుల విషయంలోనే కేంద్రం అనుమతులు అవసరమని జల వనరుల శాఖ సహాయ మంత్రి సంజీవ్ బలియాన్ బదులిచ్చారు. ఈ ప్రాజెక్టుల నిర్మాణం విషయంలో రెండు రాష్ట్రాల సీఎంలు ఇక్కడే కూర్చుని మాట్లాడుకున్నారన్నారు. నీటి వివాదం ప్రస్తుతం ట్రిబ్యునల్ పరిధిలో ఉందన్నారు.

## ✦ అది కేసీఆర్ రాజకీయ పునరుజ్జీవన సభ



**శ్రీరాంసాగర్ పునరుజ్జీవన సభపై పొన్నాల**

సాక్షి, న్యూఢిల్లీ: శ్రీరాంసాగర్ పునరుజ్జీవనం పేరుతో సీఎం కేసీఆర్ చేపట్టిన కార్యక్రమంపై పీసీసీ మాజీ చీఫ్ పొన్నాల లక్ష్మయ్య విరుచుకుపడ్డారు. అది కేవలం కేసీఆర్ రాజకీయ పునరుజ్జీవన సభని అన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడంతో ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వెల్లువెత్తుతున్న నేపథ్యంలో ఉనికిని కాపాడుకునేందుకే ఈ సభ చేపడుతున్నారన్నారు. గురువారం ఢిల్లీలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ హయాంలో పూర్తిచేసిన కాల్వల ద్వారా నీళ్లిస్తూ.. తమ పార్టీవి మోసపూరిత ప్రాజెక్టులనడం సిగ్గుచేటన్నారు.

## ✦ అభివృద్ధి పేరుతో అన్యాయం చేస్తోంది

**ప్రభుత్వంపై భూనిర్వాసితుల పోరాట కమిటీ ధ్వజం**

సాక్షి, హైదరాబాద్: అభివృద్ధిపేర టీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతులు, వ్యవసాయ కార్మికులు, వృత్తిదారులకు తీవ్ర అన్యాయం చేస్తోందని తెలంగాణ భూనిర్వాసితుల పోరాట కమిటీ విమర్శించింది. అభివృద్ధిని అడ్డుకుంటున్నారని అబద్ధాలు చెబుతూ విధ్వంసం సృష్టిస్తున్నారని మండిపడింది. సుందరయ్య విజ్ఞానకేంద్రంలో గురువారం నిర్వాసితుల కమిటీ రౌండ్‌టేబుల్ సమావేశం కన్వీనర్ వెంకట్ అధ్యక్షతన జరిగింది. మిడ్‌మానేరు వల్ల 8 గ్రామాలు ముంపునకు గురవుతున్నాయని, రైతు, వ్యవసాయ కార్మిక సొసైటీలు ఏర్పాటు చేసి నేరెళ్ల ప్రాంతంలోని ఇసుక క్వారీలను నిర్వాసితులకే అప్పజెప్పాలని డిమాండ్ చేశారు.

## ✦ 'కాళేశ్వరం'పై ప్రజాభిప్రాయ సేకరణ



సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతులు పొందడం లో భాగంగా ఈ నెల 22 నుంచి 26 వరకు 15 జిల్లాల్లోని ముంపు ప్రభావిత గ్రామాల్లో పీసీబీ ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టనుంది. ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతులు పొందేందుకు పర్యావరణ ప్రభావ మదింపు(ఈఐఏ), పర్యావరణ ప్రభావ నిర్వహణ ప్రణాళిక(ఈఎంపీ)ని తప్పనిసరిగా చేయాల్సి ఉంటుంది. ఇందులో భాగంగా ప్రజాభిప్రాయ సేకరణ చేసి ఆ వివరాలను కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వశాఖలకు అందించాలి. దీన్ని దృష్టిలో పెట్టుకుని భూసేకరణ అవసరమైన జిల్లాల్లో ప్రజాభిప్రాయాన్ని పీసీబీ సేకరించనుంది. 22న భువనగిరి, మేడ్చల్, నిజామాబాద్, కరీంనగర్, 23న పెద్దపల్లి, కామారెడ్డి, సంగారెడ్డి, నల్లగొండ, 24న నిర్మల్, జగిత్యాల, మెదక్, 26న భూపాలపల్లి, మంచిర్యాల్, సిరిసిల్ల, సిద్దిపేట జిల్లాల్లో ఈ కార్యక్రమం నిర్వహించనుంది. అలాగే కాళేశ్వరం ప్రాజెక్టుపై డాక్యుమెంటరీ చేసేందుకు ఇమేజ్‌లే అడ్వర్టైజింగ్ సంస్థకు రూ.14.41 లక్షల పనులు కట్టబెడుతూ నిర్ణయం తీసుకుంది.

## ✦ నారాయణపూర్ నీటిపై కర్ణాటకతో చర్చలు

సాక్షి, హైదరాబాద్: ఎగువ నారాయణపూర్ నుంచి దిగువ నాగార్జునసాగర్‌కు నీటి విడుదలపై కర్ణాటకతో రాష్ట్ర ప్రభుత్వం చర్చలు కొనసాగిస్తోంది. గురువారం సైతం సాగర్ సీఈ సునీల్ బెంగళూరులో కృష్ణా భాగ్య జల నిగమ్ ఎండీ అంజూమ్ ఫర్వేజ్‌తో చర్చలు జరిపారు. హైదరాబాద్ ప్రజలకు, నల్లగొండ జిల్లా ఫ్లోరైడ్ పీడిత ప్రాంతాలకు తాగునీటి కోసం 15 టీఎంసీలు మేర నీటిని విడుదల చేయాలని కోరారు. అయితే శుక్రవారం కృష్ణా భాగ్య జల నిగమ్ బోర్డు సమావేశం జరుగనుండటంతో అక్కడే దీనిపై తుది నిర్ణయం తీసుకుంటామని కర్ణాటక ప్రభుత్వ వర్గాలు చెప్పినట్లుగా సమాచారం.

## ✦ 'కుమ్రంభీమ్ స్ఫూర్తితో పోరాటం'

సాక్షి, హైదరాబాద్: జల్–జంగల్–జమీన్ నినాదంతో ఆనాడు నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాటం చేసిన గిరిజన బిడ్డ కుమ్రం భీమ్ స్ఫూర్తిగా రాబోయే రోజుల్లో టీఆర్‌ఎస్‌పై పోరాటం చేస్తామని బీజేపీ ఎస్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.బిక్కూనాథ్‌నాయక్ చెప్పారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా జోడాఘాట్‌లో టీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు, అధికారులెవరూ కుమ్రం భీమ్ విగ్రహానికి నివాళులు కూడా అర్పించలేదని మండిపడ్డారు. రాష్ట్రంలోని 2వేల తండాలు, గూడేల్లో రోడ్లు, కనీస మౌలిక సదుపాయాలు లేవని, వాటిని కల్పించాలని కోరారు.

## మరుగుదొడ్ల వినియోగంపై నమూనాల ఆహ్వానం

సాక్షి, హైదరాబాద్: మరుగుదొడ్ల వినియోగంతో పారిశుద్ధ్యం, ఆరోగ్య సంరక్షణ పూర్తి స్థాయిలో సాధించేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని తెలంగాణ రాష్ట్ర గ్రామీణ స్వచ్ఛ భారత్ మిషన్ డైరెక్టర్ ఎస్పీ సింగ్ తెలిపారు. మరుగుదొడ్ల వినియోగంపై అవగాహనను పెంపొందించేందుకు పలు కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్తున్నట్లు తెలిపారు. ఈ ప్రక్రియలో భాగంగా మరుగుదొడ్ల నిర్వహణ, వినియోగం వంటి అంశాలపై నిపుణుల నుంచి నమూనాలను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. నమూనాలను భారత ప్రభుత్వ వెబ్‌సైట్ https://innovate.mygov.in/swachhathon-1-0/ నుంచి అప్‌లోడ్ చేయవచ్చునని తెలిపారు. నిపుణులు తమ ఆలోచనలను, సాంకేతిక పరిష్కార మార్గాలను రాతపూర్వకంగా పంపించవచ్చని తెలిపారు. నమూనాలను వీడియోతీసి, యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేసి, లింక్‌ను అప్లికేషన్ ఫామ్‌లో పొందుపరచవచ్చని సూచించారు. నమూనాలను ఆగస్ట్ 25లోపు పంపించాలని సూచించారు.

# అన్‌ట్రైన్డ్ టీచర్లూ అర్హత పొందాల్సిందే

- 2019 మార్చి 31కల్లా ఉపాధ్యాయ శిక్షణ తప్పనిసరి
- లేదంటే బోధించడానికి వీల్లేదని స్పష్టం చేసిన ఎంహెచ్‌ఆర్‌డీ



సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ, ప్రైవేటు సహా ఏ పాఠశాలలో బోధించాలన్నా తప్పనిసరిగా ఉపాధ్యాయ శిక్షణ పొంది ఉండాలని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇప్పటికే బోధిస్తున్న అన్‌ట్రైన్డ్ టీచర్లు కూడా తప్పనిసరిగా శిక్షణ తీసుకోవాలని.. 2019 మార్చి 31వ తేదీలోగా వారంతా అర్హత సంపాదించాలని సూచించింది. లేదంటే వారిని పాఠశాలల నుంచి తొలగించాలని, అన్ని రాష్ట్రాల్లోని పాఠశాలలు ఈ నిబంధనను కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర విద్యాశాఖ చర్యలు చేపట్టడంపై దృష్టి సారించింది.

**పెద్ద సంఖ్యలో..:** రాష్ట్రంలో 25,750 వరకు ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో 1,09,022 మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. వారంతా ఉపాధ్యాయ శిక్షణ కోర్సులు పూర్తిచేసిన వారే. 720 ఎయిడెడ్ పాఠశాలల్లో 3,177 మంది టీచర్లు పనిచేస్తుండగా.. అందులో 25 మంది అన్‌ట్రైన్డ్ టీచర్లున్నారు. ఇక 11,262 ప్రైవేటు పాఠశాలల్లో 92,675 మంది టీచర్లుండగా.. ఇందులో 3,905 మంది ఉపాధ్యాయ శిక్షణ పొందలేదని యూ–డైస్ లెక్కల ప్రకారం విద్యా శాఖ గుర్తించింది. వారంతా వచ్చే నెల 15వ తేదీలోగా డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (డీఎడ్) కోర్సుల్లో చేరేలా చర్యలు చేపట్టాలని ప్రైవేటు పాఠశాలలకు సూచించింది. లేదంటే కేంద్రం ఆదేశాల మేరకు వారిని ఉపాధ్యాయ వృత్తి నుంచి తొలగించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది.

**మార్కుల శాతం పెంచుకోవాల్సిందే**

ప్రస్తుతం డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (డీఎడ్) కోర్సులో చేరేందుకు ఇంటర్‌లో కనీసం 50 శాతం మార్కులు ఉండాలన్న నిబంధన ఉంది. అయితే ఆయా టీచర్లు ఎప్పుడో ఇంటర్, డిగ్రీలు కోర్సులు పూర్తి చేసి ప్రైవేటు స్కూళ్లలో చేరి ఉంటారు. వారిలో ఎవరికైనా ఇంటర్‌లో 50 శాతం మార్కులు లేకపోతే.. ఇప్పుడు తిరిగి దూర విద్యా విధానంలో ఇంటర్ చదివి.. ఉపాధ్యాయ విద్య కోర్సు పూర్తయ్యే లోగా నిర్ణీత మార్కులను సాధించాలని కేంద్రం స్పష్టం చేసింది.

**శిక్షణ పొందని వారు భారీ సంఖ్యలోనే!**

ప్రైవేటు పాఠశాలల్లో అన్‌ట్రైన్డ్ టీచర్లు పెద్ద సంఖ్యలో ఉన్నారని, కానీ స్కూళ్లు వివరాలు సరిగా ఇవ్వకపోవడంతో కేవలం 3,905 మందే లెక్కతేలుతున్నారని విద్యాశాఖ వర్గాలు భావిస్తున్నాయి. ప్రస్తుతం 23 లక్షల మంది విద్యార్థులున్న ప్రభుత్వ పాఠశాలల్లోనే 1,09,022 మంది టీచర్లున్నారు. అయినా టీచర్లు సరిపోవడం లేదన్న డిమాండ్ ఉంది. అలాంటిది 31 లక్షల మంది విద్యార్థులు చదువుతున్న ప్రైవేటు పాఠశాలల్లో 92,672 మందే టీచర్లున్నారా.. అనే ప్రశ్న తలెత్తుతోంది. అధికారికంగా ప్రైవేటు పాఠశాలలు ఇచ్చిన లెక్క అంతేనని, వాస్తవంగా మరో 30వేల మందికిపైగా టీచర్లు పనిచేస్తున్నారని విద్యాశాఖ వర్గాలు భావిస్తున్నాయి. అధికారికంగా వారిని వివరాల్లో చూపిస్తే నిబంధనల ప్రకారం ప్రయోజనాలు కల్పించాల్సి వస్తుందనే లెక్కలు చెప్పడం లేదేమోనని విద్యాశాఖ అధికారులు భావిస్తున్నారు.

## అసలు తల్లిదండ్రుల వివరాలివ్వండి

**కిరణ్ సంతాన సాఫల్య కేంద్రం నిర్వాహకులకు హైకోర్టు ఆదేశం**

**వివరాల ఆధారంగా బిడ్డల అప్పగింతపై నిర్ణయం తీసుకోండి**

సాక్షి, హైదరాబాద్: బంజారాహిల్స్‌లోని సాయికిరణ్ హాస్పిటల్–కిరణ్ సంతాన సాఫల్య కేంద్రంలో సరోగసీ తల్లులకు జన్మించిన బిడ్డలకు అసలైన తల్లిదండ్రుల వివరాలను వారం రోజుల్లో వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు అందచేయాలని ఆ కేంద్రం నిర్వాహకులను హైకోర్టు ఆదేశించింది. సరోగసీ తల్లులకు జన్మించిన బిడ్డలను తీసుకోవాలనుకుంటున్న తల్లిదండ్రులు కూడా వారి వివరాలను అధికారులకు ఇవ్వాలని స్పష్టం చేసింది. వివరాలు అందుకున్న తర్వాత పూర్తిస్థాయిలో విచారణ జరిపి బిడ్డలను వారి తల్లిదండ్రులకు అప్పగించే విషయంలో తగు నిర్ణయం తీసుకోవాలని అధికారులను ఆదేశించింది. తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి (ఏసీజే) జస్టిస్ రమేశ్ రంగనాథన్, న్యాయమూర్తి జస్టిస్ జె.ఉమాదేవితో కూడిన ధర్మాసనం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని రోడ్ నంబర్–12లోని సాయికిరణ్ హాస్పిటల్–కిరణ్ సంతాన సాఫల్య కేంద్రంలో సరోగసీ వ్యాపారం చేస్తున్నారంటూ పోలీసులు ఇటీవల ఆసుపత్రిని సీజ్ చేసిన విషయం తెలిసిందే. ఇక్కడున్న సరోగసీ తల్లుల ఆరోగ్యంపై ఏసీజే జస్టిస్ రమేశ్ రంగనాథన్‌కు రాసిన లేఖలో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సురేశ్‌కుమార్ కెయిత్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ లేఖను పిల్‌గా మలిచి ఇప్పటికే విచారించారు. చట్ట ఉల్లంఘనలకు సంబంధించి కిరణ్ సంతాన సాఫల్య కేంద్రానికి మూడు షోకాజ్ నోటీసులిచ్చినట్టు గురువారం విచారణ సందర్భంగా ధర్మాసనం చెప్పింది. ఈ సమయంలో సంతాన సాఫల్య కేంద్రం తరపు న్యాయవాది స్పందిస్తూ.. షోకాజ్ నోటీసులకు సమాధానం ఇచ్చేందుకు పదిరోజుల గడువు కావాలని కోరారు. తమ సంతాన సాఫల్య కేంద్రాన్ని సీజ్ చేయడాన్ని సవాల్ చేస్తూ నిర్వాహకులు దాఖలు చేసిన వ్యాజ్యాన్ని ధర్మాసనం తోసిపుచ్చింది. ఈ వ్యవహారంలో ప్రభుత్వం అంతిమ నిర్ణయానికి రాక ముందే ఈ వ్యాజ్యాన్ని దాఖలు చేశారని పేర్కొంది.

## మూడేళ్లుగా ఎందుకు నిర్వహించడం లేదు?

**ఎల్పీసెట్‌పై ప్రశ్నించిన హైకోర్టు**

సాక్షి, హైదరాబాద్: భాషా పండితుల (తెలుగు, ఇంగ్లిష్, ఉర్దూ) ప్రవేశాలకు సంబంధించి ఎల్పీ సెట్ మూడేళ్లుగా ఎందుకు నిర్వహించడం లేదని ఉమ్మడి హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. ఇందుకు సంబంధించి పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. తదుపరి విచారణను వచ్చే వారానికి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ చల్లా కోదండరామ్ గురువారం ఉత్తర్వులు ఇచ్చారు. మూడేళ్లుగా ఎల్పీ సెట్ నిర్వహించకపోవడాన్ని సవాలు చేస్తూ నగరానికి చెందిన బాల్‌రాజ్, మరో ఏడుగురు వేసిన పిటిషన్‌పై జస్టిస్ కోదండరామ్ గురువారం విచారణ జరిపారు. పిటిషనర్ తరపు న్యాయవాది అర్జున్ వాదనలు వినిపిస్తూ, ఎల్పీ సెట్ నిర్వహించకపోవడం వల్ల పిటిషనర్లు భాషా పండితుల కోర్సు పూర్తి చేయలేకపోతున్నారన్నారు. బీఏ (తెలుగు) పూర్తిచేసిన వారికి బీఈడీ చేసే అర్హత లేదని, భాషా పండిత ట్రైనింగ్ కోర్సు చేయాల్సి ఉంటుందని, ఇందులో ప్రవేశానికి ఎల్పీ సెట్ నిర్వహించాల్సి ఉంటుందన్నారు. తద్వారానే ప్రవేశాలు కల్పించాలని ఉత్తర్వులు చెబుతున్నాయన్నారు.

## మల్లన్నసాగర్ టెండర్లపై స్టేకు హైకోర్టు నో

**కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వానికి ఆదేశం**



సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా చేపడుతున్న మల్లన్నసాగర్ రిజర్వాయర్ పనుల టెండర్ ప్రక్రియను నిలిపేసేందుకు ఉమ్మడి హైకోర్టు నిరాకరించింది. ఈ వ్యవహారంపై పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ ఎ.రామలింగేశ్వరరావు గురువారం ఉత్తర్వులిచ్చారు. మల్లన్నసాగర్ రిజర్వాయర్ నిర్మాణానికి పర్యావరణ అనుమతులు రాకుండానే ప్రభుత్వం టెండర్ నోటిఫికేషన్ జారీ చేసిందని, ఇది చట్ట విరుద్ధమంటూ వేములఘాట్‌కు చెందిన జి.లక్ష్మి, మరో ఐదుగురు హైకోర్టులో వేసిన వ్యాజ్యంపై న్యాయమూర్తి మరోసారి విచారణ జరిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వం తరపున అడ్వొకేట్ జనరల్ దేశాయ్ ప్రకాశ్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ, కాళేశ్వరం భారీ ప్రాజెక్టని, దీని కోసం 17వేల ఎకరాల భూమిని సేకరిస్తున్నామన్నారు. పిటిషనర్లది చిన్న చిన్న పరిమాణంలో ఉన్న భూమి మాత్రమేనని, విస్తృత ప్రజా ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని నిర్మిస్తున్న ఈ భారీ ప్రాజెక్టును పిటిషనర్లు అడ్డుకోవాలని చూస్తున్నారని తెలిపారు. పిటిషనర్లకు కావాల్సింది పరిహారమని, ఈ విషయంలో చట్ట నిబంధనలకు లోబడి వ్యవహరిస్తామని చెప్పారు. పిటిషనర్ల తరపు న్యాయవాది సీహెచ్ రవికుమార్ స్పందిస్తూ... పర్యావరణ అనుమతులు లేకుండా ప్రాజెక్టు పనులు చేపట్టడం చట్ట విరుద్ధమన్నారు. తాము కూడా విస్తృత ప్రజాప్రయోజనాలను దృష్టిలో పెట్టుకునే ఈ వ్యాజ్యాన్ని దాఖలు చేశామన్నారు. ఈ సమయంలో న్యాయమూర్తి స్పందిస్తూ, ఐదారుగురి కోసం ఇంత భారీ ప్రాజెక్టును ఆపడం సరికాదన్నారు. ప్రాజెక్టు పనులపై స్టే ఇవ్వడం సాధ్యం కాదంటూ, ఈ వ్యవహారంపై పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించారు. అయితే పిటిషనర్లను వారి భూముల నుంచి ఖాళీ చేయించవద్దని స్పష్టం చేస్తూ తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేశారు.

# దళితులపై దాడిని ఖండిస్తున్నాం

- టీటీడీపీ అధ్యక్షుడు ఎల్.రమణ
- సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో నేరెళ్ల ఘటనపై ఫొటో ఎగ్జిబిషన్
- అన్ని పార్టీలు ఒక్కటై పోరాడాలి: ఉత్తమ్‌కుమార్‌రెడ్డి
- ఇసుక దందాపై విచారణ జరగాలి: కోదండరాం



గురువారం ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతున్న పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి. చిత్రంలో రేవంత్‌రెడ్డి తదితరులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర మంత్రి కేటీఆర్ సొంత నియోజకవర్గంలో దళితులపై జరిగిన దమనకాండను ఖండిస్తున్నామని, బాధితులకు నష్టపరిహారం చెల్లించాలన్న డిమాండ్‌ను ప్రభుత్వం పెడచెవిన పెడుతోందని తెలంగాణ టీడీపీ అధ్యక్షుడు ఎల్.రమణ విమర్శించారు. నేరెళ్ల ఘటనపై గురువారం సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో టీడీపీ ఫొటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసింది. వివిధ పార్టీల నేతలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. నేరెళ్ల ఘటనపై కాంగ్రెస్ పార్టీ పోరాటం చేసి బాధితులకు న్యాయం జరిగేలా ప్రయత్నం చేసిందని టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. లోక్‌సభ మాజీ స్పీకర్ మీరాకుమార్ బాధితులను చూసి కంట తడిపెడితే సీఎం కేసీఆర్ హేళన చేశారని, ఇలాంటి సంఘటనలపై అన్ని పార్టీలు ఏకమై పోరాడాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

**ఒక్కటైన పార్టీలకు అభినందన..**

అట్టడుగు వర్గాల మీద జరిగిన దాడులను ఖండించడానికి ఏకతాటిపైకి వచ్చిన అన్ని పార్టీలను అభినందిస్తున్నానని టీజేఏసీ చైర్మన్ కోదండరాం అన్నారు. లారీని తగుల బెట్టారన్న నెపంతో పది కుటుంబాలను టార్గెట్ చేశారని ఆరోపించారు. కులం పేరుతో దూషించిన తర్వాత ఇది దళితులపై జరిగిన దాడి కాదని ఎలా అంటారని, బాధ్యులపై అట్రాసిటీ కేసులు కూడా పెట్టాలని అన్నారు. ఇసుక దందాపై సిట్టింగ్ జడ్జితో సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. నేరెళ్ల బాధితులను తాను స్వయంగా కలిశానని, పోలీసులు వారిని చిత్రహింసలు పెట్టారని జస్టిస్ చంద్రకుమార్ అన్నారు. ప్రభుత్వానికి మానవత్వం ఉందా అని ప్రశ్నించారు. కేసీఆర్ ప్రజా పరిపాలన కాకుండా పోలీస్ పాలన సాగిస్తున్నారని టీడీపీ సీనియర్ నేత మోత్కుపల్లి విమర్శించారు. దళితులను ఎందుకు చిత్రహింసలకు గురిచేయాల్సి వచ్చిందో చెప్పాలని, చలో సిరిసిల్ల పాదయాత్ర కార్యక్రమానికి అన్ని పార్టీల సహకారం ఉంటుందని ఆశిస్తున్నామన్నారు. ఇసుక మాఫియాతో కేటీఆర్‌కు ప్రత్యక్ష సంబంధాలు ఉన్నాయని, కేసీఆర్ కుటుంబమే ఇసుక మాఫియాను నడిపిస్తోందని, ఇందుకు తమ దగ్గర ఆధారాలు ఉన్నాయని టీడీపీ నేత రేవంత్‌రెడ్డి అన్నారు. నేరెళ్ల బాధితులకు ఒక్కొక్కరికి రూ.10 లక్షల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. నేరెళ్ల ఘటనను బీజేపీ ఖండిస్తోందని ఆ పార్టీ నాయకుడు చింతా సాంబమూర్తి పేర్కొన్నారు. నేరెళ్లలో జరిగిన దాడులను సీపీఐ ఖండిస్తోందని ఆ పార్టీ నేత బాలస్వామి అన్నారు.

## బీసీ సబ్–ప్లాన్‌పై పోరాటం: ఉత్తమ్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో బీసీలకు రిజర్వేషన్లను జనాభా ప్రాతిపదికన పెంచాలని, బీసీ సబ్‌ప్లాన్ అమలు చేయాలని టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. సబ్‌ప్లాన్ అమలు కోసం క్షేత్రస్థాయి పోరాటాలకు కాంగ్రెస్ సిద్ధంగా ఉందన్నారు. గాంధీభవన్‌లో ఓబీసీ సెల్ చైర్మన్ చిత్తరంజన్‌దాస్ అధ్యక్షతన గురువారం బీసీల సమావేశం జరిగింది. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ భట్టి విక్రమార్క, ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్న సమావేశంలో ఉత్తమ్ మాట్లాడుతూ... ఎన్నికల ముందు టీఆర్‌ఎస్ బీసీలకు ఇచ్చిన హామీల అమలు కోసం పోరాటాలు చేయాలన్నారు. బీసీలు అందరిని ఒక్కతాటిపైకి తేవాలని పిలుపునిచ్చారు. సెప్టెంబరు 30 నాటికి గ్రామాల్లో కమిటీలు నియమించి, సభ ఏర్పాటుచేయాలన్నారు. సామాజిక న్యాయం ఒక్క కాంగ్రెస్‌లోనే సాధ్యమని, 3 నెలల్లో గ్రామ స్థాయి వరకు కమిటీలు పూర్తి చేయాలని విక్రమార్క సూచించారు. పార్టీ నాయకులు మల్లు రవి, మహేశ్‌కుమార్‌గౌడ్, నెరేళ్ల శారద, సురేశ్ షెట్కార్‌తో పాటు జిల్లాల నాయకులు పాల్గొన్నారు.

సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
శుక్రవారం, 11-8-2017

# సప్త సమంత



నటి సమంతతో నీరజ కోన
సినీ తారల డ్రెస్ స్టైలిస్ట్, కాస్ట్యూమ్ డిజైనర్

సినిమాలో.. సన్నివేశానికో డ్రెస్! వేదికల మీద.. సందర్భానికో డ్రెస్!! ఏ వేడుకకైనా.. 'తార'లా వెలిగిపోవాలంటే ధరించే డ్రెస్సులు వైవిధ్యంగా ఉండాలి. అభిమానుల మదిని కొల్లగొట్టాలి. ఆహూతుల కితాబులు అందుకోవాలి సమ్‌థింగ్ సమ్‌థింగ్ 'సమంత' అనిపించాలి. స్టార్ కాస్ట్యూమ్ డిజైనర్ నీరజకోన స్టార్ హీరోయిన్ సమంత కోసం ఎంపిక చేసిన డిజైన్ల గురించి వివరించారు. ఇలాంటి డిజైన్స్‌లో మన ఎంపిక ఎలా ఉండాలో సూచనలు ఇస్తున్నారు.

'అ ఆ' సినిమా ఆడియో లాంచ్ వేడుకకు శ్రియాసోం డిజైన్ చేసిన డ్రెస్ ఇది. ఆర్గాంజా క్లాత్ మీద పువ్వులను ఎంబ్రాయిడరీ చేశారు. బ్లౌజ్‌కి సిల్వర్ బీడ్ వర్క్ చేశారు. పెద్ద ఈవెంట్ అనుకున్నప్పుడు, స్టైలిష్‌గా కనిపించాలంటే ఇలా ఇండోవెస్టన్ డిజైన్ బాగా నప్పుతుంది.

మీడియా ఇంటర్వ్యూ కోసం పాయల్ ఖండ్‌వాలా డిజైన్ చేసిన డ్రెస్‌ని ఎంపిక చేశాం. రెడ్ బ్రొకేడ్ బ్లౌజ్ రా సిల్క్ పలాజో ప్యాంట్‌మీదకు చక్కగా అమరింది. ఈ కలర్, కాంబినేషన్‌ని చూస్తే ఇటు ట్రెడిషనల్ పార్టీలకు అటు గెట్ టుగెదర్ పార్టీలకు స్టైలిష్‌గా ఉంటుంది. ఆమ్రపాలి డిజైన్ చేసిన యాంటిక్ గోల్డ్ ఫినిష్డ్ నెక్లెస్ తప్ప మరే ఆభరణమూ ఈ అలంకరణలో ఉపయోగించలేదు. మెరుపులీనే మేకప్, కోరల్ లిప్‌కలర్, హెయిర్ స్టైల్ ఈ డ్రెస్‌కి బాగా అమరాయి.

తమిళ సినిమా 'తెరి' మీడియా ఇంటర్వ్యూ కోసం డిజైన్ చేసిన శారీ డ్రెస్ ఇది. దీని ఎంపికలోనే ఒక హైలైట్ ఉంది. ఒకే రంగు అదీ చాలా బ్రైట్‌గా ఉండే డ్రెస్‌ను ఎంపిక చేయాలనుకున్నాం. పర్పుల్ కలర్ బాగా అట్రాక్ట్ చేస్తుంది. అందుకని ప్లెయిన్ జార్జెట్ పర్పుల్ శారీ తీసుకున్నాం. దీనికి అదే రంగు కలర్ జాకెట్‌ను జత చేశాం. అయితే ఆర్మీప్రింట్స్ ఉన్న నకోడా ఫాబ్రిక్‌ను తీసుకొని డిజైన్ చేశాం. ఈ డ్రెస్సే పెద్ద హైలైట్. అందుకని ఆభరణాలేవీ ఉపయోగించలేదు. ఈ స్టైలిష్ లుక్ ఆకట్టుకుంది.

ఈ గాగ్రాచోలీ సినిమా రిలీజ్ ఫంక్షన్‌లో ప్రత్యేకంగా నిలిచింది. దీనిని సబ్యసాచి డిజైన్ చేశారు. మోచేతుల వరకు ఉండే బ్లౌజ్, పెద్ద అంచుతో లెహంగా, అంచు రంగు దుపట్టా హంగులుగా అమరాయి. సంప్రదాయ వేడుకలకు ఈ తరహా డ్రెస్సింగ్ ఇప్పుడు అందరినీ ఆకట్టుకుంటుంది.

జైపూర్‌కే ప్రత్యేకమైన హ్యాండ్లూమ్ శారీ విత్ లాంగ్ జాకెట్ ఇది. ఈ గెటప్‌కి ఎత్నిక్ టచ్ తీసుకురావాలని అనుకున్నాం. ఇందుకు జైపూర్ హ్యాండ్ ఎంబ్రాయిడరీ చేయించాం. బ్రాస్ నెక్‌పీస్‌ను తీసుకున్నాం. దీంతో కళ పూర్తిగా మారిపోయింది.

ఈషార్ట్ గౌన్ శంకరాభరణం సినిమా ఆడియోలాంచ్ వేడుకకు డిజైన్ చేసినది. ఈ ఫ్రాక్‌ని మన్‌కా నంద డిజైనర్ డిజైన్ చేశారు. ఈ ఫ్రాక్‌కి షిఫాన్, జార్జెట్ ఫ్యాబ్రిక్స్‌ని వాడారు. ఫ్రాక్ అంటే చాలా స్టైలిష్‌గా ఉంటుంది. అందుకని వేరే యాక్ససరీస్ ఏవీ ఉపయోగించలేదు.

ముదురాకుపచ్చ, నీలం, నలుపురంగుల ప్రింట్ మ్యాక్సీ డ్రెస్ ఇది. 'అత్తారింటికి దారేది' సినిమాలోని పాట కోసం ఎంపిక చేశాం. ఎలాంటి శరీరాకృతి గలవారికైనా సూట్ అయ్యే డ్రెస్ ఇది. ఈ డ్రెస్‌లో ఎక్కడా ఫిటింగ్ ఉండదు. రెగ్యులర్ మ్యాక్సీకి ఫ్యాన్సీ బెల్ట్ ఉపయోగించేసరికి లుక్‌లో స్టైలిష్ మార్పు వచ్చింది. బెల్ట్‌తో పాటు మెడలో వేసుకునే హారానికి ప్రాముఖ్యం ఇచ్చాం. దీనికీ ఫ్యాన్సీ నెక్‌లైన్‌ని తీసుకున్నాం. లూజ్ హెయిర్‌స్టైల్, చెవులకు చిన్న స్టడ్స్ తప్ప ఎక్కడా ఇతరత్రా యాక్ససరీస్ ఉపయోగించలేదు.

నిర్వహణ: **ఎన్.ఆర్.** ఫొటోలు: **శివ మల్లాల**

స్ఫూర్తి

# ఆశయ శిఖరం



రష్యాలోని ఎలబ్రిస పర్వతంపై తెలంగాణ మ్యాపుతో శ్రీవిద్య

మైనస్ 30 డిగ్రీల ఉష్ణోగ్రత, చిమ్మచీకటి, మంచుతాకిడికి చేతులు తిమ్మిర్లు వస్తున్నాయి. ముఖంపైనున్న మాస్క్ తీసి మాట్లాడలేని పరిస్థితి, రాత్రి కావడంతో నిద్ర ముంచుకు వస్తోంది. భయం వేస్తోంది. అమ్మానాన్న, అక్కలు గుర్తుకొచ్చారు. కాని, 2 లక్షల మంది విద్యార్థుల్లో నన్ను ఎంపిక చేసి పంపించారని గుర్తుతెచ్చుకుని ధైర్యం తెచ్చుకున్నాను. మారుమూల గ్రామంలో దళితకుటుంబంలో పుట్టిన నేను ఇంతదాకా వచ్చాను. శిఖరం అంచున జాతీయ పతాకాన్ని ఎగురవేస్తాను అని పట్టుదలతో మౌంట్ ఎలబ్రస్ పర్వత శిఖరాన్ని అధిరోహించాను. ఆ క్షణాన నేను పడ్డ కష్టాన్నంతా మర్చిపోయాను. సంతోషంతో ఎగిరి గంతేశాను. నాతో పర్వతం అధిరోహించిన నలుగురు మిత్రులతో కలిసి భారత జాతీయ పతాకాన్ని ఎగురవేసి పర్వతమంతా సగర్వంగా నిలబడ్డాను అని చెప్పింది 16 సంవత్సరాల శ్రీవిద్య. ఆలేరు సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఎం.ఇ.సి. ఇంటర్ సెకండియర్ చదువుతున్న శ్రీవిద్య రష్యాలో ఎలబ్రస్ మంచుపర్వతాన్ని అధిరోహించింది. ఆమె సాహసం గురించి ఆమె మాటల్లోనే...

''మా అమ్మానాన్నలు వ్యవసాయ కూలీలు, మేము ముగ్గురం ఆడపిల్లలం. ఇద్దరు అక్కల తర్వాత నేను. మా అక్కలు కూడా గురుకుల పాఠశాలల్లోనే చదువుకున్నారు. నా చిన్నతనంలో మా అక్కలతో కలిసి ఊరికి దగ్గరలో ఉన్న ఏనే (చిన్నపాటి రాతిగుట్ట) వరకు పరుగులు తీసి ఎక్కేదాన్ని. అలా చిన్నతనం నుంచి పరుగెత్తడం, గుట్టలు ఎక్కడం అలవాటు అయింది. దెబ్బలు తగిలినా, రక్తం వచ్చినా ఆటగానే తీసుకునేవాళ్లం. ఆలేరు రెసిడెన్షియల్ పాఠశాలలో 5 తరగతిలో చేరాను. 9వ తరగతిలో పర్వతారోహణ శిక్షణకు అవకాశం వచ్చింది. రాష్ట్రంలోని వివిధ గురుకుల పాఠశాలల నుంచి 160 మంది బాలికలు వచ్చారు. అందులో మా బ్యాచ్ నుంచి నేను సెలక్ట్ అయ్యాను. పాఠశాల తరపున భువనగిరి ఖిలాపై రాక్‌క్లైంబింగ్‌లో శిక్షణ ఇప్పించారు. భువనగిరి ఖిలా చూసినప్పుడు భయం వేసింది. కొన్ని వ్యాయామాలు చేసిన అనంతరం 'ఏహే గిదెంత' అని మనసులో అనుకుని అవలీలగా ఎక్కేశాను. కాని వయసు తక్కువని ఎవరెస్ట్ ఎక్కడానికి అప్పుడు నన్ను తీసుకుపోలేదు.

| బయోడేటా | | |
|---|---|---|
| పేరు | : | బొల్లెద్దు శ్రీ విద్య |
| తల్లిదండ్రులు | : | సైదులు, స్వరూప |
| అక్కలు | : | శ్రీహర్షిణీ, శ్రీవాణి |
| స్వగ్రామం | : | కట్టంగూరు మండలం పేరిందేవిగూడెం |

**ఏర్‌పోర్ట్‌కు వెళ్లేదాకా తెలియదు!** రష్యాలోని ఎలబ్రస్ పర్వతాన్ని ఎక్కడానికి పోతున్నప్పుడు ఎలబ్రస్ పర్వతారోహణ అని నాకు చెప్పలేదు. న్యూఢిల్లీ నుంచి మాస్కోకు ఆరున్నర గంటలు, అక్కడినుంచి మరో విమానంలో 2 గంటల ప్రయాణం. అక్కడి నుంచి కారులో ప్రయాణం చేసి ఎలబ్రస్‌కు చేరుకున్నాం. నాతోపాటు ఎవరెస్ట్ అధిరోహించిన మాలవత్ పూర్ణ, ఏపీకి చెందిన సత్యారావు, రఘు, పుణేకు చెందిన వర్షలు వచ్చారు. ఎలబ్రస్ ఎక్కడానికి రెండురోజులు ప్రయత్నాలు చేసి వెనుదిరిగి వచ్చాం. విపరీతమైన మంచు, వర్షం కురియడంతో మధ్యలోనే దిగివచ్చాం. 27వ తేదీ రాత్రి మూడోసారి విజయవంతంగా ఐదున్నర గంటల్లో పైకి చేరుకున్నాం. 50 అడుగుల జాతీయ పతాకం ఎగురవేశాం. అనంతరం నాలుగు గంటల్లో భూమి మీదికి వచ్చాం.

**నా తదుపరి లక్ష్యం ఎవరెస్ట్:** ఎలబ్రస్ ఎక్కిన తర్వాత నాలో ఆత్మస్థైర్యం పెరిగింది. ఇక ఎంతటి పర్వతాన్నైనా అవలీలగా ఎక్కేస్తాను. నా తర్వాత టార్గెట్ అత్యంత ఎత్తైన ఎవరెస్ట్ పర్వతం ఎక్కడం. ఆ తర్వాత ప్రపంచవ్యాప్తంగా ఉన్న అన్ని పర్వతాలు ఎక్కేస్తాను. పర్వతారోహణతోపాటు చదువులో రాణించి ఐపీఎస్ సాధిస్తాను. ఎలబ్రస్ అధిరోహించిన తర్వాత నాకు లభించిన ప్రశంసలు మరచిపోలేను. నాతోటి విద్యార్థులు, ఉపాధ్యాయులేగాక జిల్లా కలెక్టర్ అనితారామచంద్రన్, ఆలేరు ఎమ్మెల్యే... ఇలా ఎందరో నన్ను అభినందిస్తున్న తీరు నాకు మరింత ఉత్సాహాన్ని ఇస్తోంది'' అంటున్న శ్రీవిద్య లక్ష్యాన్ని సాధించాలని ఆకాంక్షిద్దాం... ఆల్ ది బెస్ట్ చెబుదాం.




తల్లిదండ్రులతో శ్రీవిద్య

**- యంబ నర్సింహులు**
సాక్షి, యాదాద్రి జిల్లా

బ్యూటిప్స్

## మొటిమల నివారణకు...



- తెల్ల ఉల్లిపాయని గ్రైండ్ చేసి రసం తీయాలి. దీంట్లో పావు టీ స్పూన్ తేనె, చిటికెడు రాళ్ల ఉప్పు వేయాలి. అది కరిగిన తరవాత ఈ మిశ్రమాన్ని మొటిమల మీద అప్లై చేసి 20 నిమిషాల వరకు ఉంచి చన్నీటితో కడిగేయాలి.
- దాల్చిన చెక్కను పొడి చేయాలి. దీంట్లో కొద్దిగా నీటిని చేర్చి పేస్ట్‌లా కలపాలి. మొటిమలు, మచ్చలు ఉన్న చోట ఈ మిశ్రమాన్ని అప్లై చేసి ఆరిన తరవాత కడిగేయాలి. వారానికి ఒక్కసారి ఈ విధంగా క్రమం తప్పకుండా చేస్తే మొటిమలు, మచ్చలు తగ్గి చర్మ కాంతి పెరుగుతుంది.



ఆత్మీయం

# సహనమే సాఫల్య సోపానం



సహనం ఓ సుగుణం, అది జీవిత సౌశీల్యం, సహనం జీవిత ప్రధాన అవసరం. సహనమును కోల్పోయే పరిస్థితులు, ఆస్కారములు మన జీవితంలో అడుగడుగునా తారసపడుతుంటాయి. సహనం కోల్పోతే, మనకు కలిగే నష్టాలు, అనర్థాలు మనం ఈ జీవితంలో కోలుకోలేని, పూడ్చుకోలేని పరిణామాలకు దారితీస్తాయి. సహనం ఆరోగ్యవంతమైన మానసిక సమతుల్యతా స్థితికి నిదర్శనం. సహనం పరిస్థితులను జయించి తనకు అనుకూలంగా మలుచుకుంటుంది. సహనమన్నది జీవిత ఉన్నత శిఖరాలను అధిరోహించడానికి బలమైన సూత్ర సాధనం. సహనం కోల్పోతే ఏ రంగంలోని వారమైనా జీవిత లక్ష్యాన్ని, ఆశయాన్ని సాధింపజాలరు. సహనం ఓ అభ్యాసం, ఈ జీవిత పరిస్థితులు మనకు నేర్పే పాఠం. జీవితంలో కొన్ని అధికృతలు, అర్హతలు సాధించటానికి ఓ సోపానం. సహనాన్ని దైవసన్నిధిలో, దైవధ్యానంలో మనం అలవర్చుకొంటాము, అకళింపజేసుకుంటాము. అయితే సహనానికి మారు పేరు భూదేవి. మన భక్తికి, మనం చేసే పూజలకు, మనం చేసే కృషికి, ప్రయత్నానికి సత్ ఫలితాన్ని ఎదురుచూడటానికి కూడా సహనం అవసరం.

సహనం ఓ అశక్తత కాదు, బలహీనత కాదు, చేవలేని తనం అసలే కాదు. కాదు. సోమరితనం అంతకన్నా కాదు, జీవిత బలం. అసహనం మన జీవితాలను, కుటుంబాలను, మన విలువల్ని, మనం సంపాదించుకున్న గౌరవ ప్రతిష్ఠలను, అప్రతిష్ఠపాలు చేస్తుంది. మన కుటుంబ సంబంధాలు, వైవాహిక సంబంధాలు, స్నేహసంబంధాలు, రక్త సంబంధాలు తదితర మానవ సంబంధాలన్నీ ఆరోగ్యకరంగా, బలంగా ఉండాలంటే సహనమే ప్రధానం.

సహనంతోనే సంసార జీవితం ఒడుదుడుకుల మధ్య సైతం సాఫీగా సాగుతుంది. సహనం లేని చోట ప్రేమ పగగా మారుతుంది. సహనంతో సాధించలేనిది ఏది లేదు. ఒక్కమాట! ఈ జీవితంలోని విజయానికే కాదు, ఈ జీవితానంతరపు నిత్య జీవిత సాధన వరకు సహనమే సోపానం.











సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
శుక్రవారం
11-8-2017


నాటి సినిమా

# సంస్కార నిరూపణే శంకరాభరణం






గంజాయివనంలో తులసి పుట్టింది.

ఆ తులసికి డబ్బంటే మోజు లేదు. నగలంటే మోహం లేదు. తన తల్లిలా ఐశ్వర్యం అంటే పిచ్చి లేదు. తన కుటుంబాలలో స్త్రీలు ఇంతకాలం చేసినట్టుగా మగవాళ్ల విలాసవస్తువుగా మారి విలువలు లేని జీవితం గడపాలన్న తాపత్రయం లేదు.

తులసి నిజంగా తులసే.

స్త్రీ దేహానికి విలువ కట్టి వలువ ఊడదీసే ఇంట్లో పుట్టిన తులసి.

ఆ అమ్మాయికి సంగీతం అంటే ఇష్టం. గానం అంటే ప్రాణం. నృత్యం అంటే అభిమానం. ముఖ్యంగా 'శంకరాభరణం' శంకర శాస్త్రి అంటే ఆర్తి.

ఎలాంటి ఆర్తి అది?

ఆయన శివుడు అయితే తను నందిలా ప్రణమిల్లాలని, ఆయన విష్ణువైతే తను పారిజాతంలా పాదం వద్ద పడి ఉండాలని, ఆయన బ్రహ్మ అయితే విశ్వసృజనలో తానొక సింధువులా మారాలని.. అంత భక్తి.

ఈ భక్తిలో ఆత్మకు తప్ప శరీరానికి విలువ లేదు. ఉనికి లేదు.

కాని ఊరు వేరేలా అర్థం చేసుకుంది. తనను అభిమానించి చేరదీసిన శంకరశాస్త్రిని తప్పు బట్టింది. ఊరు వెలేసే 'కులట'ను చేరదీసినందుకు శంకరశాస్త్రిని బహిష్కరించింది. ఆయనను బహిష్కరిస్తే తప్పు లేదు. ఆయన సంగీతాన్ని కూడా బహిష్కరించింది.

శంకర శాస్త్రి– తులసి.

ఇద్దరూ బహిష్కృతులు. పాములు.

ఒక పాము వీధిన కనబడితే కేవలం అది పాము. విషపురుగు. కాని అది శివుని మెడలో కనబడితే ఆభరణం. శివుని ఆభరణం. శంకరాభరణం. పూజలు అందుకుంటుంది.

శంకరశాస్త్రి తానొక శంకరాభరణం అని లోకానికి తెలియచేయాలి.

తులసి తానొక శంకరాభరణం అని నిరూపించుకోవాలి.

సంగీతం కోసం జీవించి, సంగీతాన్ని శోధించి, సంగీతాన్ని ఆరాధించి, సంగీతంలో ఐక్యమై శంకరాభరణంలా గౌరవం పొందిన ఆ ఇద్దరి కథే శంకరాభరణం.

* * *

శంకరశాస్త్రి ఉపాసకుడు. నాదోపాసకుడు. అగ్నిని అరచేత ధరించి సత్యం పలుకగలిగిన సరస్వతి పలుకు ఉన్నవాడు. ఆయన పాడితే పాములు కూడా పడగ విప్పి వింటాయి. పక్షులు రెక్కలు ముడుచుకుని కూచుంటాయి. చెట్లు తలలు ఊపుతూ వంత పలుకుతాయి. అటువంటి శంకర శాస్త్రి, భార్యా వియోగుడైన శంకర శాస్త్రి, ఒక్క గానొక్క కూతురిని పోషించుకుంటూ ఉన్న శంకరశాస్త్రి అనుకోని పరిస్థితిలో తులసిని చూస్తాడు. ఆమె కష్టాన్ని అర్థం చేసుకుంటాడు. కన్న తల్లే ఆమెను అమ్మేయాలనుకుంటుందని తెలిసి ఆదుకుంటాడు. కాని దానివల్ల తానే నష్టపోతాడు. సంఘం అనుమానంగా చూస్తుంది. సమాజం నోరు నొక్కుకుంటుంది. వెంట నిలిచే స్నేహితులు తప్ప ఎవరూ మిగలరు. ఇది తులసి తట్టుకోలేకపోతుంది. ఆయన కోసమే ఆయనను దూరంగా వదిలిపోతుంది.

ఒకప్పుడు గజారోహణం, గండపెండేరం బహూకరణ, సన్మానం, సత్కారం, కచ్చేరి అంటే విరబడే జనాలు... ఆ వైభవం కాలం గడిచే కొద్దీ మాసిపోయింది. శాస్త్రీయ సంగీతం అరుపులు కేకల సినీ సంగీతంలో మూల్గుల నిట్టూర్పుల పాశ్చాత్య సంగీతంలో పడి కొట్టుకుపోయింది. ఇప్పుడు ఎవరూ శంకరశాస్త్రిని పిలిచేవారు లేరు. పలుకరించేవారు కూడా లేరు. ఆయన కూతురు పెళ్లికి ఎదిగి వచ్చింది. కాని పెళ్లి చేసే డబ్బు లేదు. శరీరాన ఉన్న వస్త్రాలు జీర్ణమయ్యాయి. కొత్త వస్త్రాలు కొనుక్కునే స్తోమత లేదు. మిగిలిందల్లా కంఠాన కొలువున్న సంగీతం. దివారాత్రాలు తోడుండే స్వరాలు.

ఇలాంటి స్థితిలో ఆనాడు వదిలి వెళ్లిన తులసి తిరిగి వస్తుంది.

తల్లి చనిపోగా బోలెడంత ఆస్తి కలిసి రాగా ఆ ఆస్తితో ఏదైనా సత్కార్యం చేయాలని శంకర శాస్త్రిని వెతుక్కుంటూ వస్తుంది.

అందుకు మాత్రమే కాదు. తనను ఒక మగవాడు కాటేశాడు. అందువల్ల తాను గర్భవతి అయ్యింది. తన కడుపున కూడా కొడుకు రూపంలో ఒక పాము పుట్టింది. ఆ పామును శంకర శాస్త్రి పాదాల చెంత చేర్చి, సంగీతం నేర్పుకు నేలా చేసి, ఆ పామును శంకరాభరణం చేయాలన్న లక్ష్యంతో వచ్చింది.

తులసి కొడుకు శంకరశాస్త్రి శిష్యుడవుతాడు.

ప్రభ కోల్పోయిన శంకరశాస్త్రి పూర్వపు వెలుగును సంతరించుకుంటూ తన చివరి కచ్చేరి ఇస్తాడు. సభికులు క్రిక్కిరిసిన ఆ సభలో 'దొరకునా ఇటువంటి సేవా' అంటూ సంగీతాన్ని అర్చించడానికి మించిన సేవ లేదంటూ పాడుతూ పాట సగంలో వుండగా ప్రాణం విడుస్తాడు.

కాని సంగీతం అంతమాత్రాన ఆగిపోతుందా?

అది జీవనది.

శంకరశాస్త్రి శిష్యుడు, తులసి కొడుకు అయిన పిల్లవాడు మిగిలిన పాటను అందుకుంటాడు.

గొప్ప సంగీతం, మరెంతో గొప్ప సంస్కారం, సంస్కృతి ఎక్కడికీ పోవు.

మనం చేయవలసిందల్లా పూనిక చేయడమే.

ఆదరించడమే. కొత్తతరాలకు అందించడమే.

ఇవన్నీ సమర్థంగా సక్రమంగా చెప్పడం వల్ల శంకరాభరణం క్లాసిక్ అయ్యింది. కలెక్షన్ల శివ తాండవం ఆడింది. సినిమాలలో కైలాస కొండలా అంత ఎత్తున బంగారువర్ణంలో నిలిచింది.

* * *

1979లో విడుదలైన 'శంకరాభరణం' తెలుగు వారి కీర్తి కారణాలలో ఒకటిగా నిలుస్తుందని ఎవరూ ఊహించలేదు. కాని బీడువారిన నేల ఎదురు చూస్తున్న కుంభవృష్టి అదేనని సినిమా విడుదలయ్యాక తెలిసివచ్చింది. ఈ నేలలో, ఈ ప్రజల రక్తంలో నిబిడీకృతమైన పురా సంస్కృతిని తట్టి లేపడం వల్ల ఆ సినిమా ప్రజల ఆనందబాష్పాలతో తడిసి ముద్దయింది. అవుతూనే ఉంది. దర్శకుడు కె.విశ్వనాథ్ మలినం లేని ఉద్దేశ్యంతో తెరకెక్కించడం వల్ల ఆ స్వచ్ఛత సినిమా అంతా కనిపిస్తుంది. ఈ సినిమా సంగీతాన్ని సంస్కరించడం మాత్రమే కాదు మన సంస్కారాన్ని సంస్కరించే పని చేయడం వల్ల కూడా ఆకట్టుకుంది. శంకరశాస్త్రిగా జె.వి.సోమయాజులు, తులసిగా మంజుభార్గవి జన్మలు ధన్యమయ్యాయి. సంగీతం అందించిన కె.వి.మహదేవన్, పాటలు రాసిన వేటూరి సుందరరామమూర్తి, పాడిన ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం చరితార్థులయ్యారు. 'అద్వైత సిద్ధికి అమరత్వ లబ్ధికి గానమే సోపానమూ' అంటూ ఈ సినిమా రిలీజైన రోజుల్లో రిక్షావాళ్లు కూడా గొంతు కలిపారు. నాటుసారా తాగి 'శంకరా' అని పాట ఎత్తుకున్నారు. చంద్రమోహన్, రాజ్యలక్ష్మి, నిర్మలమ్మ వీళ్లంతా ఒకెత్తయితే శంకరశాస్త్రి స్నేహితుడిగా నటించిన అల్లు రామలింగయ్య ఒక్కడే ఒకెత్తు. కథను సూత్రధారిలా నడిపిస్తాడు. పొంగే శంకరరాస్త్రిపై చిలకరింపులా పడి అతడిని పాలుగా మిగులుస్తుంటాడు. అతడే శంకరశాస్త్రికి స్నేహితుడు, కొడుకు, కన్నతండ్రి.

* * *

ఏ సంగీతం అయితే ఏమిటి? ఏ మతం అయితే ఏమిటి? ఏ సమూహం అయితే ఏమిటి? అది పాటిస్తున్న విలువలు, కొనసాగిస్తున్న సంప్రదాయం, అది నిలబెడుతున్న నాగరికత సమాజ హితంలో ఉంటే ఏ సమాజం కూడా దానిని వదలుకోదు. నిలబెట్టుకుంటుంది. వెంట నడిచి కాపాడుకుంటుంది.

మాసిన తెల్లరంగు గోడల మీద తిరిగి తెల్ల రంగు వేయడాన్ని ఎవరు వద్దంటారు.

మాసిన గొప్ప సంగీతాన్ని తిరిగి నిలబెడతానని శంకరాభరణం అంటే అందుకే వెల్‌కమ్ చెప్పారు.

శంకరాభరణం తీసినందుకు నిర్మాత ఏడిద నాగేశ్వరరావుకు, దర్శకుడు విశ్వనాథ్‌కు మాత్రమే శభాష్ అనకూడదు. సినిమా విడుదలయ్యాక పసిగట్టి పెరుగన్నం పాయసం తినిపించిన ప్రేక్షకులను కూడా శభాష్ అనాలి.

అప్పుడే అందరూ గెలిచినట్టు.

ఓంకార నాదాను సంధానమౌ గానమే... శంకరాభరణమూ.

\- కె

## పచ్చని ఆరోగ్యం

హెల్త్ టిప్స్

- గోరువెచ్చని పాలలో చిటికెడు పసుపుపొడి వేసుకొని ఉదయం, సాయంత్రం తాగితే జలుబు త్వరగా తగ్గుతుంది.
- కొద్దిగా నీటిని చేర్చి పచ్చిపసుపు దంచి రసం తీయాలి. దీన్ని చర్మం పై ఎలర్జీ ఉన్న చోట అప్లైచేస్తే ఉపశమనం లభిస్తుంది.
- పసుపుపొడిని నీటిలో కలిపి ముద్ద చేయాలి. దీన్ని వేపాకు గుజ్జులో కలిపి చర్మం పైన పూయడం ద్వారా ఎగ్జిమా వంటి చర్మవ్యాధులను నివారించవచ్చును.
- నువ్వుల నూనెలో పసుపు కలపాలి. ఈ మిశ్రమాన్ని చర్మం పైన దద్దుర్లు వచ్చినప్పుడు రుద్దితే ఉపశమనం కలుగుతుంది.
- పసుపులో కొంచెం సున్నం కలిపిన మిశ్రమంతో బెణికిన చోట మర్దనా చేస్తే నొప్పి తగ్గుతుంది.



## లవ్ డాక్టర్ నన్నడగొద్దు ప్లీజ్

హాయ్ అన్నయ్యా.. నేను, ఒక అబ్బాయి 3 ఇయర్స్‌గా లవ్ చేసుకుంటున్నాం. చాలా హ్యాపీగా ఉంటాం కానీ, అప్పుడప్పుడు క్యాజువల్‌గా గొడవలు అవుతుంటాయి. అన్నింటికీ తనే కాంప్రమైజ్ అయ్యి నన్ను కూల్ చేస్తుంటాడు. కానీ నాకు అప్పుడప్పుడు భయం వేస్తుంది చాలా న్యూస్‌లలో చూస్తున్నాం కదా.. తను కూడా అంతేనా? అనిపిస్తుంది. కానీ ఎప్పుడూ నాతో అలా ప్రవర్తించలేదు. పైగా మా నేపథ్యాలు వేరు. నేను బాగా చదువుతా. తను అంతగా చదవడు. ఇంకా తను మాకన్నా ఆర్థికంగా పూర్ కూడా. ఇవన్నీ నాకు అవసరం లేదు కానీ, ఇంట్లో ఒప్పుకోరు. మా డాడ్ చాలా స్ట్రిక్ట్. అందుకే కావాలనే చాలాసార్లు గొడవ పెట్టుకుని విడిపోదాం అన్నా. కానీ.. నా ఫ్యామిలీ గురించి ఆలోచించే ఇవన్నీ చేస్తున్నానని అర్థం చేసుకుని నాకు సర్దిచెప్పాడు. ఏం ఆలోచించకు మనం కలిసే అందరినీ ఒప్పించి పెళ్లి చేసుకుందాం అంటున్నాడు. అలా తను నాకు నచ్చజెప్పినప్పుడు చాలా హ్యాపీగా అనిపిస్తుంది. నిజమే అనిపిస్తుంది. కానీ కొన్ని రోజులు గడిచేసరికి.. మళ్లీ మామూలుగా అయిపోతున్నా. మళ్లీ తనని విపరీతంగా బాధపెట్టేస్తున్నా. మా ఫ్యామిలీ గురించి ఆలోచించకుండా ఉండలేకపోతున్నా. ఏం చెయ్యాలో అర్థం కావడంలేదు. దయచేసి సలహా చెప్పండి.

\- తులసి



ప్రియదర్శిని రామ్
లవ్ డాక్టర్

జంప్ చెల్లెమ్మా.. జంప్. ఇమ్మీడియట్లీ జంప్ వెరీ ఫాస్ట్...

'సార్...'

ఆపు.. నువ్వు అంతగా ఫీల్ అవ్వొద్దు నీలాంబరి..!

'సార్..'

వద్దు!

'ఫీల్ అవ్వకుండా ఎలా ఉంటాయి సార్..'

ఎందుకు ఫీలింగ్?

'అబ్బాయి పవిత్రంగా లవ్ చేస్తున్నాడు కదా సార్!'

అవునా?

'అవునా ఏంటి అవునా.. మీ మనస్సుకు కళ్లు లేవు సార్ యు ఆర్ బ్లైండ్!!'

గుడ్డి మనసా నాదీ...?

'ముమ్మాటికీ.. అదే అమ్మాయి... అబ్బాయి లేకుండా బతకలేను అని రాస్తే.. అబ్బాయిని ముప్పుతిప్పలు పెట్టేవారు. అమ్మాయి పేరెంట్స్ గురించి ఆలోచించి అబ్బాయిని లైట్ తీసుకుంటోంది కాబట్టి మీ ఫీలింగ్స్ బ్లైండ్‌గా సార్..'

నీ ఫీలింగ్‌లోనే ఆన్సర్ ఉంది.. అమ్మాయి పేరెంట్స్‌ని బాధ పెట్టకూడదు అనుకుంటోంది.. అలాంటప్పుడు జంప్ చెల్లెమ్మా.. జంప్!!

'మీకు అరటిపండు జంప్.. జంప్ సార్!!'

lovedoctorram@sakshi.com

## కాసుకో సుడోకు

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 8 | 7 | 5 | 4 | | 9 | | 2 | |
| | 6 | | 8 | | | 9 | | |
| | | | | 5 | | | 8 | 4 |
| | | 8 | 3 | | | | | 7 |
| 4 | 2 | 7 | | | | 8 | 3 | 1 |
| 6 | | | | | 7 | 2 | | |
| 5 | 8 | | | 1 | | | | |
| | | 6 | | | 3 | | 1 | |
| | 4 | | 9 | | 8 | 5 | 7 | 2 |

నిబంధనలు:
ప్రతి వరుసలో 1 నుంచి 9 అంకెలు నింపండి (అడ్డంగా, నిలువుగా). ఒక వరుసలో ఒక అంకెను ఒకసారి మాత్రమే వాడాలి. ప్రతి 3X3 చదరంలోనూ 1 నుంచి 9 అంకెలు రావాలి.

నిన్నటి జవాబు

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 8 | 6 | 2 | 9 | 4 | 1 | 3 | 7 | 5 |
| 5 | 3 | 4 | 7 | 2 | 8 | 9 | 1 | 6 |
| 1 | 9 | 7 | 5 | 3 | 6 | 4 | 2 | 8 |
| 2 | 4 | 5 | 3 | 8 | 7 | 6 | 9 | 1 |
| 9 | 8 | 3 | 6 | 1 | 2 | 5 | 4 | 7 |
| 7 | 1 | 6 | 4 | 5 | 9 | 2 | 8 | 3 |
| 3 | 5 | 1 | 2 | 7 | 4 | 8 | 6 | 9 |
| 6 | 2 | 8 | 1 | 9 | 3 | 7 | 5 | 4 |
| 4 | 7 | 9 | 8 | 6 | 5 | 1 | 3 | 2 |

# నో ఫైటింగ్స్!



నాగచైతన్య, సమంత

'చూడ చక్కని జంట'... నాగచైతన్య-సమంతలకు చాలామంది ఇచ్చే కితాబులివి. మరి ఈ ఇద్దరూ ఒకరికి మరొకరు ఇచ్చుకునే కితాబుల సంగతేంటి? అంటే 'చై.. (నాగచైతన్యను అలానే పిలుస్తారు) చాలా మంచి అబ్బాయి' అంటారు సమంత. నాగచైతన్య అయితే ఇటీవల ఓ కార్యక్రమంలో 'ప్రపంచంలో ఒక గొప్ప వ్యక్తి' అని సమంత గురించి చెప్పారట. అది మాత్రమే కాదు.. సమంతకన్నా అందమైన అమ్మాయి లేదని కూడా అన్నారు. ఆ సంగతలా ఉంచితే చైతూ-సమంతల పర్సనల్ లవ్ లైఫ్‌ని ఆన్ స్క్రీన్ మీద చూడాలని చాలా మందికి ఉంటుంది. ఆ అవకాశం లేకపోలేదు. ఎందుకంటే, తమ లవ్ లైఫ్‌తో సినిమా అంటే ఒప్పుకుంటానని కూడా ఆ కార్యక్రమంలో చైతూ అన్నారట. ఇద్దరూ గొడవపడుతుంటారా? అనే ప్రశ్నకు... ''కోపం వస్తే సీరియస్‌గా చూస్తుంది కానీ, నో ఫైటింగ్స్'' అని కూడా చైతూ పేర్కొన్నారట. అక్టోబర్‌లో నాగచైతన్య-సమంతల వివాహం జరగనున్న విషయం తెలిసిందే. మ్యారేజ్ కోసం షాపింగ్ మొదలు పెట్టారట.

# ముందు స్టోరీ... తర్వాతే టెక్నాలజీ!



రానా

''వైవిధ్యమైన పాత్రలు చేయాలనే నటుణ్ణి అయ్యా. ప్రతిసారీ ఒకే రకమైన పాత్రలు చేస్తే చూడ్డానికి ప్రేక్షకులకు, చేయడానికి నాకు బోర్. కొత్త క్యారెక్టర్ చేస్తున్నప్పుడు ఆ పాత్ర నుంచి ఏం నేర్చుకోవాలా? అని ఆలోచిస్తా. క్యారెక్టర్ బేస్డ్ సినిమాలు చేయడం ఇష్టం. ఇప్పటివరకు చేసిన పాత్రలతో సంతోషంగా ఉన్నా" అన్నారు రానా. ఆయన హీరోగా తేజ దర్శకత్వంలో డి. సురేశ్‌బాబు, సీహెచ్. భరత్‌చౌదరి, వి. కిరణ్‌రెడ్డి నిర్మించిన చిత్రం 'నేనే రాజు నేనే మంత్రి'. ఈరోజు సినిమా విడుదలవుతున్న సందర్భంగా రానా చెప్పిన విశేషాలు...

- మా సురేశ్ ప్రొడక్షన్స్‌లో ఫస్ట్ నుంచి సినిమా చేద్దాం అనుకున్నా కుదర్లేదు. ఇప్పుడైనా చేయడం చాలా ఆనందంగా ఉంది. మా నాన్నకు (డి.సురేశ్ బాబు), నాకు స్టోరీ నచ్చింది. బాబాయ్ వెంకటేశ్ గారు కథ విని హ్యాపీ. ఒక సినిమా మీద ఓనర్‌షిప్ ఉంటే బాగా చేయొచ్చు. ఈ సినిమాకి మా నాన్న గారు ఓ నిర్మాత కావడం నా లక్.
- 'లీడర్' సినిమాలోని అర్జున్‌ప్రసాద్ మంచోడు. 'నేనే రాజు నేనే మంత్రి'లో జోగేంద్ర(రానా పాత్ర పేరు) అంత మంచోడు కాదు. ఈ చిత్రంలో రాజకీయాలు ఒక అంశం మాత్రమే. రాధా, జోగేంద్ర అనే భార్యాభర్తల కథ ఇది. కరువు ప్రాంతంలో ఉంటూ సింపుల్ అండ్ హ్యాపీలైఫ్‌ను లీడ్ చేసే జోగేంద్ర క్రైమ్, పాలిటిక్స్, మనీ అనే ప్రపంచంలోకి ఎందుకు అడుగుపెడతాడు? ఏం చేశాడన్నదే చిత్ర కథ.
- 'బాహుబలి' కోసం కండలు పెంచా. జోగేంద్ర చాలా కామన్‌మ్యాన్. అందుకోసం కష్టపడి బరువు తగ్గా. ఈ సినిమాకు ఆత్మ కథే. టెక్నాలజీ అనేది స్టోరీని సపోర్ట్ చేసే ఒక అంశం మాత్రమే. టెక్నాలజీ మీదే ఆధారపడితే సినిమాలు ఆడకపోవచ్చు. ముందు కథ ముఖ్యం. తర్వాతే టెక్నాలజీ అని నమ్ముతాను. విడుదలకు ముందు కొంచెం డబ్బులు మిగిలితే అది ఫైనాన్షియల్‌గా సక్సెస్‌ఫుల్ మూవీనే.
- 'నేనే రాజు నేనే మంత్రి'ని తమిళంలో కూడా రిలీజ్ చేస్తున్నాం. తమిళ రాజకీయాలకు ఈ సినిమా కనెక్ట్ అవుతుందంటున్నారు. మేం తీసిన తర్వాత కనెక్ట్ అయ్యిందేమో అనిపిస్తుంది. నేను ప్రతిసారి పొలిటికల్ సినిమా చేస్తుంటే అది ఎవరికో ఎప్పుడో ఒక చోట కనెక్ట్ అవుతూనే ఉంది (నవ్వుతూ) .
- కాంపిటీషన్ అంటే ఫస్ట్‌ఫాల్ నేను చేసే సినిమాలు ఇంకెవరూ చేయరని నా అభిప్రాయం. ఈరోజు విడుదలవుతున్న సినిమాలు వేటికవే డిఫరెంట్. బిగ్ వీకెండ్. ఇండిపెండెన్స్ వీకెండ్ అనేది ఒక సంక్రాంతి వీకెండ్ అయిపోవాలని కోరుకుంటున్నాను. హాలీవుడ్ మూవీ కోసం డిస్కషన్స్ జరుగుతున్నాయి త్వరలోనే పూర్తి వివరాలు చెబుతా. .

భానుమతి క్యారెక్టర్ నుంచి బయటకొచ్చేశారు సాయి పల్లవి. 'ఫిదా'లో భానుమతిగా తెలుగు ప్రేక్షకులను ఫిదా చేసిన ఈ మలయాళీ భామ ఎప్పుడో ఆ క్యారెక్టర్ నుంచి బయటకొచ్చేశారు. మరిప్పుడు ఏం చేస్తున్నారు? అంటే... పల్లవిగా మారారామె. పల్లవి అనేది ఆమె అసలు పేరు మాత్రమే కాదు... ప్రస్తుతం తెలుగులో ఆమె నటిస్తున్న సినిమాలో పేరు కూడా! ఇప్పుడా సిన్మాలోని క్యారెక్టర్‌లోకి వెళ్లారామె. నాని హీరోగా వేణు శ్రీరామ్ దర్శకత్వంలో 'దిల్' రాజు, శిరీష్‌లు నిర్మిస్తున్న 'ఎం.సి.ఎ.'లో ప్రేక్షకులకు పల్లవిగా కనిపించనున్నారు సాయి పల్లవి. 'ఎం.సి.ఎ.' అంటే హీరో నాని, దర్శకుడు వేణు శ్రీరామ్‌లు 'మిడిల్ క్లాస్ అబ్బాయి' అని చెబుతుంటే... సాయి పల్లవి మాత్రం వేరే అర్థం చెబుతున్నారు. 'ఎం.సి.ఎ.'

# భానుమతి బన్‌గయా పల్లవి!



సాయి పల్లవి

అంటే 'మిడిల్ క్లాస్ అమ్మాయి' అంటున్నారు. అసలు మేటర్ ఏంటంటే... ఇందులో ఆమె సాధారణ మధ్య తరగతి అమ్మాయిగా నటిస్తున్నారు. భానుమతి తరహాలో ఈ పల్లవి పాత్ర కూడా చాలా సహజంగా ఉంటుందట!

# జానకీ నాయకుణ్ణి అందరూ ఇష్టపడతారు - బోయపాటి శ్రీను



నందు, ప్రగ్యా జైస్వాల్, రకుల్, సాయి శ్రీనివాస్, బోయపాటి శ్రీను, మిర్యాల రవీందర్ రెడ్డి

''భద్ర' తర్వాత నేను చేసిన తులసి, సింహా, దమ్ము, లెజెండ్, సరైనోడు' సినిమాలన్నీ వేటికవే ప్రత్యేకమైనవి. 'భద్ర' సినిమా తర్వాత నేను చేసిన బ్యూటీఫుల్ లవ్‌స్టోరీ 'జయ జానకి నాయక'' అని దర్శకుడు బోయపాటి శ్రీను అన్నారు. బెల్లంకొండ సాయిశ్రీనివాస్ హీరోగా, రకుల్ ప్రీత్ సింగ్, ప్రగ్యా జైస్వాల్ హీరోయిన్లుగా మిర్యాల రవీందర్‌రెడ్డి నిర్మించిన 'జయ జానకి నాయక' ఈరోజు విడుదలవుతోంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బోయపాటి శ్రీను మాట్లాడుతూ– ''లవ్, ఎమోషన్స్, యాక్షన్ అన్నీ ఉన్న కథ ఇది. ఫీల్ గుడ్, ఎమోషనల్ యాక్షన్ ఎంటర్‌టైనర్. మాస్‌తో పాటు అన్ని వర్గాల ప్రేక్షకులూ మా జానకీ నాయకుణ్ణి ఇష్టపడతారు. నేను పని చేసిన నిర్మాతలందరితో హ్యాపీ. అల్లు అరవింద్‌గారితో 'సరైనోడు' చేశా. ఎంతో కంఫర్టబుల్ ప్రొడ్యూసర్. ఆ రేంజ్‌లో రవీందర్‌రెడ్డి సినిమా చేశాడు. ఎక్కడా కాంప్రమైజ్ కాలేదు. ఇలాంటి నిర్మాతలు మనకు ఎంతో అవసరం'' అన్నారు. మిర్యాల రవీందర్ రెడ్డి మాట్లాడుతూ– ''ఇప్పటి వరకు బోయపాటిగారు 6 సినిమాలు చేస్తే, అన్నీ హిట్టే. ఆయన సినిమాల్లో 'జయ జానకి నాయక' బెస్ట్ మూవీ అని చెప్పగలను. సినిమాకు మంచి కథ కుదరడమే తొలి సక్సెస్. సినిమాపై చాలా కాన్ఫిడెంట్‌గా ఉన్నాం. నిజమైన ప్రేమ ఎలా ఉంటుందో ఈ సినిమాలో చూస్తారు'' అన్నారు. ''కొన్ని సినిమాలను ఇది నా సినిమా అని గర్వంగా చెప్పుకుంటాం. 'ఇది నా సినిమా' అని జీవితాంతం చెప్పుకునేలా 'జయ జానకి నాయక' ఉంటుంది'' అని సాయిశ్రీనివాస్ అన్నారు. ''ఈ సినిమాలో జానకి పాత్ర చేసే అవకాశం రావడం నా అదృష్టం. ప్రేక్షకులకు నా క్యారెక్టర్, స్ట్రాంగ్ ఎమోషన్ కనెక్ట్ అవుతాయి'' అని రకుల్ ప్రీత్‌సింగ్ చెప్పారు. ''సినిమా అందర్నీ అలరించే విధంగా ఉంటుంది'' అన్నారు ప్రగ్యా జైస్వాల్. నటుడు నందు పాల్గొన్నారు.

# స్నేహం విలువ...

ఆనంద్, కావ్యశ్రీ, అంజలి, 'జబర్దస్త్' ఆది, 'షేకింగ్' శేషు ప్రధాన పాత్రల్లో తెరకెక్కనున్న చిత్రం 'నేటి ఆకలిరాజ్యం'. శ్రీభాగ్య దర్శకత్వంలో మంజులా భాగ్యలక్ష్మి, ఎమ్.శ్యామల సంయుక్తంగా నిర్మించనున్నారు. దర్శక-నిర్మాతలు మాట్లాడుతూ– ''కృషి, పట్టుదల, ఏకాగ్రతలతో తాము అనుకున్న లక్ష్యాన్ని యువత ఎలా సాధించగలరు? స్నేహ సంబంధాలు మరచిపోయి కేవలం డబ్బే ప్రధానం అనుకుని జీవించే యువతకి నిజమైన స్నేహం విలువ ఏంటి? అనే అంశాలను మా సినిమాలో చూపించనున్నాం. యువతరంతో పాటు అన్నివర్గాల ప్రేక్షకులకు నచ్చేలా రూపొందిస్తాం. ఈ నెలాఖరున చిత్రీకరణ మొదలవుతుంది'' అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: రామ్ పినిశెట్టి, మాటలు: మోహన్.

# జూలియట్.. ఇడియట్‌ల ప్రేమ



నివేదా, నవీన్‌చంద్ర

దర్శకుడు సుకుమార్ వద్ద అసిస్టెంట్‌గా పనిచేసిన అజయ్ వోధిరాల దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'జూలియట్ లవర్ ఆఫ్ ఇడియట్. నవీన్ చంద్ర, నివేదా థామస్ జంటగా కొత్తపల్లి అనురాధ సమర్పణలో కొత్తపల్లి ఆర్.రఘుబాబు, కె.బి.చౌదరి నిర్మించిన ఈ సినిమా టీజర్‌ను విడుదల చేశారు. నవీన్‌చంద్ర మాట్లాడుతూ– ''ప్రతి లవర్ ఒక ఇడియట్టే. నేనొక ఇడియట్ లాంటి లవర్‌లా సినిమాలో కనిపిస్తా. విలువలున్న ప్రేమకథ ఇది'' అన్నారు. ''ఓ జూలియట్, ఓ ఇడియట్ ప్రేమలో పడితే ఎలా ఉంటుందన్నదే ఈ మూవీ. నవీన్‌ను ఇప్పటికీ 'అందాలరాక్షసి' నవీన్ అంటుంటారు. ఈ సినిమాతో 'జూలియట్ లవర్ ఆఫ్ ఇడియట్' నవీన్ అంటారు'' అన్నారు అజయ్ వోధిరాల. ఈ చిత్రానికి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: రవితేజ, లైన్ ప్రొడ్యూసర్: సురేష్ కొండవీటి.

## దెయ్యాల నగరంగా మారనివ్వను: సీఎం



**సాక్షి, అమరావతి బ్యూరో:** అమరావతిని దెయ్యాల నగరంగా మారనివ్వబోనని సీఎం చంద్రబాబునాయుడు అన్నారు. రెండేళ్లలో అమరావతిలో ఊహించని విధంగా అభివృద్ధి చేస్తామని చెప్పారు. గుంటూరు జిల్లా అమరావతిలోని దొండపాడు గ్రామంలో బీఆర్‌ఎస్ మెడిసిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న అమరావతి మెడిసిటీకి ఆయన గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అమరావతి నుంచి అందరూ సాయంత్రానికి గుంటూరు, విజయవాడ వెళ్లకుండా, అమరావతికొచ్చేలా ముందుచూపుతో విద్య, వైద్యం, వినోదంతోపాటు అన్నివిధాలా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని చెప్పారు. మెడిసిటీ ఏర్పాటుతో అనేక మందికి ఉద్యోగాలొస్తాయన్నారు.

**అసౌకర్యానికి గురైన సీఎం:** ఇదిలా ఉండగా సీఎం చంద్రబాబు కేవలం 20 నిమిషాల్లోనే ప్రసంగం ముగించారు. ప్రసంగం ముగించి కూర్చున్న తరువాత ఒళ్లంతా చెమటలు పట్టి అసౌకర్యానికి గురయ్యారు. వెంటనే మంచినీరు తాగారు. ఆయనకు సన్మానం చేసేటప్పుడు కూడా కుర్చీలో నుంచి లేవటానికి ఇబ్బంది పడ్డారు. కొద్దిసేపటికి ఆయన తేరుకోవడంతో అక్కడున్నవారు ఊపిరి పీల్చుకున్నారు.

## నంది, ఎన్టీఆర్ జాతీయ ఫిల్మ్ అవార్డులకు కమిటీలు

**సాక్షి, అమరావతి:** గత మూడు సంవత్సరాలకు గాను నంది ఫిల్మ్ అవార్డులు, ఎన్టీఆర్ జాతీయ ఫిల్మ్ అవార్డులతో పాటు బీ.ఎన్.రెడ్డి, నాగిరెడ్డి మరియు చక్రపాణి జాతీయ ఫిల్మ్, రఘుపతి వెంకయ్య ఫిల్మ్ అవార్డుల ఎంపిక కోసం కమిటీలను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులిచ్చింది. ఈ మేరకు 2014 సంవత్సరానికి నంది ఫిల్మ్ అవార్డుల ఎంపికకు నటుడు గిరిబాబు అధ్యక్షతన, 2015 సంవత్సరానికి జీవిత రాజశేఖర్ అధ్యక్షతన, 2016 సంవత్సరానికి నంది ఫిల్మ్ అవార్డుల ఎంపికకు పోకూరి బాబూరావు అధ్యక్షతన కమిటీలను ఏర్పాటు చేసింది. 2014, 2015, 2016 సంవత్సరాలకు ఎన్టీఆర్ జాతీయ ఫిల్మ్ అవార్డులతో పాటు బీ.ఎన్.రెడ్డి, నాగిరెడ్డి మరియు చక్రపాణి జాతీయ ఫిల్మ్ అవార్డులు, రఘుపతి వెంకయ్య ఫిల్మ్ అవార్డుల ఎంపికకు నందమూరి బాలకృష్ణ అధ్యక్షతన కమిటీలను ఏర్పాటు చేశారు.

## కాపులు బాబుకు బుద్ధి చెప్పాలి: ముద్రగడ



**జగ్గంపేట/కిర్లంపూడి (జగ్గంపేట):** 'రిజర్వేషన్ల కోసం కాపు ఉద్యమం ఆఖరి దశకు చేరుకుంది.. చావో రేవో తేల్చుకుందాం.. ఇచ్చిన వాగ్దానం అమలు చేయాలని కోరుతుంటే అణగదొక్కేందుకు చూస్తున్నారు.. తాటాకు మంటలా కాకుండా తుమ్మ కర్రలా ఉద్యమ సెగ సీఎం కుర్చీకి తగలాలి.. ఆ సెగకు కుర్చీలో కూర్చోలేక ఇదేంటి కాపు గోల అంటూ ఉక్కిరిబిక్కిరవుతూ ఇచ్చిన హామీ గుర్తుకు రావాలి.. నంద్యాల అసెంబ్లీ, కాకినాడ కార్పొరేషన్ ఎన్నికల్లో కాపులు తమ సత్తా చాటి చంద్రబాబుకు బుద్ధి చెప్పే కార్యక్రమానికి శ్రీకారం చుట్టాలి' అని కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం పిలుపునిచ్చారు. తూర్పు గోదావరి జిల్లా కిర్లంపూడిలోని ఆయన నివాసంలో గురువారం 13 జిల్లాల కాపు జేఏసీ నాయకులు 300 మంది సుమారు 6 గంటల పాటు సుదీర్ఘంగా సమావేశమయ్యారు. రిజర్వేషన్ల సాధన దిశగా తీసుకోవాల్సిన చర్యలు, ప్రభుత్వ వైఖరి, భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు.

## బ్రాహ్మణ సేవా సమాఖ్య రాష్ట్ర గౌరవాధ్యక్షుడిగా టీవీకేఎస్ శాస్త్రి

**గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్):** ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య (ఏపీబీఎస్ఎస్ఎస్) రాష్ట్ర గౌరవాధ్యక్షులుగా టీవీకేఎస్ శాస్త్రి నియమితులయ్యారు. గురువారం విజయవాడలోని ఐలాపురం హోటల్‌లో సమాఖ్య ప్రధాన కార్యదర్శి కోనూరు సతీశ్‌శర్మ ఆయనకు నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సతీశ్ శర్మ మాట్లాడుతూ.. బ్రాహ్మణుల సామాజిక, ఆర్థిక, రాజకీయ హక్కుల సాధనకు కృషి చేయాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించి బ్రాహ్మణులను ఏకతాటిపై తీసుకురావాలని పేర్కొన్నారు.

## కౌలు రైతు ఆత్మహత్య



**సి.బెళగల్:** కర్నూలు జిల్లా సి.బెళగల్ మండలం పోలకల్ గ్రామంలో అప్పుల భారంతో కౌలు రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలకల్ గ్రామానికి చెందిన ఈరపోగు బోడెన్న (30) కూలీపనులు చేసుకుని జీవించేవాడు. గత మూడేళ్లుగా నాలుగు ఎకరాల పొలాన్ని కౌలుకు తీసుకుని సాగు చేశాడు. ఏడాదికి రూ.32 వేలు కౌలు చెల్లించేవాడు. మొదటి రెండేళ్లు పత్తి పంట సాగు చేయగా పెట్టుబడులు కూడా దక్కక నష్టపోయాడు. రూ.50 వేలు అప్పులు అయ్యాయి. ఈసారి కూడా తొలకరి వర్షాలకు పత్తి వేశాడు. ఇందుకోసం తెలిసిన వారి వద్ద రూ.30 వేల వరకు అప్పు చేశాడు. ఈ నేపథ్యంలో బుధవారం పంట పొలం చూసి వస్తానని వెళ్లి ఎంతకీ తిరిగి రాకపోవడంతో కుటుంబీకులు పొలం వద్దకు వెళ్లి చూడగా మృతదేహం కన్పించింది. పోలీసులు కేసు నమోదు చేశారు.

# తప్పుచేశావ్ చంద్రబాబూ!

**నిలదీస్తూనే ఉంటాం.. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టీకరణ**

- ప్రజలను మోసం చేసిన నిన్ను వదిలిపెట్టం
- ఈ నేరాలకు, మోసాలకు ఏ శిక్ష విధించినా తక్కువే అంటాం..
- ఇలాంటి వ్యక్తికి ఉరిశిక్ష వేసినా తప్పులేదంటాం..
- అధికారంలోకి రాగానే గుండ్రేవుల నిర్మిస్తాం
- నంద్యాల రోడ్ షోలో ప్రతిపక్షనేత



గోస్పాడు మండలం దీబగుంట్లలో అశేష ప్రజానీకాన్ని ఉద్దేశించి మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్, చిత్రంలో పార్టీ అభ్యర్థి శిల్పా మోహన్‌రెడ్డి

**సాక్షి ప్రతినిధి, కర్నూలు:** అధికారంలోకి రావడం కోసం ఎన్నికల ముందు ఎన్నో హామీలిచ్చి... అధికారంలోకి వచ్చిన తర్వాత మోసం చేస్తున్న చంద్రబాబును కచ్చితంగా ప్రశ్నిస్తామని, నిలదీస్తామని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి హోదాలో మైకు పట్టుకుని ఇచ్చిన హామీలను కూడా అమలు చేయని చంద్రబాబును నిలదీస్తూనే ఉంటామని....ఇలాంటి వ్యక్తికి ఎటువంటి శిక్ష వేయాలని జగన్ ప్రశ్నించారు. 'అయ్యా చంద్రబాబు తప్పుచేశావు.... నిన్ను ప్రశ్నిస్తాం.... తప్పుచేసిన నిన్ను నిలదీస్తాం' అని పేర్కొన్నారు. నీ నేరాలకు, నీ మోసాలకు ఏ శిక్ష విధించినా తక్కువే అని చెబుతూ ఉంటామన్నారు. అన్యాయాలు, మోసాలు చేసే వ్యక్తికి ఉరిశిక్ష వేసినా తప్పు లేదు అని గట్టిగా అంటూనే ఉంటామని తేల్చిచెప్పారు. కేసీ కెనాల్ ఆయకట్టును స్థిరీకరించి నీరు అందించేందుకు అధికారంలోకి రాగానే గుండ్రేవుల ప్రాజెక్టును చేపడతామని ఆయన హామీనిచ్చారు. నంద్యాలను గుండెల్లో పెట్టుకుంటానని మాట ఇచ్చారు. శిల్పామోహన్‌రెడ్డికి వేసే ఈ ఓటుతో చంద్రబాబు గూబ గుయ్ మనాలని పిలుపునిచ్చారు. మీరు వేసే ఓటు జగన్‌కు అని గుర్తుపెట్టుకోవాలని కోరారు. ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా రెండో రోజు జగన్ రోడ్ షో నూనెపల్లె నుంచి ప్రారంభమై చాబోలు, సాంబవరం, దీబగుంట్ల, నెహ్రూనగర్, జిల్లెల్ల, కానాలపల్లె మీదుగా అయ్యలూరు వరకూ సాగింది. ఈ సందర్భంగా పలుచోట్ల మాట్లాడుతూ జగన్ ఏమన్నారంటే..

**గుండ్రేవుల నిర్మిస్తాం...**

''గుండ్రేవుల ప్రాజెక్టును నిర్మిస్తానని ముఖ్యమంత్రి హోదాలో 2014 ఆగస్టు 15న స్వాతంత్ర్యదినోత్సవ సాక్షిగా కర్నూలులో చంద్రబాబు హామీనిచ్చారు. ఈ మూడున్నరేళ్లలో కనీసం అటువైపు చూడలేదు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ హయాంలో కేసీకెనాల్‌కు రెండుకార్ల పంటలకు నీరు వచ్చేది. ఇప్పుడు ఒక్కకారు పంటకైనా నీరు వచ్చే పరిస్థితి ఉందా? చంద్రబాబు గుండ్రేవుల ప్రాజెక్టు కట్టే పరిస్థితి లేదు. మనం అధికారంలోకి వచ్చిన తర్వాత 'గుండ్రేవుల' నిర్మిస్తాం. కేసీ కెనాల్‌కు మళ్లీ రెండు కార్ల పంటలకు నీరు ఇస్తాం.

**అందరినీ మోసం చేశారు..**

రైతులను, డ్వాక్రా మహిళలను, నిరుద్యోగులు అందరినీ చంద్రబాబు మోసం చేశారు. ఇంతకు ముందు రైతులకు వడ్డీలేని రుణాలు వచ్చేవి. ఇప్పుడు ఆ వడ్డీ డబ్బులను చంద్రబాబు ఒక చేత్తో లాక్కొని...దానికే రుణమాఫీ అని పేరు పెట్టి మోసం చేస్తున్నారు. ఇప్పుడు రుణాలు మాఫీ కాక వడ్డీ భారం పెరిగి రైతులు బ్యాంకుల గడప తొక్కే పరిస్థితి లేకుండా పోయింది. డ్వాక్రా మహిళలకు పావలావడ్డీ రుణాలు వచ్చేవి. ఇప్పుడు ఆ పావలా వడ్డీ సబ్సిడీ ఇవ్వకుండా పసుపు–కుంకుమ పేరుతో మోసం చేస్తున్నారు. ఇది అక్కాచెల్లెమ్మల కంట్లో ఉప్పూ–కారం కాదా? చదువుకుంటున్న పిల్లలకు ఉద్యోగం ఇస్తానని...ఇవ్వకపోతే రూ.2 వేల నిరుద్యోగ భృతి ఇస్తానన్నారు. ఇప్పటికి చంద్రబాబు అధికారంలోకి వచ్చి 38 నెలలు అయ్యింది.. నాకు చంద్రబాబు రూ.76 వేలు బాకీ ఉన్నారని....కాలర్ పట్టుకుని అడుగుతానని యువభేరీ సభలో ఒక పిల్లాడు నాతో అన్నాడు. ఎమ్మెల్యేలకు డబ్బులు ఇస్తూ ఆడియో, వీడియో టేపుల్లో అడ్డంగా దొరికి...కేసుల భయంతో మోదీ కాళ్ల మీద పడి ప్రత్యేక హోదాను తాకట్టు పెట్టారు. ప్రత్యేక హోదా వస్తే చదువుకున్న పిల్లలకు ఉద్యోగాలు వచ్చేవి. ఇళ్లులేని పేదలకు 3 సెంట్ల స్థలం ఇస్తానని, ఇళ్లు కట్టిస్తానన్నారు. ఇప్పటివరకు ఒక్క ఇల్లైనా కట్టించారా? ముఖ్యమంత్రి హోదాలో కర్నూలుకు వచ్చి స్మార్ట్ సిటీ చేస్తా, ట్రిపుల్ ఐటీ, ఉర్దూ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తా, మైనింగ్ యూనివర్సిటీ, చేనేత క్లస్టర్లు పెడతా, గుండ్రేవుల ప్రాజెక్టు కడతా అని హామీనిచ్చారు. ఏ ఒక్కటైనా అమలు చేశారా? ఇప్పుడు మళ్లీ నంద్యాలకు వచ్చి అది చేసేస్తాను...ఇదీ చేసేస్తానని హామీలిస్తున్నారు.

**ఏమీ అనకూడదంట...**

ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు, ముఖ్యమంత్రి హోదాలో ఇచ్చిన హామీలను అమలు చేయని ఈ వ్యక్తిని ఏమీ అనకూడదంట. 21 మంది ఎమ్మెల్యేలను కొనుగోలుచేసినా, ఆ ఎమ్మెల్యేలతో రాజీనామాలు చేయించకపోయినా ఏమీ మాట్లాడకూడదంట. వేరే పార్టీకి చెందిన ఎమ్మెల్యేలను డిస్క్వాలిఫై చేయకపోయినా, వాళ్లల్లో కొందరిని మంత్రులుగా చేసినా, రాజకీయాలు భ్రష్టు పట్టించినా ఎవ్వరూ మాట్లాడకూడదంట. చంద్రబాబు చట్టాన్ని పరిహాసం చేస్తున్నా ప్రశ్నిస్తే తప్పంట. రైతులను, డ్వాక్రా అక్కచెల్లెమ్మలను వెన్నుపోటు పొడిచినా అడగనే కూడదంట. నిరుద్యోగుల తరపున మాట్లాడితే కేసులంట. ఈ మధ్యకాలంలోనే చంద్రబాబు గురించి నేను ఒక్క మాట మాట్లాడితే టీవీలన్నీ ఊదరగొట్టేశాయి. నన్నా ఈ మాట అన్నది జగన్ అని చంద్రబాబు గింజుకున్నారు. అబ్బ.... ఎంత గింజుకున్నారంటే నాకే అర్థంకాలే. చంద్రబాబుకు ఒక్కటి చెప్పదలచుకున్నా. అయ్యా చంద్రబాబు తప్పుచేశావు. నిన్ను ప్రశ్నిస్తాం. తప్పుచేసిన నిన్ను నిలదీస్తాం. ఈ అన్యాయాలకు, మోసాలకు గాను నీకు ఏ శిక్ష విధించాలని అడుగుతూనే ఉంటాం. అంతేకాదు నీ నేరాలకు, నీ మోసాలకు ఏ శిక్ష విధించినా తక్కువే అని చెబుతూ ఉంటాం. ఇలాంటి అన్యాయాలు, మోసాలు చేసే వ్యక్తికి ఉరిశిక్ష వేసినా తప్పులేదు అని గట్టిగా అంటూనే ఉంటాం. ఏమయ్యా చంద్రబాబు...నేనేదో ఒక మాట అంటే తప్పు. మరి ఎన్నికలకు ముందు మాట ఇచ్చి మోసం చేసినప్పుడు అది తప్పు అనిపించలేదా? నిన్నే మన్నా అంటే దిష్టిబొమ్మలు కాల్పిస్తావు. మాట తప్పడం, మడమ తిప్పడం నీకున్న దురలవాటు. మాట తప్పకపోవడం, మడమ తిప్పకపోవడం నేను మా నాన్న దివంగత నేత రాజశేఖరరెడ్డి నుంచి నేర్చుకున్న అలవాటు' అని జగన్ పేర్కొన్నారు.

## వెనుకబడిన జిల్లాలంటే నిర్లక్ష్యమా?

**టీడీపీ సర్కారు నిర్లక్ష్య తీరును ఎత్తి చూపిన నీతి ఆయోగ్**

**సాక్షి, అమరావతి:** రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాల అభివృద్ధికి కేంద్రం ఇచ్చిన నిధులను వ్యయం చేయడంలో చంద్రబాబు సర్కారు తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. ఆ వ్యయానికి చెందిన లెక్కలను కూడా సక్రమంగా చెప్పడం లేదు. వీటిని నీతి ఆయోగ్ బయటపెట్టింది. లెక్కల్లో వ్యత్యాసాలు ఉన్నాయని, వాటికి వివరణ ఇస్తేనే తదుపరి నిధులు విడుదల చేస్తామని స్పష్టం చేసింది. గత మూడు ఆర్థిక సంవత్సరాల్లో రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాల అభివృద్ధికి కేంద్రం ఇచ్చిన నిధులకు వాస్తవ లెక్కలతో పాటు చేపట్టిన పనుల్లో వ్యత్యాసాలపై వివరణ ఇవ్వాలని నీతి ఆయోగ్ డైరెక్టర్ జె. కిశోర్ శర్మ బుధవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేశ్ కుమార్‌కు లేఖ రాశారు. కేంద్ర నిధుల్లో ఇంకా రూ. 279.92 కోట్లకు వినియోగ పత్రాలను పంపించాలని స్పష్టం చేశారు. విశాఖ జిల్లాలో 2016–17 ఆర్థిక సంవత్సరంలో మంజూరు చేసిన పనుల సంఖ్య తొలుత చెప్పిన దానికి ఆ తరువాత చెప్పిన దానికంటే ఎందుకు తగ్గాయని ఆ లేఖలో నీతి ఆయోగ్ ప్రశ్నించింది. ఈ ఏడాది జనవరిలో వైఎస్సార్ జిల్లాలో 1,257 పనులు పూర్తయినట్లు నివేదిక పంపారని, గత నెలలో పంపిన నివేదికలో పూర్తయిన పనులు 394 మాత్రమేనన్నారని ఇంత వ్యత్యాసం ఎందుకు వచ్చిందో చెప్పాలంది. అలాగే విశాఖ జిల్లాలో కూడా పనులు ఎందుకు తగ్గిపోయాయని నిలదీసింది. చిత్తూరు జిల్లాకు రూ. 101.93 కోట్లను విడుదల చేస్తే కేవలం రూ. 51.31 కోట్లే వినియోగించడానికి, లెక్కల వ్యత్యాసాలకు కారణాలు ఏమిటో వివరణ ఇవ్వాలని, అప్పుడే ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన రూ. 350 కోట్లు విడుదలపై కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ నిర్ణయం తీసుకుంటుందని నీతి ఆయోగ్ డైరెక్టర్ స్పష్టం చేశారు. ఈ జిల్లాలకు గత మూడేళ్ల కాలంలో మంజూరు చేసిన పనుల్లో సగం కూడా పూర్తి చేయక పోవడం గమనార్హం.

## ఏపీలో టోరే, రాక్‌మెన్ పెట్టుబడులు

**శ్రీసిటీలో పరిశ్రమల ఏర్పాటు**

**సాక్షి, అమరావతి:** రాష్ట్రంలో పెట్టుబడులు పెడుతున్నట్టు జపాన్‌కు చెందిన టోరే, హీరో మోటార్స్ గ్రూప్‌నకు అనుబంధంగా ఉన్న రాక్‌మెన్ ఇండస్ట్రీస్ ప్రతినిధులు ప్రకటించారు. చిత్తూరు జిల్లా శ్రీసిటీలో పరిశ్రమలు నెలకొల్పేందుకు తాము వెయ్యి కోట్ల పెట్టుబడి పెడుతున్నట్టు టోరె ప్రతినిధులు వెల్లడించగా, రాక్‌మెన్ ఇండస్ట్రీస్ రూ. 540 కోట్ల పెట్టుబడి పెడుతున్నట్లు తెలిపారు. ఆ కంపెనీల ప్రతినిధులు గురువారం సచివాలయంలో ముఖ్యమంత్రిని కలిశారు. ప్రాజెక్టుల వల్ల ప్రత్యక్షంగా 100 మందికి, పరోక్షంగా 300 మందికి ఉద్యోగావకాశాలు లభిస్తాయన్నారు. వచ్చే ఏడాది జనవరిలో తమ యూనిట్‌కు శంకుస్థాపన చేయనున్నట్టు వివరించారు. కంపెనీల ప్రతినిధులు కలసిన సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ.. చిత్తూరు జిల్లాను దక్షిణ భారతదేశంలో లాజిస్టిక్ హబ్‌గా తీర్చి దిద్దుతున్నామని చెప్పారు.

## ప్రతీ బూత్‌కూ కేంద్ర బలగాలు



**నంద్యాల ఉప ఎన్నిక నిర్వహణపై భన్వర్‌లాల్**

**సాక్షి, హైదరాబాద్:** ఉప ఎన్నిక జరిగే నంద్యాల శాసన సభ పరిధిలోని అన్ని పోలింగ్ బూత్‌ల బందోబస్తుకు కేంద్ర బలగాలను దించుతామని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి భన్వర్‌లాల్ తెలిపారు. పోలింగ్ స్టేషన్లను వెబ్ కాస్టింగ్‌కు అనుసంధానం చేస్తామని, ఓటింగ్ ప్రక్రియను వీడియో ద్వారా చిత్రీకరిస్తామని చెప్పారు. అధికార యంత్రాంగాన్ని దుర్వినియోగం చేస్తే మంత్రులైనా సహించమన్నారు. హైదరాబాద్‌లో గురువారం విలేకరులకు నంద్యాల ఉప ఎన్నిక ఏర్పాట్లను భన్వర్‌లాల్ వివరించారు. ఈ అసెంబ్లీ స్థానంలో మొత్తం 2,19,108 ఓట్లు ఉన్నాయని, ఈ నెల 5వ తేదీ వరకూ నమోదు చేసుకున్న ప్రతీ వ్యక్తిని ఓటర్ జాబితా పరిధిలోకి తెచ్చామన్నారు. ఆరు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు చెందిన అభ్యర్థులు, మరో ఆరుగురు స్వతంత్ర అభ్యర్థులు ఎన్నికల బరిలో ఉన్నట్టు తెలిపారు.

**అధికార దుర్వినియోగం సహించం**

అధికార దుర్వినియోగానికి పాల్పడితే కఠినంగా వ్యవహరిస్తామని భన్వర్‌లాల్ హెచ్చరించారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, పదాధికారులు ఎన్నికల ప్రచారంలో పాల్గొంటే ఎలాంటి అభ్యంతరం లేదని, ఈ సమయంలో అధికార యంత్రాంగాన్ని వాడుకున్నా, వాహనాలు ఉపయోగించినా, ప్రభుత్వ అతిథి గృహాల్లో బస చేసినా ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించినట్టే భావిస్తామని, వారిపై కేసులు పెడతామని స్పష్టం చేశారు. వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ ఇటీవల ఎన్నికల సభలో చేసిన వ్యాఖ్యలపై వివరణ ఇచ్చారని భన్వర్‌లాల్ ఓ ప్రశ్నకు బదులిచ్చారు. దీన్ని జిల్లా కలెక్టర్‌కు పంపామని, ఆయన రిమార్క్స్ వచ్చాక, తానూ వీడియోను పరిశీలించి, వాస్తవ పరిస్థితిని ఎన్నికల సంఘానికి నివేదిస్తామన్నారు.

## బీజేపీకి తగిన బుద్ధి చెబుతాం

**ఎస్సీ వర్గీకరణ చేస్తే ఊరుకోం: మాలమహానాడు**



ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాలమహానాడు నిర్వహించిన ధర్నాలో మాట్లాడుతున్న చెన్నయ్య

**సాక్షి, న్యూఢిల్లీ:** ఎస్సీ రిజర్వేషన్లను వర్గీకరించాలని చూస్తే తగిన సమయంలో బీజేపీకి బుద్ధి చెబుతామని మాల మహానాడు నేతలు హెచ్చరించారు. వర్గీకరణకు వ్యతిరేకంగా సంఘం ఆధ్వర్యంలో ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద చేపడుతున్న ధర్నా గురువారం మూడో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా సంఘం జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య మాట్లాడుతూ.. రాష్ట్ర విభజన తరువాత వర్గీకరణ అంశానికి కాలం చెల్లిందన్నారు. ఎస్సీలను విభజించాలని కొంతమంది ప్రయత్నిస్తున్నారని, ఇది దళితులు రాజ్యాధికారానికి రాకుండా పన్నిన కుట్ర అని చెన్నయ్య ఆరోపించారు.

**తెలంగాణ మాలమహానాడు ఆధ్వర్యంలో ధర్నా..**

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా తెలంగాణ మాలమహానాడు అధ్యక్షుడు రాంమూర్తి ఆధ్వర్యంలో జంతర్‌మంతర్ వద్ద ధర్నా చేపట్టారు. ఎస్సీ వర్గీకరణకు మద్దతు ఇచ్చిన పార్టీలకు వచ్చే ఎన్నికల్లో తమ సత్తా చూపిస్తామని రాంమూర్తి హెచ్చరించారు.

## 'ఆరెకటికుల' హామీని నిలుపుకోండి

**సీఎం కేసీఆర్‌ను కోరిన సంఘం నేతలు**

**సాక్షి, న్యూఢిల్లీ:** ఆరెకటికులను ఎస్సీ జాబితాలో చేర్చుతామని గత ఎన్నికల ప్రచారం సందర్భంగా బాల్కొండలో ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ఇచ్చిన హామీని అమలు చేయాలని సంఘం ప్రతినిధులు కోరుతున్నారు. అధికారంలోకి వచ్చి మూడేళ్లు పూర్తయినా ఇచ్చిన హామీని నిలుపుకోలేదని సంఘం పోరాట సమితి అధ్యక్షుడు సుధాకర్ అన్నారు. 12 రాష్ట్రాల్లో ఎస్సీ జాబితాలో ఉన్న మాదిరిగానే ఏపీ, తెలంగాణలో కూడా తమను ఎస్సీ జాబితాలో చేర్చాలని కోరుతూ పలువురు ఎంపీలకు వినతిపత్రాన్ని ఇచ్చినట్టు సుధాకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

## దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలి

**అఖిల భారత క్రిస్టియన్ సమాఖ్య ఆధ్వర్యంలో ధర్నా**



ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ధర్నా చేస్తున్న అఖిల భారత క్రిస్టియన్ సమాఖ్య ప్రతినిధులు

**సాక్షి, న్యూఢిల్లీ:** దళిత క్రైస్తవులకు షెడ్యూల్ కులాల హోదా కల్పించాలని అఖిల భారత క్రిస్టియన్ సమాఖ్య డిమాండ్ చేసింది. గురువారం ఈ మేరకు సంఘం ప్రతినిధులు ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ధర్నా చేపట్టారు. రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్ ఫలాలను దళిత క్రైస్తవులకు అందకుండా చేస్తూ సెక్యులర్ దేశంగా పేరున్న భారతదేశ ప్రతిష్టను కాంగ్రెస్, బీజేపీలు దిగజారుస్తున్నాయని సమాఖ్య ప్రతినిధులు శ్రీమంతులు, కె.రాజేశ్‌బాబు మండిపడ్డారు. ధర్నాకు కేంద్ర మాజీ మంత్రి జేడీ శీలం సంఘీభావం తెలిపారు.

**తెలంగాణ**

## ఆ 10 మంది నిర్దోషులు..

**టాస్క్‌ఫోర్స్ కార్యాలయంపై మానవ బాంబు కేసులో తీర్పు**

**సాక్షి, హైదరాబాద్:** టాస్క్‌ఫోర్స్ కార్యాలయంపై 2005లో జరిగిన మానవ బాంబు దాడి కేసులో నాంపల్లి కోర్టు గురువారం తీర్పు వెలువరించింది. ఈ కేసులో నిందితు లుగా ఉన్న 10 మందిని నిర్దోషులుగా ప్రకటించింది. నిందితులు నేరం చేసినట్లు పోలీసులు నిరూపించలేక పోవడంతో వారిని నిర్దోషులుగా ప్రకటిస్తున్నట్లు 7వ అదనపు మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ టి.శ్రీనివాసరావు తన తీర్పులో పేర్కొన్నారు. ఘటనా స్థలంలోని పేలుడు పదార్థానికి, కోర్టు ముందుంచిన శకలాలకు పొంతన కుదరలేదని తీర్పులో వివరించారు. ఈ దాడి వెనుక నిందితుల పాత్ర ఉన్నదనేందుకు పోలీసులు తగిన సాక్ష్యా ధారాలను చూపలేదన్నారు. నిర్దోషులుగా ప్రకటించిన వారిలో అబ్దుల్ కలీం, మహ్మద్ అబ్దుల్ జాహెద్, నఫీకుల్ బిశ్వాస్, షేక్ అబ్దుల్ ఖాజా, మహ్మద్ హిలాలుద్దీన్, షకీల్, సయ్యద్ హాజీ, అజ్మల్ అలీఖాన్, సయ్యద్ అజ్మత్ అలీ, మహ్మద్ బరూద్ వాలా ఉన్నారు.

**ఇదీ నేపథ్యం:** 2005 అక్టోబర్ 12న బంగ్లాదేశ్‌కు చెందిన డాలి శరీరానికి బాంబు అమర్చుకుని టాస్క్‌ఫోర్స్ కార్యా లయం వద్ద తనను తాను పేల్చుకున్నాడు. ఈ ఘటనలో హోంగార్డు సత్యనారాయణ అక్కడికక్కడే చనిపోగా, మరో కానిస్టేబుల్ గాయపడ్డారు. ఈ ఘటనపై పంజాగుట్ట పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరిపారు. అనంతరం ఈ కేసును సిట్‌కు బదిలీ చేశారు. దర్యా ప్తును పూర్తి చేసిన సిట్ 2010లో చార్జిషీట్ దాఖలు చేసింది. మొత్తం 20 మందిపై అభియోగాలు మోపింది. ఇందులో డాలి పేలుడులో మృతి చెందగా, ఇద్దరు నింది తులు గులాం యజ్దానీ, షాహెద్ బిలాల్‌లు ఎన్‌కౌం టర్లలో మృతిచెందారు. మిగిలిన వారిలో 10 మంది జైల్లో ఉండగా, మిగిలినవారు పరారీలో ఉన్నారు. జైల్లో ఉన్న 10 మందిలో 9 మందిని పోలీసులు కోర్టులో హాజరు పరచగా, అనారోగ్య కారణాలతో బరూద్ వాలా బెయిల్‌పై బయట ఉన్నారు. ఈ 10 మందిని కూడా న్యాయమూర్తి గురువారం నిర్దోషులుగా ప్రకటించారు.

## జన్యుపరీక్షల్లో గ్రామీణులకు శిక్షణ

**సీసీఎంబీ మాజీ డైరెక్టర్ డాక్టర్ లాల్జీ సింగ్**



**సాక్షి, హైదరాబాద్:** అత్యాధునిక జన్యువైద్యాన్ని సామాన్యులకు దగ్గర చేసేందుకు జీనోమ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో త్వరలో దేశంలోనే తొలిసారిగా ఓ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు సెంటర్ ఫర్ సెల్యులార్ అండ్ మాలిక్యులర్ బయాలజీ (సీసీఎంబీ) మాజీ డైరెక్టర్ లాల్జీ సింగ్ తెలిపారు. ఈ కేంద్రం జన్యుక్రమ నమోదు మొదలుకొని జన్యువ్యాధి కారక మార్పులను గుర్తించేందుకు అవసరమైన అన్ని పరీక్షలను చేపడుతుందని చెప్పారు. హైదరాబాద్‌లోని హోలీ మేరి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (హిట్స్)లో గురువారం జరిగిన అంతర్జాతీయ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సివిల్ ఇంజనీరింగ్, నీటివనరుల నిర్వహణలో తాజా పరిణామాలు అంశంపై ఈ సదస్సు జరిగింది. రూరల్ ట్రెయినింగ్ ఫెసిలిటీ పేరుతో ఏర్పాటయ్యే ఈ కేంద్రం జన్యు పరీక్షల నిర్వహణలో గ్రామీణులకు శిక్షణ ఇస్తుందని తెలిపారు. ఈ కేంద్రం ఏర్పాటుకు హైదరాబాద్ సమీపంలోని మేడిపల్లిలో 4 ఎకరాల స్థలాన్ని ప్రభుత్వం కేటాయించిందని, కేంద్ర డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ పరికరాల కొనుగోలుకు నిధులు సమకూర్చిందని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం ముందుకొస్తే ప్రభుత్వ ఆసుపత్రుల్లో నమూనాల సేకరణ కేంద్రాలు ఏర్పాటు చేసి జన్యువైద్యాన్ని పేదలకు చేరువ చేస్తామన్నారు.

**జీవశాస్త్రం స్ఫూర్తితో:** జీవశాస్త్రం స్ఫూర్తితో భవనాలను మరింత పటిష్టంగా నిర్మించేందుకు కొత్త పద్ధతులు పుట్టుకొస్తున్నాయని లాల్జీ సింగ్ తెలిపారు. ఇంజనీర్లు కొత్త సాంకేతిక పరిజ్ఞానం సాయంతో భవనాలు మరింత ఎక్కువ కాలం మన్నేలా చేయాలన్నారు. అవయవాల తయారీకి ఉపయోగపడే మూలకణాలను ఆదర్శంగా చేసుకుని భవన నిర్మాణంలో ఏదైనా లోపాలు తలెత్తితే ఆటోమెటిక్‌గా మరమ్మతు అయ్యేలా కొత్త పదార్థాలను అభివృద్ధి చేసేందుకు కృషి చేయాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో హిట్స్ సంస్థ చైర్మన్ అరిమండ వరప్రసాద్‌రెడ్డి, కార్యదర్శి విజయ శారదారెడ్డి, వైస్‌చైర్మన్ సిద్ధార్థరెడ్డితో పాటు ఐఐటీ ఖరగ్‌పూర్ విశ్రాంత అధ్యాపకుడు కె.సుబ్రమణ్యం పాల్గొన్నారు.

# మళ్లీ కొత్త జిల్లాల లొల్లి!

**వరంగల్ రూరల్ జిల్లా కేంద్రంపై తకరారు**

- కలెక్టరేట్ స్థలం ఎంపికపై వివాదం
- పరకాల, నర్సంపేట, మామునూరుల్లో ఆందోళనలు
- అధికార పార్టీ ఎమ్మెల్యేల తలోబాట.. తెరపైకి నర్సంపేట జిల్లా డిమాండ్



**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలో కొత్త జిల్లాల పేచీ మళ్లీ తెరపైకి వచ్చింది. పాత వరంగల్ జిల్లా కేంద్రంగా ఈ వివాదాలు రోజురోజుకు ముదురుతున్నాయి. వరంగల్ రూరల్ జిల్లాలో ఉన్న నర్సంపేటను ప్రత్యేక జిల్లాగా ఏర్పాటు చేయాలంటూ అక్కడి నేతలు తాజాగా డిమాండ్‌ను లేవనెత్తారు. జిల్లాల విభజన శాస్త్రీయంగా జరగలేదని.. రెవెన్యూ డివిజన్లకు సైతం సంబంధం లేకుండా కొత్త జిల్లాలను ఏర్పాటు చేశారని పేర్కొంటూ ఆ ప్రాంత నేతలు ఆందోళనలు చేపడుతున్నారు. జిల్లాల పునర్వ్యవస్థీకరణలో పాత వరంగల్ జిల్లా ఐదు జిల్లాలుగా ముక్కలైంది. వరంగల్ అర్బన్, వరంగల్ రూరల్, మహబూబాబాద్, భూపాలపల్లి, జనగామ జిల్లాలుగా విడగొట్టారు. వరంగల్, హన్మకొండ, కాజీపేట కలిసే ఉన్నా.. ఈ పాత జిల్లా కేంద్రాన్ని వరంగల్ అర్బన్, వరంగల్ రూరల్ జిల్లాలుగా విడగొట్టడంపై స్థానికుల నుంచి విమర్శలు పెల్లుబికాయి. హన్మకొండ పేరును పరిగణనలోకి తీసుకోకుండా.. వరంగల్ అర్బన్, వరంగల్ రూరల్ జిల్లాలుగా పేరు పెట్టడం కూడా వివాదాస్పదమైంది.

**అసలు జిల్లా కేంద్రం ఎక్కడ?**

హన్మకొండలో సుబేదారి ప్రాంతంలోని ఉమ్మడి జిల్లా కలెక్టరేట్ ప్రాంతాన్ని వరంగల్ అర్బన్ జిల్లా కేంద్రంగా మార్చారు. దాంతో ఇబ్బందేమీ లేకున్నా.. కొత్తగా ఏర్పాటు చేసిన వరంగల్ రూరల్ జిల్లా కేంద్రమేదీ? ఎక్కడ జిల్లా కేంద్రం ఏర్పాటు చేయాలన్న దానిపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వకపోవటం కొత్త వివాదాన్ని రాజేసినట్లయింది. హన్మకొండలోని మిషన్ కాకతీయ సూపరింటెండెంట్ కార్యాలయంలో వరంగల్ రూరల్ కలెక్టరేట్‌ను తాత్కాలికంగా నిర్వహిస్తున్నారు. కొత్త కలెక్టరేట్ సముదాయాన్ని ఎక్కడ నిర్మిస్తే అనువుగా ఉంటుందనేది అధికారులకు, ప్రజాప్రతినిధులకు పరీక్ష పెట్టినట్ల యింది. గీసుకొండ మండలం మొగిలిచర్లలో కలెక్టరేట్ ఏర్పాటుకు ఉచితంగా భూమి ఇచ్చేందుకు రైతులు ముందుకొచ్చారు. ఆ భూమిని రిజిస్ట్రేషన్ చేసుకొనేందుకు ఈ నెల 19న ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ప్రాంతంలో కలెక్టరేట్ ఏర్పాటును పరకాల, వర్ధన్నపేట ప్రజలు, నాయకులు వ్యతిరేకిస్తున్నారు. మొగిలిచర్లకు బదులుగా నర్సంపేటలో జిల్లా కేంద్రం ఏర్పాటు చేయాలని స్థానిక నేతలందరూ ఆందోళనలు చేపట్టారు. నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, కేంద్ర మాజీ మంత్రి బలరాం నాయక్, టీడీపీ నేత రేవూరి అందులో పాల్గొన్నారు. జిల్లా కేంద్రాన్ని పరకాలలో ఏర్పాటు చేయాలంటూ ఆ ప్రాంత నేతలు రిలేనిరాహార దీక్షలు చేపట్టారు. వరంగల్ రూరల్ జిల్లా కేంద్రాన్ని మామునూరులోని ప్రభుత్వ స్థలాల్లో నిర్మించాలంటూ వర్ధన్నపేట నియోజకవర్గంలో అఖిలపక్ష నేతలు దీక్షలు చేపట్టారు. అధికార పార్టీ ఎమ్మెల్యేలు జిల్లా కేంద్రం ఏర్పాటు ప్రతిపాదనపై తలోరకంగా స్పందిస్తున్నారు. దీంతో గందరగోళం నెలకొంది.

**జిల్లా కోసం సీఎస్‌కు వినతి**

వరంగల్ రూరల్ జిల్లా కేంద్రంపై ఇప్పటికే వివాదం కొనసాగుతుండగా.. ఇప్పుడు మరో జిల్లా డిమాండ్ ఊపందుకుంది. నర్సంపేట కేంద్రంగా కొత్త జిల్లా ఏర్పాటు చేయాలంటూ టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రేవూరి ప్రకాశ్‌రెడ్డి ఆధ్వర్యంలో అక్కడి అఖిలపక్ష నేతలు శుక్రవారం సచివాలయంలో ప్రభుత్వ సీఎస్ ఎస్పీ సింగ్‌కు వినతిపత్రం ఇచ్చారు. కొత్తగూడ, గూడురు మండలా లను కలిపి నర్సంపేట జిల్లాగా ఏర్పాటు చేయాలని కోరారు. వరంగల్ ఉమ్మడి జిల్లాకు సంబంధించి పునర్విభజన శాస్త్రీయంగా జరగలేదని ప్రకాశ్‌రెడ్డి అన్నారు. హన్మకొండ, కాజీపేటలను విభజించే ప్రయత్నం చేస్తున్నారని ఫిర్యాదు చేశారు.

# పళని-పన్నీరు వర్గాల విలీనం!

## అన్నాడీఎంకేలో వేగంగా మారుతున్న సమీకరణాలు

- దినకరన్ నియామకం చెల్లదని సీఎం నేతృత్వంలో పార్టీ తీర్మానం
- అమ్మ స్థానంలో మరొకరిని ఊహించుకోలేమని ప్రకటన
- శశికళకు వ్యతిరేకంగా గళం • 15 లోపు విలీన ప్రకటన!





**సాక్షి, చెన్నై:** తమిళనాట అధికార అన్నాడీఎంకేలో సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. ముఖ్యమంత్రి పళనిస్వామి– మాజీ సీఎం పన్నీరు సెల్వం వర్గాల విలీనం దిశగా అడుగులు పడుతున్నాయి. పార్టీ ఉప ప్రధాన కార్యదర్శి టీటీవీ దినకరన్ నియామకం చెల్లదని సీఎం నేతృత్వంలో సమావేశమైన అన్నాడీఎంకే అమ్మ శిబిరం ప్రకటించింది. ఆయన తీసుకునే నిర్ణయాలతో పార్టీకి సంబంధం లేదంటూ గురువారం జరిగిన పార్టీ అత్యవసర సమావేశంలో తీర్మానం చేసింది. అలాగే... 'అమ్మ' జయలలిత శాశ్వత ప్రధాన కార్యదర్శి అని, ఆమె స్థానంలో మరొకర్ని ఊహించుకోలేమని శశికళకు వ్యతిరేకంగా గళాన్ని విప్పింది. మరోవైపు పన్నీరు శిబిరంతో విలీనంపైనా చర్చించి, కీలక నిర్ణయాలు తీసుకుంది. మొత్తానికి ఈ నెల 15లోపు ఇరు వర్గాల విలీనం జరగవచ్చని విశ్వసనీయ వర్గాల సమాచారం. ఇది కార్యరూపం దాలుస్తుందని ఆర్థిక మంత్రి డి.జయకుమార్ ఆశాభావం వ్యక్తం చేయడం గమనార్హం. ఈ వ్యవహారంలో బీజేపీ మధ్యవర్తిత్వం వహిస్తోందన్న ఊహాగానాలు వినిపిస్తున్నాయి.

అయితే పార్టీ ఇంకా తన నియంత్రణలోనే ఉందని అన్నాడీఎంకే చీఫ్ శశికళ మేనల్లుడైన దినకరన్ చెప్పారు. కాగా, అమ్మ పురచ్చితలైవి శిబిరానికి నిర్వాహకులుగా మరి కొందర్ని నియమిస్తూ ఆయన ప్రకటన విడుదల చేయడం గమనార్హం. పార్టీకి వ్యతిరేకంగా వ్యవహరిస్తే సీఎం పళని స్వామిపైనా చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని దినకరన్ హెచ్చరించారు.

### కొత్త శిబిరంతో రాజుకున్న రగడ

గతంలో పన్నీరు సెల్వం నేతృత్వంలో పురచ్చితలైవి శిబిరం, సీఎం పళని స్వామి నేతృత్వంలో అమ్మ శిబిరంగా అన్నాడీఎంకే వ్యవహారాలు సాగుతూ వచ్చాయి. తాజాగా, సీఎం పళని స్వామిని ఇరకాటంలో పెట్టేలా అమ్మ శిబిరం ఉప ప్రధాన కార్యదర్శి దినకరన్ పావులు కదిపే పనిలో పడ్డారు. సీఎం మద్దతుదారులు ఎదురుదాడికి దిగడంతో అమ్మ పురచ్చితలైవి పేరుతో కొత్త శిబిరాన్ని దినకరన్ ప్రకటించారు. దీంతో అమ్మ శిబిరంలో వివాదం ముదిరింది. అలాగే, దినకరన్ దూకుడు పెంచి కొత్త కార్యవర్గాల్ని ప్రకటించే పనిలో పడ్డారు. ఫలితంగా దినకరన్‌కు చెక్ పెట్టేందుకు సీఎం పావులు కదిపారు.

### అమ్మే శాశ్వత ప్రధాన కార్యదర్శి

అన్నాడీఎంకే అమ్మ శిబిరం అత్యవసర కార్యవర్గ సమావేశానికి పళనిస్వామి గురువారం పిలుపునిచ్చారు. రాయపేటలోని రాష్ట్ర పార్టీ కార్యాలయంలో గంటన్నర పాటు సమావేశం సాగింది. రాష్ట్ర మంత్రులు, గతంలో జయలలిత ప్రకటించిన మేరకు అన్నాడీఎంకే కార్యవర్గంలోని 36 మందిలో 27 మంది హాజరయ్యారు. ఇందులో నలుగురు పార్లమెంట్ సమావేశాల్లో బిజీగా ఉన్న దృష్ట్యా, గైర్హాజరయ్యారు. మిగిలిన ఐదుగురు పన్నీరు సెల్వం శిబిరంలో ఉన్నారు. ఈ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను తీర్మానాలుగా ప్రకటించారు. ఇందులో కేవలం అమ్మ జయలలిత గతంలో నియమించిన కమిటీ మాత్రమే సంతకాలు చేసింది. ఆ మేరకు అన్నాడీఎంకే శాశ్వత ప్రధాన కార్యదర్శి జయలలిత అని పేర్కొంటూ, ఆమె స్థానంలో మరొకర్ని ఊహించుకోలేమని ప్రకటించారు. ఉప ప్రధాన కార్యదర్శిగా దినకరన్ నియామకం నిబంధనలకు విరుద్ధమని, అది చెల్లదని తీర్మానించారు. పార్టీ నిబంధనల ప్రకారం ప్రధాన కార్యదర్శిగా శశికళ నియామకం ఆ పదవికి కొత్త వారిని ఎన్నుకొనే వరకే పరిమితమని ప్రవేశపెట్టిన తీర్మానాన్ని సమావేశంలో ఆమోదించారు. కాగా, శశికళ నియామకాన్ని తాము ఇంకా అంగీకరించలేదంటూ ఎన్నికల యంత్రాంగం వివరణ ఇవ్వడం గమనార్హం.

### ఢిల్లీలో కీలక ప్రకటన!

ఇదిలా ఉండగా, పళని స్వామి, పన్నీరు సెల్వం వేర్వేరుగా గురువారం ఢిల్లీ బయలుదేరి వెళ్లారు. శుక్రవారం అక్కడ జరిగే ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు ప్రమాణ స్వీకారోత్సవంలో పాల్గొంటారు. అనంతరం ప్రధాని మోదీతో భేటీ అవుతారు. తదుపరి ఇరువురు నేతలూ కీలక ప్రకటన చేయవచ్చనే ఊహాగానాలు జోరందుకున్నాయి.

### పన్నీరు డిప్యూటీ సీఎం!

అమ్మ ఆశయ సాధనే లక్ష్యంగా ఒకే వేదికగా ముందుకు సాగుదామని మాజీ సీఎం పన్నీరు సెల్వం శిబిరానికి ఈ సందర్భంగా పళని వర్గం పిలుపునివ్వడం కీలక పరిణామం. ఈ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను ఎంపీ వైద్యలింగం మీడియాకు వివరించారు. పన్నీరు శిబిరం సరైన నిర్ణయం తీసుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కాగా, తమకు ఆహ్వానం పలికే విధంగా అమ్మ శిబిరం స్పందించడంతో తదుపరి కార్యాచరణ దిశగా మద్దతుదారులతో పన్నీరు మంతనాల్లో మునిగిపోయారు. తమ డిమాండ్లు నెరవేరిస్తేనే చర్చలకు వెళతామని ఆయన శిబిరం పునరుద్ఘాటించింది. దినకరన్‌తో చేతులు కలిపిన వారికి ఇది కనువిప్పని పన్నీరు మద్దతుదారుడు కేపీ మునుస్వామి వ్యాఖ్యానించారు. విలీనానికి తమ ప్రధాన డిమాండ్లలో ఒకటైన దినకరన్‌పై వేటు నెరవేరిందన్నారు. విలీనమే జరిగితే పన్నీరు సెల్వంకు డిప్యూటీ సీఎం పదవి కట్టబెట్టనున్నట్టు తీవ్ర ప్రచారం జరుగుతోంది. అయితే ఈ వార్తల్ని మునుస్వామి తోసిపుచ్చారు.



గురువారం చెన్నైలో జరిగిన 'మురసోలి' డైమండ్ జూబ్లీ వేడుకల్లో రజనీకాంత్‌కు జ్ఞాపికను బహూకరిస్తున్న స్టాలిన్, కమల్‌హాసన్

# తమిళ రాజకీయాల్లో కొత్త శకం

## ద్రవిడానికి వచ్చిన ముప్పేమీ లేదు

- డీఎంకే వేదికపై కమల్ హాసన్ వ్యాఖ్య
- కార్యక్రమానికి హాజరైన రజినీకాంత్

**సాక్షి, చెన్నై:** తమిళనాడులో ఓవైపు అన్నాడీఎంకేలో పళనిస్వామి, పన్నీర్ సెల్వం గ్రూపులు విలీనం దిశగా అడుగులేస్తుంటే..మరోవైపు సినీస్టార్లు కమల్ హాసన్, రజినీకాంత్‌లు డీఎంకే పార్టీ ఏర్పాటుచేసిన ఓ కార్యక్రమంలో పాల్గొని తమిళ రాజకీయాలను మరింత వేడెక్కించారు. అన్నాడీఎంకే ప్రభుత్వంపై అవినీతి ఆరోపణలతో ప్రకంపనలు సృష్టించిన కమల్ హాసన్ డీఎంకే వర్కింగ్ ప్రెసిడెంట్ స్టాలిన్‌తో కలసి వేదిక పంచుకున్నారు. అటు సూపర్‌స్టార్ రజినీకాంత్ కూడా కార్యక్రమానికి హాజరై వేదికపై కాకుండా సభలో ముందువరుసలో కూర్చొన్నారు. వీరిద్దరు రాజకీయ ప్రవేశం చేస్తారన్న వార్తల నేపథ్యంలో ఈ ఘటన ప్రాధాన్యత సంతరించుకుంది.

**1983లోనే కరుణానిధి పిలిచారు: కమల్**

డీఎంకే అధికార పత్రిక మురసోలి ఆవిర్భవించి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా చెన్నైలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీఎంకే పార్టీ నేతలతోపాటుగా పలువురు ప్రముఖులను కూడా ఆహ్వానించారు. ఇందులో రజినీ, కమల్‌లతో పాటుగా ఐసీసీ మాజీ చీఫ్, ఇండియా సిమెంట్స్ చైర్మన్ ఎన్.శ్రీనివాసన్, కోలీవుడ్ నటులు ప్రభుతోపాటు పలువురు హాజరయ్యారు. కమల్ మాట్లాడుతూ.. 'మురసోలి కార్యక్రమానికి వస్తున్నానని తెలిసి.. నా రాజకీయ ప్రవేశాన్ని ఈ వేదిక ద్వారా ప్రకటిస్తానా? అని చాలామంది ట్విటర్‌లో ప్రశ్నించారు. 1983లో కరుణానిధి నాకు టెలిగ్రాం పంపి పార్టీలో ఎందుకు చేరకూడదని అడిగారు. దీనికి సమాధానం చెప్పే ధైర్యం లేక ఇంతకాలం మౌనంగానే ఉన్నాను. ఇప్పటికీ దీనికి సమాధానం చెప్పలేకపోతున్నాను. కానీ ఇప్పుడు తమిళనాడు రాజకీయాల్లో కొత్త శకం నడుస్తోంది' అని వ్యాఖ్యానించారు. విభిన్న భావాలు, అభిప్రాయాలు ఉన్న పత్రికలకు చెందిన ప్రతినిధులే ఈ కార్యక్రమానికి హాజరవుతున్నప్పుడు, ఓ పత్రికను ప్రారంభించి మధ్యలోనే తాళం వేసుకున్న తాను ఎందుకు హాజరు కాకూడదన్న భావంతోనే కార్యక్రమానికి వచ్చినట్లు కమల్ వెల్లడించారు. ద్రవిడ శకం ఇక ముగిసిందని కొందరు తెగ వ్యాఖ్యలు చేస్తున్నారని పేర్కొంటూ జాతీయగీతంలో 'ద్రావిడ' పదం ఉన్నంత కాలం ద్రవిడానికి అంతం లేదని తేల్చిచెప్పారు. రజినీకాంత్ మాత్రం వేదికపై మాట్లాడలేదు. అయితే, ఇటీవల కమల్ అన్నాడీఎంకేపై తీవ్ర అవినీతి ఆరోపణలు చేసిన సంగతి తెలిసిందే. మంత్రులు కూడా కమల్‌పై విరుచుకుపడ్డారు. ఆ సందర్భంలో కమల్‌కు స్టాలిన్ మద్దతుగా నిలిచిన సంగతి తెలిసిందే.



ఈయన వరద పీడితుడు కాదు. ట్రాఫిక్ బాధితుడు. సిటీ ట్రాఫిక్‌తో విసిగిపోయి ఆఫీస్‌కు రోజూ ఇలా ఈదుకుంటూ వెళ్లి వస్తుంటాడు. ఈయన పేరు బెంజిమన్ డేవిడ్. రోజూ ల్యాప్‌టాప్, మొబైల్, సూట్, బూట్లు అన్నీ వాటర్‌ప్రూఫ్ బ్యాగులో వేసుకుని రెండు కిలోమీటర్ల దూరంలోని ఆఫీసుకు ఇలాగే వెళ్లివస్తాడు. జర్మనీలోని మ్యూనిక్ సిటీలోని ఇసార్ నదిలో తీసిందీ ఫొటో.

# అన్సారీకి రాజ్యసభ వీడ్కోలు

## చైర్మన్‌గా తన వంతు న్యాయం చేశారు: ప్రధాని

- సభా నియమాల్ని పాటించడంలో ఆయనకు ఆయనే సాటి: సభ్యులు
- అన్సారీ నుంచి ఎన్నో సలహాలు, సూచనలు తీసుకున్నా: మన్మోహన్
- ప్రభుత్వ విధానాలపై విమర్శల్ని అనుమతించకపోతే నిరంకుశత్వమే: అన్సారీ

**న్యూఢిల్లీ:** రాజ్యసభ చైర్మన్‌గా చివరి రోజైన గురువారం హమీద్ అన్సారీకి పార్టీల కతీతంగా ఘనంగా వీడ్కోలు పలికారు. రాజ్యాంగ ధర్మాన్ని పరిరక్షించడంలో అన్సారీ తన వంతు న్యాయం చేశారని ప్రధాని నరేంద్ర మోదీ కొనియాడారు. రాజ్యసభను సజావుగా నడపడంలో అన్సారీ పాత్రను సభ్యులు గుర్తు చేసుకున్నారు. విధి నిర్వహణలో ఎక్కువ సమయం సభా నియమాల్ని పాటించేందుకు కృషిచేశారని, ఆయన హయాంలో గందరగోళం మధ్య ఏ బిల్లు ఆమోదం పొందలేదని ప్రశంసించారు. రెండుసార్లు ఉపరాష్ట్రపతిగా ఎన్నికైన అన్సారీ.. పదేళ్ల పాటు రాజ్యసభ చైర్మన్‌గా వ్యవహరించారు. తదుపరి చైర్మన్‌గా శుక్రవారం ఎం.వెంకయ్య నాయుడు బాధ్యతలు చేపట్టనున్నారు.

ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడుతూ..' ప్రజలు, పార్లమెంట్ ఉభయ సభల తరఫున దేశ ఉపాధ్యక్షుడిగా మీరు అందించిన సేవలకు కృతజ్ఞతలు చెబుతున్నాను. దౌత్య ప్రతినిధిగా పశ్చిమాసియాలో ఎంతో చురుగ్గా పనిచేశారు. ఉద్యోగ విరమణ అనంతరం కూడా.. మైనార్టీ కమిషన్, అలీగఢ్ ముస్లిం యూనివర్సిటీతో కలిసి ఎక్కువ సమయం పనిచేశారు. ఇన్నేళ్లలో మీలో మీరు ఎంతో సంఘర్షణ అనుభవించి ఉంటారు. ఇక నుంచి ఆ సందిగ్ధత ఉండదు. స్వేచ్ఛగా ఉండేందుకు, మీ మనోభీష్టం మేరకు పనిచేసేందుకు, మాట్లాడేందుకు అవకాశం దొరుకుతుంది' అని మోదీ పేర్కొన్నారు. శారీరకంగా కూడా అన్సారీ ఎంతో ఆరోగ్యవంతుడని మోదీ ప్రశంసించారు. సభా నాయకుడు, ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ మాట్లాడుతూ 'అన్సారీకి, సభ్యులకు ఇది ఎంతో ఉద్వేగభరిత సమయం. చైర్మన్‌గా మీ విధి నిర్వహణ ఎంతో సవాలుతో కూడింది. రాజ్యసభ 1950, 60ల్లో ఉన్నట్లు లేదు, ప్రస్తుతం పార్టీల బలాబలాల్ని సభ ప్రతిఫలిస్తుంది. పరస్పర దూషణలతో చర్చ మొదలై గందరగోళం, ఆందోళనల మధ్య సాగుతోంది. అయితే అన్సారీ హయాంలో ఎన్నోసార్లు సభకు అంతరాయం కలిగినా.. చాలా సందర్భాల్లో మంచి చర్చ జరిగింది' అని జైట్లీ పేర్కొన్నారు.



వీడ్కోలు కార్యక్రమంలో అన్సారీతో మోదీ. చిత్రంలో ఆజాద్, స్పీకర్ సుమిత్రా, వెంకయ్య

**నడక, యోగా అన్సారీ ఆరోగ్య రహస్యం**

రాజ్యసభ చైర్మన్‌గా అన్సారీ పాత్రను మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ కొనియాడారు. దేశం ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటున్నా.. అన్సారీ వంటి వ్యక్తుల వల్లే పురోగమిస్తోందన్నారు. ఎన్నో సార్లు ఆయన నుంచి సలహాలు సహకారం పొందానని మన్మోహన్ గుర్తు చేసుకున్నారు. చైర్మన్‌గా సభ నడిపిన తీరును ప్రతిపక్ష నేత ఆజాద్ కొనియాడారు. మంచి ఆరోగ్యం కోసం అన్సారీ క్రమం తప్పకుండా నడకతో పాటు యోగా చేస్తారని తృణమూల్ ఎంపీ డెరెక్ ఒబ్రియాన్ వెల్లడించారు.

### బాధ్యతగా వ్యవహరించాలి: అన్సారీ

ప్రభుత్వ విధానాలపై స్వేచ్ఛగా, నిజాయతీతో కూడిన విమర్శల్ని అనుమతించకపోతే.. ప్రజాస్వామ్యం నిరంకుశత్వానికి దారి తీస్తుందని హమీద్ అన్సారీ అన్నారు. రాజ్యసభ చైర్మన్‌గా చివరి ప్రసంగం చేస్తూ.. 'సభ్యులకు విమర్శించే హక్కుంది. అయితే కావాలని సభను అడ్డుకునేలా వ్యవహరించకూడదు. అందరికీ హక్కులతో పాటు బాధ్యతలు కూడా ఉంటాయి' అని పేర్కొన్నారు. రాజ్యాంగం ఏర్పాటుచేసిన రాజ్యసభ దేశంలోని భిన్నత్వాన్ని ప్రతిఫలిస్తుందని అన్సారీ అభిప్రాయపడ్డారు. రాజ్యసభలో అధ్యక్ష స్థానం.. క్రికెట్‌లో అంపైర్, హాకీలో రిఫరీ వంటిదని ఆటను, ఆటగాళ్లను పర్యవేక్షిస్తూ.. రూల్స్ పుస్తకం ఆధారంగా వ్యవహరించాలని చెప్పారు.

### 'నా కుమారుడు హిందూనా? ముస్లిమా?'

**న్యూఢిల్లీ:** రాజ్యసభలో శుక్రవారంతో పదవీకాలం ముగియనున్న ముగ్గురు సభ్యులకు వీడ్కోలు పలికేందుకు గురువారం సమావేశం ఏర్పాటు చేశారు. సీపీఎం నేత సీతారాం ఏచూరి, తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన బంద్యోపాధ్యాయ్, బీజేపీ ఎంపీ దిలీప్ పాండ్యల పదవీకాలం ముగియనుంది. ఈ కార్యక్రమంలో సీతారాం ఏచూరి మాట్లాడుతూ దేశంలో బహుళత్వాన్ని పరిరక్షించాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. ఏకత్వంలోని భిన్నత్వ భావనలను బలపరిచినప్పుడే దేశం బలపడుతుందని ఆయన అన్నారు. ఏచూరి మాట్లాడుతూ 'మన భిన్నత్వంపై మీరు మత, భాషా, సాంస్కృతిక తదితర ఏ ఏకత్వాన్నైనా బలవంతంగా రుద్దాలని చూస్తే దేశం ఒకటిగా ముందుకు సాగలేదు. బహుళత్వమే భారత బలం. అది లేనినాడు దేశం కుప్పకూలుతుంది' అని హెచ్చరించారు. 'నేను మద్రాసులో ఓ తెలుగు బ్రాహ్మణ కుటుంబంలో పుట్టాను. నా పాఠశాల విద్యాభ్యాసమంతా ఇస్లాం సంస్కృతి ఎక్కువగా ఉండే హైదరాబాద్‌లో సాగింది. ఓ సూఫీ ముస్లిం కూతురిని నేను పెళ్లి చేసుకున్నాను. మా మామయ్య తల్లి రాజ్‌పుత్ వంశానికి చెందిన వారు. అయితే నా కుమారుడు ఏమవుతాడు? అతడు బ్రాహ్మణుడా, హిందూనా, ముస్లిమా?.. అవేమీ కాదు, నా కుమారుడు భారతీయుడు' అని ఏచూరి అన్నారు.

## షా వస్తున్నారు జాగ్రత్త!

### 2019లో సీట్లు నేనే నిర్ణయిస్తా: ప్రధాని మోదీ

**సాక్షి ప్రత్యేక ప్రతినిధి, న్యూఢిల్లీ:** గురువారం జరిగిన బీజేపీ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో ప్రధాని నరేంద్ర మోదీ చేసిన వ్యాఖ్యలు పార్టీ వర్గాల్లో చర్చనీయాంశమయ్యాయి. చాలా మంది బీజేపీ ఎంపీలు పార్లమెంటుకు గైర్హాజరవటం, ఇటీవల ఓబీసీ సవరణ బిల్లు సందర్భంగా సరైన కోరం లేక ప్రభుత్వం ఇరకాటంలో పడటాన్ని ఉటంకిస్తూ.. 'అమిత్ షా పార్లమెంటుకు వస్తున్నారు. ఇకమీరు తప్పించుకోలేరు. పార్లమెంటుకు అందరూ హాజరవ్వాల్సిందే. మీలో చాలా మంది పార్లమెంటు సమావేశాలను సీరియస్‌గా తీసుకోవటం లేదని, సరిగా పనిచేయటం లేదని నాకు తెలీదనుకుంటున్నారా?' అని మోదీ హెచ్చరించారు. ఎంపీల గైర్హాజరీతో రాజ్యసభలో ఎదురవుతున్న పరిస్థితుల నేపథ్యంలోనే మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు. '2019లో ఎవరెవరికి సీట్లివ్వాలో, ఎవరికి ఇవ్వకూడదో నేనే నిర్ణయిస్తా. మీరు బయటకెళ్లి మీడియాకు ఈ విషయం చెప్పినా నేనేమీ పట్టించుకోను' అని ప్రధాని పేర్కొన్నారు. కాగా, గుజరాత్ రాజ్యసభ ఎన్నికల్లో విజయం అనంతరం తొలిసారి రాజ్యసభకు వచ్చిన అహ్మద్‌పటేల్‌కు ఘనస్వాగతం లభించింది. విపక్ష సభ్యులు బల్లలు చరుస్తూ ఆయనను స్వాగతించారు. ఆయన చుట్టూ చేరి అభినందనలు తెలిపారు.

## 11 కోట్ల బిహారీలకు నమ్మకద్రోహం: శరద్

**పట్నా:** బిహార్‌లో మహాకూటమి విచ్ఛిన్నమవడం 11 కోట్ల మంది రాష్ట్ర ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీసిందని జేడీ(యూ) సీనియర్ నాయకుడు శరద్ యాదవ్ అన్నారు. ఆర్జేడీ, కాంగ్రెస్‌లతో జేడీయూ తెగతెంపులు చేసుకుని బీజేపీతో కలసి ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసిన తరువాత ఆయన గురువారం తొలిసారి బిహార్ పర్యటనకు వచ్చారు. పట్నా విమానాశ్రయంలో విలేకర్లతో మాట్లాడుతూ...'బిహార్‌లో మహాకూటమికి అధికారం అప్పగించిన 11 కోట్ల మంది ప్రజల విశ్వాసం దెబ్బతింది. ఐదేళ్లు కొనసాగాల్సిన మహాకూటమి ఒప్పందం అర్ధంతరంగా ముగియడం నన్నెంతో బాధించింది' అని శరద్ అన్నారు. ఆ తరువాత సోనేపూర్‌లో జరిగిన కార్యక్రమంలో ప్రసంగిస్తూ... సర్కారీ జేడీ(యూ) నితీశ్ వద్ద ఉన్నా అసలు జేడీ(యూ) తన వద్దే ఉందన్నారు. తదుపరి సాధారణ ఎన్నికల తరువాత లౌకికవాద పార్టీలతో కలసి అసలు జేడీ(యూ) ప్రభుత్వాన్ని ఏర్పాటుచేస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

## సైగలతో జాతీయ గీతాలాపన

**న్యూఢిల్లీ:** సైగలతో జాతీయ గీతం ఆలాపిస్తున్న వీడియోను కేంద్ర మానవ వనరుల శాఖ సహాయ మంత్రి మహేంద్ర నాథ్ పాండే గురువారం విడుదల చేశారు. దివ్యాంగులు, ఇతరుల మధ్య తేడా చూపకూడదనే లక్ష్యంతోనే ఈ ప్రయత్నం చేశామని ఆయన తెలిపారు. 'జాతీయ గీతాన్ని సైగల భాషలో రూపొందించినందుకు మనమంతా గర్వించాలి. మన దేశంలో సైగలను చాలా పురాతన కాలం నుంచే వాడుతున్నాం' అని మంత్రి అన్నారు. గోవింద్ నిహలానీ దర్శకత్వం వహించిన 3.35 నిమిషాల నిడివి ఉన్న ఈ వీడియోలో ఎర్రకోట ముందు బాలీవుడ్ నటుడు అమితాబ్ బచ్చన్ కొందరు దివ్యాంగులతో కలసి జాతీయగీతాన్ని సైగలతో ఆలపిస్తున్నట్లు కనిపిస్తోంది.

## '180 మందిని సముద్రంలోకి తోసేశారు'



యెమెన్ బీచ్‌లో శరణార్థి మృతదేహం

**దుబాయ్:** యెమెన్ సమీపంలో గురువారం దారుణం చోటుచేసుకుంది. స్థానిక అధికారులు అరెస్టు చేస్తారన్న భయంతో స్మగ్లర్లు అక్రమంగా యెమెన్‌కు తరలిస్తున్న 180 మంది ఆఫ్రికన్లను సముద్రంలోకి తోసేయడంతో ఆరుగురు మృతి చెందగా..దాదాపు 50 మంది గల్లంతయ్యారు. ప్రస్తుతం గాయాలతో యెమెన్ దక్షిణ తీరానికి చేరుకున్న 25 మంది శరణార్థులకు చికిత్స అందిస్తున్నట్లు ఐరాస అంతర్జాతీయ వలస వ్యవహారాల సంస్థ(ఐఓఎం) తెలిపింది. శరణార్థుల్లో ఇథియోపియాకు చెందిన యువతీయువకులే ఎక్కువగా ఉన్నట్లు వెల్లడించింది. బుధవారం కూడా మనుషులను అక్రమరవాణా చేస్తున్న స్మగ్లర్లు యెమెన్ తీరం సమీపంలో సోమాలియా, ఇథియోపియాకు చెందిన 120 మంది శరణార్థులను సముద్రంలోకి తోసేయడంతో 50 మంది మృతి చెందగా, 22 మంది గల్లంతయ్యారని ఐఓఎం పేర్కొంది. తీరానికి కొట్టుకువచ్చిన 29 మృతదేహాలను మిగిలిన శరణార్థులు పూడ్చిపెట్టారని వెల్లడించింది.

# అది రాజకీయ ప్రచారమే!

- మైనారిటీల అభద్రతపై వెంకయ్య నాయుడు
- భారతీయుల రక్తంలోనే లౌకికవాదముంది
- పరోక్షంగా అన్సారీకి చురకలు
- నేడు ఉపరాష్ట్రపతిగా ప్రమాణస్వీకారం



**న్యూఢిల్లీ:** దేశంలో మైనారిటీలు అభద్రతా భావంలో ఉన్నారన్న వ్యాఖ్యలను కాబోయే ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ఖండించారు. మైనారిటీల్లో ఇలాంటి భావమే లేదని.. రాజకీయ ప్రచారం కోసమే కొందరు ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని ఉపరాష్ట్రపతి హమీద్ అన్సారీ వ్యాఖ్యలను పరోక్షంగా తోసిపుచ్చారు. 'భారత్‌లో మైనారిటీలు అభద్రతతో ఉన్నారని కొందరంటున్నారు. ఇది రాజకీయ ప్రచారమే. ప్రపంచంలోని ఇతర దేశాలతో పోలిస్తే.. భారత్‌లోనే మైనారిటీలు భద్రంగా ఉన్నారు. వారి హక్కులను పొందుతున్నారు. దేశంలో అసహనం పెరుగుతోందన్నది అవాస్తవం. ఇక్కడి నాగరికత ప్రభావం కారణంగా భారత సమాజం చాలా సహనశీలమైనది' అని వెంకయ్య గురువారం ఢిల్లీలో పేర్కొన్నారు. దేశంలో సహనం ఉన్నందునే ప్రజాస్వామ్యం విజయవంతంగా నడుస్తోందన్నారు. అయితే మతం పేరుతో ఎవరిపైన దాడి జరిగినా దాన్ని సహించే ప్రసక్తే లేదన్నారు. అన్సారీ వ్యాఖ్యలపై వీహెచ్‌పీ మండిపడింది. ముస్లింల అభద్రతపై మాట్లాడి మహ్మద్ అలీజిన్నా మార్గంలో అన్సారీ నడుస్తున్నారని వీహెచ్‌పీ జాతీయ సహకార్యదర్శి సురేంద్ర జైన్ విమర్శించారు. అన్సారీ ఉప రాష్ట్రపతి పదవికి అవమానం చేశారన్నారు.

**నేడు వెంకయ్య ప్రమాణ స్వీకారం**

ఉపరాష్ట్రపతిగా విజయం సాధించిన వెంకయ్యనాయుడు శుక్రవారం ప్రమాణస్వీకారం చేయనున్నారు. అనంతరం రాజ్యసభ చైర్మన్‌గా కూడా ఆయన బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈ సందర్భంగా గురువారం పీటీఐ వార్తాసంస్థతో వెంకయ్య మాట్లాడుతూ.. చట్టాలను సమర్థవంతంగా అమలుచేయటం, రాజ్యసభను సజావుగా నడిపించటంలో ఎంపీల సహకారం తీసుకుంటానని ఆయన తెలిపారు. 'పార్లమెంటు సజావుగా, అర్థవంతంగా నడవడంలో మనం మరింత పరిణతితో వ్యవహరించాలి. చైర్మన్ సభను నడిపే వ్యక్తి మాత్రమే కాదు.. సభ్యుల హక్కులకు సంరక్షకుడు కూడా' అని వెంకయ్య పేర్కొన్నారు.

# జడ్జీల నియామకానికి ఉమ్మడి పరీక్ష!

- దిగువ స్థాయి కోర్టుల్లో ఖాళీల భర్తీకి కేంద్రీకృత వ్యవస్థ
- సంబంధిత 'కాన్సెప్ట్ నోట్' విడుదల



**న్యూఢిల్లీ:** దిగువ స్థాయి కోర్టుల్లో జడ్జీల ఎంపికకు ఏకైక ఉమ్మడి పరీక్ష నిర్వహించాలన్న ప్రతిపాదనను సుప్రీంకోర్టు త్వరలో పరిశీలించనుంది. ఈ వ్యవహారంలో కోర్టుకు సహాయకారిగా వ్యవహరిస్తున్న సీనియర్ న్యాయవాది అరవింద్ దాతర్ రూపొందించిన 'కాన్సెప్ట్ నోట్'ను గురువారం సుప్రీంకోర్టు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. దేశంలో జిల్లా, ఇతర దిగువ స్థాయి కోర్టుల్లో మొత్తం జడ్జీలు సుమారు 21వేలు ఉండాల్సి ఉండగా, అందులో 4,800 ఖాళీగా ఉన్నట్లు నోట్ పేర్కొంది. జడ్జీల నియామక ప్రక్రియ సజావుగా సాగేలా కేంద్రీకృత నియామక విధానం(సీఎస్ఎం) కింద డిస్ట్రిక్ట్ జడ్జెస్ రిక్రూట్‌మెంట్ ఎగ్జామినేషన్(డీజ్యూర్) నిర్వహించాలని అందులో ప్రతిపాదించారు. డీజ్యూర్ ద్వారా ఏటా 300 ఖాళీలను భర్తీ చేయాలని సూచించింది. ఈ విధానం కేవలం 'అభ్యర్థుల పూల్'ను మాత్రమే ఇస్తుందని, అందులో నుంచి ఇంటర్వ్యూల ద్వారా అర్హులను ఎంపిక చేయాలని స్పష్టత ఇచ్చింది. 'అర్హులైన న్యాయవాదులు లేకపోవడంతో జిల్లా జడ్జీల పదవులు ఖాళీగా ఉంటున్నాయి. క్రమబద్ధమైన పరీక్ష విధానం లోపించడం వల్లే ఈ పరిస్థితి తలెత్తింది. అభ్యర్థులు ముందస్తుగా సన్నద్ధమయ్యేందుకు ప్రత్యేక సిలబస్ అంటూ లేదు. ఇలాంటి లోటుపాట్లను డీజ్యూర్‌తో అధిగమించొచ్చు' అని నోట్ పేర్కొంది. 'ఎంపిక ప్రక్రియకు సంబంధించి రాష్ట్రాల స్వయంప్రతిపత్తికి డీజ్యూర్ ఆటంకం కలిగించదు. రిజర్వేషన్లు, అర్హత నియమాలు ఎప్పటిలాగే కొనసాగుతాయి' అని నోట్ పునరుద్ఘాటించింది.

# ఆహార కొరత ముప్పు

- 'ఇండియన్ టెక్నాలజీ కాంగ్రెస్–17'లో మేధావుల ఆందోళన
- 2050కి 70 శాతం జనాభా పట్టణ ప్రాంతాల్లోనే.. వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు అవసరం

**బెంగళూరు నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి:** పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఆహార ఉత్పత్తి పెరగడం లేదని, దీనిపై శాస్త్రవేత్తలు, విద్యావేత్తలు దృష్టి సారించకపోతే ఆహార కొరత తప్పదని ప్రముఖ శాస్త్రవేత్తలు, విద్యావేత్తలు ఆందోళన వ్యక్తం చేశారు. బెంగళూరులోని నిమ్‌హాన్స్ కన్వెన్షన్ సెంటర్‌లో ఇండియన్ టెక్నాలజీ కాంగ్రెస్–2017(ఐటీసీ) సదస్సు గురువారం ప్రారంభమైంది. రెండురోజుల పాటు జరిగే ఈ సదస్సు తొలిరోజు ఐటీసీ చైర్మన్ డాక్టర్ ఎల్వీ మురళీకృష్ణారెడ్డి అధ్యక్షత వహించగా పలు రంగాలకు చెందిన ప్రముఖులు హాజరయ్యారు.

అగ్రిటెక్ ఇన్‌క్లూషన్ చైర్మన్, నాబార్డ్ చైర్ ప్రొఫెసర్ అయ్యప్పన్ మాట్లాడుతూ... ప్రస్తుతం దేశజనాభాకు సరిపడా ఆహారం ఉత్పత్తి జరగడం లేదని, దేశంలో సన్నకారు రైతులకు ప్రోత్సాహకాలు అందక నష్టాల్లో కూరుకుపోయారని చెప్పారు. 2050కి దేశ జనాభాలో 70శాతం పట్టణ ప్రాంతంలో ఉంటారని, వ్యవసాయం తగ్గడం వల్ల ఆహార కొరత ముప్పు ఉండవచ్చని తెలిపారు. 'అమెరికా, చైనా, బ్రెజిల్ వంటి దేశాల్లో వలె ఇక్కడ కూడా వ్యవసాయంలో కొత్త ఆవిష్కరణలు రావాలి. సన్నకారు రైతులకు ప్రభుత్వాలు అండగా ఉండి వ్యవసాయ ఉత్పత్తులను పెంచాలి. అందుకు విప్లవాత్మక మార్పులు అవసరం' అని అన్నారు.

**పారిశ్రామిక విప్లవంపై మేధోమథనం జరగాలి**

ఐటీసీ చైర్మన్ డాక్టర్ ఎల్వీ మురళీకృష్ణారెడ్డి మాట్లాడుతూ.. 'పారిశ్రామిక విప్లవం 4.0తో కొత్త టెక్నాలజీ అభివృద్ధి చెందుతోంది. నైపుణ్యం పెంచడం, సమాచారాన్ని అందించడమే దీని ప్రధాన లక్ష్యం. భవిష్యత్తులో వినియోగదారుడు ఏ ఫీచర్స్‌తో వస్తువు కోరుకుంటాడో అలా తయారు చేసేలా పరిశ్రమలు రానున్నాయి. ఒకే పరిశ్రమలో అన్ని రకాల వస్తువులు తయారు చేసే 'ఫ్యూచర్ ఫ్యాక్టరీస్'పై అగ్రదేశాలు దృష్టి సారించాయి. ఇది త్వరలో మన దేశంలో కూడా రానుంది' అని పేర్కొన్నారు. వ్యవసాయాభివృద్ధికి ఇస్రో ప్రాధాన్యత ఇస్తుందని ఇస్రో బెంగళూరు సెంటర్ డైరెక్టర్ అన్నాదొరై చెప్పారు. 'రిమోట్ సెన్సింగ్ అప్లికేషన్స్ ద్వారా వ్యవసాయభూములు, పంటల చిత్రాల్ని విశ్లేషించి పరిశోధనలకు సహకరిస్తున్నాం. అగ్రి అప్లికేషన్స్‌కు ఓ శాటిలైట్ ఏర్పాటు చేస్తాం. ఎడారి ప్రాంతాల్లో వ్యవసాయాభివృద్ధికి మరింత ప్రాధాన్యత ఇస్తాం' అన్నారు.



ఇండియన్ టెక్నాలజీ కాంగ్రెస్–2017 పుస్తకావిష్కరణ దృశ్యం

సీఎస్ఐఆర్ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ వీఎస్ ప్రకాశ్ మాట్లాడుతూ 2025కు ఆహారకొరత దేశానికి ప్రధాన సమస్య కానుందని, ఏడేళ్లలో వ్యవసాయరంగంలో వంద శాతం అభివృద్ధి సాధించడమే లక్ష్యంగా శాస్త్రవేత్తలు శ్రమించాలని సూచించారు. పారిశ్రామికంగా భారత్ అభివృద్ధి దిశగా దూసుకెళ్తోందని, కార్పొరేట్ యాజమాన్యాలు, శాస్త్రవేత్తలు, విద్యావేత్తలు మరింత చొరవ చూపి దేశాభివృద్ధికి సహకరించాలని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్రొడక్షన్ ఇంజనీర్స్ జాతీయ అధ్యక్షుడు పి.కృష్ణన్ పేర్కొన్నారు. సమావేశం అనంతరం పారిశ్రామిక, వ్యవసాయ, టెక్నాలజీ రంగాలపై వేర్వేరుగా సదస్సులు నిర్వహించారు. పలు రంగాల్లో సేవలందించిన 11మంది ప్రముఖులకు అవార్డులు ప్రదానం చేశారు. డాక్టర్ డీవీ నాగభూషణ్, బీఎస్ త్యాగరాజులకు 2017 సంవత్సరానికి జీవిత సాఫల్య పురస్కారాల్ని అందించారు.

స్పర్ధయా వర్ధతే విద్య

విద్య నేటి విద్యలో..
- జనరల్ స్టడీస్: వరల్డ్ జాగ్రఫీ
- బ్యాంక్ పీవోస్, క్లర్క్స్: క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్

మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన ఈ-మెయిల్
sakshieducation@gmail.com

## దరఖాస్తు చేశారా?

- ఐఐటీ-రూర్కీలో రీసెర్చ్ అసోసియేట్ తదితర 26 పోస్టులకు చివరి తేదీ: ఆగస్టు 12
- డీఆర్‌డీవో-సీవీఆర్‌డీఈలో 17 జూనియర్ రీసెర్చ్ ఫెలో పోస్టులకు చివరి తేదీ: ఆగస్టు 12
- ఆయిల్ ఇండియా లిమిటెడ్‌లో 47 సీనియర్ ఇంజనీర్, ఆఫీసర్ పోస్టులకు చివరి తేదీ: ఆగస్టు 12



యూపీఎస్సీ సివిల్స్..

# 'ఎస్సే'కు ధీమాగా..

ఎగ్జామ్ టిప్స్



**యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ (మెయిన్) ఎగ్జామినేషన్‌లో అధిక స్కోర్ సాధించేందుకు ఎస్సే పేపర్ కీలకమైంది. ప్రశ్నపత్రంలో సెక్షన్-ఎలో నాలుగు, సెక్షన్-బిలో నాలుగు ఎస్సే ప్రశ్నలు ఉంటాయి. అభ్యర్థులు ప్రతి సెక్షన్ నుంచి ఒకదాన్ని ఎంపిక చేసుకొని, రెండు ఎస్సేలు రాయాల్సి ఉంటుంది. ఈ పేపర్‌కు 250 మార్కులు కేటాయించారు. అందుబాటులో ఉన్న సమయం 3 గంటలు.**

ఇటీవల కాలంలో ఎస్సే పేపర్‌లో వస్తున్న ప్రశ్నల సరళిని పరిశీలిస్తే సమకాలీన **(contemporary)** వార్తల్లోని అంశాలకు ప్రాధాన్యమిస్తున్నట్లు కనిపిస్తోంది. అయితే అంశం సమకాలీనమైనదే అయినా, దాన్నుంచి నేరుగా కాకుండా సంబంధిత సబ్జెక్టులోని అంశంపై ప్రశ్నలు వచ్చేందుకు అవకాశముంది. ఉదాహరణకు జీఎస్‌టీ అమలు నేపథ్యంలో 'సహకార సమాఖ్య' భావనపై ప్రశ్న అడగొచ్చు. అదే విధంగా విశాల దృక్పథమున్న అంశం నుంచి స్పష్టమైన, సూక్ష్మ కోణంలో ప్రశ్నలు ఎదురవుతున్నాయని చెప్పొచ్చు. ఒక సమస్యకు అభ్యర్థి ఎలాంటి నిర్వచనం ఇస్తున్నాడు? ఆ సమస్య పరిష్కారానికి ఎలాంటి మార్గాలను ఎంచుకుంటున్నాడు? వంటి అంశాలను పరీక్షించేలా ఎస్సే ప్రశ్నలుంటున్నాయి. అభ్యర్థులు ఈ అంశాలను పరిగణనలోకి తీసుకొని, ప్రిపరేషన్ కొనసాగించాలి.

### అంశాల గుర్తింపు

సివిల్స్ మెయిన్స్ ఔత్సాహికులు తొలుత ప్రస్తుతం వార్తల్లో ఉన్న ఏ సమకాలీన అంశాల నుంచి ప్రశ్నలు వచ్చేందుకు అవకాశముందో గుర్తించాలి. తర్వాత ఆయా అంశాల నుంచి ఏ కోణంలో ప్రశ్నలు అడిగేందుకు అవకాశముందో చూడాలి.

**ఉదా 1:** ప్రస్తుతం వివిధ రూపాల్లో సైబర్‌దాడుల బారినపడుతున్న మనదేశం తగిన జాగ్రత్తలు తీసుకోకుంటే 2020 నాటికి వినాశకర దాడులకు గురయ్యే ప్రమాదమున్నట్లు నిపుణులు హెచ్చరిస్తున్నారు. కేంద్ర ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ పరిధిలోని ఇండియన్ కంప్యూటర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్ నిపుణులు కూడా ఇదే రకమైన అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కాలంలో చోటుచేసుకున్న వాన్నక్రై, మిరై, పెట్యా దాడుల నేపథ్యంలో సైబర్ భద్రతపై ఇప్పుడు పెద్ద ఎత్తున చర్చజరుగుతోంది. అందువల్ల దీనికి సంబంధించి ప్రశ్న వచ్చేందుకు అవకాశముంది. ఈ నేపథ్యంలో అభ్యర్థులు సైబర్ ముప్పు పొంచి ఉన్న రంగాలు (బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, బీమా తదితర); ఐవోటీ విస్తరణ, డిజిటల్ లావాదేవీలు పెరిగిన నేపథ్యంలో తీసుకోవాల్సిన రక్షణ చర్యలు; అమెరికా, ఇజ్రాయెల్ తదితర దేశాల్లోని భద్రతా ప్రమాణాలు తదితర అంశాలపై అవగాహన పెంపొందించుకోవాలి.

**ఉదా2:** భారత్, చైనా మధ్య చాలా ఏళ్ల పాటు సాంస్కృతిక సంబంధాలు కొనసాగినా.. ఆధునిక కాలంలో వీటి మధ్య సంబంధాలు స్నేహపూరితంగా లేవు. ప్రస్తుతం రెండు దేశాల మధ్య డోక్‌లామ్ వివాదం కొనసాగుతోంది. ఈ ప్రాంతంలో రహదారి నిర్మాణానికి చైనా సైన్యం ప్రయత్నించడం, దాన్ని భారత్ అడ్డుకోవడంతో ఘర్షణ పూర్వక వాతావరణం నెలకొంది. ఈ నేపథ్యంలో దీనికి సంబంధించి ఎయే కోణాల్లో ప్రశ్నలు వచ్చేందుకు అవకాశముందో గుర్తించి, ప్రిపరేషన్ కొనసాగించాలి. బ్రహ్మపుత్ర నదీజలాలు, న్యూక్లియర్ సప్లయర్స్ గ్రూప్ (ఎన్ఎస్‌జీ) సభ్యత్వం తదితర అంశాల్లో భారత్‌కు వ్యతిరేకంగా చైనా మొండిగా వాదిస్తోంది. నేపాల్, భూటాన్‌లకు మన దేశం సహకారం అందించడాన్ని చైనా జీర్ణించుకోలేకపోతోంది. అదే విధంగా భారత్, చైనా మధ్య వాణిజ్యలోటు ప్రమాదకర స్థాయికి చేరింది. ఇలాంటి పరిస్థితుల్లో ఆర్థిక సంబంధాలు దెబ్బతినకుండా, సరిహద్దు సమస్యలను ఎలా ఎదుర్కోవచ్చనే దానిపై అభ్యర్థులు అవగాహన పెంపొందించుకోవాలి.

### దృష్టిసారించాల్సిన కొన్ని అంశాలు

- ☆ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధానాలు-భారత్‌పై వాటి ప్రభావం.
- ☆ డీమానిటైజేషన్, జీఎస్‌టీ
- ☆ సైబర్ దాడులు, సైబర్ భద్రత
- ☆ పొరుగుదేశాలతో సరిహద్దు సమస్యలు (ముఖ్యంగా చైనాతో..)
- ☆ భావ ప్రకటనా స్వేచ్ఛ; ఆధార్ సమాచారం- గోప్యత అంశాలు
- ☆ పర్యావరణ అంశాలు
- ☆ ఇంధన భద్రత
- ☆ సహకార సమాఖ్య, క్యాష్‌లెస్ ఎకానమీ సానుకూల ప్రతికూలతలు
- ☆ ఉగ్రవాదంపై భారత్ పోరాటం
- ☆ భారత విదేశాంగ విధానం- ప్రధాని పర్యటనలు.

### రైటింగ్ ప్రాక్టీస్

ఎస్సేగా రావడానికి అవకాశమున్న అంశాలను గుర్తించి, ఆపై సరైన ఎస్సే రాయడానికి అవసరమైన సమాచారాన్ని సేకరించాలి. ఎస్సే రైటింగ్‌ను ప్రాక్టీస్ చేయాలి. ఇలా రాసిన ఎస్సేలను సబ్జెక్టు నిపుణులతో మూల్యాంకనం చేయించుకోవాలి. ఇలా చేస్తే తప్పులను సరిదిద్దుకొని, పూర్తిస్థాయి సంసిద్ధతతో పరీక్షకు హాజరయ్యేందుకు అవకాశముంటుంది.

### ప్రారంభం ఇలా..

ఒక అంశంపై ఎస్సే రాసేటప్పుడు.. మొదటి పేరాను ఆ అంశానికి సంబంధించిన సమకాలీన నేపథ్యంలో ప్రారంభిస్తే మంచి ఫలితం ఉంటుంది. అసలు ఈ అంశాన్ని ఎస్సేగా ఇవ్వడానికి కారణం ఏమిటి? అనేదానికి అభ్యర్థి కచ్చితమైన సమాధానం ఇచ్చుకోగలిగి, ఆ మేరకు ఎస్సేను ప్రారంభించడం ద్వారా ఎగ్జామినర్‌ను ఆకట్టుకోవచ్చు. ఇలా చేయడం వల్ల **"starting trouble"** నుంచి కూడా బయటపడొచ్చు.

### విశ్లేషణ

ప్రశ్నను క్షుణ్నంగా పరిశీలించి, కచ్చితంగా ఏమి అడిగారో దానికి సంబంధించి మాత్రమే ఎస్సే **BODY**లో విశ్లేషణ చేయాలి. కొందరు ఎస్సేను బాగా ప్రారంభించినప్పటికీ ఆ తర్వాత అడిగిన అంశానికి సంబంధం లేకుండా రకరకాల విశ్లేషణలు చేస్తూ పక్కదోవ పడతారు. ఇలాంటి పరిస్థితి ఎదురుకాకుండా ఉండాలంటే ఎప్పటికప్పుడు ఏమి రాస్తున్నామనే దాన్ని విశ్లేషించుకుంటూ, ముందుకెళ్లాలి. ఏదైనా సమస్యకు సంబంధించి ఎస్సే రాయాలంటే.. తొలుత ఆ సమస్యను సరిగా అర్థం చేసుకోవాలి. ఆపై సమస్యకు మూల **(genesis)** కారణాలను గుర్తించడం - ప్రస్తుత చర్యలు- వాటిలో లోపాలను ఉదాహరణ సహితంగా చూపడం - సమస్యకు తనదైన శైలిలో పరిష్కారాలు చూపడం- సరైన ముగింపు ఇవ్వడంపై అభ్యర్థి దృష్టిసారించాలి. ఈ ముగింపు ఆశావహ దృక్పథంతో ఉండేలా చూసుకోవాలి. నిరాశ, నిస్పృహలను ప్రతిబింబించకూడదు. ఇచ్చే పరిష్కారాలు ఆచరణ సాధ్యంగా ఉండాలి. ప్రారంభ ఎత్తుగడకు, ముగింపునకు సంబంధం ఉండేలా చూసుకోవాలి. ఒక్కోసారి ఎస్సేలో రెండు అంశాలను స్పృశిస్తూ విశ్లేషణ చేయాల్సి ఉంటుంది. అలాంటప్పుడు జోడెద్దుల తరహాలో **balanced approach**తో విశ్లేషణను ఉరకలెత్తించాలి. ఏదో ఒక కోణాన్ని మాత్రమే ప్రస్తావించి వదిలేయకూడదు.

### ముఖ్యాంశాలు

సరైన సమాచారాన్ని పొందుపరిచేందుకు, సమకాలీన ఉదాహరణలతో విశ్లేషణాత్మకంగా రాసేందుకు అవకాశమున్న ప్రశ్నలను ఎంపిక చేసుకోవాలి. అప్పుడే మంచి మార్కులు సాధించేందుకు అవకాశముంటుంది.

- ☆ చాలా ముఖ్య అంశమైతే తప్ప అండర్‌లైన్ చేయొద్దు. అవసరమైతే పేజీకి ఒక అండర్‌లైన్ ఉండేలా చూసుకోవాలి.
- ☆ సందర్భానుసారం అవసరమైనంతలో కొటేషన్స్ ఉపయోగించొచ్చు. అంతేగానీ పొంతన లేని కొటేషన్స్ వల్ల లాభం మాట అటుంచి నష్టం ఎక్కువ జరుగుతుంది.
- ☆ ఎస్సేను పేరాగ్రాఫ్‌లుగా విభజించుకొని రాయాలి. ఒక పేరాగ్రాఫ్ ఒకే అంశానికి సంబంధించినదై ఉండాలి. ఒక పేరాకు, తర్వాతి పేరాకు సంబంధం ఉండేలా చూసుకోవాలి.
- ☆ ఎస్సేలో పాయింట్లు ఉండకూడదు.. టేబుల్ వేయకూడదు.. అనేవి అపోహలు మాత్రమే. సందర్భాన్నిబట్టి అవసరమైన చోట సమాచారాన్ని పాయింట్ల రూపంలో రాయొచ్చు. ఫ్లోచార్ట్స్, టేబుల్స్ వంటివీ వేయొచ్చు.
- ☆ పత్రికల ఎడిటోరియల్స్, కురుక్షేత్ర, యోజన, టీవీ చానెళ్లలో చర్చలు తదితరాలను ఎస్సేతో పాటు జనరల్ స్టడీస్ ప్రిపరేషన్‌కు ఉపయోగించుకోవాలి.
- ☆ లౌకిక వాదానికి, దేశ సమగ్రతకు వ్యతిరేకంగా అభిప్రాయాలు ఉండకూడదు. మతం, కుల దూషణలకు పాల్పడకూడదు. వ్యక్తిగత విమర్శలకు తావివ్వకూడదు.

### సరళమైన పదాలతో..

ఎంతబాగా ప్రిపర్ అయినా, ఎంత విషయ పరిజ్ఞానం సంపాదించినా రైటింగ్ ప్రాక్టీస్ చేయకపోతే ప్రతికూల ఫలితమే ఎదురవుతుంది. ఓ సంక్లిష్ట సమస్యకు సరళమైన పరిష్కారాలను ఎగ్జామినర్ అభ్యర్థి నుంచి ఆశిస్తాడు. ఇలాంటి పరిస్థితిలో సంక్లిష్టమైన సమస్యను, దాని మూలాలను, పరిష్కార మార్గాలను సరళ పదజాలంతో వివరించగలిగితే మంచి స్కోర్ సాధించడం ఖాయం. ఓ మేధావితో సంభాషిస్తున్నట్లు ఎస్సే ఉండాలి. అలాంటి ఎస్సే ఎగ్జామినర్‌ను కట్టిపడేస్తుంది.

ప్రారంభం (సమకాలీన నేపథ్యంతో..) → బాడీ (ఉదాహరణ సహిత విశ్లేషణ) → ముగింపు (సకారాత్మక ధోరణితో)





గురజాల శ్రీనివాసరావు
సబ్జెక్టు నిపుణులు
హైదరాబాద్

# ఇటీవల భారత్‌లో పర్యటించిన పాలస్తీనా అధ్యక్షుడు?



కాంపిటీటివ్ గైడెన్స్
కరెంట్ అఫైర్స్

1. 2017, ఆగస్టు 5న నీతి ఆయోగ్ సభ్యునిగా ఎవరిని నియమించారు?
- ■ డాక్టర్ వినోద్ పాల్

2. 2017, ఆగస్టు 1న పాకిస్తాన్ నూతన ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టినవారు?
- ■ షాహిద్ కఖాన్ అబ్బాసీ (నవాజ్ షరీఫ్ స్థానంలో..).

3. ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన ఎవరెస్ట్ శిఖరాన్ని ఐదు సార్లు అధిరోహించిన ఏకైక భారతీయ మహిళ?
- ■ అన్షు జంసెన్పా (అరుణాచల్‌ప్రదేశ్)

4. 2017, మే లో అమెరికాలో నిర్వహించిన 'నేషనల్ జియోగ్రాఫిక్ బి' పోటీల్లో విజేతగా నిలిచిన భారత సంతతి విద్యార్థి?
- ■ ప్రణయ్ వరదా

5. 2017, మే 18న మరణించిన కేంద్ర పర్యావరణ, అటవీ శాఖ మంత్రి?
- ■ అనిల్ దవే

6. ఎం-777 అనే తేలికపాటి హోవిట్జర్ శతఘ్నులను భారత్ ఏ దేశం నుంచి కొనుగోలు చేసింది?
- ■ అమెరికా

7. 2017, మే లో బార్సిలోనాలో జరిగిన స్పానిష్ గ్రాండ్ ప్రి రేసులో విజేతగా నిలిచిన ఫార్ములా వన్ డ్రైవర్?
- ■ లూయిస్ హామిల్టన్ (మెర్సిడెస్ జట్టు)

8. 2017, మే 15న ఫ్రాన్స్ ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టినవారు?
- ■ ఎడ్వర్డ్ ఫిలిప్

9. మహిళల వన్డే క్రికెట్లో ఏ వికెట్‌కైనా అత్యుత్తమ భాగస్వామ్యం (320 పరుగులు) నమోదు చేసిన భారత క్రికెటర్లు?
- ■ దీప్తిశర్మ, పూనమ్ రౌత్

10. 2016, డిసెంబర్ 11న ప్రారంభమైన నర్మదా సేవా యాత్ర 2017, మే 15న ఆ నది జన్మస్థానం వద్ద ముగిసింది. అయితే ఆ పట్టణం పేరు?
- ■ అమర్ కంఠక్

11. ధరిత్రీ దినోత్సవాన్ని ఏటా ఏ రోజు నిర్వహిస్తారు?
- ■ ఏప్రిల్ 22

12. మన దేశ జనాభాలో ఎంత శాతం మంది ప్రజలు ప్రకృతి వైపరీత్యాల తాకిడి ఉన్న ప్రాంతాల్లో నివసిస్తున్నట్లు కేంద్ర హోంశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ వెల్లడించారు?
- ■ 50 శాతానికి పైగా ప్రజలు

13. స్వచ్ఛ సర్వేక్షణ్-2017 జాబితాలో మూడో స్థానంలో నిలిచిన నగరం?
- ■ విశాఖపట్నం

14. నిర్భయ కేసులో హంతకులకు మరణ శిక్ష ఖరారు చేసిన సుప్రీంకోర్టు త్రిసభ్య ధర్మాసనంలోని న్యాయమూర్తులెవరు?
- ■ జస్టిస్ దీపక్ మిశ్రా, జస్టిస్ అశోక్ భూషణ్, జస్టిస్ ఆర్.బానుమతి

15. 2017 సుల్తాన్ అజ్లాన్ షా హాకీ టోర్నీలో భారత్ ఏ పతకం సాధించింది?
- ■ కాంస్యం

16. 2017, మే లో ఆసియా ఫెలోషిప్ అవార్డును అందుకున్న భారతీయుడు?
- ■ సచిన్ టెండూల్కర్

17. ఇటీవలే శత జయంత్యుత్సవాలను జరుపుకొన్న భారత్ సేవాశ్రమ్ సంఘం వ్యవస్థాపకుడు?
- ■ స్వామి ప్రణవానంద

18. ద సండే టైమ్స్ రిచ్‌లిస్ట్-2017 ప్రకారం బ్రిటన్‌లో అత్యంత సంపన్నులు?
- ■ హిందూజా బ్రదర్స్

19. ఫ్రాన్స్ చరిత్రలో అతి పిన్న వయస్కుడైన అధ్యక్షుడిగా చరిత్ర సృష్టించింది?
- ■ ఇమ్మాన్యుయేల్ మేక్రన్ (39)

20. భారత్‌లో ప్రస్తుత పాకిస్తాన్ హై కమిషనర్?
- ■ సొహైల్ మహమూద్

21. కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు (సీబీడీటీ) చైర్మన్‌గా ఎవరి పదవీ కాలాన్ని కేంద్రం ఇటీవల మరో ఏడాది పొడిగించింది?
- ■ సునీల్ చంద్ర

22. మహిళల వన్డే క్రికెట్లో అత్యధిక వికెట్ల ప్రపంచ రికార్డును సొంతం చేసుకున్న భారత బౌలర్?
- ■ జులన్ గోస్వామి

23. 2017, మే లో భారత్‌లో పర్యటించిన రష్యా ఉపప్రధాని?
- ■ డిమిట్రీ రొగొజిన్

24. 2017, మే లో మాడ్రిడ్ ఓపెన్ పురుషుల సింగిల్స్ టైటిల్ గెలుచుకున్న క్రీడాకారుడు?
- ■ రఫెల్ నాదల్ (స్పెయిన్)

25. కుల్‌భూషణ్ జాదవ్‌కు పాకిస్తాన్ సైనిక న్యాయస్థానం విధించిన మరణశిక్షను సవాల్ చేస్తూ అంతర్జాతీయ న్యాయస్థానం (ఐసీజే)లో మన దేశం తరపున వాదనలు వినిపించిన ప్రముఖ న్యాయవాది?
- ■ హరీష్ సాల్వే

26. ఇటీవల భారత్‌లో పర్యటించిన పాలస్తీనా అధ్యక్షుడు?
- ■ మహ్మద్ అబ్బాస్

27. 1968లో ఆంధ్రప్రదేశ్ నుంచి తొలి అర్జున అవార్డు అందుకున్న డెన్నిస్ స్వామి ఇటీవల మరణించారు. ఆయన ఏ క్రీడలో ప్రసిద్ధి చెందారు?
- ■ బాక్సింగ్

28. ఇటీవల ముంబైలో సంగీత విభావరి నిర్వహించిన జస్టిన్ బీబర్ ఏ దేశ ప్రముఖ గాయకుడు?
- ■ కెనడా

29. ప్రస్తుతం న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఎన్‌పీసీఐఎల్).. దేశంలో ఎన్ని రియాక్టర్లను నిర్వహిస్తోంది?
- ■ **22 (వీటి ద్వారా 6,780 మెగావాట్ల అణు విద్యుత్ ఉత్పత్తి అవుతోంది).**

30. 2017, మే 17న కేంద్ర కేబినెట్ ఎన్ని అణు రియాక్టర్ల నిర్మాణానికి ఆమోదం తెలిపింది?
- ■ 10

31. పాతిక మంది వ్యాపార దిగ్గజాలతో ఫోర్బ్స్ మేగజీన్ రూపొందించిన 'గ్లోబల్ గేమ్ ఛేంజర్స్' జాబితా-2017లో ఏకైక భారతీయుడు?
- ■ ముకేష్ అంబానీ

32. 2017, మే 23న కార్యకలాపాలు ప్రారంభించిన చెల్లింపుల బ్యాంక్?
- ■ పేటీఎం పేమెంట్స్ బ్యాంక్

33. రద్దీ ఎక్కువగా ఉండే రైల్వే స్టేషన్ల(ఏ1) విభాగంలో అత్యంత పరిశుభ్రంగా నిలిచిన రైల్వే స్టేషన్?
- ■ విశాఖపట్నం రైల్వే స్టేషన్

34. అణు విద్యుత్‌ను అధికంగా వినియోగించే దేశం?
- ■ ఫ్రాన్స్

35. చుట్కా అణు విద్యుత్ కేంద్రాన్ని ఏ రాష్ట్రంలో నిర్మించాలని కేంద్ర ప్రభుత్వం తలపెట్టింది?
- ■ మధ్యప్రదేశ్

36. ఇటీవల భారత్‌లో పర్యటించిన స్వీడన్ వాణిజ్య, యూరోపియన్ యూనియన్ వ్యవహారాల శాఖ మంత్రి?
- ■ ఆన్ లిండే




ఎన్.విజయేందర్‌రెడ్డి
జనరల్ అవేర్‌నెస్
సీనియర్ ఫ్యాకల్టీ

## కెరీర్ కౌన్సెలింగ్

**ఇంటర్‌లో సీఈసీ చదివాను. బీకాంలో చేరాలను కుంటున్నాను. మాది మధ్య తరగతి కుటుంబం. ప్రభుత్వ ఉద్యోగం సంపాదించి, జీవితంలో త్వరగా స్థిరపడాలంటే ఏం చేయాలి?**

**– మధు, కర్నూల్ జిల్లా**

ప్రస్తుతం ప్రభుత్వ కొలువులు భారీగా లభిస్తున్న రంగం బ్యాంకింగ్. బ్యాంకుల్లో ఖాళీ పోస్టుల భర్తీకి క్రమంతప్పకుండా ప్రకట నలు వెలువడుతున్నాయి. ఆఫీస్ అసిస్టెంట్, క్లర్క్ స్థాయి మొదలుకొని ప్రొబేషనరీ ఆఫీసర్ (పీవో), జనరల్ మేనేజర్ గ్రేడ్ వరకు ఉద్యోగ నియామకాలు జరుగుతున్నాయి. రానున్న రోజుల్లో వివిధ బ్యాంకుల శాఖల సంఖ్య పెర గనుండటం, వాటిలో సిబ్బంది అవసరం ఏర్పడనుండటంతో ఈ దిశగా ఉద్యోగ ప్రయ త్నాలు మొదలుపెట్టడం మంచిది. ఈ మేరకు ముందుగా బీకాం (జనరల్/కంప్యూటర్స్)లో చేరి మంచి మార్కులు సాధించాలి. డిగ్రీలో ఉన్నప్పుడే బ్యాంక్ పరీక్షలకు సంబంధించిన సబ్జెక్టులను అధ్యయనం చేయాలి. డిగ్రీ తర్వాత ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ పర్సనల్ సెలక్షన్) పరీక్షలకు హాజరవ్వాలి. కొన్ని ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంకులు పీజీడీబీఎఫ్ (పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్) కోర్సులో ప్రవేశానికి నిర్వహించే పోటీ పరీక్షలూ రాసుకోవచ్చు. ఆయా ఎగ్జామ్స్‌లో వచ్చే మార్కుల ఆధారంగా ప్రిపరేషన్ ప్లాన్‌ను మెరుగుపరచుకోవాలి. తెలుగు, ఆంగ్ల దిన పత్రికల్లో వచ్చే మోడల్ పేపర్లు, ప్రీవియస్ పేపర్లు; పలు వెబ్‌సైట్లు అందించే మాక్ టెస్టులు ప్రాక్టీస్ చేయాలి. సీరియస్‌గా ప్రయత్నిస్తే ఒకట్రెండు ప్రయత్నాల్లో బ్యాంకు ఉద్యోగం సొంతం చేసుకోవచ్చు. బ్యాంకులతోపాటు రైల్వే, బీమా, టెలికాం తదితర ప్రభుత్వ సంస్థల్లో అకౌంట్స్ విభాగంలో పోస్టుల కోసం కూడా ప్రయత్నించవచ్చు. ఉద్యోగంలో చేరిన తర్వాత కూడా దూర విద్యా విధానంలో ఉన్నత విద్య పూర్తి చేయొచ్చు.




# జాతీయ మానవ హక్కుల కమిషన్




కాంపిటీటివ్ గైడెన్స్
ఇండియన్ పాలిటీ

- **మానవ హక్కుల అర్థం - వివరణ:** మానవ ప్రగతికి, వికాసానికి దోహదపడే పరిస్థితులే మానవ హక్కులు. జాతి, మత, కుల, లింగ, ప్రాంత భేదాలు లేకుండా మానవుడు అనే ప్రాతిపదికపై వ్యక్తి ఔన్నత్యాన్ని పెంపొందించడానికి అవసరమైన కనీస పరిస్థితులనే మానవ హక్కులు అంటారు. 1948, డిసెంబర్ 10న ఐక్యరాజ్యసమితి 'విశ్వ మానవ హక్కుల ప్రకటన' చేసి సమితి చార్టర్‌లో కొన్ని హక్కులను పొందుపరిచింది. ముఖ్యంగా వాక్ స్వాతంత్ర్యం, భావ ప్రకటనా హక్కు, పనిహక్కు, విశ్రాంతి పొందే హక్కు, సామాజిక భద్రతా హక్కు, విద్యాహక్కు, జీవించే హక్కు, మతస్వేచ్ఛ హక్కు, శాంతియుత సమావేశ హక్కు, సంచార హక్కు, సంఘాలు, సంస్థలను ఏర్పాటు చేసుకొనే హక్కు మొదలైన వాటిని ఐక్యరాజ్యసమితి గుర్తించింది. ఈ హక్కులన్నింటినీ భారత రాజ్యాంగంలో మూడో భాగంలో ప్రాథమిక హక్కుల రూపంలో పొందుపర్చారు.
- **కమిషన్ నిర్మాణం:** దేశంలో జాతీయ మానవ హక్కుల కమిషన్‌ను పార్లమెంటు ఒక చట్టం ద్వారా 1993లో ఏర్పాటు చేసింది. జాతీయ మానవ హక్కుల చట్టాన్ని 2006లో సవరించారు. ఇదే చట్టాన్ని రాష్ట్రాలకు వర్తింపజేస్తూ, రాష్ట్ర స్థాయిలో మానవ హక్కుల కమిషన్‌ను ఏర్పాటు చేసే విధంగా సవరణ చేశారు.
- ఈ కమిషన్‌లో ఒక చైర్మన్, నలుగురు ఇతర సభ్యులుంటారు (1+4). అలాగే జాతీయ మైనారిటీ హక్కుల కమిషన్ చైర్మన్, జాతీయ ఎస్సీ, ఎస్టీ హక్కుల కమిషన్ల చైర్మన్లు, జాతీయ మహిళా హక్కుల కమిషన్ చైర్‌పర్సన్, మైనారిటీ కమిషన్ అధ్యక్షులు ఈ కమిషన్‌లో హోదా రీత్యా సభ్యులుగా ఉంటారు.
- **నియామకం:** జాతీయ మానవ హక్కుల కమిషన్ చైర్మన్, సభ్యులను రాష్ట్రపతి నియమిస్తారు. ఇందుకోసం రాష్ట్రపతి ఆరుగురు సభ్యులతో కూడిన కమిటీని సంప్రదించాలి. ఆ కమిటీలోని సభ్యులు...

**1. ప్రధానమంత్రి (చైర్మన్‌గా ఉంటారు), 2. లోక్‌సభ స్పీకర్, 3. రాజ్యసభ డిప్యూటీ చైర్మన్, 4. లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు, 5. రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడు, 6. కేంద్ర హోంశాఖ మంత్రి**

- **పదవీకాలం:** మానవ హక్కుల కమిషన్ చైర్మన్, ఇతర సభ్యులను రాష్ట్రపతి 5 ఏళ్ల కాలానికి నియమిస్తారు. వీరి పదవీ విరమణ వయసు 70 ఏళ్లు. వీటిలో ముందు వచ్చిన దాన్ని పరిగణనలోకి తీసుకుంటారు. సభ్యుల వయోపరిమితికి లోబడి రెండో పర్యాయం కూడా నియమించొచ్చు. యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సభ్యులను తొలగించే ప్రక్రియ ద్వారానే రాష్ట్రపతి వీరిని తొలగించొచ్చు. చైర్మన్, సభ్యులు తమ రాజీనామాను రాష్ట్రపతికి సమర్పిస్తారు.
- **అర్హతలు:** చైర్మన్‌గా నియమితులయ్యే వ్యక్తి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పదవీ విరమణ చేసినవారై ఉండాలి. మరో సభ్యుడు సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదవీ విరమణ చేసినవారై ఉండాలి. ఇంకొక సభ్యుడు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పదవీ విరమణ చేసి ఉండాలి. మిగిలిన ఇద్దరు సభ్యులు మానవ హక్కుల రంగంలో అనుభవజ్ఞులై ఉండాలి. చైర్మన్, సభ్యుల జీత భత్యాలను రాష్ట్రపతి నిర్ణయిస్తారు.

### కమిషన్ కొన్ని విధులు

■ మానవ హక్కుల ఉల్లంఘన లేదా ఉల్లంఘనను నివారించడంలో ప్రభుత్వోద్యోగి విఫలమైనప్పుడు సుమోటోగా లేదా ఫిర్యాదు ఆధారంగా విచారణ జరపడం. ■ న్యాయస్థానాల అనుమతితో మానవ హక్కుల ఉల్లంఘనకు సంబంధించిన కేసులో కక్షిదారుగా చేరడం. ■ జైళ్లు, ఇతర నిర్బంధ గృహాలను తనిఖీ చేసి, అక్కడ ఉన్నవారికి కనీస వసతుల కల్పనపై విచారణ జరిపి అవసరమైన సూచనలివ్వడం. ■ మానవ హక్కుల పరిరక్షణకు సంబంధించి రాజ్యాంగంలో పేర్కొన్న అంశాలను, చట్టపరమైన నిబంధనలను నిరంతరం సమీక్షిస్తూ తగిన సూచనలివ్వడం.

- మొదటి చైర్మన్: జస్టిస్ రంగనాథ్ మిశ్రా
- ప్రస్తుత చైర్మన్: జస్టిస్ హెచ్.ఎల్.దత్తు



బి.కృష్ణారెడ్డి,
డైరెక్టర్, క్లాస్‌వన్ స్టడీ సర్కిల్, హైదరాబాద్

# ప్రతి వారం మీ భవిత మెయిన్ పేజీల్లో...

| సోమవారం | మంగళవారం | బుధవారం | గురువారం | శుక్రవారం | శనివారం | ఆదివారం |
|---|---|---|---|---|---|---|
| 10+2/గ్రాడ్యుయేట్ స్పెషల్ | ఇంజనీరింగ్/ ఎంబీఏ స్పెషల్ | జాబ్ పాయింట్ | కెరీర్ గైడెన్స్/ టెక్నాలజీ స్పెషల్ | ఫారెన్ ఎడ్యుకేషన్ స్పెషల్ | యూత్ స్టోరీ/ కరెంట్ అఫైర్స్ (ఇంగ్లిష్) | జాబ్ స్కిల్స్/ గెస్ట్ కాలమ్ |
| గ్రూప్స్ ప్రత్యేకం | గ్రూప్స్ ప్రత్యేకం | గ్రూప్స్ ప్రత్యేకం | గ్రూప్స్ ప్రత్యేకం | గ్రూప్స్ ప్రత్యేకం | గ్రూప్స్ ప్రత్యేకం | గ్రూప్స్ ప్రత్యేకం |



"దేశంలో ఆశించిన స్థాయిలో పరిశోధనలు జరగడం లేదు. ఈ విషయమై ఇంకా పెట్టుబడులు పెట్టాల్సి ఉంది. అంతర్జాతీయ సమాజంలో మెరుగైన ర్యాంకు సాధించాలంటే.. దేశంలో పరిశోధనలు పెరగాలి. నూతన ఆవిష్కరణలకు మన విశ్వవిద్యాలయాలు వేదికలు కావాలి.
-ఉస్మానియా విశ్వ విద్యాలయ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా భారత తాజా మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ

ఎగ్జామ్ డైరీ

**ప్రాచీన భాషల నుంచి అంతరిక్షం వరకు ప్రస్తుతం అనేక విభాగాల్లో పరిశోధనల ప్రాధాన్యం పెరుగుతోంది. ఈ నేపథ్యంలో విద్యార్థులు ఇష్టమైన రంగంలో పరిశోధనల దిశగా అడుగు వేసేందుకు.. అధ్యాపక వృత్తి చేపట్టేందుకు.. 'యూజీసీ నెట్' మార్గం చూపుతోంది. తాజాగా సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) 'యూజీసీ నెట్-నవంబర్ 2017)' నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇందులో విజయానికి మార్గాలు.. అవకాశాలపై ఫోకస్..**



# యూజీసీ నెట్ 2017

## పరిశోధనలకు ప్రోత్సాహం.. అధ్యాపక వృత్తికి మార్గం..

### ప్రయోజనాలివే

- బోధనా రంగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా కెరీర్ ప్రారంభించడానికి యూజీసీ నెట్‌లో ఉత్తీర్ణత తప్పనిసరి. ఎలిజిబిలిటీ ఫర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ కేటగిరీలో ఉత్తీర్ణులకు రాష్ట్ర స్థాయి యూనివర్సిటీలు, ఇన్‌స్టిట్యూట్‌లలో అసిస్టెంట్ ప్రొఫెసర్ నియామకాల్లో ప్రాధాన్యం ఉంటుంది.
- నెట్ ఉత్తీర్ణతతో ఐఐటీ వంటి ప్రతిష్టాత్మక ఇన్‌స్టిట్యూట్లు/యూనివర్సిటీల్లో ప్రవేశం పొందే వీలుంటుంది. వివిధ స్కీమ్స్ కింద యూజీసీ ఫెలోషిప్‌లూ పొందవచ్చు. జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్ (జేఆర్ఎఫ్)కు ఎంపికైతే మొదటి రెండేళ్లు నెలకు రూ.32,500 ఫెలోషిప్ లభిస్తుంది. తర్వాత సీనియర్ రీసెర్చ్ ఫెలో(ఎస్ఆర్ఎఫ్)కు నెలకు రూ.36 వేలు ఇస్తారు. ఇతర సౌకర్యాలు ఉంటాయి. జేఆర్ఎఫ్‌కు ఎంపికైనట్లు ఇచ్చే జేఆర్ఎఫ్ అవార్డు లెటర్ రెండేళ్ల వరకు మనుగడలో ఉంటుంది.
- యూజీసీ నెట్ అర్హత ఆధారంగా పబ్లిక్ సెక్టార్ సంస్థలు నియామకాలు చేపట్టే అవకాశం కూడా ఉంది. పలు పీఎస్‌యూలు ఆర్అండ్‌డీ, మేనేజ్‌మెంట్, కార్పొరేట్ కమ్యూనికేషన్స్, హ్యూమన్ రిసోర్సెస్, ఫైనాన్స్ తదితర విభాగాల్లో నియామకాలకు యూజీసీ నెట్ ఉత్తీర్ణులను పరిగణనలోకి తీసుకునే వీలుంది. వీటిల్లో ఉద్యోగాలు పొందితే ఆకర్షణీయ వేతనాలు అందుకోవచ్చు.

### అర్హతలు

- అభ్యర్థులు హ్యూమానిటీస్; సోషల్ సైన్స్, మేనేజ్‌మెంట్, సైన్స్, కళలు విభాగాల్లో మొత్తం 100 సబ్జెక్ట్‌ల్లో నిర్వహించే నెట్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు. ఆయా సబ్జెక్టుల్లో పీజీ లేదా తత్సమాన స్థాయిలో 55 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి. రిజర్వ్‌డ్ కేటగిరీ అభ్యర్థులకు 5 శాతం సడలింపు ఉంటుంది. పీజీ ఫైనల్ ఇయర్ విద్యార్థులూ దరఖాస్తుకు అర్హులే.

### వయో పరిమితి

- 2017 జూన్1 నాటికి 28 ఏళ్లకు మించకూడదు. ఓబీసీ (నాన్- క్రీమీ లేయర్), ఎస్సీ/ఎస్టీ/పీడబ్ల్యుడీ తదితర రిజర్వ్‌డ్ కేటగిరీ అభ్యర్థులకు అయిదేళ్ల సడలింపు.
- 'ఎలిజిబిలిటీ ఫర్ అసిస్టెంట్ ప్రొఫెసర్' ఔత్సాహిక అభ్యర్థులకు ఎలాంటి గరిష్ట వయో పరిమితి లేదు.

**దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.1000, ఓబీసీలకు రూ.500, ఎస్సీ/ ఎస్టీ/ పీడబ్ల్యూడీలకు రూ.250.

**పరీక్ష విధానం:** యూజీసీ నెట్ మూడు పేపర్లుగా పూర్తి ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది.

| పేపర్ | ప్రశ్నలు | మార్కులు | సమయం |
|---|---|---|---|
| పేపర్-1 | 50 | 100 | 75 నిమిషాలు |
| పేపర్-2 | 50 | 100 | 75 నిమిషాలు |
| పేపర్-3 | 75 | 150 | 2.30 గంటలు |

- అన్ని సబ్జెక్టుల అభ్యర్థులకు మొదటి పేపర్ ఒకటే ఉంటుంది. ఇందులో అభ్యర్థి రీసెర్చ్/టీచింగ్ ఆప్టిట్యూడ్, జనరల్ అవేర్‌నెస్, రీజనింగ్ ఎబిలిటీ, కాంప్రహెన్షన్‌లను పరీక్షిస్తారు. మొత్తం 50 ప్రశ్నలు ఉంటాయి. ఒక్కోదానికి 2 మార్కుల చొప్పున 100 మార్కులు.
- పేపర్- 2, 3 అభ్యర్థులు ఎంచుకున్న సబ్జెక్ట్‌కు సంబంధించినవి.
- పేపర్-2లో 50 ప్రశ్నలు ఉంటాయి. ఒక్కోదానికి రెండు మార్కులు. మొత్తం 100. అన్నిటికీ సమాధానం తప్పనిసరి.
- పేపర్-3లో 75 ప్రశ్నలు అడుగుతారు. దీంట్లోనూ అన్నిటికీ సమాధానం ఇవ్వాలి. 2 మార్కుల చొప్పున మొత్తం 150 మార్కులకు ఉంటుంది.

### అధిక మార్కులే లక్ష్యంగా..

ఔత్సాహిక అభ్యర్థులు కనీసం 70 శాతం మార్కులు లక్ష్యంగా సాధన చేస్తే జేఆర్ఎఫ్ పొందే అవకాశాలు మెండుగా ఉంటాయి. యూజీసీ నెట్ జనవరి- 2017 ఫలితాలు గమనిస్తే 65 శాతం నుంచి 70 శాతం మార్కులు సాధించిన అన్ రిజర్వ్‌డ్ కేటగిరీ అభ్యర్థులు జేఆర్ఎఫ్‌కు అర్హత సాధించారు. 100 సబ్జెక్టుల్లో 3640 మందికి జేఆర్ఎఫ్‌లు లభించాయి.

### సబ్జెక్టుపై పూర్తి పట్టుతోనే

పేపర్ 2, పేపర్ 3లలో రాణించాలంటే ఎంపిక చేసుకున్న సబ్జెక్టుపై పూర్తి పట్టు అవసరం. ప్రశ్నపత్రం ఆబ్జెక్టివ్ విధానంలో ఉన్నప్పటికీ.. ప్రశ్నలు సంబంధించిన ప్రాథమిక అంశాలపై పట్టు అవసరం. అందుకని డిస్క్రిప్టివ్ అప్రోచ్‌తో అవగాహన పెంచుకోవాలి. అభ్యర్థులు పీజీ స్థాయి సిలబస్‌లో పేర్కొన్న ప్రతి అంశాన్ని విభిన్న కోణాల్లో చదవాలి. ఒక అంశం నుంచి ప్రశ్నలు అడిగే అవకాశం ఉన్న వేర్వేరు కోణాలపై అవగాహన ఏర్పరచుకోవాలి.

- ఉమ్మడిగా ఉండే పేపర్-1లో ఎక్కువగా టీచింగ్ ఆప్టిట్యూడ్, రీసెర్చ్ ఆప్టిట్యూడ్, దేశంలో ఉన్నత విద్య-ప్రస్తుత పరిస్థితులపై ప్రశ్నలు ఉంటాయి. ఈ రంగాల్లో ఇటీవలి పరిణామాలపై అవగాహన పెంచుకోవాలి. వీటితోపాటు పేపర్-1లో డేటా ఇంటర్‌ప్రిటేషన్ నుంచి లాజికల్ రీజనింగ్, కమ్యూనికేషన్ నైపుణ్యాలను పరీక్షించే ప్రశ్నలు కూడా అడుగుతారు. అభ్యర్థులు నిర్దిష్ట డేటా నుంచి ముఖ్యాంశాలను గుర్తించే విశ్లేషణ నైపుణ్యం సొంతం చేసుకోవాలి. అందుకు ఎక్కువగా ప్రాక్టీస్ చేయాలి.

### ప్రతి పేపర్‌లో కనీస మార్కులు

మొత్తం మూడు పేపర్ల (పేపర్-1, పేపర్-2; పేపర్-3)లో కలిపి సగటున కనీసం 40 శాతం మార్కులు తప్పనిసరి. అప్పుడే మెరిట్ లిస్ట్ రూపకల్పనలో తదుపరి దశకు పరిగణనలోకి తీసుకుంటారు. ఓబీసీ (నాన్ క్రీమీ లేయర్)/పీడబ్ల్యూడీ/ఎస్సీ/ఎస్టీలకు 35 శాతం మార్కులు రావాలి.

- మూడు పేపర్లకు హాజరై నిర్దేశిత కనీస సగటు మార్కులు పొందిన అభ్యర్థులతో సబ్జెక్ట్ వైజ్, కేటగిరీ వైజ్ మెరిట్ లిస్ట్ తయారుచేస్తారు.
- మూడు పేపర్లకు హాజరైన మొత్తం అభ్యర్థుల సంఖ్యలో 6 శాతం మందిని అసిస్టెంట్ ప్రొఫెసర్‌షిప్‌కు ఎంపికచేస్తారు.
- అసిస్టెంట్ ప్రొఫెసర్‌షిప్ జాబితాలో చోటు సాధించిన అభ్యర్థులతో అందుబాటులో ఉన్న జేఆర్ఎఫ్‌లను పరిగణనలోకి తీసుకుని ప్రత్యేక ఫార్ములా అనుసరించి జేఆర్ఎఫ్ అర్హుల జాబితా రూపొందిస్తారు.

### ముఖ్య తేదీలు

- ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభం: ఆగస్టు 11, 2017
- ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ: సెప్టెంబర్ 11, 2017
- ఈ-చలాన్/డెబిట్ కార్డ్/ క్రెడిట్ ద్వారా ఫీజు చెల్లింపు చివరి తేదీ: సెప్టెంబర్12, 2017
- ఆన్‌లైన్ దరఖాస్తుల్లో పొరపాట్లు సరిదిద్దుకునే గడువు: సెప్టెంబర్19 నుంచి 25వ తేదీ
- పరీక్ష తేదీ: 2017 నవంబర్ 5
- వెబ్‌సైట్: cbsenet.nic.in

# కంబైన్డ్ డిఫెన్స్ సర్వీసెస్ ఎగ్జామినేషన్(2)-2017

UPSC
జాబ్ పాయింట్

త్రివిధ(నేవీ/ఆర్మీ/ఎయిర్‌ఫోర్స్) దళాల్లోని 414 ఖాళీల భర్తీకి 'కంబైన్డ్ డిఫెన్స్ సర్వీసెస్ ఎగ్జామినేషన్(2)-2017'కు యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్సీ) నోటిఫికేషన్ విడుదల చేసింది. ఎంపికైన అభ్యర్థులకు ఆయా విభాగాల్లోని ఖాళీల భర్తీకి నిర్వహించే ప్రత్యేక కోర్సుల్లోకి ప్రవేశం లభిస్తుంది.

**పరీక్ష పేరు:** కంబైన్డ్ డిఫెన్స్ సర్వీసెస్ ఎగ్జామినేషన్(2)-2017

**విభాగాల వారీ ఖాళీలు:**

ఇండియన్ మిలటరీ అకాడమీ(ఐఎంఏ)-డెహ్రాడూన్ - 100.
ఇండియన్ నేవల్ అకాడమీ(ఐఎన్ఏ)-ఎజిమల - 45
ఎయిర్‌ఫోర్స్ అకాడమీ(ప్రీ-ఫ్లైయింగ్)-హైదరాబాద్ - 32
ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీ(పురుషులు)-చెన్నై - 225
ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీ(మహిళలు)-చెన్నై - 12

**నోట్:** ఇండియన్ మిలటరీ అకాడమీలోని ఖాళీల్లో 13 ఎన్‌సీసీ 'సి' సర్టిఫికెట్(ఆర్మీ వింగ్); ఇండియన్ నేవల్ అకాడమీలో 6 పోస్టులను ఎన్‌సీసీ 'సి' సర్టిఫికెట్(నేవల్ వింగ్); ఆఫీసర్ ట్రైనింగ్ అకాడమీ (పురుషులు)లో 50 ఖాళీలను ఎన్‌సీసీ 'సి' సర్టిఫికెట్(ఎన్‌సీసీ స్పెషల్ ఎంట్రీ) అభ్యర్థులకు రిజర్వ్ చేశారు.

- **అర్హతలు:**
- **ఇండియన్ మిలటరీ అకాడమీ(ఐఎంఏ):** అవివాహ పురుష అభ్యర్థులు అర్హులు. ఏదైనా డిగ్రీ లేదా తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. 1994 జూలై 2-జూలై 1, 1999 మధ్య జన్మించి ఉండాలి.
- **ఇండియన్ నేవల్ అకాడమీ(ఐఎన్ఏ):** అవివాహ పురుష అభ్యర్థులు అర్హులు. ఏదైనా డిగ్రీ లేదా తత్సమాన డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.
- 1994 జూలై 2-జూలై 1, 1999 మధ్య జన్మించి ఉండాలి
- **ఎయిర్‌ఫోర్స్ అకాడమీ(ప్రీ-ఫ్లైయింగ్):** ఫిజిక్స్, మ్యాథమెటిక్స్ సబ్జెక్టులతో ఇంటర్మీడియెట్‌తోపాటు ఏదైనా డిగ్రీ లేదా బ్యాచిలర్ ఆఫ్ ఇంజనీరింగ్ పూర్తి చేసి ఉండాలి. వయస్సు 20-24 ఏళ్ల లోపు ఉండాలి. డీజీసీఏ కమర్షియల్ పైలట్ లైసెన్స్ ఉంటే గరిష్ట వయోపరిమితిలో రెండేళ్ల సడలింపు ఉంటుంది. అయితే, 25 ఏళ్ల లోపు ఉన్నవారికి కచ్చితంగా వివాహం జరిగి ఉండకూడదు.
- **ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీ(పురుషులు):** ఏదైనా డిగ్రీ లేదా తత్సమాన విద్యార్హత. 1993 జూలై 2- జూలై 1, 1999 మధ్య జన్మించిన పురుష అభ్యర్థులు అర్హులు.
- **ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీ(మహిళలు):** అవివాహిత/విడాకులు పొంది తిరిగి పెళ్లి చేసుకోని/వైధవ్యం పొంది తిరిగి వివాహం చేసుకోని మహిళలు అర్హులు. 1993 జూలై 2-జూలై 1, 1999 మధ్య జన్మించి ఉండాలి. ఏదైనా డిగ్రీ లేదా తత్సమాన విద్యార్హత ఉండాలి.
- **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ.
- **దరఖాస్తు ఫీజు:** రూ.200; ఎస్సీ/ఎస్టీ/మహిళ అభ్యర్థులకు ఫీజు లేదు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తులకు చివరి తేదీ:** సెప్టెంబర్ 8, 2017.
- **వెబ్‌సైట్:** upsconline.nic.in , www.upsc.gov.in

## స్టాక్ మార్కెట్లు

**దేశీ సూచీలు**

| సెన్సెక్స్ | నిఫ్టీ |
|---|---|
| 267 ▼ | 88 ▼ |
| 31,531 | 9,820 |

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

**విదేశీ సూచీలు** పై రెండూ సూచీలు రాత్రి 11.30

| సూచీ | విలువ | మార్పు |
|---|---|---|
| నాస్‌డాక్ | 6,250 | ▼ 103 |
| డోజోన్స్ | 21,910 | ▼ 139 |
| ఎఫ్‌టీఎస్‌ఈ 100 | 7,390 | ▼ 108 |
| డాక్స్ | 12,014 | ▼ 140 |
| షాంఘై | 3,262 | ▼ 14 |
| నికాయ్ | 19,730 | ▼ 9 |

● అమెరికా ● బ్రిటన్ ● జర్మనీ ● చైనా ● జపాన్

## ఫారెక్స్ రేట్లు రూ. లలో

| | కరెన్సీ | | ● కొనుగోలు | ● అమ్మకం |
|---|---|---|---|---|
| $ | యూఎస్ డాలర్ | ఎస్‌బీఐ | 63.13 | 64.80 |
| £ | బ్రిటన్ పౌండ్ | ఎస్‌బీఐ | 81.75 | 84.56 |
| € | యూరో | ఎస్‌బీఐ | 73.86 | 76.30 |
| ¥ | జపాన్ ఎన్ (100) | ఎస్‌బీఐ | 57.14 | 59.15 |
| AUS | ఆస్ట్రేలియా డాలర్ | ఎస్‌బీఐ | 49.40 | 51.35 |
| SS | సింగపూర్ డాలర్ | ఎస్‌బీఐ | 46.16 | 47.65 |
| SAR | సౌదీ రియాల్ | థామస్‌కుక్ | 15.48 | 18.35 |
| UAE D | యూఏఈ దిర్హామ్ | థామస్‌కుక్ | 15.84 | 18.52 |
| ¥ | చైనా యువాన్ | థామస్‌కుక్ | 6.78 | 11.00 |

# ఫ్లిప్‌కార్ట్‌లో సాఫ్ట్‌బ్యాంక్ భారీ పెట్టుబడి




## విజన్ ఫండ్ ద్వారా 2.5 బిలియన్ డాలర్ల ఇన్వెస్ట్‌మెంట్

### సుమారు 20 శాతం వాటా సాఫ్ట్‌బ్యాంక్ చేతికి ● అతి పెద్ద వాటాదారుల్లో ఒకటిగా హోదా

**న్యూఢిల్లీ:** దేశీ ఈ కామర్స్ దిగ్గజం ఫ్లిప్‌కార్ట్‌లో జపాన్‌కి చెందిన సాఫ్ట్ బ్యాంక్ భారీ స్థాయిలో పెట్టుబడులు పెట్టింది. సాఫ్ట్ బ్యాంక్ తన విజన్ ఫండ్ ద్వారా 2.5 బిలియన్ డాలర్లు (సుమారు రూ.16,000 కోట్లు) ఇన్వెస్ట్ చేసింది. తద్వారా ఫ్లిప్‌కార్ట్‌లో అతి పెద్ద ఇన్వెస్టర్లలో ఒకటిగా మారింది. భారతీయ కంపెనీలో ఈ స్థాయి పెట్టుబడులు రావడం ఇదే ప్రథమమని పేర్కొన్న ఫ్లిప్‌కార్ట్... ఇన్వెస్ట్‌మెంట్ మొత్తాన్ని మాత్రం వెల్లడించలేదు. అయితే పెట్టుబడి విలువ సుమారు 2.5 బిలియన్ డాలర్లు ఉంటుందని, ఇందులో 1.5 బిలియన్ డాలర్లు నేరుగా ఫ్లిప్‌కార్ట్‌లో ఇన్వెస్ట్ చేయగా, మిగతా 1 బిలియన్ డాలర్లను టైగర్ గ్లోబల్ మేనేజ్‌మెంట్ వాటాలో కొంత భాగాన్ని కొనుగోలు చేసేందుకు సాఫ్ట్‌బ్యాంక్ విజన్ ఫండ్ వెచ్చించిందని సంబంధిత వర్గాలు తెలిపాయి. టెక్నాలజీ సంస్థల్లో ఇన్వెస్ట్ చేస్తున్న అత్యంత భారీ ఫండ్ అయిన సాఫ్ట్‌బ్యాంక్ విజన్ ఫండ్‌కి తాజా పెట్టుబడి ద్వారా ఫ్లిప్‌కార్ట్‌లో దాదాపు 20 శాతం వాటాలు దక్కినట్లని వివరించాయి. '50 కోట్ల మందికి పైగా ఇంటర్నెట్ యూజర్లున్న దేశీ ఇంటర్నెట్ మార్కెట్లో పుష్కలంగా వ్యాపార అవకాశాలున్నాయి. భారత ఈ-కామర్స్ మార్కెట్ ఏటా 30 శాతం పైగా వార్షిక వృద్ధి నమోదు చేయనుందని అంచనా' అని ఫ్లిప్‌కార్ట్ పేర్కొంది. మార్కెట్‌లో ఆధిపత్యం నిలబెట్టుకోవడానికి తాజా నిధులు తోడ్పడతాయని వివరించింది. 'ఫ్లిప్‌కార్ట్, భారత్.. చిరస్థాయిగా గుర్తుంచుకోతగ్గ డీల్ ఇది. అంతర్జాతీయంగా కొన్ని దేశాలు మాత్రమే అత్యుత్తమ ఇన్వెస్టర్ల దృష్టిని ఆకర్షించగలవు' అని ఫ్లిప్‌కార్ట్ సహ వ్యవస్థాపకుడు బిన్నీ బన్సల్, సచిన్ బన్సల్ పేర్కొన్నారు. మరోవైపు, సాఫ్ట్‌బ్యాంక్ వ్యవస్థాపకుడు మసయోషి సన్... భారత్‌ను అవకాశాల గనిగా అభివర్ణించారు. టెక్నాలజీ ఊతంగా ప్రజలు మరింత సౌకర్యవంతమైన జీవితాన్ని గడిపేందుకు కృషి చేస్తున్న ఇలాంటి సృజనాత్మక సంస్థలకు తోడ్పడటమే తమ ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు. ఈ డీల్‌కు నియంత్రణ సంస్థల నుంచి ఇంకా అనుమతులు లభించాల్సి ఉంది. సన్ స్థాపించిన సాఫ్ట్‌బ్యాంక్ విజన్ ఫండ్‌లో టెక్ దిగ్గజాలు యాపిల్, ఫాక్స్‌కాన్, పబ్లిక్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్ ఆఫ్ ది కింగ్‌డమ్ ఆఫ్ సౌదీ అరేబియా మొదలైనవి భాగస్వాములుగా ఉన్నాయి.



సాఫ్ట్‌బ్యాంక్ పెట్టుబడుల రాకతో ఫ్లిప్‌కార్ట్ నగదు నిల్వలు ఏకంగా 4 బిలియన్ డాలర్లకు చేరనున్నాయి. ఈ ఏడాది ఏప్రిల్‌లోనే ఫ్లిప్‌కార్ట్ సంస్థ దాదాపు 11.6 బిలియన్ డాలర్ల వేల్యుయేషన్‌తో... టెన్సెంట్, ఈబే, మైక్రోసాఫ్ట్ నుంచి 1.4 బిలియన్ డాలర్లు సమీకరించింది.

### ఫ్లిప్‌కార్ట్‌కు పుష్కలంగా నిధులు..

ఇక తాజా పెట్టుబడులతో ఫ్లిప్‌కార్ట్ ఇప్పటిదాకా 5 బిలియన్ డాలర్లకు పైగా నిధులు సమీకరించినట్లయింది. అమెరికా ఆన్‌లైన్ షాపింగ్ దిగ్గజం అమెజాన్‌కి గట్టి పోటీ ఇచ్చేందుకు ఫ్లిప్‌కార్ట్ ఈ నిధులను వినియోగించనుంది. ఇటు విక్రేతలను, అటు కొనుగోలుదారులను ఆకర్షించేందుకు ఇరు సంస్థలు భారీ స్థాయిలో నిధులు కుమ్మరిస్తున్నాయి. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటిదాకా అమెజాన్ భారత విభాగం కార్యకలాపాలపై దాదాపు 600 మిలియన్ డాలర్లు వ్యయం చేసింది. అటు ఫ్లిప్‌కార్ట్ ఈ ఏడాది 4 బిలియన్ డాలర్ల దాకా సమీకరించింది. ఫ్లిప్‌కార్ట్‌లో ఇన్వెస్ట్ చేసిన సాఫ్ట్‌బ్యాంక్‌కి.. దాని పోటీ సంస్థ స్నాప్‌డీల్‌లో కూడా పెట్టుబడులు ఉన్న సంగతి తెలిసిందే. వాస్తవానికి నిధుల సంక్షోభం ఎదుర్కొంటున్న స్నాప్‌డీల్‌ను విలీనం చేయడం ద్వారా ఫ్లిప్‌కార్ట్‌లోకి పెట్టుబడులతో వాటాలు దక్కించుకోవాలని సాఫ్ట్‌బ్యాంక్ యోచించింది. అయితే, స్నాప్‌డీల్ ఆశించిన రేటు రాకపోవడంతో డీల్ కుదరలేదు. దీంతో ఫ్లిప్‌కార్ట్‌లోకి సాఫ్ట్ బ్యాంక్ నేరుగా ఇన్వెస్ట్ చేసింది. అటు ట్యాక్సీ సేవల సంస్థ ఓలాలో కూడా పెట్టుబడులు ఉన్న సాఫ్ట్‌బ్యాంక్.. భారత్‌లో దాదాపు 10 బిలియన్ డాలర్లు ఇన్వెస్ట్ చేయనున్నట్లు 2014లో వెల్లడించింది. ఈ ఏడాదే డిజిటల్ పేమెంట్స్ సంస్థ పేటీఎంలో 1.4 బిలియన్ డాలర్లు (సుమారు రూ. 9,079 కోట్లు) పెట్టుబడులు పెట్టింది.



## పసిడికి 'అంతర్జాతీయ' దన్ను

### ముంబై మార్కెట్‌లో రూ.29,000పైకి



**ముంబై:** అమెరికా-ఉత్తర కొరియా భౌగోళిక ఉద్రిక్తతల నేపథ్యంలో పసిడి అంతర్జాతీయంగా పరుగులు పెడుతోంది. ఇదే ప్రభావం దేశీయంగానూ కనబడుతోంది. ముంబై ప్రధాన మార్కెట్‌లో పసిడి 99.9 స్వచ్ఛత 10 గ్రాముల ధర గురువారం రూ.340 పెరిగి, రూ. 29,070కి చేరింది. 99.5 స్వచ్ఛత ధర కూడా అదే స్థాయిలో ఎగిసి రూ. 28,920కి చేరింది. వెండి కేజీ ధర భారీగా రూ. 1,120 ఎగసి రూ.38,995కి చేరింది. ఇక అంతర్జాతీయంగా న్యూయార్క్ మర్కంటైల్ ఎక్స్ఛేంజ్- నైమెక్స్‌లో పసిడి ధర గురువారం కడపటి సమాచారం అందేసరికి ఏకంగా 10 డాలర్లకు పైగా లాభంతో 1,290 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఇక దేశీయంగా మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్‌లో చురుగ్గా ట్రేడవుతున్న 10 గ్రాముల పసిడి కాంట్రాక్ట్ ధర కడపటి సమాచారం అందేసరికి రూ.300 లాభంతో రూ. 29,144 వద్ద ట్రేడవుతోంది. ఇదే ధోరణి కొనసాగితే, శుక్రవారం స్పాట్ మార్కెట్‌లో పసిడి ధర మరింత పెరిగే వీలుంది.

## స్పైస్ జెట్ లాభం 16శాతం అప్



**న్యూఢిల్లీ:** ఏవియేషన్ కంపెనీ స్పైస్ జెట్ కన్సాలిడేటెడ్ నికరలాభం 2017 జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో 16 శాతం వృద్ధిచెంది రూ. 149 కోట్ల నుంచి రూ. 173 కోట్లకు పెరిగింది. కంపెనీ మొత్తం ఆదాయం రూ. 1,544 కోట్ల నుంచి రూ. 1,890 కోట్లకు చేరింది. ఫలితాల సందర్భంగా స్పైస్ జెట్ షేరు 5 శాతం పతనమై రూ. 119 వద్ద ముగిసింది.

## తగ్గిన ఐఓబీ నష్టాలు



**న్యూఢిల్లీ:** మొండి బకాయిలకు కేటాయింపులు తగ్గడంతో ప్రభుత్వ రంగ ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ (ఐఓబీ) నికర నష్టం 2017 జూన్ త్రైమాసికంలో రూ. 499 కోట్లకు తగ్గింది. గతేడాది ఇదేకాలంలో బ్యాంకు రూ. 1,450 కోట్ల భారీ నష్టాన్ని చవిచూసింది. తాజాగా ముగిసిన త్రైమాసికంలో బ్యాంకు మొత్తం ఆదాయం కూడా రూ. 5,868 కోట్ల నుంచి రూ. 5,174 కోట్లకు తగ్గిందని, ఇందుకు వడ్డీ రేట్ల తగ్గుదల కారణమని స్టాక్ ఎక్స్ఛేంజీలకు ఐఓబీ తెలిపింది. మొండి బకాయిలకు కేటాయింపులు తగ్గినా...స్థూల ఎన్‌పీఏలు 20.48 శాతం నుంచి 23.60 శాతానికి పెరిగాయి. జూన్ క్వార్టర్లో రుణ వితరణ తగ్గడంతో ఎన్‌పీఏల శాతం పెరగడానికి ప్రధాన కారణమని బ్యాంకు తెలిపింది. నికర ఎన్‌పీఏలు 13.97 శాతం నుంచి 14.97 శాతానికి పెరిగాయి. బ్యాంకు నికర వడ్డీ మార్జిన్ 1.87 శాతం నుంచి 1.65 శాతానికి తగ్గింది. ఫలితాల నేపథ్యంలో ఐఓబీ షేరు 3.35 శాతం క్షీణతతో రూ. 23.10 వద్ద ముగిసింది.

## బోనస్ ప్రకటించిన బీహెచ్ఈఎల్




**న్యూఢిల్లీ:** ప్రభుత్వరంగ బీహెచ్ఈఎల్ లాభం జూన్ త్రైమాసికంలో 3.9 శాతం వృద్ధితో రూ.80 కోట్లుగా నమోదైంది. అంతకుముందు ఏడాది ఇదే కాలంలో వచ్చిన లాభం రూ.77 కోట్లు. ఆదాయం మాత్రం 1.5 శాతం తగ్గి రూ.5,820 కోట్ల నుంచి రూ.5,732 కోట్లకు చేరింది. మెటీరియల్స్, ఉద్యోగుల ప్రయోజనాలు, తరుగుదల తదితర రూపంలో వ్యయాలు 2 శాతం పెరిగి రూ.6,086 కోట్లకు చేరినట్టు సంస్థ తెలిపింది. విద్యుత్ రంగం నుంచి వచ్చిన ఆదాయం రూ.4,335 కోట్లుగా ఉంది. పూర్తి చేయాల్సిన ఆర్డర్ బుక్ విలువ రూ.1,01,380 కోట్లుగా ఉన్నట్టు బీహెచ్ఈఎల్ తెలిపింది. ప్రతి రెండు షేర్లకు గాను ఒక షేరును బోనస్‌గా ఇచ్చేందుకు బోర్డు సిఫారసు చేసింది.

# ఆర్‌బీఐ డివిడెండ్ చిక్కి సగమైంది!

## కేంద్రానికి రూ.30,659 చెల్లించడానికి ఓకే

- 2015-16లో మాత్రం ఈ మొత్తం 65,876 కోట్లు
- కొత్త నోట్ల ముద్రణకు భారీ వ్యయం ఓ కారణం
- రూపాయి విలువ పెరగటమూ మరో కారణం
- రాబడికి ప్రత్యామ్నాయాలపై కేంద్రం దృష్టి!




**ముంబై:** కేంద్ర ప్రభుత్వానికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) చెల్లించే డివిడెండ్ గడిచిన ఆర్థిక సంవత్సరం భారీగా సగానికి సగం పడిపోయింది. ఆర్‌బీఐకి ఆర్థిక సంవత్సరం జూన్‌తో ముగుస్తుంది. ఈ కాలానికి సంబంధించి ఆర్‌బీఐ రూ.30,659 కోట్లు మాత్రమే కేంద్రానికి చెల్లించింది. అంతకు ముందటి ఆర్థిక సంవత్సరంలో ఈ మొత్తం రూ.65,876 కోట్లు.

**కొత్త నోట్ల ముద్రణ కారణం...**

విశ్లేషకుల అంచనా ప్రకారం భారీగా డివిడెండ్ పడిపోడానికి ప్రధాన కారణాల్లో... డీమోనిటైజేషన్ నేపథ్యంలో- కొత్త నోట్ల ముద్రణకు అయిన వ్యయం ఒకటి. రూ.500 నోటు ముద్రణకు సగటున రూ.2.87 నుంచి రూ.3.09 శ్రేణిలో వ్యయమయితే రూ.2,000 నోటు ముద్రించడానికి సగటున రూ.3.54 నుంచి రూ.3.77 మధ్యలో ఖర్చయిందని ఇటీవలే ఆర్థిక శాఖ సహాయ మంత్రి అర్జున్ రామ్ మేఘ్‌వాల్ తెలిపారు. అయితే డీమోనిటైజేషన్ అనంతరం కొత్త నోట్ల ముద్రణకు ఆర్‌బీఐ మొత్తంగా ఎంత వెచ్చించిందన్నది మాత్రం ఆయన వెల్లడించలేదు. 'గురువారం జరిగిన ఆర్‌బీఐ బోర్డ్ సమావేశంలో... కేంద్రానికి రూ.30,659 డివిడెండ్ చెల్లించడానికి బోర్డు ఆమోదముద్ర వేసింది'అని ఆర్‌బీఐ అధికారిక ప్రకటనలో తెలియజేసింది. అయితే గత ఏడాదికన్నా తక్కువ డివిడెండ్ చెల్లించడానికి గల కారణాలను మాత్రం ప్రకటన వెల్లడించలేదు. అయితే కొత్త నోట్ల ముద్రణ, రివర్స్ రెపో ద్వారా అధిక చెల్లింపులు, డాలర్ మారకంలో రూపాయి విలువ గణనీయ పెరుగుదల వంటి అంశాలు కూడా కారణాలు కావచ్చని విశ్లేషణలు ఉన్నాయి.

### ప్రత్యామ్నాయంపై ప్రభుత్వం చూపు...

**2017-18లో** కనీసం రూ.58,000 కోట్లు ఆర్‌బీఐ నుంచి వస్తాయని ప్రభుత్వం భావించింది. బడ్జెట్ అంచనాల ప్రకారం ఆర్‌బీఐ, జాతీయ బ్యాంకులు ఆర్థిక సంస్థల నుంచి ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రూ.74,901 కోట్లు డివిడెండ్ రూపంలో అందుకోవచ్చని భావించారు. ఆర్‌బీఐ నుంచి డివిడెండ్ భారీగా పడిపోవడంతో, కేంద్ర ఆర్థిక ప్రణాళికపై కొంత ఒత్తిడి నెలకొనే పరిస్థితి ఏర్పడింది. 2017-18 ఆర్థిక సంవత్సరం ద్రవ్యలోటును (ప్రభుత్వ ఆదాయాలు-వ్యయాలకు మధ్య వ్యత్యాసం) నిర్దేశిత 3.2 శాతం వద్ద కట్టడి చేయడానికి అదనపు కసరత్తు చేయాల్సి ఉంది. తాజా పరిణామంపై ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్ ఆర్.గాంధీ మాట్లాడుతూ... గడచిన ఐదేళ్లలో బ్యాంకింగ్ రాబడి తగ్గుతూ వస్తున్నట్లు తెలిపారు. అభివృద్ధి చెందిన దేశాల్లో ప్రతికూల వడ్డీరేట్లు దీనికి కారణమని అన్నారు. వ్యవస్థలో లిక్విడిటీ (ద్రవ్య లభ్యత) పెరగడం వల్ల రివర్స్ రెపో (బ్యాంకులు తన వద్ద ఉంచిన డిపాజిట్‌పై ఆర్‌బీఐ ఇచ్చే వడ్డీ), సంబంధిత చెల్లింపులు రెవెన్యూపై ప్రభావం చూపుతున్నట్లూ ఆయన విశ్లేషించారు.

## తగ్గిన హెరిటేజ్ లాభం

### తొలి త్రైమాసికంలో 53 శాతం డౌన్

**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** హెరిటేజ్ ఫుడ్స్ లిమిటెడ్ నికరలాభం 2017-18 తొలి త్రైమాసికంలో 53 శాతం తగ్గింది. గతేడాది ఇదే కాలంతో ఆర్జించిన స్టాండలోన్ నికరలాభం రూ.16.4 కోట్లతో పోలిస్తే... ఈ ఏడాది మొదటి త్రైమాసికంలో (ఏప్రిల్- జూన్) కేవలం రూ.7.64 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం మాత్రం 32 శాతం వృద్ధి చెంది రూ.610.74 కోట్ల వద్ద నిలిచింది. రూ.10 ముఖ విలువ కలిగిన ఒకో ఈక్విటీ షేరును రూ.5 ముఖ విలువ కలిగిన రెండు షేర్లుగా విభజించేందుకు (స్ప్లిట్) బోర్డు ఆమోదించింది. హెరిటేజ్ సంస్థ ఫ్రాన్స్‌కు చెందిన నొవాన్‌డీ ఎస్ఎఎస్‌తో కలసి 50:50 జాయింట్ వెంచర్‌గా రూ.16 కోట్లతో గ్రీన్‌ఫీల్డ్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసింది. ఇందులో ఫ్లేవర్డ్ యుగార్ట్, వెస్ట్రన్ డిసర్ట్స్‌ను తయారు చేస్తోంది. ఈ ఉత్పత్తులను వచ్చే ఏడాది మార్కెట్లోకి విడుదల చేయనుంది.

## రెడ్డీస్‌కు జర్మనీ రెగ్యులేటర్ షాక్

**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** ఔషధ తయారీ సంస్థ డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరీస్‌కు జర్మనీ ఔషధ నియంత్రణ సంస్థ షాక్ ఇచ్చింది. హైదరాబాద్ సమీపంలోని బాచుపల్లి వద్ద ఉన్న ఫార్ములేషన్స్ తయారీ యూనిట్-2కు జీఎంపీ ధ్రువీకరణను పునరుద్ధరించలేదు. ఈ మేరకు జర్మనీలోని రెడ్డీస్ అనుబంధ కంపెనీ అయిన బెటాఫార్మ్‌కు సమాచారం ఇచ్చింది. తాజా పరిస్థితుల నేపథ్యంలో యూనిట్-2 నుంచి యూరోపియన్ యూనియన్‌కు ఔషధ ఎగుమతులు చేయడానికి రెడ్డీస్‌కు వీలు లేకుండా పోయింది. ఇటీవలే ఈ ప్లాంటును జర్మనీ నియంత్రణ సంస్థ తనిఖీ చేపట్టింది. తదుపరి తనిఖీ పూర్తి అయి ఉత్తమ తయారీ విధానాలు (జీఎంపీ) అవలంబిస్తోందంటూ గ్రీన్ సిగ్నల్ వచ్చే వరకు కంపెనీ వేచి చూడాల్సిందే.

## యాంబీ వ్యాలీ వేలం నిలిపివేతకు సుప్రీం నో!

### సెప్టెంబర్ 7లోపు రూ.1,500 కోట్లు జమచేస్తే, తదుపరి తగిన ఉత్తర్వులిస్తామని స్పష్టీకరణ



**న్యూఢిల్లీ:** మహారాష్ట్ర పుణేలోని రూ.34,000 కోట్ల యాంబీ వ్యాలీ వేలాన్ని నిలిపివేయాలని సహారా చేసిన అభ్యర్థనను సుప్రీంకోర్టు గురువారం తిరస్కరించింది. వేలం ప్రక్రియను నిలిపివేస్తే, రూ.1,500 కోట్లు తక్షణం చెల్లిస్తామని సుబ్రతో రాయ్ చేసిన ప్రతిపాదనను జస్టిస్ దీపక్ మిశ్రా నేతృత్వంలోని బెంచ్ ప్రస్తావిస్తూ, 'నమ్మశక్యం కాని అంశాన్ని నమ్మడమే' అని వ్యాఖ్యానించింది. వేలం ప్రక్రియ నిర్ణేత షెడ్యూల్ ప్రకారం కొనసాగుతుందని, అయితే సెప్టెంబర్ 7వ తేదీ లోపు సెబీ-సహారా రిఫండ్ అకౌంట్‌లో రూ.1,500 కోట్లు జమచేస్తే మాత్రం బెంచ్ తగిన ఆదేశాలు ఇస్తుందని బెంచ్ స్పష్టం చేసింది.

**న్యూయార్క్ హోటల్స్ విక్రయం**

సహారా అడ్వకేట్ కపిల్ సిబల్ కోర్టుకు తన వాదనలు వినిపిస్తూ, న్యూయార్క్‌లోని హోటల్స్‌ను అమ్మడం జరిగిందనీ, త్వరలో ఈ నిధులు సహారా అకౌంట్‌కు వస్తాయని, వెను వెంటనే సెప్టెంబర్ 7లోపు సెబీ-సహారా అకౌంట్‌కు రూ.1,500 కోట్లు జమచేస్తామని తెలిపారు. సహారా వడ్డీతో కలిపి దాదాపు రూ.35,000 కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉందని మార్కెట్ రెగ్యులేటర్- సెబీ సుప్రీంకోర్టుకు చెబుతోంది.

## జెట్ ఎయిర్‌వేస్ డిస్కౌంట్ ఆఫర్



**ముంబై:** 'జెట్ ఎయిర్‌వేస్' తాజాగా స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని టికెట్ ధరల డిస్కౌంట్ ఆఫర్‌ను ప్రకటించింది. ఇందులో భాగంగా దేశీ, విదేశీ ప్రయాణానికి సంబంధించిన బిజినెస్ తరగతి టికెట్ల బేస్ ఫెయిర్‌లో 20%, ఎకానమీ తరగతి టికెట్ల బేస్ ఫెయిర్‌లో 30% డిస్కౌంట్‌ను అందిస్తోంది. ఆగస్ట్ 11న ప్రారంభమైన ఈ డిస్కౌంట్ ఆఫర్ ఆరు రోజుల పాటు అందుబాటులో ఉండనుందని, ఇందులో భాగంగా టికెట్లను బుకింగ్ చేసుకున్న దేశీ ప్రయాణికులు సెప్టెంబర్ 5 నుంచి, విదేశీ ప్రయాణికులు సెప్టెంబర్ 15 నుంచి ప్రయాణించొచ్చని జెట్ ఎయిర్‌వేస్ తెలిపింది.

# జేకుమార్, ప్రకాశ్ ఇండస్ట్రీస్‌కు శాట్ ఊరట

### ట్రేడింగ్ ఆంక్షలపై స్టే ఉత్తర్వులు ● సెప్టెంబర్ 4కి విచారణ వాయిదా ● నేటి నుంచి షేర్లలో యథాప్రకారం ట్రేడింగ్




**ముంబై:** అనుమానాస్పద షెల్ కంపెనీల అభియోగాలతో ట్రేడింగ్‌పరమైన ఆంక్షలు ఎదుర్కొంటున్న జేకుమార్, ప్రకాశ్ ఇండస్ట్రీస్‌కి కాస్త ఊరట లభించింది. మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ ఆంక్షలపై స్టే విధిస్తూ సెక్యూరిటీస్ అప్పిలేట్ ట్రిబ్యునల్ (శాట్) గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఎలాంటి విచారణ లేకుండానే సెబీ ఆదేశాలు ఇచ్చినట్లు తెలుస్తోందని ఈ సందర్భంగా వ్యాఖ్యానించింది. తదుపరి విచారణ సెప్టెంబర్ 4కి వాయిదా వేసింది. తాజా పరిణామంతో ఈ రెండు సంస్థల షేర్లలో శుక్రవారం నుంచి మళ్లీ యథాప్రకారం ట్రేడింగ్ జరగనుంది. ఈ మేరకు బీఎస్ఈ, ఎన్ఎస్ఈ కూడా సర్క్యులర్‌లు విడుదల చేశాయి. రెండు సంస్థల షేర్లను నిఘా చర్యల (జీఎస్ఎం) పరిధి నుంచి తప్పించనున్నట్లు పేర్కొన్నాయి. 20 శాతం శ్రేణిలో వీటిలో ట్రేడింగ్‌కు అనుమతించనున్నట్లు వివరించాయి. 'అనుమానాస్పద డొల్ల కంపెనీలు' అభియోగాలతో 331 సంస్థల షేర్లలో ట్రేడింగ్‌పై సెబీ ఆగస్టు 7న ఆంక్షలు విధించిన సంగతి తెలిసిందే. ఈ జాబితాలోని కొన్ని కంపెనీల్లో దేశ విదేశాలకు చెందిన ప్రముఖ ఇన్వెస్టర్ల పెట్టుబడులు కూడా ఉన్నాయి. సెబీ ఆదేశాలను సవాలు చేస్తూ జేకుమార్ ఇన్‌ఫ్రాప్రాజెక్ట్స్, ప్రకాశ్ ఇండస్ట్రీస్ తమను ఆశ్రయించడంతో శాట్ తాజా ఉత్తర్వులు ఇచ్చింది. అటు స్టాక్ ఎక్స్ఛేంజీలు సైతం తమ నిర్ణయాలను ఉపసంహరించుకోవాలని సూచించింది.

**విచారణ లేకుండానే ఆంక్షలు..**

'పిటీషనర్లు వాదిస్తున్నట్లుగా.. కార్పొరేట్ వ్యవహారాల శాఖ (ఎంసీఏ) 2017 జూన్ 9న పంపిన లేఖలో అనుమానాస్పదమైనవిగా భావిస్తున్న 331 కంపెనీలు నిజంగానే డొల్ల కంపెనీలేనా లేక నిఖార్సయినవేనా అన్నది మాత్రమే సెబీ విచారణ జరపాల్సి ఉంది. కానీ ఎలాంటి విచారణ జరపకుండానే సెబీ ఆంక్షల ఆదేశాలు జారీ చేసినట్లు తెలుస్తోంది' అని ట్రిబ్యునల్ వ్యాఖ్యానించింది. పైగా ఎంసీఏ సూచనలను అమలు చేయడానికి సెబీ దాదాపు రెండు నెలల సమయం తీసుకోవడాన్ని బట్టి చూస్తే.. విచారణ లేకుండానే అత్యవసరంగా ఆదేశాలివ్వాల్సినంత పరిస్థితి కూడా లేదని స్పష్టంగా తెలుస్తోందని శాట్ పేర్కొంది. సదరు కంపెనీల వివరణ కూడా తీసుకున్న సెబీ హోల్‌టైమ్ మెంబరు.. మరింత సమాచారం కావాలని కోరినట్లు తమ దృష్టికి వచ్చినట్లు శాట్ పేర్కొంది. అయితే, ఈ ప్రక్రియలో జాప్యం జరుగుతుండటంతో పిటీషనర్ల ప్రయోజనాలకు భంగం వాటిల్లుతున్న నేపథ్యంలో ఊరటనిచ్చేలా మధ్యంతర ఉత్తర్వులు జారీ చేస్తున్నట్లు వివరించింది.

## నిత్యావసరాల ధరలు (హోల్‌సేల్/క్వింటాల్‌కు)




| సరుకు | ధర |
|---|---|
| పత్తి (వరంగల్, వ్యాపారస్తులు) | రూ.4,850 (కనిష్టం), రూ.5,170 (గరిష్టం) |
| మిర్చి (వరంగల్, తేజ) | రూ.2,000 (కనిష్టం), రూ.4,800 (గరిష్టం) |
| పసుపు (నిజామాబాద్, కొమ్ము) (4న ముగింపు) | రూ.3,527 (కనిష్టం), రూ.8,284 (గరిష్టం) |
| ఉల్లి (కర్నూలు) (20న ముగింపు) | రూ.260 (కనిష్టం), రూ.840 (గరిష్టం) |
| చక్కెర (చెన్నై) | రూ.4,100 |
| బియ్యం (కరీంనగర్) | రూ.3,600 (హెచ్ఎంటీ) |
| కందిపప్పు (చెన్నై) | రూ.6,500 |
| సుబాబులు (కృష్ణా) | రూ.4,400 (టన్నుకు) |
| ఆయిల్ పామ్ (పశ్చిమ గోదావరి) | రూ.6,781 |











# నాలుగో రోజూ నష్టాలే

## సెన్సెక్స్ మరో 267 పాయింట్లు డౌన్

- ఇంట్రాడేలో 9.800 పాయింట్ల స్థాయిని కోల్పోయిన నిఫ్టీ
- అమెరికా–ఉత్తరకొరియా మధ్య ఉద్రిక్తతల ప్రభావం



**ముంబై:** అమెరికా– ఉత్తర కొరియాల మధ్య ఉద్రిక్తతలు పెరిగిపోవడంతో వరుసగా నాలుగో రోజూ స్టాక్ మార్కెట్ పడిపోయింది. గురువారం బీఎస్ఈ సెన్సెక్స్ మరో 267 పాయింట్లు పతనమై నెలరోజుల కనిష్టస్థాయి 31,531 పాయింట్ల వద్ద ముగిసింది. ఇంట్రాడేలో 31,423 పాయింట్ల కనిష్టస్థాయిని తాకిన తర్వాత స్వల్పంగా జరిగిన షార్ట్ కవరింగ్ కారణంగా నష్టాల్లో కొంతమేర పూడ్చుకోగలిగింది. సెన్సెక్స్ నాలుగురోజుల్లో దాదాపు 800 పాయింట్లు పతనమయ్యింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ ట్రేడింగ్ తొలిదశలోనే గ్యాప్‌డౌన్‌తో 9,900 పాయింట్ల దిగువన ప్రారంభమై, ఇంట్రాడేలో 9,800 పాయింట్ల స్థాయిని సైతం కోల్పోయింది. 9,776 పాయింట్ల కనిష్టస్థాయిని తాకిన తర్వాత,..చివరకు 88 పాయింట్ల నష్టంతో 9,820 పాయింట్ల వద్ద క్లోజయ్యింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్ర హెచ్చరికల్ని భేఖాతరు చేస్తూ అమెరికా నౌకా స్థావరంపై ఈ నెల మధ్యలో దాడి చేస్తామంటూ ఉత్తర కొరియా ప్రకటించిన నేపథ్యంలో ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలో అమ్మకాలు జరిగాయి. ఈ ట్రెండ్‌లో భాగంగానే ఇక్కడ పతనం జరిగినట్లు మార్కెట్ వర్గాలు పేర్కొన్నాయి. ఇప్పటికే కొన్ని షెల్ కంపెనీల ట్రేడింగ్ నిలుపుచేస్తూ మార్కెట్ నియంత్రణా సంస్థ సెబి జారీచేసిన ఆదేశాల కారణంగా అట్టుడుకుతున్న మార్కెట్‌ను అమెరికా–కొరియా ఉద్రిక్తతలు మరింత దెబ్బతీశాయని ఆ వర్గాలు వివరించాయి.

**మరి కొంత కరెక్షన్...**

భౌగోళిక ఉద్రిక్తతల ప్రభావంతో ప్రస్తుత బుల్ మార్కెట్‌లో మరికొంతమేర కరెక్షన్ జరగవచ్చని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ చెప్పారు. షెల్ కంపెనీలపై సెబి చర్యలతో దేశీయ ఇన్వెస్టర్ల విశ్వాసం ఇప్పటికే దెబ్బతినివుందని, మరోవైపు కొన్ని రంగాల్లో కార్పొరేట్ల వ్యాపార వృద్ధిమందగించినట్లు ఫలితాల్లో వెల్లడైనందున..వచ్చే 1–2 క్వార్టర్లకు డౌన్‌గ్రేడ్స్ జరగవచ్చని, ఈ అంశాల ప్రభావంతో మార్కెట్లో కొంత కరెక్షన్ వుండవచ్చని ఆయన వివరించారు.

## స్టాక్ మార్కెట్ డేటా

| | టర్నోవర్ (రూ. కోట్లలో) |
|---|---|
| బీఎస్ఈ | 4,589 |
| ఎన్ఎస్ఈ (ఈక్విటీ) | 31,702 |
| ఎన్ఎస్ఈ (డెరివేటివ్స్) | 11,57,386 |
| ఎఫ్ఐఐ | -1,171 |
| డీఐఐ | 822 |

## టాటా మోటార్స్ 8 శాతం డౌన్

నిరుత్సాహకరమైన ఆర్థిక ఫలితాల్ని వెల్లడించిన టాటా మోటార్స్ షేరు 8.6 శాతం పతనమై 52 వారాల కనిష్టస్థాయి రూ. 380 వద్ద ముగిసింది. సెన్సెక్స్–30 షేర్లలో అధికంగా క్షీణించిన షేరు ఇదే. వరుసగా కొద్దిరోజుల నుంచి పతనమవుతూ వస్తున్న ఫార్మా షేర్లు గురువారం సైతం భారీగా తగ్గాయి. డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్ దాదాపు 5 శాతం తగ్గుదలతో ఏడాది కనిష్టస్థాయి రూ. 1,945 వద్ద క్లోజయ్యింది. మరోవైపు మిడ్‌క్యాప్, స్మాల్ క్యాప్ షేర్లు నిలువునా పతనమయ్యాయి.

## ఎండెంట్ డైమండ్ సెట్ రూ.10,000



రిలయన్స్ జువెల్స్ 10వ వార్షికోత్సవం సందర్భంగా ఎక్స్‌క్లూజివ్ పెండెంట్ డైమండ్ సెట్‌ను ఆవిష్కరించింది. పెండెంట్, ఇయర్ రింగ్స్‌తో కూడిన ఈ సెట్ ధర రూ.10,000. బంగారు ఆభరణాలపై 50 శాతం, డైమండ్ జువెల్లరీపై 100 శాతం తయారీ చార్జీల తగ్గింపును కంపెనీ ప్రకటించింది. ఎస్‌బీఐ క్రెడిట్, డెబిట్ కార్డులపై 5 శాతం క్యాష్‌బ్యాక్ కూడా ఉంది. ఆఫర్ ఆగస్టు 15 వరకు ఉంటుంది.

## నిబంధనల ఉల్లంఘనతోనే మొండి బాకీలు పెరిగాయ్

### ఆర్ఈసీ, పీఎఫ్‌సీలకు కాగ్ అక్షింతలు

**న్యూఢిల్లీ:** స్వతంత్ర విద్యుదుత్పత్తి సంస్థలకు రుణాలిచ్చే విషయంలో అంతర్గత మార్గదర్శకాలు పాటించకపోవడం వల్లే ప్రభుత్వ రంగ సంస్థలు ఆర్ఈసీ, పీఎఫ్‌సీ మొండి బాకీలు ఎగిశాయని కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) ఆక్షేపించింది. అటు రిజర్వ్ బ్యాంక్ నిర్దేశిత నిబంధనల ప్రకారమైనా ఆయా ఖాతాలను సరిగ్గా మదింపు చేయకుండా రిస్కులు తీసుకున్నాయని అక్షింతలు వేసింది.

## నేటి బోర్డు మీటింగ్స్

➤ జీఎంఆర్ ఇన్‌ఫ్రా ➤ ఎస్‌బీఐ ➤ బీపీసీఎల్
➤ సిప్లా ➤ గోద్రెజ్ ఇండ. ➤ హిందాల్కో
➤ క్యాడిలా హెల్త్‌కేర్ ➤ ఆర్ఈసీ ➤ బీఓబీ
➤ అలహాబాద్ బ్యాంక్ ➤ ఓబీసీ ➤ బ్లూ స్టార్
➤ జేఎస్‌డబ్ల్యూ ఎనర్జీ ➤ ఆయిల్ ఇండియా
➤ సన్ టీవీ ➤ అవంతి ఫీడ్స్ ➤ సీఈఎస్‌సీ
➤ టీవీఎస్ ➤ సుజ్లాన్ ➤ క్లారిస్ లైఫ్
➤ స్ట్రైడ్స్ షాసున్ ➤ ఒరాకిల్ ➤ కార్పొ బ్యాంక్

## బులియన్ రూ.లలో

| | | | |
|---|---|---|---|
| **ముంబై** | | | |
| బంగారం (99.9, 10గ్రా) | 29,070 | ▲ | 340 |
| బంగారం (99.5, 10గ్రా) | 28,920 | ▲ | 340 |
| వెండి (కిలో) | 38,995 | ▲ | 1,120 |
| **చెన్నై** | | | |
| బంగారం (24 క్యారెట్లు) | – – | | |
| బంగారం (22 క్యారెట్లు) | 27,560 | ▲ | 290 |
| వెండి (కిలో) | – – | | |
| **హైదరాబాద్** | | | |
| బంగారం (24 క్యారెట్లు) | 29,440 | ▲ | 360 |
| బంగారం (22 క్యారెట్లు) | 27,530 | ▲ | 350 |
| వెండి(కిలో) | 38,925 | ▲ | 960 |
| **ప్రొద్దుటూరు** | | | |
| బంగారం (24 క్యారెట్లు) | 29,800 | ▲ | 260 |
| బంగారం (22 క్యారెట్లు) | 27,590 | ▲ | 220 |
| వెండి(కిలో) | 39,900 | ▲ | 900 |
| **విశాఖపట్నం** | | | |
| బంగారం (24 క్యారెట్లు) | 29,440 | ▼ | 160 |
| బంగారం (22 క్యారెట్లు) | 27,530 | ▲ | 330 |
| వెండి(కిలో) | 39,200 | | 0 |
| **విజయవాడ** | | | |
| బంగారం (24 క్యారెట్లు) | 30,000 | ▲ | 200 |
| బంగారం (22 క్యారెట్లు) | 27,950 | ▲ | 200 |
| వెండి(కిలో) | 40,400 | ▲ | 1,000 |
| **ఏపీ బులియన్ అసోసియేషన్** | | | |
| బంగారం (24 క్యారెట్లు) | 29,950 | ▲ | 380 |
| బంగారం (22 క్యారెట్లు) | 27,730 | ▲ | 350 |
| వెండి(కిలో) | 40,300 | ▲ | 1,000 |

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

## కోడిగుడ్లు (హోల్‌సేల్ -నెక్ /100కు రూ.లలో) 11-8-2017

| | |
|---|---|
| విశాఖ | 348-00 |
| చిత్తూరు | 375-00 |
| వరంగల్ | 337-00 |
| ముంబై | 380-00 |
| చెన్నై | 382-00 |
| విజయవాడ | 343-00 |
| గోదావరి | 343-00 |
| నమక్కల్ | 370-00 |
| **10-8-2017 ఫామ్ ధర...** | |
| హైదరాబాద్ | 335-00 |
| రిటైల్ (ఒక గుడ్డుకు) | 3.95 |
| బెంగళూరు | 365-00 |

## మెడిలైట్ హెచ్-రిచ్ వాటర్ ఆయనైజర్



మీడియాతో మాట్లాడుతున్న శ్రీనివాస యాదవ్

**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** హైడ్రోజన్ వాటర్ ఆయనైజర్ల విక్రయంలో ఉన్న మెడిలైట్ తాజాగా హెచ్-రిచ్ పేరుతో కొత్త ఉత్పాదనను గురువారమిక్కడ విడుదల చేసింది. హైడ్రోజన్ ఆధారిత ఆల్కలైన్ యాంటీ ఆక్సిడెంట్ వాటర్ ఆయనైజర్స్ విభాగంలో భారత్‌లో ఇదే తొలి ఉత్పాదన అని కంపెనీ ఎండీ కందుల శ్రీనివాస యాదవ్ ఈ సందర్భంగా మీడియాకు తెలిపారు. ఇది 4 నుంచి 11.5 పీహెచ్ స్థాయిల్లో నీటిని అందిస్తుందని చెప్పారు. 'హెచ్-రిచ్‌ను తైవాన్‌లోని థర్డ్ పార్టీ కంపెనీలో తయారు చేయించి సొంత బ్రాండ్‌లో దిగుమతి చేసుకుంటున్నాం. ఈ ఉత్పాదనకు పేటెంట్ ఉంది. ప్లాటినం కోట్ కలిగిన టైటానియం విడిభాగాలను ఇందులో వాడారు. స్వచ్ఛమైన ఈ మంచి నీరు ఆరోగ్యానికి మంచిది. ధర రూ.1,26,000. వాయిదా పద్ధతిలోనూ అందించేందుకు బజాజ్ ఫైనాన్స్, కొటక్ మహీంద్రా బ్యాంకుతో చేతులు కలిపాం. అర్హులైన కస్టమర్లకు మెడిలైట్ సైతం రుణ సాయం చేస్తుంది' అని తెలిపారు.

## బిగ్‌బజార్ 5 రోజుల 'మహాబచత్'

### ఈ నెల 12 నుంచి 16 వరకు సేల్

**హైదరాబాద్:** ఫ్యూచర్ గ్రూప్‌కు చెందిన రిటైల్ చైన్ 'బిగ్‌బజార్' తాజాగా ఐదు రోజుల మెగా డిస్కౌంట్ సేల్ 'మహాబచత్'ను ప్రకటించింది. ఈ సేల్ ఆగస్టు 12 నుంచి 16 వరకు అందుబాటులో ఉండనున్న ఈ బిగ్గెస్ట్ సేవింగ్స్ సేల్‌లో వినియోగదారులు ఎలక్ట్రానిక్స్, ఫుడ్ అండ్ గ్రాసరీ, దుస్తులు, గృహోపకరణాలు వంటి పలు ఉత్పత్తులపై ఆకర్షణీయ డిస్కౌంట్‌ను పొందొచ్చని సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది.

## లారస్ ల్యాబ్స్ లాభం రూ.38.9 కోట్లు

**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** లారస్ ల్యాబ్స్ 2017–18 తొలి త్రైమాసికంలో 51.7 శాతం వృద్ధి రేటుతో రూ.38.9 కోట్ల లాభాన్ని ఆర్జించింది. ఎబిటా 19.5 శాతం వృద్ధితో రూ.103.5 కోట్లుగా ఉంది. మొత్తం నికర ఆదాయం 16.7 శాతం వృద్ధి చెంది రూ.478.4 కోట్లుగా ఉంది.

## యూనియన్ బ్యాంక్ లాభం 30 శాతం డౌన్



**ముంబై:** మొండి బాకీలు, భారీ ప్రొవిజనింగ్‌ల కారణంగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో ప్రభుత్వ రంగ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (యూబీఐ) నికర లాభం 30 శాతం క్షీణించి రూ. 117 కోట్లకు పరిమితమైంది. స్థూల నిరర్థక ఆస్తులు ఏకంగా 10.16 శాతం నుంచి 12.63 శాతానికి ఎగిశాయి. నికర నిరర్థక ఆస్తులు 6.16 శాతం నుంచి 7.47 శాతానికి పెరిగాయి. సీక్వెన్షియల్ ప్రాతిపదికన లాభం పెరిగినప్పటికీ మొండిబాకీలకు కేటాయింపుల వల్ల వార్షిక ప్రాతిపదికన చూస్తే 30 శాతం క్షీణించిందని బ్యాంక్ సీఈవో రాజ్‌కిరణ్ రాయ్ పేర్కొన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొత్తం రుణాల్లో మరో 4 శాతం కొత్తగా మొండి బాకీలుగా మారే అవకాశం ఉందని భావిస్తున్నట్లు రాయ్ పేర్కొన్నారు. మరో 10 ఎన్‌పీఏ ఖాతాలను నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ ముందుకు పంపాలని యోచిస్తున్నట్లు వివరించారు.

## ఆర్ఐఎల్.. 'ఫ్యూచర్స్' సిగ్నల్స్!



ఈ రోజు ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్‌లో (ఎఫ్అండ్ ఓ) ఏ షేర్లయితే బెటర్? ఆ 'ఫ్యూచర్ సిగ్నల్స్' 'సాక్షి' పాఠకులకు ప్రత్యేకం...

**ఆర్ఐఎల్..**

ప్రపంచ మార్కెట్ల ట్రెండ్‌లో భాగంగా మన మార్కెట్ కూడా గురువారం బాగా తగ్గింది. ఐటీ షేర్లు మినహా దాదాపు బ్లూచిప్ షేర్లన్నీ నష్టాల్లోనే ముగిసాయి. ఈ క్రమంలోనే ఇటీవల పెద్ద ర్యాలీ జరిపిన రిలయన్స్ ఇండస్ట్రీస్ కూడా 1 శాతం క్షీణతతో రూ. 1,584 వద్ద క్లోజయ్యింది. స్పాట్ మార్కెట్లో ట్రేడింగ్ పరిమాణం తక్కువగా నమోదు కాగా, ఫ్యూచర్ కాంట్రాక్టు నుంచి 4.71 షేర్లు (3.59 శాతం) కట్ అయ్యాయి. ఫ్యూచర్ ఓపెన్ ఇంట్రస్ట్ (ఓఐ) 1.26 కోట్లకు తగ్గింది. గురువారం నిఫ్టీ, బ్యాంక్ నిఫ్టీలతో సహా దాదాపు అన్ని స్టాక్ ఫ్యూచర్ల నుంచి కొంతవరకూ లాంగ్ అన్‌వైండింగ్ జరిగింది. అయితే పలు షేర్ల ఫ్యూచర్ ప్రీమియంలు తగ్గగా, ఆర్ఐఎల్ ఫ్యూచర్ కాంట్రాక్టు ప్రీమియం పెరిగింది. ఆర్ఐఎల్ స్పాట్ ధరతో పోలిస్తే ఫ్యూచర్ ప్రీమియం క్రితంరోజుకంటే నాటకీయంగా రూ. 2 నుంచి రూ. 9కి పెరిగింది. ఓఐ తగ్గుతూ...ప్రీమియం పెరగడం షార్ట్ కవరింగ్ కార్యకలాపాల్ని సూచిస్తోంది. రూ. 1,600, 1,620 స్ట్రయిక్స్ వద్ద స్వల్పంగా కాల్ రైటింగ్ జరగడంతో వీటివద్ద కాల్ బిల్డప్ 6.86 లక్షలు, 6.64 లక్షల షేర్లకు పెరిగింది. కానీ 1,640 స్ట్రయిక్ వద్ద కాల్ కవరింగ్ కారణంగా బిల్డప్ నుంచి లక్ష షేర్లు తగ్గగా, బిల్డప్ 8.08 లక్షల షేర్లకు దిగింది. ఈ ట్రెండ్ షేరుకి నిరోధస్థాయి రూ. 1,640 నుంచి దిగువ శ్రేణి రూ. 1,600–1,620 వద్దకు తగ్గుతుందని కాల్‌రైటర్లు భావించడం కారణం కావొచ్చు. రూ. 1,600 స్థాయికి 1 % దిగువన షేరు ముగిసినా, ఆ స్ట్రయిక్ వద్ద పుట్ బిల్డప్ నుంచి కేవలం 39 వేల షేర్లు కట్ అయ్యాయి. ఇక్కడ 5.50 లక్షల పుట్ బిల్డప్ వుంది. రూ. 1,580 స్ట్రయిక్ వద్ద కూడా 39 వేల పుట్స్ కట్ కాగా, బిల్డప్ 5.50 లక్షలకు చేరింది. సమీప భవిష్యత్తులో ఈ షేరు రూ. 1,580పైన స్థిరపడితే రూ. 1,600–1,620 శ్రేణిని చేరవచ్చని, రూ. 1,580 స్థాయి దిగువన కొనసాగితే క్రమేపీ క్షీణించవచ్చని ఈ ఆప్షన్ డేటా వెల్లడిస్తున్నది.

→ బ్యాంక్ నిఫ్టీ ఫ్యూచర్ సంకేతాలు ఎలా వున్నాయి? - ఈ వివరాలు W . wో C

## ఎన్ఎస్ఈ నగదు విభాగంలో ట్రేడైన షేర్లు

| కంపెనీ పేరు | ముగింపు ధర | క్రితం ముగింపు |
|---|---|---|
| ACC LIMITED | 1776.7 | 1819.5 |
| ADANI PORT | 385.65 | 397.25 |
| AMBUJA CEME | 267.45 | 273.2 |
| ASIAN PAINT | 1151.1 | 1155.55 |
| AXIS BANK L | 485.5 | 486.95 |
| BAJAJ AUTO | 2796.2 | 2831.15 |
| BANK OF BAR | 148.45 | 155.2 |
| BHARTI AIRT | 416.25 | 416.05 |
| BOSCH LIMIT | 23543.8 | 24032 |
| BHARAT PETR | 481.5 | 495.95 |
| CIPLA LTD | 548.2 | 561.85 |
| COAL INDIA | 238.95 | 242.5 |
| EICHER MOTO | 30111.7 | 31489.1 |
| GAIL (INDIA | 365 | 382.2 |
| HCL TECHNOL | 882.9 | 878.75 |
| HDFC LTD | 1709.8 | 1731.65 |
| HDFC BANK L | 1760.45 | 1764.45 |
| HERO MOTOCO | 3889.55 | 3883.75 |
| HINDALCO I | 238 | 239.45 |
| HIND.Unilever | 1170.7 | 1185.35 |
| INDIABULLS | 1156.5 | 1159 |
| ICICI BANK | 288.75 | 290.6 |
| INDUSIND BA | 1629.4 | 1637.25 |
| BHARTI INFR | 382.45 | 381.7 |
| INFOSYS LIM | 981.25 | 969.35 |
| INDIAN OIL | 410.3 | 414.05 |
| ITC LTD | 273.1 | 272.85 |
| KOTAK MAHIN | 996.8 | 992.4 |
| LARSEN & TO | 1157.7 | 1153.9 |
| LUPIN LIMIT | 936.7 | 952.95 |
| MAHINDRA & | 1387.05 | 1392.3 |
| MARUTI SUZU | 7578.75 | 7661.6 |
| NTPC LTD | 172.65 | 173.65 |
| OIL AND NAT | 163.7 | 165.7 |
| POWER GRID | 217.4 | 221.9 |
| RELIANCE IN | 1584.35 | 1598.8 |
| STATE BANK | 296.7 | 302.3 |
| SUN PHARMAC | 460.8 | 474.35 |
| TATA MOTORS | 380.2 | 416.05 |
| TATA MOTORS | 221.45 | 242.25 |
| TATA POWER | 76.7 | 77.8 |
| TATA STEEL | 604.35 | 605.05 |
| TATA CONSUL | 2511.45 | 2512 |
| TECH MAHIND | 404 | 393.85 |
| ULTRATECH C | 3907.6 | 3997.85 |
| VEDANTA LIM | 298.8 | 300.2 |
| WIPRO LTD | 288.15 | 286.5 |
| YES BANK LI | 1730.1 | 1741.55 |
| ZEE ENTERTA | 520.05 | 540 |

### నిఫ్టీ నెక్స్ట్ ఫిఫ్టీ

| కంపెనీ పేరు | ముగింపు ధర | క్రితం ముగింపు |
|---|---|---|
| ABB INDIA L | 1341.6 | 1386.35 |
| ASHOK LEYLA | 103.45 | 109.6 |
| BAJAJ FINSE | 5024.75 | 5121.9 |
| BAJAJ FINAN | 1635.6 | 1697.7 |
| BHARAT ELEC | 170.75 | 179.25 |
| BHEL | 126.75 | 133 |
| BRITANNIA I | 4119.2 | 4058.9 |
| CADILA HEAL | 466.15 | 485.45 |
| COLGATE PAL | 1054.65 | 1056.75 |
| CONTAINER C | 1145.45 | 1168.85 |
| CUMMINS IND | 893 | 904.35 |
| DABUR INDIA | 306.55 | 310.5 |
| DLF LIMITED | 164.6 | 178.85 |
| EMAMI LIMIT | 1091.85 | 1128.65 |
| GLAXOSMITHK | 2374.55 | 2392.1 |
| GLENMARK PH | 612.75 | 645.45 |
| GODREJ CONS | 901.75 | 921.8 |
| GLAXOSMITHK | 5411.15 | 5409.85 |
| HAVELLS IND | 463.65 | 497.95 |
| HIND.Petroleum | 412.45 | 429.65 |
| HIND.Zinc | 280.8 | 286.65 |
| ICICI PRU L | 413.8 | 425.75 |
| IDEA CELLUL | 87.95 | 91.05 |
| INTERGLOBE | 1273.7 | 1303.35 |
| JSW STEEL L | 222.75 | 230.45 |
| LIC HOUSING | 657.65 | 676.9 |
| MARICO LIMI | 320.55 | 325.7 |
| UNITED SPIR | 2490.8 | 2535.95 |
| MOTHERSON S | 317.45 | 329.05 |
| NHPC LTD | 30.05 | 30.85 |
| NMDC LTD. | 121.75 | 126.15 |
| ORACLE FIN | 3445.45 | 3552.9 |
| OIL INDIA L | 281.95 | 282.05 |
| PIRAMAL ENT | 2731.1 | 2851.55 |
| PETRONET LN | 208.2 | 207.45 |
| POWER FIN C | 124.55 | 134.1 |
| P&G HYGIENE | 8017.6 | 8104.3 |
| PIDILITE IN | 795.35 | 795.25 |
| PUNJAB NATI | 143.15 | 148.3 |
| RURAL ELEC | 163.75 | 175.25 |
| STEEL AUTHO | 58.85 | 61.45 |
| SHREE CEMEN | 17336.3 | 17945.95 |
| SIEMENS LTD | 1289.45 | 1325.75 |
| SHRIRAM TRA | 933.75 | 942.75 |
| SUN TV NETW | 680.8 | 705.55 |
| TITAN COMPA | 610.35 | 619.15 |
| TORRENT PHA | 1228.9 | 1234.7 |
| UNITED BREW | 824.2 | 832.35 |
| UPL LIMITED | 821.5 | 830.5 |

## బీఎస్ఈలో ఏపీ,టీఎస్ స్టాక్స్

| కంపెనీ పేరు | ముగింపు ధర | క్రితం ముగింపు |
|---|---|---|
| AditSpin | 9 | 9.1 |
| Alphageo | 795 | 806.15 |
| Alu Flouride | 53.25 | 56.45 |
| Amar Raja Bat | 798.85 | 802.45 |
| And Bank | 50.85 | 54.15 |
| And Cemen | 8.61 | 9.06 |
| And Paper | 283.25 | 299.7 |
| And Petro | 24.9 | 25.6 |
| Anjani Portl | 200.45 | 218.8 |
| Aries Agro Ltd | 140.25 | 148.8 |
| Aurobindo Ph | 683 | 684.15 |
| Avantel Soft | 215 | 223.2 |
| Avanti Feeds | 1580 | 1703.9 |
| AvonOrg | 5.42 | 5.9 |
| BN Rathi Sec | 30.55 | 31.85 |
| Balaji Amin | 304.95 | 322.85 |
| Bambino Agro | 171.95 | 180.95 |
| Bartronics | 13.8 | 14.4 |
| Bhagira Chem | 175 | 165.6 |
| Bhagya Nag | 21.9 | 22.45 |
| Bhagya Wood | 25.15 | 26.45 |
| Brilliant Sec | 7.59 | 7.78 |
| CIL Securi | 38.9 | 38 |
| Color Chip | 48 | 50.55 |
| Combat Drugs | 11.71 | 11.71 |
| Cont Coffee | 274.2 | 283.2 |
| CoroFert | 418 | 424.65 |
| Cosboard Ind | 38 | 39.85 |
| Country Club | 13.18 | 13.55 |
| Cubex Tub | 17.4 | 16.9 |
| DR Reddy | 1948.95 | 2046.65 |
| Danlaw Tec | 50.5 | 46.9 |
| DecCement | 1070.9 | 1110.55 |
| Divi's Lab | 624.65 | 638.9 |
| Divya Granit | 93.15 | 98.05 |
| Dolphin Medi | 1.27 | 1.33 |
| Dredgin Corp | 572 | 604.4 |
| Empee Sugars | 5.32 | 5.59 |
| Essen Supple | 25.35 | 26.65 |
| Everest Org | 99 | 102.85 |
| Fortune Info | 85 | 83.65 |
| Four Soft | 87.8 | 91.2 |
| GMR Ferro | 3.5 | 3.34 |
| GMR Infra | 16.15 | 16.95 |
| GVK Power | 12.05 | 12.93 |
| Gati Corpn | 109.5 | 114.3 |
| Gayatri Proj | 152.9 | 160 |
| Gayatri Sugrs | 9.24 | 9.58 |
| Gennex Lab | 4.19 | 4.19 |
| GodavDru | 38.05 | 38.4 |
| Goldstn Tele | 102.2 | 92.95 |
| Goldstone Tech | 11.62 | 12.23 |
| Granules (I) | 107.3 | 116.9 |
| HBL Nife Pow | 43.85 | 44.75 |
| HYDIndus | 984.7 | 1039.75 |
| Heritage Food | 1230.55 | 1285.45 |
| ICSA Ltd | 2.7 | 2.87 |
| IDL Industrs | 480 | 501.3 |
| IQMS Soft | 15.75 | 15.7 |
| IVRCL Infras | 5.39 | 5.69 |
| Incap | 52.85 | 50.65 |
| IndoNationl | 854 | 874.6 |
| Infotech En | 515 | 524.6 |
| Innaredy Com | 2.7 | 2.87 |
| Invinex Lab | 131 | 131.05 |
| JSTL | 39.15 | 39.6 |
| KCP LTD | 96.1 | 100.15 |
| KNR Constructio | 203 | 203.1 |
| KakatiCem | 337.55 | 365.75 |
| Kallam Spg | 27.8 | 28 |
| Kernex Micro | 33.5 | 34.1 |
| Krebs Bio | 94.7 | 99.65 |
| LGS Global | 6.6 | 6.81 |
| LancoIndus | 346.8 | 362.8 |
| Lokesh Mach | 77.1 | 79.7 |
| MIC Elec | 7.35 | 7.75 |
| Madhucon Proje | 28.65 | 29.95 |
| Maytas Infra | 39.75 | 42.25 |
| Medinova Dia | 21.85 | 23 |
| Mold-tek | 49 | 51.75 |
| Moldtek Plastic | 274.95 | 275.1 |
| Moschip Semi | 43.5 | 45.6 |
| NCLInd | 202 | 207.05 |
| NETTLINX | 110.9 | 107.15 |
| NMDC Ltd | 121.6 | 126.25 |
| NagarAgrich | 31.5 | 33.7 |
| NagarConst | 82.35 | 89.65 |
| Natco Pharma | 696.65 | 830.6 |
| Nava Bh Ventur | 122.7 | 125.65 |
| Neha Inter | 5.55 | 5.54 |
| Neocure Ther | 3.15 | 3.42 |
| Neuland Lab | 1228.3 | 1355.6 |
| Nihar Info Glo | 13.65 | 17 |
| Nile | 619 | 621.55 |
| Oil Country | 42.5 | 44.1 |
| Ortin labs | 15.5 | 16.15 |
| Pankaj Poly | 10.51 | 10.01 |
| Panyam Cemen | 56.1 | 60.6 |
| PennInd | 49.5 | 51.15 |
| PennProf | 2.66 | 2.8 |
| Phytochem I | 50.15 | 55.45 |
| Pitti Lamin | 49.15 | 50.95 |
| Pokarna | 1214 | 1228.35 |
| Prajay Engs | 8.57 | 9.02 |
| PremiExpl | 436.1 | 459.25 |
| Prism Cement | 115 | 117.6 |
| Rain Industries | 112 | 131.6 |
| Raj Packagin | 55.95 | 55.2 |
| Ram Informat | 40.7 | 45 |
| RavilFin | 7.6 | 8 |
| Reg.Ceramic | 5.58 | 5.55 |
| Restile Cer | 5.12 | 5.51 |
| Roopa Indus | 12.44 | 12.47 |
| Sagar Cem | 825 | 824.5 |
| Samkrg Pist | 251.6 | 263.1 |
| Sampre Nutri | 41 | 41.7 |
| SangInd | 75.1 | 84.55 |
| Satvah. Ispat | 37.5 | 40.75 |
| Saven Techno | 22.35 | 22.8 |
| Sibar Auto | 13.15 | 12.53 |
| Softpro Sys | 4.63 | 4.41 |
| Softsol | 37 | 38 |
| South Bio Tech | 3.06 | 3.55 |
| South Magnes | 32 | 32 |
| SrRayAlk | 26 | 28.2 |
| Srinivasa Ship | 58.5 | 60 |
| Sujana Metal | 1.5 | 1.76 |
| Sujana Towers | 3.8 | 4.2 |
| Sujana Univers | 0.93 | 1.01 |
| Surana Tele | 4.62 | 4.8 |
| Suryachakra Pow | 1.1 | 1.23 |
| Suryalata Sp | 129 | 130.25 |
| Suryava Spin | 9 | 9.39 |
| SuvarCem | 154.85 | 162.95 |
| Suven Pharma | 161.3 | 164.65 |
| TCI Finance | 21.1 | 22.05 |
| Taj Gvk Hotel | 162.35 | 162.25 |
| Tanla Solutions | 31.2 | 33.15 |
| Trans Biotek | 2.3 | 2.22 |
| Transport Co | 271.55 | 280.35 |
| Trendy Knit | 0.19 | 0.2 |
| Usher Agro | 6.8 | 7.14 |
| VBC Ferro | 41.5 | 39.65 |
| VST Indus | 2783 | 2798.2 |
| Vamshi Rubb | 59 | 60 |
| Viceroy Hotels | 17.8 | 18.3 |
| VijayTextil | 57.9 | 60.9 |
| Vimta Labs | 129.5 | 135.3 |
| Virat Crane | 36 | 36 |
| Virinchi Con | 81.5 | 84.45 |
| VisakaInd | 432.55 | 459.85 |
| Vista Pharma | 29.15 | 30.65 |
| Vivimed Labs | 109.35 | 116.55 |
| ZenoTech Lab | 45.05 | 47.4 |

# మరిన్ని మోములపై ముస్కాన్

**45%**
**తగ్గిన వీధి బాలల సంఖ్య**

- సరైన చిరునామాలు చెప్పిన వారిని స్వస్థలాలకు చేర్చేలా ఏర్పాట్లు
- అనాథ బాలలను కేజీబీవీలు, బాలసదనాలకు తరలింపు

రాష్ట్రంలో వీధి బాలల సంఖ్య తగ్గుతోంది. ఇళ్ల నుంచి పారిపోవడం, తప్పిపోవడం లాంటి కారణాలతో వీధిన పడ్డ పిల్లల్ని సంరక్షించి పునరావాసం కల్పించేందుకు శిశు సంక్షేమశాఖ ఆరు నెలలకోసారి చేపడుతున్న ఆపరేషన్ స్మైల్, ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమాలు సత్ఫలితాలిస్తున్నాయి. ఈ ఏడాది జనవరిలో చేపట్టిన ఆపరేషన్ స్మైల్ కార్యక్రమంలో రాష్ట్రవ్యాప్తంగా 4,033 మంది పిల్లలను గుర్తించగా జూలైలో చేపట్టిన ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమంలో 2,496 మంది బాలలను గుర్తించారు. ఆరు నెలల వ్యవధిలో వీధి బాలల సంఖ్య తగ్గినట్లు మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ పేర్కొంది. తాజాగా గుర్తించిన పిల్లల్ని బాల సదనాలు, కేజీబీవీల్లో చేర్పించడంతోపాటు సరైన చిరునామా ఇచ్చిన పిల్లల్ని స్వగృహాలకు తరలించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. వీధి బాలల సంఖ్య ఎక్కువగా పట్టణ ప్రాంతాల్లోనే ఉంటుంది. తాజాగా నిర్వహించిన ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమంలో హైదరాబాద్‌తోపాటు వరంగల్, కరీంనగర్, నిజామాబాద్ జిల్లాల్లో ఎక్కువ మంది వీధి బాలలను గుర్తించినట్లు గణాంకాలు చెబుతున్నాయి.

-సాక్షి, హైదరాబాద్



## ప్లాట్‌ఫారాలు, బస్టాపుల్లోనే ఎక్కువ మంది..

జూలై 1 నుంచి 30 వరకు నిర్వహించిన ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమంలో 2,496 మంది వీధి బాలలను అధికారులు గుర్తించారు. వారిలో రాష్ట్రానికి చెందిన పిల్లలు 2,402 మందికాగా మిగిలిన వారు పొరుగు రాష్ట్రాలకు చెందిన పిల్లలు. తాజాగా గుర్తించిన వారిలో ఎక్కువ మంది రైల్వే ప్లాట్‌ఫారాలు, బస్టాపులు, కూడళ్లలో తిరుగుతూ అధికారులకు కనబడగా మరికొందరు యాచిస్తూ కనిపించారు. పొరుగు రాష్ట్రాల నుంచి వచ్చిన పిల్లల్లో కొందరు తప్పిపోగా మరికొందరు పరిశ్రమలు, కర్మాగారాల్లో బాలకార్మికులుగా పనిచేస్తున్నారు. ముస్కాన్ బృందాలు ఆయా పరిశ్రమలపై దాడులు నిర్వహించి బాలలకు విముక్తి కలిగించారు. వారిలో అత్యధికంగా ఒడిశాకు చెందిన 47 మంది చిన్నారులు ఉండగా ఆ తర్వాతి స్థానంలో బిహార్‌కు చెందిన పిల్లలున్నారు. ఆయా పిల్లలకు ప్రత్యేకంగా కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నామని, చిరునామాలు చెప్పిన వారిని ప్రభుత్వ ఖర్చుతో ఇళ్లకు పంపిస్తున్నామని మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ సంయుక్త సంచాలకులు లక్ష్మీదేవి తెలిపారు.

## కేజీబీవీలకు అనాథ బాలలు...

ఆపరేషన్ స్మైల్, ముస్కాన్ ద్వారా గుర్తించిన వీధి బాలల్లో అనాథలను కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో, బాలసదనాల్లో అధికారులు చేర్పిస్తున్నారు. తాజా ఆపరేషన్లో 286 మందిని బాలసదనాలు, కేజీబీవీల్లో చేర్పించినట్లు శిశు సంక్షేమశాఖ అధికారులు చెబుతున్నారు. వీధి బాలల సంరక్షణకు ఆరు నెలలకోసారి నిర్వహించే ప్రత్యేక కార్యక్రమాలే కాకుండా నిరంతరం పనిచేసేలా బాలల పరిరక్షణ సెల్‌లు ఏర్పాటు చేశారు. ఈ కమిటీలు క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశ్రమలు, నిర్మాణ ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించాలని శిశు సంక్షేమశాఖ ఆదేశాలు జారీ చేసింది.

**ఈ ఏడాది ఆపరేషన్ స్మైల్, ముస్కాన్‌లో నమోదైన పిల్లల వివరాలు**

| కేటగిరీ | మొత్తం పిల్లలు | బాలలు | బాలికలు |
|---|---|---|---|
| స్మైల్ | 4,033 | 3,713 | 320 |
| ముస్కాన్ | 2,496 | 2,108 | 388 |

**ఆపరేషన్ ముస్కాన్‌లో దొరికిన ఇతర రాష్ట్రాల పిల్లలు**



| | | | |
|---|---|---|---|
| ఒడిశా | 47 | కర్ణాటక | 5 |
| బిహార్ | 17 | ఆంధ్రప్రదేశ్ | 4 |
| జార్ఖండ్ | 10 | మహారాష్ట్ర | 3 |
| అస్సాం | 6 | ఉత్తరప్రదేశ్ | 2 |

## మూసీ పరవళ్లు..



రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మూసీ పరవళ్లు తొక్కుతోంది. నల్లగొండ, యాదాద్రి భువనగిరి జిల్లాల పరిధిలోని మోత్కూరు మండలం పొడిచేడు, నార్కట్‌పల్లి మండలం అమ్మనబోలు గ్రామాల మధ్య ఉధృతంగా ప్రవహిస్తోంది. – మోత్కూరు (తుంగతుర్తి)

# పేదల కోసమే కాదు.. మనందరి కోసం

ప్రభుత్వ దవాఖానాలపై గవర్నర్ నరసింహన్ • వైద్యానికి నేను గాంధీకి వస్తా... మీరూ రండి
తెలంగాణ ఆరోగ్య ముఖచిత్రం మారుతోందని వ్యాఖ్య • గాంధీలో 65 పడకల ఐసీయూ ప్రారంభం



గురువారం గాంధీ ఆస్పత్రిలో సీటీ స్కాన్‌ను పరిశీలిస్తున్న గవర్నర్ నరసింహన్. చిత్రంలో మంత్రి లక్ష్మారెడ్డి తదితరులు

సాక్షి, హైదరాబాద్: 'ప్రభుత్వ దవాఖానాలు పేదల కోసమే కాదు. మనందరి కోసం. నేను కూడా గాంధీ ఆసుపత్రిలో చికిత్స చేయించుకున్నాను. సర్జికల్ ఇంటర్‌వెన్షన్ కోసం ఇక్కడికి వచ్చాను. ప్రస్తుతం హాయిగా ఉన్నాను. ప్రభుత్వ వైద్యశాలలపై నమ్మకం పెంచుకోవాలి. నాకైతే గాంధీ వైద్యశాలపై నమ్మకం ఉంది. నేను హామీ ఇస్తున్నా... ఒకటి రెండేళ్లలో తెలంగాణ ఆరోగ్య ముఖచిత్రం సమూలంగా మారుతుంది. అందరికీ అత్యుత్తమ వైద్యం అందుతుంది' అని గవర్నర్ నరసింహన్ చెప్పారు. సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రి ఎమర్జెన్సీ బ్లాక్‌లో రూ.5 కోట్లతో ఏర్పాటు చేసిన 65 పడకల అత్యాధునిక ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌ను గురువారం ఆయన ప్రారంభించారు. దీంతోపాటు పౌర సమాజ సమాచార యంత్రం, డిజిటల్ రేడియోగ్రఫీ, సీటీ స్కాన్, సెంట్రల్ డయాగ్నొస్టిక్ లేబొరేటరీలను ప్రారంభించారు.

**వైద్యం కోసం గాంధీకే రండి...**

గవర్నర్ మాట్లాడుతూ 'గాంధీ మనందరి దవాఖానా. నేను కూడా ఇక్కడే చికిత్స తీసుకున్నాను. ఇకపై కూడా తీసుకుంటాను. గతంలో గాంధీకి వచ్చినప్పుడు పరిస్థితి అధ్వానంగా ఉంది. ఇప్పుడా పరిస్థితి మారింది. అధునాతన సదుపాయాలూ అందుబాటులోకి వచ్చాయి. ఇక్కడకు వేలాది మంది రోగులు వస్తుంటారు. వారి సమస్యలు పరిష్కరించాలి. విమర్శించడం కాదు, భాగస్వాములు కావాలి. ప్రస్తుతం వైద్యులపై బాధ్యత మరింత పెరిగింది. వైద్య రంగంలో రాష్ట్ర ప్రభుత్వం తెస్తున్న మార్పులు ఆరోగ్య తెలంగాణ సాధనే లక్ష్యంగా ఉన్నాయి. మరో రెండేళ్లలో ఆ లక్ష్యం నెరవేరుతుంది. ప్రభుత్వాసుపత్రుల్లో అందుతున్న వైద్య సేవలు, పరికరాల పనితీరుపై ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహించి మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేయాలి' అన్నారు.

**ఆసుపత్రి ప్రతిష్టను మరింత పెంచాలి...**

'ప్రభుత్వ దవాఖానాల్లో పబ్లిక్, ప్రైవేట్ పార్టిసిపేషన్ కాదు...గవర్నమెంట్, పబ్లిక్ పార్టిసిపేషన్ రావాలి. ఏడాది క్రితం నేను గాంధీకి ఇలా వచ్చి అలా వెళ్లాను. సీఎం కేసీఆర్... గవర్నర్ గాంధీ దవాఖానాకు వచ్చి వెళ్లారని అసెంబ్లీలో చెప్పారు. తర్వాత గాంధీలో అధునాతన ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌ని ప్రారంభించుకున్నాం. మంచాలు, పరుపులు, దుప్పట్లు, డాక్టర్లు, నర్సులు, వార్డు బాయ్‌లు, ఆయాలు... ఇలా అనేక మార్పులు వచ్చాయి. ప్రభుత్వం చేయాల్సిందంతా చేసింది. ఇంకా చేస్తూనే ఉంటుంది. ఇక్కడి వైద్య సిబ్బంది దీన్ని సొంత ఆసుపత్రిగా చూసుకోవాలి. ప్రజలందరికీ మంచి వైద్యం అందించేలా కృషి చేసి, ఆసుపత్రి ప్రతిష్టను మరింత విస్తరించాలి' అని నగర మేయర్‌కు నరసింహన్ సూచించారు. కార్యక్రమంలో మేయర్ బొంతు రామ్మోహన్, టీఎస్ఎంఎస్ఐడీసీ చైర్మన్ కృష్ణమూర్తి, వైద్య ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రాజేశ్వర్ తివారీ, డీఎంఈ రమేశ్‌రెడ్డి, టీఎస్ఎంఎస్ఐడీసీ ఎండీ వేణుగోపాలరావు, గాంధీ ప్రిన్సిపాల్ మంజుల, సూపరింటెండెంట్ శ్రవణ్‌కుమార్ పాల్గొన్నారు.

**ఆ బాధ్యత వైద్యులదే...**

నిరుపేదలకు కార్పొరేట్ స్థాయిలో వైద్య సేవలు అందించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ వైద్యశాలలను తీర్చిదిద్దుతున్నామని ఆరోగ్య మంత్రి లక్ష్మారెడ్డి చెప్పారు. ప్రభుత్వ వైద్యశాలల్లో ఖాళీ పోస్టులను భర్తీ చేసేందుకు రంగం సిద్ధం చేశామన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజలకు కలిగిన నమ్మకాన్ని నిలబెట్టుకోవాల్సిన బాధ్యత వైద్యులదేనని అన్నారు.

## ✦ పీఎన్‌జీ నెట్‌వర్క్ పనుల వేగం పెంచండి

**కేంద్ర మంత్రులతో తెలంగాణ బీజేపీ బృందం భేటీ**

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణకు సంబంధించిన వివిధ అంశాలపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.లక్ష్మణ్ నేతృత్వంలోని రాష్ట్ర బీజేపీ ప్రతినిధి బృందం గురువారం ఇక్కడ పలువురు కేంద్ర మంత్రులను కలిసింది. పెట్రోలియం శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రదాన్‌తో భేటీ అయిన ఈ బృందం హైదరాబాద్‌లో పైప్డ్ న్యాచురల్ గ్యాస్(పీఎన్‌జీ) నెట్‌వర్క్ పనులు నత్తనడకన సాగుతున్నాయని, వీటిని వేగవంతం చేయాలని కోరింది. ఉజ్వల పథకం కింద ఇస్తున్న గ్యాస్ కనెక్షన్ల సంఖ్యను పెంచాలని కోరారు. రైల్వే మంత్రి సురేశ్ ప్రభును కలసి ఎంఎంటీఎస్ రెండో దశ సహా పెండింగ్ ప్రాజెక్టు పనులను పూర్తిచేయాలని కోరారు. కొత్తపల్లి–మనోహరాబాద్ లైన్ పనులను వేగంగా చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర రసాయనాల శాఖ మంత్రి అనంత్‌కుమార్‌నూ కలిశారు. ఈ బృందంలో కేంద్ర మంత్రి బండారు దత్తాత్రేయ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి మురళీధర్‌రావు, నేతలు కిషన్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, రాంచందర్‌రావు, ఇంద్రసేనారెడ్డి, బద్దం బాల్‌రెడ్డి, ప్రేమేందర్‌రెడ్డి, కామర్సు బాలసుబ్రమణ్యం, నూనె బాలరాజు తదితరులు ఉన్నారు.

## ✦ బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించండి

**ప్రధాని మోదీకి ఆర్.కృష్ణయ్య వినతి**

సాక్షి, న్యూఢిల్లీ: పార్లమెంటులో బీసీ బిల్లు ప్రవేశపెట్టి చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ప్రధాని మోదీని బీసీ సంక్షేమ సంఘం నేత, టీడీపీ ఎమ్మెల్యే ఆర్.కృష్ణయ్య కోరారు. ప్రధాని మోదీని గురువారం ఇక్కడ ఆయన కలిశారు. బీసీలకు చట్టసభల్లో కనీస ప్రాతినిధ్యం లేదన్నారు. బీసీలకు ఉద్యోగాలు, పదోన్నతుల్లో రిజర్వేషన్లు కల్పించాలన్నారు. కేంద్రంలో బీసీ ఉద్యోగులకు రిజర్వేషన్లను 50 శాతానికి పెంచాలని, బీసీల రిజర్వేషన్లపై ఉన్న క్రిమిలేయర్‌ను తొలగించాలని కోరారు. తమ డిమాండ్లపై ప్రధాని నరేంద్ర మోదీ సానుకూలంగా స్పందించారని ఆర్.కృష్ణయ్య తెలిపారు.

## ✦ బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ

**కేంద్రమంత్రిని కోరిన జాజుల శ్రీనివాస్‌గౌడ్**

సాక్షి, న్యూఢిల్లీ: కేంద్ర మంత్రివర్గంలో బీసీలకు ప్రత్యేకంగా ఒక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని కేంద్ర సామాజిక, న్యాయ శాఖ మంత్రి తావర్‌చంద్ గెహ్లాట్‌ను తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం తెలంగాణ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ కోరారు. గురువారం కేంద్రమంత్రిని పార్లమెంటులో కలుసుకున్నారు. జాతీయ స్థాయిలో బీసీలను 3 గ్రూపులుగా వర్గీకరించాలన్నారు. వచ్చే పార్లమెంటు సమావేశాల్లో ఓబీసీ బిల్లును ప్రవేశపెడతామని గెహ్లాట్ హామీ ఇచ్చినట్టు శ్రీనివాస్ తెలిపారు.

## ✦ బియ్యం సేకరణలో వేగం పెంచాలి

**అధికారులకు సివిల్ సప్లయిస్ కమిషనర్ సీవీ ఆనంద్ ఆదేశం**

సాక్షి, హైదరాబాద్: మిల్లర్ల నుంచి బియ్యం సేకరణలో వేగం పెంచాలని, ఈ నెల 31 నాటికి పూర్తిగా సీఎంఆర్ రాబట్టాలని అధికారులను సివిల్ సప్లయిస్ కమిషనర్ సీవీ ఆనంద్ ఆదేశించారు. ఈ నెల 9 నాటికి మిల్లర్లు 54 శాతం బియ్యాన్ని అప్పగించారని, మిగిలిన 46 శాతం బియ్యాన్ని గడువులోగా అప్పగించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాల జాయింట్ కలెక్టర్లు, డీసీఎస్‌వోలు, జిల్లా మేనేజర్లు, ఎఫ్‌సీఐ అధికారులు, రైస్ మిల్లర్లతో గురువారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ ఏడాది రబీలో ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేసిన 37.16 లక్షల టన్నుల ధాన్యాన్ని మిల్లర్లకు అప్పగించామని, దీనికిగాను 25.27 లక్షల టన్నుల బియ్యాన్ని ప్రభుత్వానికి అప్పగించాల్సి ఉంటుందన్నారు.

## ✦ 'బదిలీల్లో వితంతువులకు అవకాశం ఇవ్వండి'

సాక్షి, హైదరాబాద్: అంతర్రాష్ట్ర బదిలీల్లో వితంతువులు, అనారోగ్యంతో బాధపడుతున్న వారికి అవకాశం ఇవ్వాలని ప్రభుత్వాన్ని టీఎన్జీవో నేతలు విజ్ఞప్తి చేశారు. ఇలాంటి వారు కేవలం వంద మంది మాత్రమే ఉన్నారన్నారు. ఈ మేరకు సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్‌ను టీఎన్జీవో అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి కారం రవీందర్‌రెడ్డి, మామిళ్ల రాజేందర్ గురువారం కలసి విజ్ఞప్తి చేశారు. ఇతర రాష్ట్రాల్లో పనిచేయడం వల్ల ఒంటరి మహిళలకు తగిన భద్రత లేదన్నారు. కాగా, తెలంగాణ, ఏపీలో పనిచేస్తున్న ఉద్యోగుల అభీష్టం మేరకు సొంత రాష్ట్రాలకు పంపించడానికి చర్యలు తీసుకుంటామని సీఎస్ హామీ ఇచ్చారని వారు తెలిపారు.

## ఖతర్ వెళ్లాలంటే వీసా అక్కర్లేదు

రాయికల్(జగిత్యాల): సౌదీ నేతృత్వంలో అరబ్ దేశాల నిషేధంతో సంక్షోభంలోకి వెళ్లిన ఖతర్.. విదేశీ సందర్శకులకు తీపి కబురు అందించింది. 80 దేశాలకు చెందిన వారు తమ దేశంలో పర్యటించాలంటే వీసా కోసం దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరంలేదని ఖతర్ ఉన్నతాధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. 80 దేశాల్లో భారత్‌తోపాటు యూకే అమెరికా, కెనడా, దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ ఉన్నాయి. ఖతర్‌లో ప్రవేశించే సమయంలో ఎలాంటి రుసుము తీసుకోకుండానే మల్టీఎంట్రీ వేవియర్ ఇవ్వనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. దీనికిగాను ఆరునెలలకు తక్కువ లేకుండా వ్యాలిడిటీ ఉన్న పాస్‌పోర్టుతోపాటు ప్రయాణ టికెట్‌ను చూపించాలి. ఖతర్ సందర్శించాలంటే ఇదెంతో దోహదపడుతుందని టూరిజం అథారిటీ చైర్మన్ హసన్ అల్ ఇబ్రహీం ఒక ప్రకటన విడుదల చేశారు.

## ఆంధ్రా దళారులకు వరం.. గొర్రెల పథకం

**సీఎల్పీ ఉపనేత జీవన్‌రెడ్డి**



జగిత్యాల అగ్రికల్చర్: యాదవులకు ప్రభుత్వం ఇస్తున్న సబ్సిడీ గొర్రెల పథకం ఆంధ్రా దళారులకు వరంగా మారిందని సీఎల్పీ ఉపనేత టి.జీవన్‌రెడ్డి అన్నారు. జగిత్యాల మండలం ధర్మారంలో యాదవులకు గురువారం ఆయన సబ్సిడీ గొర్రెలను పంపిణీ చేశారు. ఆంధ్రా దళారులు మన రాష్ట్రంలో గొర్రెను రూ.4 వేలకు కొనుగోలు చేసి తీసుకెళ్తున్నారని, వాటిని మన గొల్లకుర్మలకు రూ. 6 వేల నుంచి రూ.7 వేలకు అంటగడుతున్నారని విమర్శించారు. తెలంగాణకు ఆంధ్రోళ్లే అడ్డంకి అని చెప్పిన ప్రభుత్వం.. ఇప్పుడు గొర్రెల రూపేణా ఆంధ్రా దళారులకే లాభం చేస్తోందని ఎద్దేవా చేశారు. వర్షాకాలంలో పశువులకు గాలికుంటు టీకాలు వేయాలని సీఎం, పశుసంవర్ధకశాఖ మంత్రి, వెటర్నరీ డైరెక్టర్ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని చెప్పారు.

## పాఠశాలలకు 'స్వచ్ఛ' పురస్కారాలు

- సెప్టెంబరు 5లోగా ఇచ్చేందుకు విద్యాశాఖ కసరత్తు
- జాతీయ స్థాయి పురస్కారాలకు కేంద్రానికి ప్రతిపాదనలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని 40 పాఠశాలలు స్వచ్ఛ విద్యాలయ పురస్కారానికి ఎంపికయ్యాయి. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత, హ్యాండ్ వాష్, టాయిలెట్ల పరిశుభ్రత వంటి అంశాల్లో పక్కాగా చర్యలు చేపట్టినందుకుగాను 2016–17 విద్యా సంవత్సరానికి సంబంధించి 40 పాఠశాలలను విద్యాశాఖ స్వచ్ఛ విద్యాలయాలుగా ఎంపిక చేసింది. వాటికి ప్రశంసా పత్రాలను, అవార్డులను అందజేయాలని భావిస్తోంది. ఈ కార్యక్రమాన్ని ఉపాధ్యాయ దినోత్సవానికి ముందే నిర్వహించాలని భావిస్తోంది. ఆయా పాఠశాలల్లో పరిసరాల పరిశుభ్రతకు సంబంధించి చేపట్టిన కార్యక్రమాలతో కూడిన వీడియోలను సిద్ధం చేసింది. కేంద్రం ఆదేశాల మేరకు ఆ వీడియోలను ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వానికి పంపిస్తోంది. అన్ని రాష్ట్రాల్లో రాష్ట్ర స్థాయిలో స్వచ్ఛ విద్యాలయ పురస్కారాలకు ఎంపికైన స్కూళ్ల వివరాలను కేంద్ర ప్రభుత్వం సేకరిస్తోంది. అలా వచ్చిన వాటిల్లో ప్రతి రాష్ట్రంలో మూడు స్కూళ్లను జాతీయ స్థాయి పురస్కారాలకు ఎంపిక చేసే అవకాశం ఉంది.

**పురస్కారాలకు ఎంపికైన పాఠశాలలు..**

**ఆదిలాబాద్:** ఎంపీయూపీఎస్ బండ్లనాగపూర్, ఎంపీపీఎస్ మేడిగూడ కెనాల్. **మంచిర్యాల:** టీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ బాయ్స్ నెంబరు 19, బెల్లంపల్లి. **నిర్మల్:** టీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ బాయ్స్ ముథోల్. **కొమురంభీం:** ఏహెచ్ఎస్ మహగాం. **కరీంనగర్:** ఎంపీయూపీఎస్ కొత్తపల్లి, టీఎస్ఎంఎస్ గంగాధర. **జగిత్యాల:** జెడ్పీహెచ్ఎస్ అంబరిపేట్. **రాజన్న:** కేజీబీవీ సిరిసిల్ల. **నిజామాబాద్:** జెడ్పీహెచ్ఎస్ సుంకెట్, జెడ్పీహెచ్ఎస్ యానంపల్లి. **వరంగల్ అర్బన్:** జెడ్పీహెచ్ఎస్ ఉనికిచర్ల. **జయశంకర్:** జెడ్పీహెచ్ఎస్ తిమ్మంపేట్. **మహబూబాబాద్:** ఎంపీపీఎస్ బోడగట్టు తండా. **ఖమ్మం:** జెడ్పీహెచ్ఎస్ ఏపీఎన్ పురం, టీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్ సింగారెడ్డి పాలెం, టీఎస్ఎంఎస్ కారెపల్లి, ఎంపీపీఎస్ మల్లారం, ఎంపీయూపీఎస్ గండగలపాడు, ఎంపీపీఎస్ టేకులపల్లి. **భద్రాద్రి:** ఎంపీపీఎస్ నెహ్రూనగర్. **సంగారెడ్డి:** ఎంపీయూపీఎస్ మూసాపేట్, ఎంపీపీఎస్ కంది (సెంట్రల్), ఎంపీపీఎస్ కాచిరెడ్డిపల్లి. **సిద్దిపేట్:** ఎంపీయూపీఎస్ ఇబ్రహీంపూర్. **మహబూబ్‌నగర్:** ఎంపీపీఎస్ చౌటగడ్డతండా. **నాగర్‌కర్నూల్:** కేజీబీవీ కల్వకుర్తి. **నల్లగొండ:** ఎంపీపీఎస్ చెరువు అన్నారం, ఎంపీయూపీఎస్ మొల్కచెర్ల. **సూర్యాపేట్:** టీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ (గర్ల్స్) నందిగూడెం, జెడ్పీహెచ్ఎస్ అనంతారం. **యాదాద్రి:** జెడ్పీహెచ్ఎస్ దేవలమ్మ నాగారం, ఎంపీపీఎస్ దత్తాయిపల్లి, ఎంపీయూపీఎస్ బంగారిగడ్డ. **వికారాబాద్:** ఎంపీపీఎస్ బుద్దారం. **రంగారెడ్డి:** జెడ్పీహెచ్ఎస్ పాపిరెడ్డిగూడ, టీజీ రెసిడెన్షియల్ హెచ్ఎస్ఎల్ (మైనారిటీ), ఎంపీయూపీఎస్ నానక్‌రాంగూడ, ఎంపీపీఎస్ చత్తన్‌పల్లి. **హైదరాబాద్:** గవర్నమెంట్ హైస్కూల్ సిటీ మోడల్ చార్మినార్.

## తెలంగాణ వచ్చినా దొరల పాలనే: తమ్మినేని



సాక్షి, ఖమ్మం: తెలంగాణ సాధించుకున్నా.. దొరల పాలనే సాగుతోందని టీ మాస్ స్టీరింగ్ కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం విమర్శించారు. ఖమ్మంలో తెలంగాణ ప్రజా, సామాజిక సంఘాల ఐక్య వేదిక (టీమాస్) జిల్లా సదస్సు గురువారం నిర్వహించారు. తమ్మినేని మాట్లాడుతూ ప్రజలు అభివృద్ధి చెందినప్పుడే రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందినట్లని చెప్పారు. గద్దర్ మాట్లాడుతూ రాష్ట్రంలో 93% అట్టడుగు కులాల ప్రజలు ఉన్నా.. 7% ఉన్న కులాల వారే పాలన సాగిస్తున్నారన్నారు. నాడు జీఎస్టీ మంచిదే అంటూ మద్దతు పలికిన కేసీఆర్.. నేడు ప్రభుత్వ ప్రాజెక్టులపై పన్నుల భారం పడేసరికి జీఎస్టీపై పోరాడుతానని చెబుతున్నారన్నారు. టఫ్ అధ్యక్షురాలు విమలక్క మాట్లాడుతూ రాష్ట్రంలో దొరల పాలన పారదోలేందుకు ప్రజలను సమీకరించాలన్నారు.

## చలో ప్రగతిభవన్

**తెలంగాణ పంచాయతీరాజ్ చాంబర్స్ చైర్మన్ చింపుల**



సమావేశంలో మాట్లాడుతున్న చింపుల

సాక్షి, హైదరాబాద్: స్థానిక సంస్థలపై ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని తెలంగాణ పంచాయతీరాజ్ చాంబర్స్ ఆగ్రహం వ్యక్తం చేసింది. సర్కార్ వైఖరికి నిరసనగా సమరానికి పిలుపునిచ్చింది. ఈమేరకు తెలంగాణ పంచాయతీరాజ్ చాంబర్స్ రాష్ట్ర సమావేశాల్లో కమిటీ తీర్మానించింది. నగరంలో రెండ్రోజుల పాటు జరిగిన తెలంగాణ పంచాయతీరాజ్ చాంబర్స్ రాష్ట్ర స్థాయి సమావేశాల అనంతరం చైర్మన్ చింపుల సత్యనారాయణరెడ్డి గురువారం మీడియాతో మాట్లాడారు. 'కొత్త ప్రభుత్వం వచ్చి మూడేళ్లవుతున్నా గ్రామ పంచాయతీలకు పైసా ఇవ్వలేదు. మా సమస్యలను సీఎం కేసీఆర్‌కు వివరించాలనుకున్నాం, కానీ మాకు ఆయన అపాయింట్‌మెంట్ దొరికే పరిస్థితి లేదు. ప్రభుత్వంతో తాడోపేడో తేల్చుకోవాలని నిర్ణయించుకున్నాం. నెల రోజుల్లో చలో ప్రగతిభవన్ నిర్వహిస్తాం' అని స్పష్టం చేశారు. ప్రగతిభవన్ ముట్టడికి ముందు మండల, జిల్లా స్థాయిలో నిరసన కార్యక్రమాలు చేపడతామన్నారు. ఒకట్రెండు రోజుల్లో కార్యాచరణ ప్రకటిస్తామన్నారు.

## నేరెళ్ల బాధితులను పరీక్షించిన వైద్యులు

వేములవాడ: నేరెళ్ల ఘటనలో తీవ్రంగా గాయపడి వేములవాడలోని డాక్టర్ మనోహర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పెంట బానయ్య, కోల హరీష్, చిట్యాల బాలరాజు, బత్తుల మహేశ్, పసుల ఈశ్వర్‌కుమార్, గంధం గోపాల్‌కు హైకోర్టు ఆదేశాల మేరకు వరంగల్‌లోని ఎంజీఎం ఆసుపత్రి వైద్యులు కృపాల్‌సింగ్, చంద్రశేఖర్ గురువారం వైద్యపరీక్షలు నిర్వహించారు. దాదాపు గంటసేపు బాధితులకు పరీక్షలు నిర్వహించి వెళ్లిపోయారు. నివేదికను ప్రభుత్వానికి అందిస్తామని తమకు చెప్పారని.. తమ గాయాలను పరిశీలించడంతోపాటు సెల్‌ఫోన్లలో చిత్రీకరించారని బాధితులు తెలిపారు.

## నేరెళ్ల ఘటనలో ఎస్‌ఐ రవీందర్ సస్పెన్షన్

**'థర్డ్ డిగ్రీ'పై స్పందించిన సర్కారు**



సిరిసిల్ల: నేరెళ్లకు చెందిన ముగ్గురు దళితులు, మరో ఐదుగురిని నిర్బంధించి థర్డ్ డిగ్రీ ప్రయోగించిన ఘటనపై సర్కారు స్పందించింది. సెంట్రల్ క్రైమ్ స్టేషన్(సీసీఎస్) సబ్ ఇన్‌స్పెక్టర్ బి.రవీందర్‌ను సస్పెండ్ చేస్తూ వరంగల్ ఐజీ నాగిరెడ్డి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లెల్ల వద్ద జూలై 2న ఇసుక లారీలు దహనం చేసిన కేసులో ఎనిమిది మందిని అదుపులోకి తీసుకుని థర్డ్ డిగ్రీ ప్రయోగించిన ఘటన రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ప్రతిపక్షాల ఆందోళనతో మంత్రి కేటీఆర్ స్పందించారు. నేరెళ్ల ఘటనపై విచారణ జరుపుతున్నామని, బాధ్యులపై చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. వేములవాడకు వచ్చి బాధితులను పరామర్శించి వెళ్లిన 3 రోజులకే ఎస్‌ఐ సస్పెన్షన్‌కు గురయ్యారు. అంతకుముందు నేరెళ్ల ఘటనపై డీఐజీ రవివర్మ విచారణ జరిపారు. ఆయన నివేదిక ఆధారంగా ఎస్‌ఐని సస్పెండ్ చేశారు.

**మంత్రి కేటీఆర్ ట్వీట్..**

నేరెళ్ల ఘటనలో ఎస్‌ఐ రవీందర్‌ను సస్పెండ్ చేస్తూ ఐజీ నాగిరెడ్డి ఆదేశాలు జారీ చేసిన వెంటనే స్థానిక ఎమ్మెల్యే, మంత్రి కేటీఆర్ ట్వీటర్‌లో స్పందించారు. మాట నిలుపుకున్నానని మేసెజ్ పోస్ట్ చేశారు. నేరెళ్ల ఘటనలో పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారని మంత్రి ఇప్పటికే ప్రకటించిన విషయం తెల్సిందే.



## వేచి ఉండాల్సిందే!

నర్సాపూర్: మెదక్ జిల్లా నర్సాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో 128 మంది బాలికలు చదువుతున్నారు. ఒకే మరుగుదొడ్డి ఉండటంతో వారు క్యూలో నిలబడి తమ అవసరాలు తీర్చుకుంటున్నారు. ఇదే పాఠశాలలోని బాలురు బయటకు వెళ్తున్నారు. రూ.లక్షలు వెచ్చించి పాఠశాల భవనాలు నిర్మిస్తున్న అధికారులు.. మరుగుదొడ్లను సరిపడా నిర్మించకపోవడం శోచనీయమని పలువురు పేర్కొంటున్నారు.

## విద్యుత్ షాక్‌తో రైతు మృతి

మనూరు (నారాయణఖేడ్): విద్యుత్ షాక్‌తో ఓ రైతు మృతి చెందాడు. ఈ ఘటన మనూరు మండలం డోవూర్‌లో గురువారం జరిగింది. గ్రామానికి చెందిన పెద్దగొల్ల మనోహర్ (50) ఉదయం పత్తి చేనుకు పురుగు నివారణ మందు కొట్టడానికి చేనుకు వెళ్లాడు. దీంతో బోరు మోటారును ప్రారంభిస్తున్న క్రమంలో విద్యుదాఘాతానికి గురై మరణించాడు.

సాక్షి స్పోర్ట్స్
శుక్రవారం 11-8-2017



### తెల్లగా ఉంటేనే అందంగా ఉన్నట్లా?

భారత క్రికెటర్ అభినవ్ ముకుంద్‌పై సోషల్ మీడియాలో కొంత మంది వర్ణ వివక్ష వ్యాఖ్యలు చేయడం వివాదం రేపింది. దీనిపై స్పందిస్తూ ముకుంద్... తన నలుపు రంగు కారణంగా బాధితుడిగా మారడం ఇది మొదటిసారి కాదని, కెరీర్ ఆసాంతం తనకు అలాంటి అనుభవం ఎదురైందని చెప్పాడు. ఈ విషయంలో ప్రజల ఆలోచన తీరు మారాలన్న ముకుంద్... అందం అంటే తెలుపు రంగులోనే లేదని అన్నాడు. భారత కెప్టెన్ కోహ్లి సహా పలువురు ప్రముఖులు ఈ విషయంలో ముకుంద్‌కు తమ మద్దతు ప్రకటించారు.

# 'లక్ష్మణ' రేఖ దాటలేకపోయాడు



గోవిందన్ లక్ష్మణన్

## హీట్స్‌లోనే వెనుదిరిగిన గోవిందన్

### ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్

**లండన్:** ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో భారత్ ఖాతాలో మరో నిరాశాజనక ఫలితం చేరింది. లాంగ్ డిస్టెన్స్ రన్నర్ గోవిందన్ లక్ష్మణన్ తన అత్యుత్తమ ప్రదర్శన కనబర్చినా...అది ఫైనల్‌కు అర్హత సాధించేందుకు సరిపోలేదు. పురుషుల 5000 మీటర్ల పరుగులో లక్ష్మణన్ తొలి రౌండ్ హీట్స్‌లో 15వ స్థానంలో సరిపెట్టుకున్నాడు. 27 ఏళ్ల లక్ష్మణన్ ఈ పోటీని 13 నిమిషాల 35.69 సెకన్లలో ముగించాడు. గతంలో అతని అత్యుత్తమ టైమింగ్ 13 నిమిషాల 36.62 సెకన్లు కాగా... ఇప్పుడు దానిని సవరించడంలో మాత్రం అతను సఫలమయ్యాడు. ఓవరాల్‌గా అతను 31వ స్థానంలో నిలిచాడు. ఇప్పటి వరకు చాంపియన్‌షిప్‌లో పోటీ పడిన భారత అథ్లెట్లలో లక్ష్మణన్ ఒక్కడే తన అత్యుత్తమ టైమింగ్‌కంటే మెరుగైన ప్రదర్శన ఇచ్చాడు. భారీ వర్షం అనంతరం ఉష్ణోగ్రత 15 డిగ్రీలకు పడిపోయిన స్థితిలో అతను పూర్తిగా వెనుకంజ వేశాడు. 'ఇది నా తొలి ప్రపంచ చాంపియన్‌షిప్. కనీసం మన జాతీయ రికార్డు బద్దలు కొడదామని ఇక్కడికి వచ్చాను కానీ అది సాధ్యం కాలేదు. అయితే వ్యక్తిగతంగా ఉత్తమ ప్రదర్శన ఇవ్వడం సంతృప్తినిచ్చింది. ఇక దిగ్గజ అథ్లెట్ మో ఫరాతో కలిసి ఈ రేసులో పరుగెత్తాను. ఆ రూపంలో నా కల నిజమైంది. మాకు అతనే స్ఫూర్తి. ఫరా ఆఖరి రేసులో నేను పక్కన ఉండటం జీవితకాలం గుర్తుండిపోయే అనుభూతి' అని లక్ష్మణన్ వ్యాఖ్యానించాడు. శనివారం జరిగే ఫైనల్‌కు అర్హత సాధించిన మో ఫరా ఆ రేసుతో కెరీర్‌కు గుడ్‌బై చెప్పనున్నాడు.



### ఒకే ఒక్కడు...

అథ్లెటిక్ ట్రాక్ అంతా తానే అయి పరుగెత్తుతున్న ఇతడిని చూశారా... ఇతను బోట్స్‌వానాకు చెందిన ఐసాక్ మక్వానా. 200 మీటర్ల పరుగులో ఫేవరెట్. అయితే కలుషిత ఆహారం తీసుకొని అనారోగ్యం బారిన పడటంతో అతను హీట్స్‌లో పాల్గొనలేకపోయాడు. అయితే ఐఏఏఎఫ్ అతనిపై కరుణ ప్రదర్శించింది. గతంలో ఎన్నడూ జరగని రీతిలో ప్రత్యేక అనుమతి ఇచ్చి మళ్లీ పరుగెత్తే అవకాశం కల్పించింది. దాంతో మక్వానా ట్రాక్‌పైకి దిగాడు. 20.54 సెకన్లలో లక్ష్యాన్ని చేరి ఫైనల్స్‌కు అర్హత సాధించాడు. తన పతకం ఆశలను నిలబెట్టుకోగలిగాడు.



### ఫెలిక్స్‌కు 14వ పతకం...

అమెరికా స్టార్ అథ్లెట్ అలీసన్ ఫెలిక్స్ ఖాతాలో మరో పతకం చేరింది. మహిళల 400 మీటర్ల పరుగులో ఆమె కాంస్యం (50.08 సెకన్లు) సాధించింది. ఫెలిక్స్ కెరీర్‌లో ఇది 14వ ప్రపంచ చాంపియన్‌షిప్ పతకం కావడం విశేషం. ఫలితంగా జమైకా దిగ్గజాలు ఉసేన్ బోల్ట్, మెర్లీన్ ఒటీ (14)లతో ఆమె సమంగా నిలిచింది. ఈ ఈవెంట్‌లో ఫైలిస్ ఫ్రాన్సిస్ (యూఎస్–49.92సె.), సల్వా నసీర్ (బహ్రెయిన్–50.06సె.) వరుసగా పసిడి, రజత పతకాలు గెలుచుకున్నారు. ఓవరాల్‌గా ప్రపంచ చాంపియన్‌షిప్స్‌లో 9 స్వర్ణాలు నెగ్గిన ఫెలిక్స్... ఒలింపిక్స్‌లో కూడా మరో 6 స్వర్ణాలు సాధించింది.

## శ్రీశాంత్ నిషేధంపై బీసీసీఐ అప్పీల్



**న్యూఢిల్లీ:** పేసర్ శ్రీశాంత్‌పై తాము విధించిన జీవితకాల నిషేధాన్ని కేరళ హైకోర్టు ఎత్తివేయడంపై బీసీసీఐ న్యాయపోరాటం చేయనుంది. ఈ తీర్పుకు వ్యతిరేకంగా బోర్డు కేరళ హైకోర్టు డివిజన్ బెంచ్‌కు అప్పీల్ చేయనుంది. 2013లో మ్యాచ్ ఫిక్సింగ్ ఆరోపణలపై బోర్డు శ్రీశాంత్‌ను క్రికెట్ నుంచి నిషేధించింది. అయితే గత సోమవారం కేరళ హైకోర్టు సింగిల్ జడ్జి సరైన సాక్ష్యాలు లేవంటూ నిషేధాన్ని ఎత్తివేశారు. కానీ అతడిని తిరిగి క్రికెట్‌లోకి అనుమతించడంపై బోర్డు సిద్ధంగా లేనట్టు కనిపిస్తోంది. 'కోర్టు తీర్పు ప్రతిని మా లీగల్ టీమ్ పరిశీలించింది. నిబంధనల ప్రకారం దీనిపై డివిజనల్ బెంచ్ ముందు అప్పీల్ చేసుకునే హక్కు మాకు ఉంది. త్వరలోనే ఈ ప్రక్రియ మొదలుపెట్టనున్నాం' అని బీసీసీఐ సీనియర్ అధికారి ఒకరు పేర్కొన్నారు.

## యువ భారత్‌కు మరో గెలుపు

### రెండో వన్డేలో ఇంగ్లండ్ అండర్-19 ఓటమి



హిమాన్షు రాణా

**కాంటర్‌బరీ:** యూత్ వన్డే సిరీస్‌లో భారత్ అండర్–19 జట్టు వరుసగా రెండో మ్యాచ్‌లోనూ గెలిచింది. బుధవారం రాత్రి జరిగిన రెండో వన్డేలో హిమాన్షు రాణా (85 బంతుల్లో 74; 9 ఫోర్లు), అనుకుల్ రాయ్ (4/27) రాణించడంతో యువ భారత్ 8 వికెట్ల తేడాతో ఇంగ్లండ్ అండర్–19 జట్టుపై ఘన విజయం సాధించింది. మొదట బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్ జట్టు 44.4 ఓవర్లలో 175 పరుగుల వద్ద ఆలౌటైంది. ట్రెవస్కిస్ (35), లెమోన్‌బై (30) ఫర్వాలేదనిపించారు. రాహుల్ చహర్ 3, అభిషేక్ శర్మ 2 వికెట్లు తీశారు. తర్వాత లక్ష్యఛేదనకు దిగిన భారత్ 33.2 ఓవర్లలోనే 2 వికెట్లు కోల్పోయి 177 పరుగులు చేసి విజయాన్నందుకుంది. ఓపెనర్లు పృథ్వీ షా (51 బంతుల్లో 48; 7 ఫోర్లు), రాణా తొలి వికెట్‌కు 110 పరుగులు జోడించారు. రెండో వికెట్‌కు శుభ్‌మన్ గిల్ (38 నాటౌట్)తో కలిసి రాణా 61 పరుగులు జతచేయడంతో విజయం సులువైంది. ఐదు వన్డేల యూత్ సిరీస్‌లో ప్రస్తుతం భారత్ 2–0తో ఆధిక్యంలో ఉంది. శనివారం మూడో వన్డే హోవ్‌లోని కౌంటీ గ్రౌండ్‌లో జరగనుంది.



## తలైవాస్‌కు తొలి విజయం

**నాగపూర్:** ప్రొ కబడ్డీ లీగ్‌లో సచిన్ జట్టు తమిళ్ తలైవాస్‌కు మొదటి విజయం దక్కింది. బెంగళూరు బుల్స్‌తో గురువారం జరిగిన మ్యాచ్‌లో తలైవాస్ 29–24తో బెంగళూరు బుల్స్‌పై నెగ్గింది. వరుసగా రెండు మ్యాచ్‌లు ఓడిన అనంతరం తమిళ్ జట్టు గెలుపు బోణీ చేయడం విశేషం. తలైవాస్ తరఫున కె. ప్రపంజన్ (6), అమిత్ హుడా (4) ఆకట్టుకున్నారు. బుల్స్ జట్టులో రోహిత్ కుమార్ (12) ఒంటరి పోరాటం చేశాడు.

**పింక్ పాంథర్స్ కూడా...**

ఐదో సీజన్‌లో జైపూర్ పింక్ పాంథర్స్ జట్టు తొలి విజయాన్ని సాధించింది. గురువారం జరిగిన మ్యాచ్‌లో 30–28తో పుణేరి పల్టన్‌ను ఓడించింది. పుణేరి జట్టులో రైడర్ సందీప్ నర్వాల్ అత్యధికంగా 9 పాయింట్లు స్కోర్ చేశాడు. రోహిత్ చౌదరి 4 పాయింట్లు సాధించాడు. జైపూర్ జట్టు తరఫున మంజీత్ ఛిల్లర్ 9, జస్వీర్ సింగ్ 5 పాయింట్లు స్కోర్ చేశారు.

## తులసీ చైతన్యకు 3 పతకాలు

### ప్రపంచ పోలీస్ క్రీడలు



**సాక్షి, విజయవాడ:** ప్రపంచ పోలీస్ క్రీడల్లో ఆంధ్రప్రదేశ్ స్విమ్మర్ తులసీ చైతన్య సత్తా చాటాడు. లాస్ ఏంజెల్స్‌లో జరుగుతోన్న ఈ మెగా క్రీడల్లో చైతన్య మూడు పతకాలను కైవసం చేసుకున్నాడు. స్విమ్మింగ్ 400మీ. ఫ్రీస్టయిల్, 4x50మీ. ఫ్రీస్టయిల్ రిలేలో రజతాలు గెలుచుకున్న చైతన్య, 100మీ. బ్యాక్‌స్ట్రోక్‌లో కాంస్యాన్ని దక్కించుకున్నాడు. 400మీ. ఫ్రీస్టయిల్ ఈవెంట్‌ను 4ని. 31సెకన్లలో, 100మీ. బ్యాక్‌స్ట్రోక్ ఈవెంట్‌ను ఒక నిమిషం 6.49సెకన్లలో చైతన్య పూర్తి చేయగా...అతను సభ్యుడిగా ఉన్న భారత జట్టు 4x50మీ. ఫ్రీస్టయిల్ రిలేను ఒక నిమిషం 41.21సెకన్లలో ముగించింది. చైతన్య ప్రస్తుతం విజయవాడలో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు.

## 15వ ర్యాంకులో ప్రణయ్

**న్యూఢిల్లీ:** ఇటీవల నిలకడగా రాణిస్తున్న భారత షట్లర్ హెచ్.ఎస్.ప్రణయ్ ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య (బీడబ్ల్యూఎఫ్) ర్యాంకింగ్స్‌లో రెండు స్థానాలు మెరుగుపర్చుకొని 15వ స్థానానికి ఎగబాకాడు. గత నెలలో యూఎస్ ఓపెన్ టైటిల్ కైవసం చేసుకున్న ప్రణయ్, ఆ తర్వాత జరిగిన న్యూజిలాండ్ గ్రాండ్ ప్రి గోల్డ్ టోర్నమెంట్‌లో క్వార్టర్ ఫైనల్‌కు చేరాడు. శ్రీకాంత్ ఎనిమిదో ర్యాంకులో ఏ మార్పు లేదు. పురుషుల సింగిల్స్ టాప్–50లో ఏడుగురు భారత ఆటగాళ్లు ఉండటం విశేషం. మహిళల సింగిల్స్‌లో సింధు 5, సైనా 16వ ర్యాంకుల్లో కొనసాగుతున్నారు.

## భారత్ ర్యాంక్ 97

**న్యూఢిల్లీ:** ఫుట్‌బాల్ ప్రపంచ ర్యాంకింగ్స్‌లో భారత్ ఒక ర్యాంకు దిగజారింది. 'ఫిఫా' విడుదల చేసిన తాజా ర్యాంకుల్లో భారత్ 97వ స్థానానికి పడిపోయింది. గత నెలలో 96వ ర్యాంకులో నిలవడం ద్వారా అత్యుత్తమ ర్యాంకుకు చేరిన భారత్ ఇప్పుడు ఒక ర్యాంకును కోల్పోయింది. బ్రెజిల్ అగ్రస్థానంలో కొనసాగుతోంది.

## భారత హాకీ జట్టు ఓటమి

**న్యూఢిల్లీ:** భారత హాకీ జట్టు యూరప్ పర్యటనను పరాజయంతో ప్రారంభించింది. బూమ్‌లో బుధవారం రాత్రి జరిగిన పోరులో బెల్జియం జట్టు 1–0తో భారత్‌పై గెలుపొందింది. మొదటి మూడు క్వార్టర్లలో ఒక్క గోల్ కూడా నమోదు కాలేదు. అయితే నాలుగో క్వార్టర్ చివరి (60వ) నిమిషంలో టామ్ బూన్ చేసిన ఫీల్డ్ గోల్‌తో బెల్జియం గెలిచింది.

## ఆనంద్‌కు రెండో విజయం

**సెయింట్ లూయిస్ (అమెరికా):** సింక్యూఫీల్డ్ కప్ చెస్ టోర్నమెంట్‌లో భారత గ్రాండ్‌మాస్టర్ విశ్వనాథన్ ఆనంద్ రెండో విజయాన్ని నమోదు చేశాడు. గురువారం జరిగిన ఏడో రౌండ్ గేమ్‌లో రష్యాకు చెందిన నెపొమ్నియాషిపై 40 ఎత్తుల్లో ఆనంద్ గెలుపొందాడు. ఈ గెలుపుతో 4.5 పాయింట్లతో మరో ఇద్దరితో కలిసి ఆనంద్ అగ్ర స్థానంలో ఉన్నాడు.

## పాపకు జన్మనిచ్చిన హంపి

**సాక్షి, విజయవాడ:** చెస్ గ్రాండ్ మాస్టర్ కోనేరు హంపి తల్లయింది. స్థానిక రెయిన్‌బో ఆసుపత్రిలో గురువారం మధ్యాహ్నం ఆమె పాపకు జన్మనిచ్చింది. 2014లో అన్వేష్‌తో హంపికి వివాహమైంది.



Published and Printed by K.Ramachandra Murthy, Editorial Director, on behalf of Jagati Publications Limited, Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Survey No. 127, Plot No. 12, Mallapur Village, Nacharam, Medchal District. Editor: V. Murali, Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.



## విద్యార్థి యువజన నేత,
## అత్యవసర పరిస్థితిలో పోరాటయోధుడు
## నాడు అసెంబ్లీలో రాణించిన
## అసెంబ్లీ టైగర్

ఆధునిక తెలుగుజాతి ఆత్మగౌరవ పతాకమితడు...
సిద్ధాంత నిబద్ధతతో రాజకీయాలకు అద్దిన మంచి గంధమితడు...
రైతుబిడ్డగా కుసుమించి, రాజ్యసభాపతిగా వికసించిన కొత్త చరితమితడు
పార్టీతో పేగుబంధం పెనవేసుకొని జాతీయాధ్యక్షుడిగా ఎదిగిన అద్వితీయుడితడు
మూడు కీలక మంత్రిత్వ విభాగాలను ఏకకాలంలో సమర్థంగా
నిభాయించిన అతిరథుడితడు
కార్యదక్షతే జీవలక్షణంగా లెక్కకు మిక్కిలి ప్రజాహిత పథకాలకు ప్రాణం పోసిన
పాలనాదక్షుడితడు
చట్టసభల్లో తెలుగుల ప్రయోజనాలకు అడుగడుగున దడికట్టిన వీరమల్లుడితడు
పట్టణాభివృద్ధిలో తెలంగాణకు పట్టం కట్టిన ప్రభంజనమితడు
పల్లె బాటపట్టి తల్లి రుణం తీర్చుకున్న పాలన విప్లవమితడు
విశ్వ వేదికలపై భారతావని ప్రతిష్టను ఉత్తిష్టపరచిన పనిమంతుడీతడు
వ్యర్థ వాదనలు విడిచిపుచ్చి ప్రత్యర్థులనూ అర్థవంతంగా గెలుచుకున్న
పరిణత పాఠమితడు
భావ గంభీరం, భాషా నుడికారం ఒక్కచోట చేరిన ఒప్పులకుప్ప ఇతడు
స్వర్ణభారత వికసనానికి చల్లిన విజయ విత్తనమితడు
స్వపక్ష విపక్షాలను ఏకం చేసి అంబరాన్నంటే గెలుపు సొంతం చేసుకున్న
మాలిన్యం అంటని కమలమితడు సత్‌ప్రమాణాలతో పెద్దలసభకే వన్నెతెచ్చిన
సమున్నత ఆదర్శమితడు
కాలదోషమంటని ప్రజానాయకుడితడు
జనవాహిని మెచ్చిన జానుతెనుగు ఇతడు
నిలువెత్తు తెలుగుదనానికి నిండు గౌరవమితడు
తెలుగువారి ఇంటి దేవుడు వెంకన్న.
ఉభయరాష్ట్రాల గెలుపు వాకిలి

# శ్రీ ముప్పవరపు
# వెంకయ్య నాయుడు

భారతదేశంలో రెండవ అత్యున్నత రాజ్యాంగ పదవి
**ఉపరాష్ట్రపతి పీఠాన్ని అధిష్టిస్తున్న వేళ**
**మా హృదయపూర్వక శుభాకాంక్షలు**

**కె. హరిచంద్రారెడ్డి**
కనుమూరు హరిచంద్రారెడ్డి ఛారిటబుల్ ట్రస్ట్ - గూడూరు.

**సందిరెడ్డి శ్రీనివాస్**
సొసైటి ఫర్ రూరల్ ఇంప్రూవ్‌మెంట్ - అనంతపురం.